# ఆశ్చర్య రామాయణము

## అయోధ్యకాండ - ద్వితీయ భాగము

లక్కావఝ్ఝుల వేంకటకృష్ణశాస్త్రి



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# ASCHARYA RAMAYANAMU
## Ayodhya Kanda - Part - II

*Author*
Lakkavajjhala Venkata Krishna Sastry

T.T.D. Religious Publications Series No.678
First Edition : 2005
Copies : 1000

© All Rights Reserved

*Published by*
Sri A.P.V.N. Sharma, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams
Tirupati - 517 501

*Cover design* : Adsprint

*D.T.P. by*
Keerthi Offset,
Tirupati.

*Printed at*
Adsprint, 5/3, Rajabather Street,
T.Nagar, Chennai - 17.

# ముందు మాట

హైందవ సంస్కృతీ సాహిత్యంలో ఇతిహాస పురాణాల్లో రామాయణ భారత, భాగవతాలు ముఖ్యమైనవి. అందు రామాయణ మెంత మొదటిదో ప్రాచీనమైందో అంతగా మార్గదర్శకమైంది కూడ. మానవజీవితంలో ఆదరింపవలసిన ఆచరింపదగిన అనేక ధర్మాలలో ఉత్తమోత్తమ ధర్మాన్ని నిరూపించింది రామాయణ మొక్కటే. అందుకే రామోవిగ్రహవాన్ ధర్మః అన్నారు పెద్దలు. అట్లే రామునివలె నడుచుకో, రావణునివలె నడుచుకోవద్దు అని కూడా నీతిని బోధించారు మనకు.

కాగా అట్టి రామాయణాన్ని ఆనాటి ఆదికవి వాల్మీకి మొదలు నేటి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణవరకు అనేకులు అనేక భాషల్లో అనేకకాలాల్లో అనేక పద్య గద్య ద్విపద నాటక యక్షగాన జానపద బుఱ్ఱకథ గేయకథ పాటలు మొదలుగా అనేక ప్రక్రియల్లో రచించిన వారున్నారు. అట్లే సంపూర్ణ కథనేగాక ఆయా ముఖ్య రసవత్తర సన్నివేశాల ప్రధానంగా కూడా రచనలు చేసిన వారున్నారు. ఇంకా రచింపబడవచ్చును కూడా అంతటి ఆదరణ, మహిమ, అవకాశం వున్న కథాభాగం రామాయణమని చెప్పక తప్పదు. పైగా వుపాసకులకు వుపయోగపడే గాయత్రీ మొదలగు అనేక మంత్రాలలో రామతారకమంత్రంవలె అందివచ్చిన చిన్నమంత్రం మరొక్కటి లేదు. కాబట్టి వాల్మీకి ఆరామనామ జపంతోనే మునియై రామాయణ రచయిత అంతటివాడు కాగలిగినాడు.

ఇక గ్రంథం రచనను బట్టి ఒక్క సంస్కృతంలోనే సుమారు నలభైవరకు రామాయణాలున్నట్లు తెలుపబడింది. అయితే మూలకథ వొకటే యైనా కొన్ని సన్నివేశాలతో భావాలతో అంతో యింతో భేదాలుండవచ్చుగాక. ప్రధానమైన మూలకథలో ధర్మబోధనలోమాత్రం ఏమాత్రం మార్పు లేకపోవడంతో ఆ అన్ని రామాయణాలూ నేటికీ నిలిచివున్నాయి. లేకుంటే భారతీయ సంస్కృతిలో వాటికి మనుగడయే వుండే అవకాశమే లేదు.

ప్రస్తుతం ఈ ఆశ్చర్య రామాయణ గ్రంథకర్త సంస్కృత భాషాధ్యాపకులేగాక బహుముఖంగా బహుపురాణ శాస్త్ర పండితులు కూడా.

పైగా తనకాలానికే రామాయణ కేసరి, రామాయణ తీర్థ మొదలగు బిరుదాంకితులు శ్రీమాన్ లక్కావఝ్ఝల వేంకటకృష్ణశాస్త్రి గారు, విజయవాడ వాస్తవ్యులు. సరళమైన సంస్కృతభాషలో శ్లోకరూపంగా సుమారు పైచెప్పబడిన నలుబది రామాయణ సంగ్రహ స్వరూపాన్ని ఆశ్చర్యరామాయణమనే పేరుతో లోకాని కందించి ఎంతో మేలు చేశారు. మూలం సంస్కృతంలో వున్నా దానికి తెలుగు వచనంలో తాత్పర్యం కూడా తానే రచించి సాధారణ పాఠకులకుకూడా దీన్ని చదివి ఆనందించడంలో ఎంతో అనుకూలం కల్పించారు. కాకుంటే ఈ గ్రంథరచనాకాలం బహుశః గడచిన 3వ దశాబ్దం కావడంతో తెలుగు కూడా గ్రాంథికభాషలో సాగింది. అయినా అది కూడా సరళంగానే వుందనడంలో సందేహంలేదు. రచయితా పాఠకులూ ఇద్దరూ లాభపడ్డారు. ధన్యులయ్యారు మరి.

ఇక ఈ ముద్రణ ప్రచార విషయంలో రచయితచే యిప్పటికే రెండు మూడు సార్లు ముద్రింపబడి లోకంలో బహుళ ప్రచారంలో వున్న గ్రంథమిది. వారి అనంతరం వారి కుమారులు ల. రామచంద్రరావుగారు దీని ముద్రణకు తిరుమల తిరుపతి దేవస్థానంవారికి అందజేశారు. రామాయణ ప్రాశస్త్యాన్ని బట్టి దానియొక్క బహుముఖ ప్రయోజనాన్ని ఆదరించి పౌరాణిక గ్రంథంగా దీన్ని ప్రస్తుతం ప్రచురించడం జరిగింది. ఈ సంస్థయొక్క ధార్మిక ప్రచార ప్రణాళికలో యిది కూడా ఒక భాగమే కాన దీనిని కూడా ప్రజలు ఆదరించి శ్రీ వేంకటేశ్వరస్వామివారి కృపకు పాత్రు లగుదురుగాక యని ఆశిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి
తి.తి. దేవసానములు, తిరుపతి.

# కృతిసమర్పణము



శ్లో॥ శ్రీభద్రాచలరామచంద్ర! చరణద్వంద్వే త్వదీయే మయా
లక్కావఝ్ఝుల కృష్ణనామక భవద్దాసేన సంగుంభితమ్।
భక్త్యాచాంకితరూపతో ఽర్పిత మిదం త్వాశ్చర్య రామాయణం
జీయా దారవిచంద్రతారకమలం మచ్ఛ్రేయసే భూయసే॥

శ్రీరామశ్శరణం మమ.

# విజ్ఞప్తి

భో భో రామభక్తాగ్రేసరాః! మదీయా మిమాం వాచమల్పాంశ్రుణ్వంతు తత్రభవంతో మహాంతో భవంతః. నాయికా నాయకయో స్తచ్చరిత్రస్య వా బహువారం సంశ్లాఘనం న హి పౌనరుక్త్యాపాదకం భవేదితి ప్రథమత స్తద్విషయే కించిత్ప్రస్తూయతే, యస్తావ దనుపమ ప్రభావసూర్యవంశ ముక్తాఫలస్య దశరథస్యానితర స్త్రీ సాధారణ సౌభాగ్యవతీనాం కౌసల్యాదీనాం జఠరేషు చతుర్భిరంశై ర్జననమభిగృహ్య స్వధర్మాచరణేన పితృవాక్పాలనాదీంశ్చ ధర్మాన్ సముపదిశతిస్మ లోకానాం, తస్యపరమకారుణికస్య భగవతశ్శ్రీరామచంద్రస్య, యానామ స్వాచరణేన నివేదయామాన దిక్తో దిగంతరం దేశతో దేశాంతరం వా పతిభక్తిం, యా చ విగ్రహవతీవ పుణ్యకళా, యస్యా ఏవ జనన పరిగ్రహో ధరణ్యాం మానవీనాం పాతివ్రత్య శిక్షాఫలకః తస్యాస్సతీలలామ భూతాయా స్సీతాయాశ్చ, ద్వయోస్తయో రనన్యసాధారణ మాహాత్మ్యయో స్సీతారామయో శ్చరిత్రం పవిత్ర మాదికవిర్వాల్మీకిర్మహాకావ్యం లోకానాముత్తారణార్థం వ్యరచయదితి, తాదృశం రామాయణం చతురంభోధి వలయితేస్మిన్భూ మండలే కించిదప్యశ్రుణ్వా న ఏవ నాస్తీతి చ, తదవతారప్రభృత్యేతావ ద్భగవతో నామ్నశ్చరితస్యచ ప్రచారః ప్రచలతీతి చ నిశ్శంకం సర్వైరప్యురరీకృతమేవ, మానవానాం కష్టభూయిష్ఠే జీవితే హైందవ మతగ్రంథేషు పారాయణోపయుక్త మేకైకాక్షరశ్రవణకృతామపి మహాఫలప్రదం సంసారతారకం దుఃఖ నివారకం చ రామాయణాదన్య న్నహి దరీదృశ్యతే.

తాదృశం రామచరిత మపరేఽప్యగస్త్యాదయో మహర్షయో వర్ణయంతిస్మ బహుధా, తథాపి నహి తత్కారణం విజానీమః, యేన వాల్మీకీయ ఇవ పరకీయేషు రామాయణేషు ప్రభూతతరా ప్రీతి రాస్తికానాం నహి సందృశ్యతే, ఏవంసతి మాదృశస్యాల్పధియో మమాస్మి న్సమాలోచనే యత్నః కేవల ముపహాసాయైవ, నాస్త్యత్ర సందేహావకాశః, తథాపి, బలవద్వాసనావాసితాంతఃకరణస్య స్వాధికార మవిచారయతో మే మనస్వినామపి దురారోహే కర్మణి ప్రవర్తమానస్యానుష్ఠానమిదం న మద్విచారాసహం, సహృదయ హృదయమే వాత్రప్రమాణం, తథాపి నవ్యవిశేషోపేతా దాంధ్రతాత్పర్యసహితా దస్మాదపి మహత్ప్రయోజన మాంధ్రదేశస్య భవేదితి, తదా త్వాంధ్రదేశస్య మత్కృతాసేవా భవేదితి చ, అనేన శ్రీరామానుగ్రహా దైహికాముష్మిక శ్రేయాంసి ప్రాప్నువానీతి చైతత్కార్య మారబ్ధవా నహం, అస్మిన్ చతుర్థసంపు

టేఽపి ప్రయోజనీయా న్కథావిశేషా నేకత్ర సంగ్రథ్యాంధ్ర తాత్పర్యం చ విలిఖ్య, స్వకీయాంశ్చ శ్లోకానర్థాధికా న్విరచయ్య, క్వచన పూర్వజన్మకథాశ్చ నివేద్య, క్వచిద్వాల్మీకీయ శ్లోకానాం ధర్మతాత్పర్యకత్వం వినివేద్య తత్ర తత్ర గద్యాన్యపి సంగ్రథ్య చ, సులభయా శైల్యా సంగ్రథితోఽయం గ్రంథస్సర్వేషా మాస్తికానా ముపయుక్తో భవేదిత్యభిప్రైమి, అస్మి న్గ్రంథే ముద్రణప్రమాదా స్మత్ప్రమాదాద్వా దోషా యది దృశ్యేరన్ మామకీనాపరాధం క్షమధ్వ మిత్యభ్యర్థయే.

ఈషద్వైషమ్యేణ వత్సరపర్యంత మనారోగ్య సంయుతత్వా న్మమ ద్రుతతర మేతద్భాగముద్రాపణావకాశో నాభూదితి వక్తు మహమేవ లజ్జితోఽస్మి, ఇతః పురా శ్రీరామానుగ్రహేణ సంపుటత్రయం ముద్రాప్య ప్రకాశితమితి సర్వైర్విదితమేవ, అధునా చతుర్థసంపుటం శ్రీరామవనగమనకథారంభక పాదుకా పట్టాభిషేకాంత కథా సంవలితం.

భగవతః శ్రీరామచంద్రస్య ప్రసాదేన చతుర్విధ పోషకాణాం సహాయేన చ ముద్రాప్య ప్రకాశితవా నహం. అవశిష్టభాగా అపి ద్రుతమేవ ముద్రాపితా భవేయు. అంతరేఽంతరేత్వనారోగ్యవశా దేవ కామనానుగుణం సౌందర్యం సంవిధాతుం న క్షమోహ మిత్యభిప్రైమి. అత ఏవ యత్రకుత్రచి త్ప్రమాదః యా కా చ త్రుటి రాపాతితా సైవ తు సహృదయైఃక్షంతవ్యేతి గ్రంథ మిమ మా మూలచూడం సంపఠ్య మదీయశ్రమం సఫలం కుర్వంత్వితి- సాంజలిబంధ మహ మభ్యర్థయే. వాగ్దత్తకృతః పోషకమహాశయాః దాతవ్యాని విరాళాని సత్వరం దత్వా మదీయోద్యమం సఫలం కుర్వంత్వితి, సాంజలిబంధ మహ మభ్యర్థయే. కి చైతద్గ్రంథ ముద్రాపణస్య సహాయభూతా నాం పోషక మహాశయానాం శ్రీరామచంద్ర ప్రసాదేనాయురారో గ్యైశ్వర్యపుత్రపౌత్త్రాభివృద్ధి ర్భూయాదితి శ్రీరామచంద్రం సప్రణామం సంప్రార్థ్య విరమ్యతే.

బెజవాడ,
9-2-39

ఇత్థం గ్రంథరచయితా,
లక్కావఝ్ఝుల వెంకట కృష్ణశాస్త్రీ.

## (అనువాదము)

ఓ రామ భక్తాగ్రేసరులారా! నాదగు చిన్న విన్నవింపు పలుకు నొండాలకింపుడు. నాయికానాయకులగు సీతారాముల గూర్చి కాని తచ్చరిత్రమును గూర్చికాని గ్రంథాదియొం దొకింత ప్రస్తావించుట పునరుక్తము కాదు కాన నొకింత మొదట వారినిగూర్చి ప్రస్తావింపబడుచున్నది.

ఏమహాత్ముడు నిరుపమాన ప్రభావముగల సూర్యవంశమునకు ముక్తాఫలమైన దశరథచక్రవర్తికి, ఇతర నారీసాధారణము కాని సౌభాగ్యము గల కౌసల్యాదుల గర్భంబులందు నాలుగంశముల నుద్భవించి, స్వీయ ధర్మాచరణముచేఁ బిత్రాజ్ఞా పరిపాలనాది ధర్మములను లోకములకు బోధించెనో, ఆ పరమకారుణికుడగు భగవంతుడైన శ్రీరామచంద్రమూర్తియొక్కయు; ఏ రమణీ లలామ స్వధర్మాచరణముచే దిక్కులనుండి దిక్కులకును, దేశములనుండి దేశములకునుఁ దన పతిభక్తిని వెల్లడిచేసెనో, ఏ పవిత్రురాలు శరీరధారిణియగు పుణ్యకళయో, ఏ స్త్రీరత్నముయొక్క జననము మానవస్త్రీలకుఁ బాతివ్రత్య శిక్షాఫలక మయ్యెనో, అట్టి నారీతిలకమగు సీతయొక్కయు, (అనగా ననన్య సాధారణ మాహాత్మ్యము గల యాసీతారాములయొక్క) పవిత్ర చరిత్రమును ఆదికవియగు వాల్మీకిమహర్షి సంసారదుఃఖ నిమగ్నులైన జనుల నుద్ధరించుటకై రామాయణ మహాకావ్యమునుగా రచించినట్లును, ఆ సీతా రామ చరిత్రాత్మకమగు రామాయణమును చతురంభోధి వేలావలయిత మైన యీ భూమండలమున నేమాత్రమైన నెఱిగి యుండని జనుడొక్కడేనియు లేడనియు, శ్రీరామావతారము మొదలుకొని నేటిదనుక నా భగవంతుని నామముయొక్కయుఁ జరిత్రముయొక్కయు బ్రచారము మిక్కిలిగ నీ భరతఖండమునందుఁ బెంపొందుచున్నదనియు. నిశ్శంకముగ నందరు నంగీకరించిన విషయమే.

మానవుని కష్టభూయిష్ఠమైన జీవితములో హిందూమత గ్రంథములలోఁ బారాయణోపయుక్త మైనదియు, నొక్కొక్క యక్షరశ్రవణముజేతను గూడ మహాఫలము నిచ్చునదియు, సంసారతారకమును, దుఃఖనివారకమునగు నది రామాయణముకంటె వేరొక్కటి వెదకి చూచినను గాన్పింపదనుట యతిశయోక్తి కానేరదు. అట్టి రామకథ నితరులయిన యగస్త్యదుర్వాసాదులు సయితము ననేకవిధములుగ వర్ణించి రామాయణములను రచించిరి. అయినను వాల్మీకి రామాయణమునందువలె, నితర రామాయణములయం దాస్తిక జనుల కత్యంతప్రీతి గన్పట్టుటలేదు. ఇందుకు గారణములను గానము.

ఇవి యిట్లుండ నావంటి యల్పబుద్ధికి రామాయణ సమాలోచనమునందు యత్నము కేవలముపహాసమునకే యగును. ఇందుకు సందియము లేదు. అయినను

బలవద్వాసనా వాసితాంతఃకరణుఁడనై స్వాధికారమును విచారించుకొనని నేను బుద్ధిమంతులకును సాధ్యముకాని ఈ కార్యమును బూనుట విచారసహమైనదిగా లేదు. ఇచ్చట సహృదయ హృదయమే ప్రమాణము. అయినను నూతన విశేషాంశములతోగూడినదియు నాంధ్ర తాత్పర్యసహితమునగు నా యీ గ్రంథమువలన నాంధ్ర దేశమునకు మహాప్రయోజనము కాగలదనియు నప్పుడు నా కాంధ్రదేశసేవా భాగ్యము కలుగుననియు, నందుచే శ్రీరామానుగ్రహమువలన సకలైహికాముష్మికఫలములు సమకూరుననియుఁ దలచి యీ కార్యమును నారంభించితిని.

ఈ చతుర్థసంపుటమునందును బ్రయోజనకరములగు విశేషములను సమకూర్చియు, నాంధ్రతాత్పర్యమును లిఖించియు సగముకంటె నెక్కుడుగ స్వయంకృత శ్లోకములను గూర్చియు, నొక్కొక స్థలమునఁ బూర్వ జన్మ కథా వృత్తాంతములనుఁ దెలియజేసియు, నింకొకస్థలమున వాల్మీకీయశ్లోకములు ధర్మతాత్పర్యము గలవని దృఢపరచియు, నచ్చటచ్చట గద్యలను జేర్చుచు సులభశైలిచేఁ గూర్పబడిన యీ గ్రంథ మాస్తికజనుల కందరకు నుపయుక్త మగునని యభిప్రాయపడుచుంటివి.

ఈ గ్రంథమునందు ముద్రణ ప్రమాదమువలన గాని, నా ప్రమాదమువలనగాని దోషములేమైన గన్పడినచో నా యపరాధములను విద్వాంసులు సహించుదురు గాక యని కోరుచున్నాఁడను. కాని కొంచెమించుమించుగ సంవత్సరకాలము నేననారోగ్యముతో నుండినందున శీఘ్రముగ నీ భాగమును ముద్రింప నవకాశము కలుగలేదని చెప్ప నేను లజ్జించుచుంటిని.

ఇంతకుఁబూర్వము శ్రీరామానుగ్రహముచే మూడుసంపుటములను ముద్రింపించి ప్రకటించితి నను విషయ మందరికిఁ దెలిసినదే. శ్రీరాము డరణ్యమునకు బయలుదేరుట మొదలు పాదుకా పట్టాభిషేకపర్యంతకమగు కథ గల యీనాల్గవసంపుటము నిప్పుడు శ్రీరామానుగ్రహముచేతను పోషక సాహాయ్యముచేతను ముద్రింపించి ప్రకటింపగలిగితిని. మిగిలిన భాగములుకూడ శీఘ్రముగ ముద్రింపఁబడగలవు. మధ్య మధ్య నా కనారోగ్యము కలిగిన కారణముచే నేన నుకొనినంత గ్రంథమును కలుగజేయలేక పోతినేమో యను సంశయము కలదు. అందువలననే యెచ్చటనైనను ప్రమాదములు (తప్పులు) ఉండినచో క్షమింప దోషజ్ఞులను వేడుకొనుచుంటిని. నా యీ గ్రంథము నా మూలాగ్రముగఁ జదివి నా శ్రమను సఫలము చేయుదురుగాత యని పండితులను గోరుచుంటిని. ఇదియునుం గాక ఈ గ్రంథముద్రా పణవిషయమై నాకు ధనసహాయము చేసిన పోషకమహాశయులకు శ్రీరామానుగ్రహముచే సకలాయురారోగ్యైశ్వర్యాభివృద్ధులు కలుగుగాక యని శ్రీరామచంద్రమూర్తిని సప్రణామముగఁ బ్రార్థించుచున్నాఁడను.

ఇట్లు గ్రంథరచయిత,

**లక్కావఝ్ఝల వెంకటకృష్ణశాస్త్రి.**

# పండితాభిప్రాయః

శ్రీమద్భిః పండితవరైర్విజయవాటికా హైందవాంగ్లేయ మధ్యమ కళాశాలాప్రధాన సంస్కృతపండితైః శ్రీ లక్కావఝ్ఝుల వేంకట కృష్ణశాస్త్రిభిర్విరచితమాశ్చర్య రామాయణ మహామద్రాక్షమ్- అపఠంచ కాంశ్చన భాగాన్, అశ్రౌషం చ శాస్త్రిముఖాదేవ కానిచిద్విమర్శనాని కథాభాగాంశ్చ, ఏతద్గ్రంథపఠన శ్రవణా దిభి ర్మమాభూత పూర్వమాశ్చర్యం సమజని, ప్రాదురభూచ్చమహాన్ సంమోదః, అన్వర్థనామధారీ గ్రంథరాజ స్సకృచ్ఛ్రవణ మాత్రేణైవ సర్వేషా మాస్తికవరేణ్యానా మభూతపూర్వాం ముదముద్వహన్, శ్రీరామతత్త్వ నివేదనేన సర్వపురుషార్థాన్ ప్రదాస్యతీతి దృఢం విశ్వసిమి. తత్ర భవతాం శాస్త్రివర్యాణామేతద్గ్రంథప్రకాశన కౌతూహల మచిరాదేవ పరిపూరయంతు దానశౌండా ఇత్యాశాస్మహే. శ్రీరామచంద్ర కటాక్షేణ గ్రంథరాజోఽయ మారచయితా చాచంద్రార్కం జీయాస్తామితి శివమ్ -

కాకినాడ — ఇత్థం

ది 13-10-1938 — "వేదభాష్యవిశారదః" ఉప్పలూరి గణపతిశాస్త్రీ.

(అనువాదము)

విజయవాడ హిందూహైస్కూల్‌లో ప్రధానసంస్కృతపండితులును, పండితవరేణ్యులునగు లక్కావఝ్ఝుల వేంకట కృష్ణశాస్త్రిగారిచే రచింపబడిన యాశ్చర్య రామాయణమును నేను జూచి కొన్ని భాగములను జదివితిని. శాస్త్రిగారి ముఖమునుండికూడఁ గొన్ని విమర్శనలను కథాభాగములనుగూడ వింటిని. ఈ గ్రంథపఠన శ్రవణములచే నపూర్వమైన యాశ్చర్య ముదయించెను. గొప్ప యానందముకూడ కలిగెను సార్థకనామము కల యీ గ్రంథరాజము సకృచ్ఛ్రవణమాత్రముచేతనే సమస్తాస్తిక వరేణ్యులకు నపూర్వానందమును గలుగజేయుచు శ్రీరామతత్త్వమును నివేదించుట మూలకముగ సకల పురుషార్థముల నొసగగలదని దృఢముగ విశ్వసించుచున్నాను. పూజనీయులగు శాస్త్రివర్యుల గ్రంథముద్రణ కుతూహలమును దాతలు పరిపూర్తిచేయుదురని కోరుచుంటిని. శ్రీరామచంద్ర కటాక్షముచే నీగ్రంథ రాజము నీ గ్రంథరచయితయును నాచంద్ర తారకముగ సర్వోత్కర్షచే నుందురుగాతయని కోరుచు విరమించుచుంటిని.

కాకినాడ, — ఇట్లు,

13-10-38. — "వేదభాష్యవిశారదులు" ఉప్పలూరి గణపతిశాస్త్రి.

# పండితాభిప్రాయము

శ్రీ లక్కావఝుల వెంకట కృష్ణశాస్త్రిగారు!

బహు రామాయణములు పరిశీలించి యాశ్చర్యరామాయణమును రచించిరి. ఇందు ముప్పాతిక శ్లోకములు వీరు వ్రాసినవే, అవసరమైనచోట్లనెల్లఁ బూర్వరామాయణముల నుండి కొన్ని కొన్నిచోట్ల సంగ్రథించిరి. వీరు రామాయణములను బహు విమర్శబుద్ధితోఁ బఠించి యనేక సంశయములు నివారించిరి.' ఆశ్చర్యవత్పశ్యతి కశ్చి దేనం' అన్న గీతావాక్యగతాశ్చర్య శబ్దనిక్షేపమువలన వీరు తమ రామాయణోద్దిష్ట మహార్థము సూచించిరి. అల్పశక్తులు గల యీ కాలమువారికి, రామకథాభిలాషులగు వారికి వీరి గ్రంథము రామాయణకోశము; వీరికిఁ బెద్దలు ధనసాహాయ్యము చేసి యీ మహాగ్రంథము పూర్తిగాఁ బ్రకటిత మగుటకు సానుకూలపడుచున్నారు. భగవంతుడు వీరకి చిరాయురారోగ్యము లిచ్చి తన పని తానే సానుకూలపరచుకొనుఁగాక.

ఇట్లు,

బెజవాడ,
20-12-1938.

విశ్వనాథ సత్యనారాయణ, M.A.
S.R.R. కాలేజీ ఆంధ్రోపన్యాసకులు.

శ్రీకాంచీపురీవాసిభి శ్రీశైల ఈశన్ పాడి సింహాసనాధిపతిభి శ్రీనివాసరాఘవాచాః ప్రేషితేయం పత్రికా. భోభో వేంకటకృష్ణశాస్త్రిణస్త్రికరణ శుద్ధ్యా వినా ఖ్యాతి లాభ పూజాదికం యుష్మదీయాశ్చర్య రామాయణ గ్రంథ విషయేత్వావిష్క్రియతే మామకీనోయ మాశయః యుష్మత్కృత మేత మపూర్వం గ్రంథం ప్రథమాది తృతీయాంతం సంపుట త్రయ మహం సవిమర్శ మపశ్యం. తత్ర సంపాదితాని పద్యాని సర్వాణి హృదయంగమాని. సర్వేషా మా స్తికానా మాదరణీయాని చేతివక్తుం నకోఽపి ద్వాపరః. ఏతద్గ్రంథపఠనేన సర్వేషా మపి పరమపురుషార్ధ స్సంభవేదితి చ మన్యే. యథా భారతయుద్ధం భవాన్ స్వయమేవ కృత్వార్జునేన కృతమితి ప్రఖ్యాపయామాస, తథా స్వయమేవ హృదంతర్జ్యోతిః పురుషః యుష్మన్మూలేన విస్తారయామాసేతి చ మన్యే. అతశ్శీఘ్రమేవ యావద్గ్రంథముద్రణసమాప్తి ర్భూయాదితి శ్రీ కాంచీపురాధిపం దేవాధిరాజం సంప్రణామ మభ్యర్థయే.

49 ఉత్తరమాడవీథీ.
కాంచీపురం,
14-12-1938.

ఇత్థం విద్వజ్జనవిధేయః:
"ఉభయవేదాంత విద్వాన్"
టి. ఇ. శ్రీనివాస రాఘవాచార్యః,

## (అనువాదము)

శ్రీకాంచీపురనివాసులును శ్రీశైల ఈశన్ పాడి సింహాసనాధిపతులు నగు శ్రీనివాస రాఘవాచార్యులవారిచే నీ సన్మానపత్రిక పంపబడుచున్నది.

ఓ వేంకటకృష్ణశాస్త్రి గారు! తమరు రచించిన యాశ్చర్యరామాయణ గ్రంథ విషయమై ఖ్యాతిలాభగౌరవాదుల నపేక్షింపక త్రికరణశుద్ధిగ నాయభిప్రాయమును బ్రకటించుచుంటిని. మీరు రచించిన యీ యపూర్వ గ్రంథమును ప్రథమసంపుటము మొదలు మూడు సంపుటములను సవిమర్శ ముగఁ జూచితిని. ఆ గ్రంథమునందు సమకూర్చిన శ్లోకము లన్నియు మనో హరములుగాను, ఆస్తికుల కందర కాదరణీయములుగాను నున్నవని చెప్పుటకు సందియ మెంతమాత్రము లేదు. ఈగ్రంథపతనము చేసిన వారందరకును పరమపురుషార్థము సంభవించునని తలచెదను. కృష్ణభగవానుడు భారత యుద్ధమును తానే చేసి యర్జుననిచేఁ జేయబడినదని తెల్పుడు చేసిన విధముగ హృదయాంతర్యామియగు జ్యోతిఃపురుషుడే యీ గ్రంథమును స్వయముగఁ జేసి మీమూలకముగ విస్తరింపజేసెనని తలచుచుంటివి. కావున నీ గ్రంథమంతయు శీఘ్రముగ ముద్రణ సమాప్తి నొందగలందులకు శ్రీ కాంచీపురాధిపతియగు వరదరాజస్వామిని నమస్కార పూర్వకముగఁ బ్రార్థించు చున్నాడను.

49 ఉత్తరమాడవీధి.
కాంచీపురము,
10 - 12 - 38.

ఇట్లు విద్వజ్జన విధేయులు,
**ఉభయ వేదాంత విద్వాన్,**
టి.ఇ.శ్రీనివాసరాఘవాచార్యులు,

రామాయణ కేసరీ, రామాయణ తీర్థేత్యాది బిరుదావళీ విరాజితైః, లక్కావఝ్ఝుల వేంకటకృష్ణశాస్త్రిభిః బహు రామాయణేభ్యః శ్రుతిస్మృతి పురాణేతిహాసేభ్యః అదృష్ట పూర్వాన్ సుహృదాహ్లాదజనకాన్ విశేషాన్ ఏకత్ర సంగృహ్య స్వీయ మృదుమధుర రసమిళిత వచనైః రచితం పద్యాత్మకం ఆశ్చర్య రామాయణం సార్థక నామధేయం బహువారం వ్యలోకయం, తత్ర రామ నామార్థ రహస్యం స్ఫుటతరం భాతి, దశరథస్య శ్రీరామ పట్టాభిషేకాలోచన ప్రస్తావే ప్రజాపాలనాది పద్ధతిః సూచితా, రామలక్ష్మణ సంవాదే పుత్రాణాం పిత్రాజ్ఞాకరణం స్పష్టతరం నిరూపితం, సీతాయాః రామస్య చ సంవాదే ప్రోషిత భర్తృభి స్సాకం సమసుఖ దుఃఖ భాగిత్వమేవ ఉచితమితి సమ్యక్ నిరూపితం, బహుధర్మయుక్తమిద మాశ్చర్య రామాయణం పాశ్చాత్యవిద్యా సంస్కృత బుద్ధీనాం పుంసాం విదేశీయ వాసనావాసిత చిత్తానాం స్త్రీణాంచ రామాయణవిషయే అవిశ్వాస పూర్వక కుతర్కాన్ నిరస్య శ్రేయసే అవశ్యం భవతు, శ్రీశాస్త్రిణాం బహు గ్రంథస్థ విషయావలోకన సంఘటన ప్రయాసం విద్వాంస ఏవ విజానంతి. కిం బహునా, గ్రంథోఽయం పండిత పామరాణాం ముదమాదధానాః యావచ్చంద్ర దివాకరం జగతివిజయతా మిత్యాశాస్మహే.

ఇత్థం

"న్యాయవేదాంత పండితః"

ది 4 - 2 - 1939,

**మండలిక చినవేంకటశాస్త్రీ,**

శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి సంస్థాన విద్వాన్.

## (అనువాదము)

రామయణకేసరీ రామాయణతీర్థేత్యాది బిరుదములచే నొప్పుచున్న బ్రహ్మశ్రీ లక్కావఝ్ఝుల వేంకట కృష్ణశాస్త్రిగారు అనేక రామాయణములనుండియు శ్రుతిస్మృతి పురాణేతిహాసాదులనుండియు నదృష్టపూర్వములును సహృదయానందజనకములు నగు విశేషాంశములను నొక్కచో సమకూర్చి తన మృదుమధురవాక్కులచే రచించిన శ్లోకరూపముగ నున్న సార్థకనామము గల యీ యాశ్చర్యరామాయణమును నే ననేకపర్యాయములు చూచితిని. ఆ రామాయణమున రామనామరహస్యార్థ విచారణము స్పష్టముగ జేయబడినది. దశరథుడు శ్రీరామునకుఁ బట్టాభిషేకవిషయమై యాలోచించిన సందర్భమున ప్రజాపరిపాలనాపద్ధతి సూచితమైనది. రామలక్ష్మణ సంవాదములో కుమారులు పితృాజ్ఞ విధిగా జేయవలయునను ధర్మము స్పష్టముగ నిరూపింపఁబడినది. సీతారాముల సంవాదములో ప్రోషిత భర్తృకలగు స్త్రీల ధర్మములు సప్రమాణముగ నిరూపితములైనవి. మఱియు స్త్రీలు భర్తతో సమానసుఖ దుఃఖములు గలవారుగా నుండవలయునని ధర్మముకూడ బాగుగ నిరూపింపఁబడెను. ఇట్లనేక ధర్మబోధనములతో గూడిన యీ యాశ్చర్యరామాయణము పాశ్చాత్య విద్యచే సంస్కరింపబడిన బుద్ధులుగల పురుషులకును, విదేశీయ వాసనా వాసిత చిత్తములు గల స్త్రీలకును, రామాయణవిషయమున విశ్వాసరాహిత్య పూర్వకములగు దురూహములఁబోగొట్టి శ్రేయోదాయకము కాగలదనియు, ననేక గ్రంథస్థవిషయములను జూచి సంఘటనము చేసిన శ్రీ శాస్త్రిగారి ప్రయాసమును విద్వాంసులు గుర్తెరుగగలరనియు, నీ గ్రంథము పండితులకు పామరులకు ప్రమోదమును గలుగజేయునదియై సూర్యచంద్రాదు లుండు పర్యంతము జగత్తునందు విరాజిల్లుచుండుగాత యనియు కోరుచున్నాడను.

ఇట్లు
న్యాయవేదాంత విద్వాన్,
**మండలిక చిన వేంకటశాస్త్రి,**
శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి సంస్థాన విద్వాన్.

శ్రీ విజయవాడ హిందూన్నత పాఠశాలా ప్రధాన సంస్కృతా ధ్యాపకైర్విద్వద్వరై, "రామాయణతీర్థ, రామాయణ కేసరీ" త్యాద్యుపాధిభి రలంకృతైర్బ్రహ్మశ్రీ లక్కావఝ్ఝుల వేంకటకృష్ణశాస్త్రిభి స్సహృదయ హృదయా హ్లాదకతయా చత్వారింశద్రామాయణేభ్యః పురాణేభ్యశ్చ కథాభాగాన్సం గృహ్యోపనిబద్ధమిదమాశ్చర్య రామాయణ మామూలాగ్ర మవలోకితం. గ్రంథేఽ స్మిన్ దోషలేశోపి నా సి. కించాక్షేప సమాధాన పూర్వకవిమర్శన దర్శనేన పండితానాం పామరాణా మాశ్చర్యం మహాన్ప్రమోదశ్చ సంభవేదిత్యహమభిప్రైమి. ఏత స్యాశ్చర్యరామాయణమితి నామ సార్థకమేవేత్యత్ర నఽకోపి సంశయః. అపిచాయం గ్రంథ స్స్వాచంద్రతారకం జయత్వితి, గ్రంథకర్త్రాన్ భగవాన్ కాశీపతిర్విశ్వనాథోఽవత్వితిచ, సంప్రణామ మహ ముమాపతి మభ్యర్థయే.

ఇత్థం పండితవిధేయః,

నైజాం మంతిన
1-12-38.

**సత్యవాడ రామమూర్తిశాస్త్రీ**, కాశీపండితః.
తూండ్ల ఇత్యాది జమీందారువారి ఆస్థాన విద్వాన్.

## (అనువాదము)

శ్రీ విజయవాడ హిందూహైస్కూలులో ప్రధానసంస్కృతపడితులును" రామాయణ తీర్థ, రామాయణకేసరీ" త్యాది బిరుదాంకితులును. విద్వద్వరేణ్యులు నగు బ్రహ్మశ్రీ లక్కావఝ్ఝుల వెంకటకృష్ణశాస్త్రి గారిచే సహృదయ మనోరంజకముగ నలుబది రామాయణములనుండియు పురాణముల నుండియు, కథాభాగములను సంగ్రహించి సమకూర్పబడిన యీ యాశ్చర్యరామాయణ గ్రంథము నామూలాగ్రముఁ జదివితిని. నా కెచ్చటను దోష లేశమైన నీ గ్రంథమున గన్పడుటలేదు. మఱియు నాక్షేపసమాధాన పూర్వకములగు విమర్శనలను జూచియెడలఁ బండితులకును పామరులకును గూడ గొప్ప యానందము కలుగగలదని యభిప్రాయపడుచుంటిని. ఈ గ్రంథమునకుఁ బెట్టిన పేరు సార్థక నామధేయమని చెప్పుటలో సందేహ మేమియు లేదు. మఱియు నీ గ్రంథ మాచంద్రతారకముగ సర్వోత్కర్షచే నుండుగాతయనియు, గ్రంథరచయితను శ్రీ కాశీపురాధీశ్వరుడగు విశ్వనాథుడు రక్షించుగాత యనియు సాదరముగ నుమాపతినిఁ బ్రార్థించెదను.

ఇట్లు పండితవిధేయుడు,

1-12-1938,
నైజాం-మంతిన.

**సత్యవాడ రామమూర్తిశాస్త్రి**, కాశీపండితులు,
తూండ జమీందారువారి యాస్థానవిద్వాంసులు.

## ధేనువాగీశ్వర్యై నమః

బ్రహ్మశ్రీ లక్కావఝుల వెంకట కృష్ణ శాస్త్రిగారికి,

తమరు నాకుఁ బ్రీతిపూర్వకంబుగ నొసంగినట్టి యాశ్చర్యరామాయణ సంపుటములు, స్థాలీపులాక న్యాయముగా నక్కడక్కడ ఁచివినాడను.

తమరు పెక్కు పురాణములనుండి, మహర్షిప్రోక్తములగు బహువిధ రామాయణములయందు గల రామకథాభాగములనుండియు సంగ్రహించి, సమకూర్చిన యద్భుతకథాభాగములు పరికింపఁగా వాల్మీకి రామాయణమునఁ గల శ్లోకములయందు ధర్మబోధయే ముఖ్య తాత్పర్యమనియు ముముక్షువుల కత్యంతోపయుక్త మనియు తేట తెల్లమగుచున్నది. మఱియు, కథాభాగములు హృదయంగమములై సకలవేద్యములేగాక, సర్వజన మనోరంజకము లగుచున్నవి. వేయేల, మీ రామాయణకథలు చదివినవారు ఇంచుకసేపయిన మైమరచి, యానందవారాశి నోలలాడని యాస్తికు లుండరని నానమ్మకము.

అంతియేగాక పౌరాణికులు శ్రమపడనక్కరలేక, రామాయణమున గల సంశయములను సులభముగా నివారించి యాయాభాగముల ప్రవేశించు పాత్రల పూర్వజన్మ వృత్తాంతములు శ్రోతల కుపదేశించుట కధునాతనులకు సహకారియు, భావికథకుల కాచార్యరూపమనియు నా యాశయము.

ఈ గ్రంథమందు తమ కవితాధోరణి యొకదిక్కున, తర్కవేదాంత శాస్త్రపాండిత్యమును మఱియొకచో, బహువిధపురాణపరిశ్రమయు నింకొక చక్కి, సులభమగు వాక్యరచనా సామర్థ్యములు మొదలగు ఘట్టముల జూడ తమ పాండిత్య మసాధారణ మనియు, రామానుగ్రహము తమ యందు పూర్తిగా గలదనియు స్పష్టమగుచున్నది.

తమ ప్రయత్నము శ్రీరామచంద్రమూర్తి సంపూర్తి గావించి కృతార్థ జన్ముల జేయుగాత.

ఇట్లు,
విద్వత్కవి
**మల్లాది అచ్యుతరామశాస్త్రి.**

# విషయసూచిక


| సర్గ | విషయము | పుట |
|---|---|---|
| 1. | శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణసమేతుడై వనమునకు వెళ్లుట-దశరథవిలాపము - కౌసల్యాసాంత్వనము. సాధుబృందము కైకేయీ దశరథులను దూషించుచు రామునితోఁ బ్రయాణమై పోవుచుండ నా సాధుబృందమునకు వామదేవుడు రామతత్త్వమునుఁ దెలిపి నివారించుట. పురజనులు రామునివెంటఁ జని రథము ననుసరింప లేక తిరిగి పురమున కరిగి రాముని రాకకై దేవతా పూజాదులనుఁ జేయుచుండుట-రాముడు తమసానదీతీరమున నారాత్రి విశ్రమించుట. | 1-15 |
| 2. | రామచంద్రమూర్తి యచ్చటనుండి పురజనులకుఁ దెలియకుండగ బయలుదేరి రథారూఢుడై వెళ్ళగా పురజనులు విముఖులై తిరిగి యయోధ్యకేగగా పౌరస్త్రీలు రామునిఁ దీసికొనిరానందుకుఁ దమ భర్తలను కైకనుగూడ దూషించి వారలుకూడ వనమునకుఁ బ్రయాణమగుట- రాముడు గంగాతీరమును జేరుట, రామగుహ సమాగమము. గుహుని భక్తి ప్రకటము. గుహశబ్దార్థ విచారము. గుహుడు సీతారాముల వనవాసకష్టములను గూర్చి లక్ష్మణునితోఁ జెప్పి విచారపడుట. లక్ష్మణుడు గుహునకుఁ దత్త్వోపదేశము - సుఖ దుఃఖాది ఫలము కర్మవలననా, ఈశ్వరునివలననా యనువిచారము- ఈశ్వరుని వలననే యని సిద్ధాంతము. | 16-32 |

3. సుమంత్రుడు రామునితో దశరథుడు చెప్పిన మాటలను చెప్పి పురమునకు రాగోరుట, సీతారాములు తమ మనో నిశ్చయమును జెప్పి సుమంత్రున కనుజ్ఞ నిచ్చుట-గుహునిచే దేబడిన నావ నెక్కి రామభద్రుడు సీతా లక్ష్మణ యుతుడై గంగను దాటుచున్నతరి సీత గంగనుఁ బ్రార్థించుట, గంగామాహాత్మ్యము. గంగ యశరీరవాక్కుతో సమాధానము గంగనుదాటి రాముడు గుహున కనుజ్ఞ నిచ్చుట. 33-46

4. శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతముగా నడవిలో కాలినడకచే బయలుదేరుట - సీత యలసటచే నడువలేక పోవుట-రాముడు భూదేవినిఁ బ్రార్థింప నామెపాదములకు భూమి పుష్పశయ్యగా మారుట- సీతను పాంథస్త్రీలు సత్కరించుట - రాత్రి వనస్పతిమూలమున వారలు శయనించుట - వారలు భరద్వాజాశ్రమ ప్రవేశము-మరుదినము చిత్రకూటమునకు భరద్వాజాజ్ఞచే బయలుదేరుట-మధ్యమార్గమున సీత న్యగ్రోధవృక్షమును ధ్యానించుట-చిత్రకూట ప్రవేశము. 47-66

5. వాల్మీక్యాశ్రమ ప్రవేశము-వాల్మీకి తన పూర్వజన్మవృత్తాంతమును జెప్పి రాముని స్తుతించుట-పర్ణశాలానిర్మాణము-వాస్తుపూజ-గృహప్రవేశము. 67-77

6. సుమంత్రు డయోధ్యకు వచ్చి రామాదుల కుశలవార్తను కౌసల్యా దశరథులకుఁ జెప్పుట. కౌసల్యావిలాపము-సుమంత్రుని యోదార్పు-దశరథుడు తనకుఁ బూర్వము గలిగిన శాపవృత్తాంతమును గౌసల్యతోఁ జెప్పి విలపించుట - దశరథ మృతి. 78-90

7. కౌసల్యాది రాజస్త్రీల విలాపము-వసిష్ఠుడు దశరథుని శరీరమును తైలద్రోణియం దుంపించి, దూతలను భరతసమీపమునకుఁ బంపుట-దుస్స్వప్న నివేదనము - భరతుని దూతలు కలిసి వసిష్ఠాజ్ఞను జెప్పి భరతుని సాకేతమునకుఁ దీసికొనివచ్చుట - కైకేయివలన

భరతుడు పితృమరణ వృత్తాంతమును విని విలపించి పిమ్మట కౌసల్యాదర్శనమున కేగుట - కౌసల్యా భరతుల సంభాషణము. వసిష్ఠాదుల యాజ్ఞచే భరతుడు దశరథున కౌర్ధ్వదైహిక కృత్యములను నెరవేర్చుట, వసిష్ఠుడు పితృమరణమును గూర్చి విలపించుచున్న భరతునకు శాంతివాక్యములనుఁ జెప్పి యోదార్చుట. 91-107

8. శత్రుఘ్నుడు మంథరను గొట్టుచుండ భరతుడు నివారించుట- మంత్రిపురోహితాదులు భరతునిఁ బట్టాభిషేకము చేసికొనుమని ప్రార్థింప భరతుడు, రాముడు రాజ్యపాలనమున కర్హుడుకాని తాను కానని చెప్పి రామునియొద్దకు వెళ్లుటకు మార్గశోధనము చేయించి చతురంగ సైన్యముతో రామ సమీపమునకు బయలుదేరి గంగాతీరమునకు వచ్చుట. గుహభరత సమాగమము, వారి సంభాషణము, గుహుడు సైన్య యుతుడగు భరతుని గంగను దాటించుట. 108-123

9. భరతుడు భరద్వాజాశ్రమ ప్రవేశము, భరత భరద్వాజుల సంభాషణము. సైన్యసమేతుడగు భరతునకు భరద్వాజుడు విందుచేయుట.125-142

10. భరతుడు భరద్వాజానుజ్ఞ నొంది చిత్రకూటమునకు, బయలుదేరుట- రాముడు కాకరూపియగు జయంతునిమీద బ్రహ్మాస్త్రప్రయోగము. ముల్లోకములు తిరిగినను రక్షకుడు కన్పడనందునఁ దిరిగి రాముని నతడు శరణుజొచ్చుట. రాముడభయము నొసంగుట-భరతుని సైన్యమునుఁజూచి లక్ష్మణుడు క్రోధావిష్టు డగుట - రాముడు తమ్ముని శాంతింపఁజేయుట- రామలక్ష్మణ సంవాదము. 143-153

11. రామ భరత సమాగమము. భరతునకు రామచంద్రుడు రాజనీతి బోధించుట. పితృమరణవార్తను విని రామచంద్రుడు దుఃఖించుట. వసిష్ఠోపదేశము, రాముడు గంగ యందుఁ బితృవునకు నివాపాంజలి నిచ్చుట. 154-165

12. భరతుడు సవినయముగ రాముని రాజ్యపాలనము చేయు మని కోరుట. రామ భరతుల సంవాదము. 166-179

13. జాబాలి మతోపన్యాసము. రాముడు చార్వాకాది మతములను ఖండించుట. ఆస్తికమతస్థాపనము. 180-191

14. వసిష్ఠుని యానతిచే రామభద్రుడు భరతునకుఁ దన పాదుకలను సమర్పించుట. పాదుకలను శిరసావహించి భరతుడు సైన్యసమేతముగ బయలుదేరి భరద్వాజాశ్రమమునకు వచ్చుట. 192-205

15. భరతు డయోధ్యకు వచ్చి కౌసల్యాదుల నందుఁ బ్రవేశపెట్టి నందిగ్రామము చేరి పాదుకాపట్టాభిషేకము చేసి రామభక్తితత్పరుడై యుండుట. 206-214

16. రాము డత్ర్యాశ్రమమునుఁ బ్రవేశించుట. అనసూయా పాతివ్రత్య ప్రకటనము. శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై దండకారణ్యమును బ్రవేశింపఁ బోవుట. 215-232

# ఆశ్చర్య రామాయణే
## అయోధ్యాకాండే ద్వితీయభాగః

# ధ్యానశ్లోకాః

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్।
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే॥

సంసారతాప యుక్తానాం జంతూనాం హతచేతసామ్।
శ్రీమద్రామాయణాఖ్యాన పీయూషం భేషజం స్మృతమ్॥

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి 'కోకిలమ్॥

మనోజవం మారుత తుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్।
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి॥

శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపమ్।
ఆజానుబాహు మరవిందదళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి॥

మాతా రామో మత్పితా రామభద్రో
భ్రాతా రామో మత్సఖా రాఘవేశః।
సర్వస్వం మే రామచంద్రో దయాళు
ర్నాన్యం దైవం నైవ జానే న జానే॥

శ్రీరామచంద్ర శ్రితపారిజాత
స్సమస్తకల్యాణ గుణాభిరామః।
సీతాముఖాంభోరుహ చంచరీకో
నిరంతరం మంగళ మాతనోతు॥

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# ఆశ్చర్య రామాయణే

## అయోధ్యాకాండే ద్వితీయభాగే ప్రథమస్సర్గః
## అయోధ్యాకాండ రెండవభాగమున ప్రథమసర్గము

1ప్రాహేదం వచనం తతో దశరథస్సూతం సువర్ణం రథం
శీఘ్రం త్వానయ రాఘవాదయ ఇమే త్వారుహ్య యాంత్వద్య తమ్,
ఇత్యుక్త స్త్వరితం గతస్సహృదయ స్సూతో రథం సిద్ధవ
త్కృత్వాఽఽనీయచ తం రథం ద్రుతగతిర్నత్వా బ్రవీద్రాఘవమ్. 1

పిమ్మట దశరథుఁడు సుమంత్రునితో నిట్లు పలికెను. సుమంత్రా! నాబంగరు రథమును వెంటనే తోడ్కొని రమ్ము. సీతా రామలక్ష్మణు లారథము నెక్కి వనమున కరిగెదరుగాక అని చెప్పగా విని వెంటనే సుమంత్రుఁడు వెళ్ళి రథమును సమస్తపరికరములతో సిద్ధము చేసి తోడుకొని వచ్చి యంజలి బద్ధుఁడై రామునితో నిట్లనెను.

సంసిద్ధోఽభూద్రథోఽద్య త్వమిమ మవనిజా లక్ష్మణాభ్యాం రథం వై
సౌవర్ణం త్వాశ్రయేతి బ్రువతి రఘువరం మంత్రివర్యే సుమంత్రే,
భర్త్రా గంతవ్యభాగ్యం మమ సముపగతం చేతి తుష్ట్వాంతరంగే
రామాదాగత్య తూర్ణం జనకనృపసుతా త్వారురోహాదితస్తమ్. 2

రామచంద్రా! రథమును ప్రయాణమున కనువుగా సిద్ధముచేసి తెచ్చితిని. ఈ సువర్ణరథమును నీవు సీతా లక్ష్మణులతో నెక్కుము అని మంత్రివర్యుఁడైన సుమంత్రుడు రామునితో బలుకుచుండఁగా సీత విని తనకు భర్త ననుసరించి వెళ్ళు భాగ్యము లభించినందులకుప్పొంగుచు రామలక్ష్మణులకంటె ముందుగా సీత యారథము నెక్కెను.

---

1కవి.

పశ్చాద్రాఘవసౌమిత్రీ జాతరూపం రథోత్తమమ్,
నిశ్శంకం మోదమానౌ తావారూఢౌ సపరిచ్ఛదౌ. 3

అనంతర మా బంగరు రథమును రామలక్ష్మణు లిర్వురుఁగూడ జంకులేక సంతోషముగ నెక్కిరి.

ఏకవారం సుమంత్రాఽ త్ర సమాగచ్ఛేతి భూపతిః ,
సమాహూయ సుమంత్రం తు ప్రాహేదం వచనం రహః. 4

అప్పుడు దశరథుడు ఒక్కమారిటు రమ్మని సుమంత్రుని పిలిచి వానితో రహస్యముగా నిట్లు చెప్పెను.

ఆగాంగం త్వ మిమాన్నీత్వా స్నాపయిత్వా నదీజలే,
అటవీం దర్శయిత్వా చ సామ్నైతాన్పురమానయ. 5

గంగానది వఱకును నీవు వీరలను తోడ్కొనిపోయి యానదీజలమందు స్నాతులగా జేసి, యరణ్యమును చూపించి శాంతివాక్యములతో మఱపించి పట్టణమునకు తోడ్కొని రమ్ము.

రామలక్ష్మణయోర్భూయః పురస్యాస్యాప్యనాగమే,
సీతాం వా సాంత్వయిత్వా త్వం సమానయ పురం పునః,
ఇతి తత్ప్రేమవశతః ప్రాహ తం భూపతిర్బహు. 6 ½

ఒక వేళ రామలక్ష్మణు లిర్వురును తిఱిగి పురమునకు వచ్చుట కొప్పుకొననిచో సీతనైనను వనవాసమునుండి మరల్చి యెట్లైనను పురమునకు దీసికొని రావలయును. ఇట్లు ప్రేమావేశముచేత చెప్పినదే చెప్పుచు దశరథుఁడు సుమంత్రుని బ్రతిమాలుకొనెను.

రామేణాఽకారితస్సూతో గత్వా తం రథమాస్థితః,
చోదితస్తేన రామేణ చోదయామాస తం రథమ్. 7 ½

ఇంతలో రాముడు సుమంత్రా! రమ్మని పిలిచెను. సుమంత్రుడును వెంటనే వెడలి యారథమునెక్కి రామాజ్ఞచే రథము తోలెను.

2 రాజాఽపి ద్రుత ముత్థాయ సోఽనువ్రజితు ముద్యతః,
తదామాత్యా దశరథం నివార్యైవం సమబ్రువన్. 8 ½

2. వా॥ రా॥

దశరథుడును వెంటనే లేచి రాముని రథము ననుసరించి పోబోవగా నచ్చటి యమాత్యు లెల్లరును నివారించి యతనితో నిట్లు పలికిరి.

యమిచ్ఛేత్పున రాయాంతం నైనం దూరమనువ్రజేత్,
[3]ఇత్యుక్త్వా మంత్రిణో భూపం గృహాంతఃపురమానయన్. 9½

ఎవనిరాకను తిఱిగి యపేక్షింతుమో వానిని వెంబడించి చాలదూరము చనకూడదు. ఇట్లు పలికి యామంత్రు లారాజు నంతఃపురమునకుఁ దోడ్కొనిపోయిరి.

రాజా రుదిత్వా సుచిరం ప్రాహ తా ననుజీవినః.
కౌసల్యా భవనం యూయం నయత త్వరితం తు మామ్,
కైకేయీం తద్వశాంశ్చాహం త్యజామ్యద్య న సంశయః,
తతః ప్రవేశయామాసుః కౌసల్యాభవనం తు తే.
మూర్ఛితశ్చ చిరాద్బుద్ధ్వా రుదన్నామగతిం స్థితః,
రుదంతం స్వపతిం వీక్ష్య కౌసల్యా ప్రాహ దుఃఖితా. 10-12½

దశరథుడు కొంతసేపు తన పరిజనముతో నిట్లు పలికెను."నన్ను వెంటనే మీరు కౌసల్యాభవనమునకుఁ గొనిపొండు,కైకేయిని తత్సంబంధులను నిస్సంశయముగ నేను త్యాగము చేసితిని - అని చెప్పుచుండఁ బరిచారకు లారాజును కౌసల్యాంతఃపురమున ప్రవేశపెట్టిరి. అతడును శోకవేగముచే మూర్ఛ చెంది కొంతసేపటికి మూర్ఛనుండి మేల్కాంచినట్లు తెలివొంది రాముడు పోయిన దిక్కుకై చూచుచు శోకించుచుండెను. అట్లు శోకించుచున్న తన భర్తను చూచి కౌసల్య శోకించుచు నిట్లుపలికెను:

గేహే వామమవాసయేద్యదిసుతం భిక్షాటనే నాపి వా
జీవన్నౌపరితోషయేత్ఖలు కృతం నాద్య త్వయా వా తథా,
త్వత్ప్రేమాస్పద కైకయీవచసిచేత్ప్రేమ స్థితం తే భవాన్
తత్పుత్రాయ దదాతు సర్వమపి మే పుత్రః కుతో ఽప్రేష్యత. 13½

నాథా! నీవు నా పుత్రుని నింటియందైనను నుండనిచ్చినచో తుదకు బిచ్చమెత్తుకొనియైన జీవించుచు మనలను సంతోషపెట్టుచుండువాడు గదా!

3. కవిః ||

అట్లును చేయకపోతిని. నీ కాముద్దుల భార్యయగు కైకయొక్క వాక్యములయందే ప్రేమయున్న! నామె పుత్త్రునికే నీ రాజ్యమంతయుఁ గట్టిపెట్టవచ్చును. నా పుత్త్రునేల నిష్కారణముగా నరణ్యములకుఁ బారదోలవలెను.

యే తిష్ఠన్ప్రథమే వయస్యపిచ యై ర్భోగ్యం సుఖం త్వద్య యే.
కష్టం వన్యమ పీదృశం త్వితి విభో జానంతి నాప్యేకదా.
కైకేయ్యా వచనం నిశమ్య భవతో వన్యా నిమాన్కుర్వత
స్తేఽలం రోదనత స్స్వహస్తవిహితం కర్మాదనీయం ఖలు. 14½

నాథా! ఏ పుత్రులు పడుచుదనములో సుఖము ననుభవించుటకు యోగ్యులై యుండిరో, ఎవరు వనమందలి కష్టము లిట్టివని యెన్నడు కనివిని యెరుంగరో, అట్టి సుకుమారులగు కుమారులను కైకేయీ మహాదేవియాజ్ఞను శిరసావహించుచు వనమునకు పంపి యింక శోకించెదవేల? చేతులార చేసికొన్న కర్మమనుభవింపకతీరునా?

1నిస్సంశయం మయా మన్యే పురా వీరకదర్యయా,
పాతు కామేషు వత్సేషు మాతౄణాం శాతితాస్తనాః.

2ఇత్యుక్త్వా విలపంతీం తాం కౌసల్యాం తత్త్వదర్శినీ,
సుమిత్రా సాంత్వయామాస వచోభిస్సాంత్వనాన్వితైః. 15-1 ½

వీరపురుషా! పూర్వజన్మమందు నేను, తమ తల్లికడకు పాలుత్రాగబోవు లేగదూడలను నివారించి దురాశచే వాటి తల్లుల పాలన్నియు పిండికొని యాలేగలకుఁ దల్లులతో నెడబాటుచేసి యుండియుందును. లేకున్న నాకిట్టి పుత్రవియోగము కలుగదు. ఇట్లని విలపించుచున్న కౌసల్యను శాంతివచనములతో మెల్లగా సుమిత్ర యోదార్చెను.

అయోధ్యానగరం సర్వం దుఃఖవారిధి సంప్లుతమ్,
హాహాకారశ్చ సర్వత్ర తదాఽభూత్పురవాసినామ్. 17 ½

అప్పుడా యయోధ్యానగరమెల్ల, పురవాసుల హాహాకారములతో నిండి నిబిడీకృతమై దుఃఖసముద్రమున గన్పింపజొచ్చెను.

1. వా ॥ రా ॥ 2. కవిః ॥

గేహిన్యః పురుషాశ్చ వైకృతహృదోఽభూవం స్తతస్త త్స్త్రియ
స్త్వన్నాదీన్నపచంతి తత్ర పతయః పృచ్ఛంతినో స్వస్త్రియః,
మన్యంతే న హి హోమ మాశ్రితశుచో నిత్యాగ్నిహోత్రాన్వితాః
నైకోఽపి స్వవిధేయ మాచరతిచాకాలేస్త్రమాపార్యమా, 18 ½

ఆ పట్టణమునందలి స్త్రీపురుషు లెల్లరును తమ కృత్యములయందు కూడ నిరుత్సాహులై విషణ్ణభావమును చెందియుండిరి. స్త్రీలు అన్నాదులను వండుట మానిరి. పురుషులు" వంట నేల చేయలేదని తమ భార్యల నడుగుటగూడ మానిరి. నిత్యము అగ్నిహోత్రములను చేసికొనునట్టి కర్మిష్ఠులు గూడ హోమమను మాటనైన తలపోయరైరి.

మాతంగాశ్చ విసృజ్య భోజ్యమధికం బాష్పం విముంచంతి హా.
గావో దుగ్ధసమాగతాన్నిజ శిశూన్శృంగైస్సముత్తోలయన్,
ఘాసం నో తురగాః స్పృశంతి పశవోఽ ప్యాహారవర్జం స్థితాః,
వక్తవ్యం కిము చేతనేషు విషయే సాకేతపుర్యాం తదా. 19 ½

ఏనుగులు మేతమాని కన్నీరు కార్చుచు మిక్కిలి శోకింపఁ జొచ్చినవి. గోవులు పాలు త్రాగుటకు తమకడకు వచ్చిన దూడలను కొమ్ములతోఁ జిమ్ముటకు మొదలిడినవి. గుఱ్ఱములు గడ్డిముట్టుట మానినవి. పశువులు నాహారపానీయములు మాని శోకించుచున్నట్లుండెను. ఇట్లుండ మనుష్యులమాట చెప్పనేల!

కౌసల్యాఽఽత్మసుతం వనం గతమిమం దృష్ట్వాఽపి తూష్ణీం స్థితా,
తస్మాన్మాతృజనో నిరర్థక ఇతి భ్రాంత్యా త్యజంస్తాస్సుతాః,
రామో యాతి విసృజ్య చాద్య జననీం నార్థోఽ స్తి పుత్రైరితి
భ్రాంత్యా స్వాత్మసుతాం స్త్యజంతి నగరే త త్తజ్జనన్య స్తదా. 20½

కడుపారగన్నసుతుడు వనముల పాలై పోవుచుండ కన్నార గాంచుచు కౌసల్య నివారింపనైన బూనుకొనకపోయె గదా! ఇక నందరి తల్లులు నిట్టివారే గదా, మాతృజనము నిరర్ధకమే గదా యని భ్రాంతి పడి పుత్త్రులు తల్లులను విడువఁజొచ్చిరి. కని పెంచి పెద్దవానిని చేసిన తల్లిని విడిచి రామునంతటి ధర్మపరు డరణ్యమునకు పోవుచున్నాడు గదా! పుత్త్రులవలన తల్లులకు బ్రయోజనమేమి యని భ్రమించి తల్లులు పుత్త్రులను విడువజొచ్చిరి.

కైకేయీం పతిఘాతినీం చ పతయోఽ వేక్ష్యాత్యజన్గేహినీః
రాజోపేక్షితవా న్సతీమితి ధియా భార్యాః పతీ నత్యజన్,
కైకేయీసుత మప్యవేక్ష్యసహజ శ్రీసంహృతం సోదరాన్
జ్యేష్ఠాస్త్యజురేవ మేవ నిఖిలాస్సంత్యజ్య రామం గతాః. 21½

భర్తను హింసపెట్టుచున్న కైకను చూచి యానగరమందలి పురుషులెల్ల తమ తమ భార్యలను విడువ నిశ్చయించిరి. దశరథునంతటి వాడు భార్యయగు కౌసల్యను నుపేక్షించినాడుగదా యని భావించి భార్యలు భర్తలను విడువదొడంగిరి. భరతుని రాజ్యకాంక్ష తలంచుకొని జ్యేష్ఠులెల్లరును తమ తమ కనిష్ఠ సోదరజనమునందు విముఖతను పొందిరి. ఈ విధముగా నెవరికి వారు స్వజనములను విడిచి రాముని వెన్నంటి పోఁజొచ్చిరి.

కౌసల్యాహృదయం కిలాఽయసమిదం నోచేత్తథా స్వాత్మజే
గచ్ఛత్యద్య కథం న భిన్నమటవీం ధన్యా న హీయం భువి
ఛాయే వావనిజా పతిం త్వనుగతా ధన్యా భవల్లక్ష్మణో
ధన్యో దైవసమాన రాఘవపదద్వంద్వార్చనార్థం గతః. 22½

ఆహా! కౌసల్య హృదయమెంత కఠినమైనది? కాకున్న నట్టి లోకోత్తరుడైన పుత్రుడడవుల బట్టి పోవుచుండ భళ్ళున బ్రద్దలు కాకుండునా? ఆలోచింప నికముందీమె ధన్యురాలుగా తోచదు. నిజమునకు దేశాంతరమందు గూడ భర్త ననుసరించు భాగ్యము లభించినందున సీత ధన్యురాలు. భగవత్సమానుడైన శ్రీరాముని పాదములను సేవించుటకై యరుగుచున్న లక్ష్మణుని జన్మ ధన్యమైనది.

తస్మాద్రాఘవ పాదాబ్జ సేవనార్థం వయం గతాః,
తేనైవ సహ తిష్ఠేమ త్వితికేచి ద్వినిర్గతాః. 23½

కావున మనము గూడ శ్రీరామచంద్రుని పాదసేవకొఱకు వనముల కఱిగి యతనితో నచ్చటనే నివసించెదమని కొందరు బయలుదేరిరి.

సూర్యోఽ పి కాంతిహీనోఽ భూత్కమలిన్యో నిమీలితాః,
అపి వృక్షాః పరిమ్లానాః కింపునః పురవాసినః. 24 ½

అప్పుడు సూర్యుడు ప్రకాశము లేని వాఁడయ్యెను. పద్మములు ముకుళించుకొని పోయినవి. ఇంక సాకేతపురనివాసులైన జనులను గూర్చి యేమి చెప్పవలయును.

**తదా దశరథ స్త్రీరే పాతితో మత్స్యారాడివ,**
**అవటే పాతితః కుంభీ యథా విలపతిస్మ సః. 25½**

ఆ సమయమున దశరథుడు జాలరిచే నొడ్డున వేయఁబడి తట తట కొట్టుకొను చేపచందమునను, గోతియందుపడి తన్నుకొను మహాగజమ్ముమాడ్కి, శోకవిహ్వలుఁడై విలపింపజొచ్చెను,

**అపశ్యంతీ యథా వత్సం విలపిష్యతి గౌర్భృహు,**
**కౌసల్యాఽపి తథా రామ మదృష్ట్వా వ్యలపద్భృహు. 26 ½**

కౌసల్యయు శ్రీరామచంద్రుని కాంచజాలక, దూడను గానక విలపించు గోవుచందమున, ననేక విధముల దుఃఖింపజొచ్చెను.

**సపత్నీ హేళన మహం భరతే సతి రాజని,**
**కరిష్యామీతి కైకేయీ మోదమానా బభూవహా. 27 ½**

అప్పుడు కైకేయి మాత్రము నాపుత్రుడైన భరతుడు రాజయి రాజ్యమేలుచుండ నా సవతుల నెల్ల నూరించుచు పరియాచిక మాడగలను గదాయని లోలోన సంతసింపజొచ్చెను.

**భూభారహరణార్థాయ సమభూద్భువి రాఘవః,**
**తద్వనం నిర్గమేతి వసిష్ఠోఽంతర్ముదం గతః. 28½**

ఇక వసిష్ఠుడో; భూభారమును హరించుటకు శ్రీ మహావిష్ణు వీ రామ చంద్రుడై లోకమం దవతరించి లోకకంటకులైన రాక్షసాధముల గండడగింప వనముల కఱుగుచున్నాడుగదా యని లోలోన ముద మందియుండెను.

**లంకాయాం దుర్నిమిత్తాని తత్కాలే బహుశో ఽభవన్,**
**దివి దేవా మహానందవారిధౌ సంస్థితాస్తదా,**
**రావణాదివినాశస్స్యా దితి సంతుతుషుస్సురాః. 29-30**

ఆ కాలమున లంకయందనేక దుశ్శకునము లుద్భవిల్లి రాక్షసులకు భయహేతువు లయ్యెను. ఆకాశమునందు దేవత లానంద సముద్రతరంగముల నుయ్యేల లూగుచు, నిక, రావణాది మహాసురుల చావు తప్పదు గదా యని లోలోన సంతసింపజొచ్చిరి.

శ్రీరామరహితాఽయోధ్యాఽ భవత్స్వృద్ధ వివాహితా,
బాలికేవోషరక్షిప్త బీజవద్వ్యాధివృష్టివత్,
కించావివేకిసేవేవ కృతఘ్నో ఽపకృతిర్యథా,
అపాత్రే దానవన్మ్నాన మంధస్య ముకురో యథా, 31-32

తత్కాలమందు శ్రీరామచంద్రుడు లేని యయోధ్య యెట్లున్నదని చెప్పవలె? మూడు పెండ్లిండ్లు దాటిన ముదుసలి వగ్గును చేపట్టిన బాలికవలె, యెడారి నట్టనడుమ పాతిపెట్టిన విత్తనమువలె, సముద్రమునందు కురిసిన వర్షము వడువున, యుక్తాయుక్త వివేక శూన్యునకు జేయు సేవవిధమున, చేసిన యుపకారమును మఱచునట్టి నీచునకు చేయు నుపకారమువలె, అపాత్రునకిచ్చు దానమ్ముతీరున, గ్రుడ్డివానిచేతి యద్దమువలె రామరహితమగు నయోధ్య నిష్ప్రయోజనమై కాన్పించెను.

ఆశ్రితేషు సువాత్సల్యః ఆపద్బంధురనాథపః,
కరుణావారిధిశ్శాంతః రామో గచ్ఛతి హావనమ్.
తదదర్శకనేత్ర న నేత్రే మాయూరకేతు తే,
శ్రుతీనత్వ తదాలాప శ్రుతీతి కుంచికాశ్రుతీ.
బహునా కింజీవకోటౌ త్వీదృక్సర్వగుణాన్వితః,
న భూతో న భవత్యేవం వ్యలపన్నాగరా స్తదా. 33-35

అప్పుడాపురజను లివ్విధముగ వాపోవజొచ్చిరి (ఏమన) ఆశ్రితవత్సలుడును, ఆపద్బాంధవుడును, అనాథరక్షకుడును, కరుణాసముద్రుడును, శాంతుడునగు మన రామచంద్రుడు వనమున కేగుచుండెను గదా, ఎంత కష్టము వచ్చినది. ఆ సుగుణాభిరామునిఁ జూడనివాని కన్నులు నెమలికన్నులుగాని కన్నులు గావు, అతని నామమును వినని చెవులు తాళపు చెవులుగాని చెవులు గావు. ఎందరు జీవులుండిన నేమి లాభము? ఇట్టి సకలసద్గుణ పరిపూర్ణుడగు మానవోత్తముడు ముల్లోకములయందును మున్ను పుట్టియుండలేదు. ముందు పుట్టబోడు, (అని పురజనులు బహువిధముల గొంతులెత్తి గగ్గోలుపడజొచ్చిరి.).

సర్వే పురజనాస్తత్ర మిళిత్వా వ్యలపన్నితి,
పురపావనరామేణ రహితం పురమద్యతు.
ధ్రువం విచార్యమాణే తు జ్యేష్ఠాపురమివాభవత్.
పురేఽస్మిన్రామరహితే న కశ్చిదపి సంవసేత్.

ఇతి సర్వేజనాస్త స్మాత్పురాన్నిర్గత్య దుఃఖితాః,
దారాపుత్రాంశ్చ సంత్యజ్య యయూ రామరథం ద్రుతమ్. 36-38

ఇట్లు పురజను లెల్లరును విచారమగ్నులై యొక్కచోట గుమిగూడి యిటుల నిశ్చయించుకొనిరి. ఏ రామభద్రుడు నివసించుటవలన నీపురమెల్ల పవిత్రమై సర్వమంగళ శోభితమై యున్నదో, ఆ రామభద్రుడు లేని యీ పురము నేడు పెద్దమ్మకాపురమువలె నయ్యెను. కాన రాముడు కాని యీపురమునం దొక్క మానవుడైన నుండగూడదు - అని నిశ్చయించుకొని వారలందరును పురమును విడిచి దారాపుత్రాదులను గూడఁ బరిత్యజించి రాముని రథమార్గమును బట్టి పోవఁజొచ్చిరి,

తదా సాధుజనాః కేచిద్రామప్రవ్రాజనం ప్రతి,
విచారయంతిస్మ చైవం సంఘశస్త్రసంస్థితాః,
తత్రైకస్సాధు రప్యాహ పరాన్సాధూనిదం వచః. 39½

ఆ సమయమున గొందరు సాధుజనులు గుమిగూడి రాముని వనగమనమునకు బహువిధముల విచారించుచుండ వారిలో నొక్క సాధుపుంగవు డితర సాధువులతో నిటులఁ బలికెను.

కైకేయ్యా ఉదభూ త్కుబుద్ధిరధునా హా కీదృశీసుందరం
రామం ప్రేషయ కాననం త్వితి కథం జిహ్వాఽఽగతాస్యా ధ్రువమ్,
పూర్వం ధార్మిక ఏవ భూపతిరయం కిం వా ఫలం తస్యధీ
ర్లుప్తా దుష్టవధూవశాదయమభూద్దుష్కృత్యకారీ నృపః. 41½

కైక బుద్ధి నేడు పెడతలఁ బట్టినది. అబ్బ, యెంత వైపరీత్యము, అట్టి సుందరుడైన రామచంద్రుని వనమునకు బంపుమని దశరథునితోఁ జెప్పుటకు కైకకు నోరెట్లాడెనో, నిజమునకు దశరథుడు ధార్మికుడే. కాని ఫలమేమి? అతని సద్బుద్ధి యంతయు నీ దుష్టురాలి సాంగత్యము వలన నశించిపోయినది కావుననే దశరథుడిట్టి ఘోరకృత్యమునకు ముందంజవేసెను. (అని యొకసాధువనెను).

అన్యః కశ్చిదథాబ్రవీది యమహో శ్రీకామదేవప్రభా
రాజాత్వాదిత ఏవకామనిరతో భుంజన్బుభాగాన్బహూన్
వృద్ధోఽ భూదధునాపి భూపతిరయం త్యక్తుం న హీశశ్చ తాన్
ధర్మిష్ఠస్య బభూవ చేదృశగతి స్త్వన్యాన్జనాన్కిం పునః. 42½

(ఆ సాధువులలో మఱియొక్క డిట్లనెను) ఓ సాధువులారా! ఇది మఱేమియు గాదు. కామదేవుని మహిమ, ఈ దశరథుడు మొదటి నుండియు కామలంపటుడే. కామోపభోగములయందే కాలమును గడిపి వృద్ధుడైనవాడు, ఇప్పటికి నాకామోపభోగములను వదలలేకున్నాడు. అట్టి దశరథునకే యిట్టి దుర్గతి పట్టినది. ఇంక నితరుల మాట తడవవలయునా?

తార్తీయీక జనో ఽవదత్సహృదయా స్త్యక్త్వా భువం భూపతేః
రామో యత్ర గతో ఽ భవద్వయ మమీ గచ్ఛామ తత్రైవహి,
రాజా మూర్ఖతమో న చేత్కథమముం సంప్రేషయత్యాత్మజం
కైకేయీపరితుష్టయే వన మత శ్శీఘ్రం హి నిర్గచ్ఛత. 43½

పై విధముగ నిద్దరు పలుకగా మూఁడవ సాధువు లేచి యితర సాధువులతో నిట్లనియెను. ఓ సాధువులారా! మన మీ దశరథుని భూమియం దుండగూడదు. మన రాముఁడెచ్చటకఱిగెనో యచ్చటకే మనము కూడ నఱుగుదము. ఈ రాజు వట్టి మూర్ఖుఁడు. కాకున్న కైకేయికి సంతోషమును కలుగఁజేయుటకు గుణవంతుఁడగు నిట్టి కొడుకును వనములకేల పంపించును? (పంపడు) కాన మన మీ మూర్ఖుని రాజ్యము నందుండ గిట్టదు. శీఘ్రముగ బయలుదేరుడు.

అన్యో ఽప్యాహ జనో విచారితతమేక స్యాత్ర దోషోఽస్తి నో
ప్రారబ్ధం త్వనివార్యమేవ సుకృతీ సౌఖ్యం ఫలం ప్రాప్స్యతి
కుర్వన్దుష్కృతకర్మ తత్ఫలమలం భుంజీత లోకే జన
స్సర్వం కర్మవశం భవేత్తదవనౌ నాలం హి నోల్లంఘితుమ్. 44½

మఱియొక సాధువిట్లనెను.యథార్థ మాలోచింపగా నిచ్చట నెవ్వరిదియు తప్పులేదు. ప్రారబ్ధ మనుభవింపక తీరునెట్లు? జన్మాంతరమున సుకర్మ చేసినవాఁడు సౌఖ్యము ననుభవించును. దుష్కృతము చేసిన వాఁడు దుఃఖ మనుభవించును. సమస్తము కర్మాధీనమై యున్నది. ఆ కర్మను దాటుటకు నెవ్వరికి శక్యము?

ప్రాహాన్య స్త్రీయ మాత్మజస్యవిభవ ప్రాప్త్యై దురాశాన్వితా
భాస్వ ద్వంశవిభూషణం రఘువరం సంప్రేషయంతీతి యత్
యుక్తం తద్ధి దురాశయా కిము జనో ఽకృత్యం విధాతుం క్షమో
న స్యాద్భూత తదీయ చేష్టిత మహో కో నామ తద్వర్ణయేత్. 45½

ఇంకను మఱియొక సాధు విట్లనియెను. తన పుత్త్రునకు రాజ్యప్రాప్తి కోరి దురాశచే కైక రఘువంశమున కలంకారభూతుఁడైన రామచంద్రుని నడవులకు బారదోలుట చూడఁగా సయుక్తికముగనే యున్నది. ఔను దురాశాపీడితుఁడైన జనుఁడెంతటెంతటి దుష్కృత్యముల చేయ నొల్లండు? కాన నిదియంతయు నాశాపిశాచ మహత్త్వమునుగా నెఱుఁగుఁడు. దానిని వర్ణింప శక్తు డెవ్వఁడు? (అని యనెను)

ఇత్యుక్త్వా సాధుబృందేఽపి వనం గంతుం సముద్యతే,
వామదేవో ఽబ్రవీద్గోప్యం మిథస్సాధూనిదం వచః. 46½

ఇట్లు పరస్పర సంభాషణములతో సజ్జనబృందము కూడ వనగమనమునకుఁ గృతప్రయాణులైరి. అప్పుడు రామతత్త్వము నెఱిగిన వామ దేవు డా సాధుబృందము నంతయు జేరఁబిలచి రహస్యముగా వారలతో నిట్లు చెప్పెను.

[1]మానుశోచత రామం వా సీతాంవా లక్ష్మణం తు వా
ఏష రామో పరో విష్ణు రాదినారాయణః ప్రభుః,
ఏషా సా జానకీ లక్ష్మీ ర్యోగమాయేతి విశ్రుతా.
అసౌ శేషస్తమన్వేతి లక్ష్మణాఖ్యశ్చ సాంప్రతం,
రావణాదీని రక్షాంసి కోటిశో నిహనిష్యతి,
ఏషా సీతా హరేర్మాయా సృష్టిస్థిత్యంతకారిణీ
రాజా వా కైకయీ వాపి నాత్ర కారణమణ్వపి
పూర్వేద్యుర్నారదః ప్రాహ రామం త త్త్వవిదాం వరః
భూభారహరణార్థాయ నిర్గచ్ఛేతి మిథో బుధాః,
అతో రామం సముద్దిశ్య చింతాం త్యజత బాలిశాః. 46-51½

మీరు రామచంద్రుని గూర్చిగాని, సీతను గూర్చిగాని, లక్ష్మణుని గూర్చిగాని దుఃఖించవలసిన పనిలేదు. ఈ రామచంద్రుడు జగత్ప్రభువును, ఆదినారాయణుడును, పరాత్పరుడు నగు శ్రీమహావిష్ణువు; ఈ సీత యోగమాయ యని ప్రసిద్ధి జెందిన శ్రీమహాలక్ష్మి; ఇప్పుడాతని ననుసరించి యరుగుచున్న లక్ష్మణుఁడు కేవల మాదిశేషుని యవతారము. రాము డరణ్యమున కేగి లోకకంటకులగు రావణాదుల ననేకకోట్ల

1. అ || రా ||

రాక్షస వీరులను జంపగలడు. ఈ సీత జగదుత్పత్తిస్థితి లయములకుఁ గారణభూతురాలైన విష్ణుమాయ. ఈ విషయమునందు దశరథుడు గాని, కైకగాని కారకులు కారు. నిన్నటిదినమున త్రికాలవేదియగు నారదుఁడరుదెంచి భూభారహరణమునకై వనముల కరుగుమని రామునితో చెప్పెను. కావున నో సాధువులారా? రాముని గుఱించి చింత మానుఁడు.

రామరామేతి యే నిత్యం జపంతి మనుజా భువి,
తేషాం మృత్యుభయాదీని న భవంతి కదాచన.
కా పునస్తస్య రామస్య దుఃఖశంకా మహాత్మనః,
భక్తానాం భజనార్థాయ రావణస్య వధాయ చ.
రాజ్ఞశ్చాభీష్టసిద్ధ్యర్థం మానుషం వపురాశ్రితః,
ఇదం రహస్యం గోప్యం చ మా విష్కురుత కుత్రచిత్. 52-54½

భూమియందు దే జనులు నిత్యమును రామ! రామ! యని జపించుచుందురో వారికి మృత్యువు మొదలైన వానివలన భయమెన్నడును గలుగదు అట్టి మహాత్ముడైన శ్రీ రామచంద్రునకు దుఃఖశంక కూడ కలదా? భక్తులను సంరక్షించుటకును, రావణుని సంహరించుటకును, దశరథునికోర్కె తీర్చుటకును, లీలామానుష విగ్రహుడైన రాముడు అవతరించెను. ఇయ్యది చాలా రహస్యముగ నుంచదగిన విషయము. కాన మీరెన్నడును దీనిని బయటపెట్టకుండుఁడు

ఇత్యుక్త్వా విరరామాథ వామదేవో మహామునిః,
శ్రుత్వా తద్విస్మితాస్సర్వే రామం సాక్షాద్ధరిం విదుః. 55½

అని పలికి వామదేవ మహాముని విరమించగా నచ్చటి సాధువు లా రామవృత్తాంతశ్రవణమువలన విస్మితులై రాముని శ్రీహరినిగా దెలిసికొనిరి.

బహుదూరం గతాః కేచిద్రథవేగ మనాశ్రితాః,
అదృష్టరామ గత యః పునరాగత్య వై పురమ్,
రామసందర్శనార్థాయ పూజయంతి స్మ దేవతాః. 56½

కొందఱు జనులు రాముని రథమువెంటఁ బడి చాలదూర మరిగియు రథము వేగముగా పోవుచుండుటచే నాయాసమున నికముందున కరుగఁజాలక వెనుకఁబడి రాముడు చూపు మీరిపోవుటచే చేయునది లేక యెట్లెట్లో పురము జేరి మరల శ్రీరామచంద్రుని దర్శనము లభించుటకై దేవతలకు పూజసేయు చుండిరి.

అపరే కేచన జనా రథమార్గ ముపాశ్రితాః,
ద్రుతగత్యా మిళిత్వా తం రాఘవేణ వ్యజిజ్ఞపన్. 57½

మఱి కొందరు జనులు వాహనముల నెక్కి శ్రీరామచంద్రుని రథమార్గమును బట్టియే పోయి యాతని దర్శించి యాతనితో నిట్లు విన్నవించుకొనిరి.

రాజన్నత్ర నివర్తస్వ విహాయాస్మాన్క్వ గచ్ఛసి,
ఇత్యుక్తో రాఘవస్తైస్తు తా మువాచ దృఢవ్రతః. 58½

ఓ రామచంద్రా! నీవిక నిచ్చటినుండి పురమునకు మఱలుము. మమ్ము వదలి నీవెచ్చటికిపోయెదవు? అని వారలనఁగా విని దృఢవ్రతుఁడైన రామచంద్రుడు వారలతో నిట్లు చెప్పెను.

*భో పౌరాస్సకలాశ్చ యూయ మధునామత్ప్రీతికామా ధ్రువం
త్వా గచ్ఛంత ఇవస్థితా శ్శృణుత మే ప్రీతిం యదీచ్ఛంతి చేత్,
యోగ్యం రాజగుణైర్యుతం చ భరతం వృద్ధేషు భక్త్యాన్వితం
సేవధ్వంతు గతాః పురీం స తు గుణీ భర్తానురూపశ్చ వః. 59-60½

*పౌరులారా! మీరెల్లరును నాకు బ్రీతిని కోరువారై నన్ననుసరింప వచ్చుచున్నట్లున్నారు. కాని నాకు సంతోషముసేయు నిచ్ఛ మీకున్న యెడల మీరు పురమున కరిగి, చక్రవర్తి లక్షణోపేతుడును, యోగ్యుఁడును, పెద్దలయందు భక్తికలవాడు నగు, భరతుని సేవింపుడు. అతడు గుణవంతుడు. మిమ్ము బరిపాలింపఁదగిన రాజు.

---

* భో పౌరా ఇతి - అత్ర భరతస్య రాజ్యం ప్రదాతుం కైకేయ్యా వనం ప్రతిప్రేషణేనాపకృతో ఽపి రామః తత్పుత్రస్య భరతస్య "స తు గుణీ భర్తానురూపశ్చ వః" ఇతి నియోగ పూర్వకం ప్రకృతి సన్నిధౌ తద్గుణకథనాత్ తథా చిత్రకూటే భరతం ప్రతి - మాతరం రక్ష కైకేయీం మారోషం కురు. తాం ప్రత్యుక్తతాచ్చ మహదపకారిష్వపి ఉపకారః కర్తవ్య ఇతి ధర్మస్సూచితః. తథా చాపద్ధర్మేలుబ్ధకపోతీయే "ఛేత్తుమభ్యాగతే ఛాయాం నోపసంహారతే ద్రుమః ఆత్మనో హిత మన్విచ్ఛన్ బాధతే యో పరం నరః| కర్తవ్యా మూఢవిజ్ఞానే దయా తత్ర దయాళుభిః" ఇతి.

*ఇచ్చట భరతునకు రాజ్యము సంపాదింపఁగోరి కైక రాముని వనములకు బంపుచు నపకార మొనర్చుచున్నను రాము డామెపుత్రుఁడైన భరతుని గుణములను గొనియాడుచు నతడే మిమ్మేలదగిన రాజని ప్రశంసించుట వలనను మిక్కిలి యపకారమును చేయువారికి గూడ నుపకారమే చేయవలయునను ధర్మము సూచింప బడుచున్నది. ఇట్లే ఆపద్ధర్మమునందు లుబ్ధకపోతీయోపాఖ్యానమందు గూడ చెప్పఁబడియున్నది. వృక్షము తనను నఱుకవచ్చిన వారిపట్లఁ గూడ నీడ నిచ్చి యుపకారము చేయుచున్నది. ఏజనుఁడు స్వార్థపరు డై పరులను పీడించునో అట్టి మూఢుని గూర్చి గూడ దయావంతులు ప్రీతిని చూపించవలయును.(అని చెప్పబడియున్నది.)

1. అ || రా ||

తతో భవద్భి ర్గంతవ్య మభియాస్యామి వై వనమ్,
పిత్రాదేశ మహం కృత్వా, పురీం ప్రాప్స్యామి వై పునః,
ఇత్యుక్త్వా తాన్నగామాథ, రామ! స్సత్యపరాయణః. 61-62

కావున మీరెల్లరును పురమున కరుగుడు. నేను వనమున కరిగెదను. తండ్రిగారి యాజ్ఞను సంపూర్తిచేసి తిఱిగి నేను పురమునకు రాగలను. సత్యశీలుఁడైన రాము డీ విధముగా ప్రజలను బుజ్జగించి వారిని మఱలించి వెళ్ళుచుండెను.

కియద్దూరం గతో రామః పశ్చాద్భాగం దదర్శ నః,
ఆశ్రిత్యా గచ్ఛతో వీక్ష్య రథమార్గం తు సజ్జనాన్,
*స్వరథా ద్రాఘవ స్తూర్ణ మవతీర్య ననామ తాన్. 63½

**రాముఁడిట్లు కొంతదూర మరిగి వెనుకకు తిరిగి చూచి యింకను రథమార్గమునుబట్టి వచ్చుచున్న కొందరు బ్రాహ్మణోత్తములను జూచి వెంటనే రథమునుండి క్రిందకు దిగి వారికి నమస్కరించెను.

రామభద్ర స్తతో గచ్ఛ న్పద్భ్యా మనుగతద్విజః,
తదుదీరిత వాగ్జాత శ్రుతి జన్యానుమోదవాన్,
సహ తై స్తమసాతీరం సమాగమ్యాహ లక్ష్మణమ్. 64-65½

పిమ్మట నా బ్రాహ్మణులు వెంట రాగా రాముడు ముందు నడచుచు వారు చెవికింపుగా నుడివిన వాగ్జాలములను విని మిక్కిలి సంతోషించుచు వారితోఁ గూడ తమసానదీతీరమందు జేరి లక్ష్మణునితో నిట్లనియెను.

1 అద్భి రేవ తు సౌమిత్రే వత్స్యా మ్యద్య నిశామిమామ్,
**ఏత ద్ధి రోచతే మహ్యం వన్యేఽపి వివిధే సతి. 66

* అనేన మహతోఽవలోక్య యానా దవతరణీయ మితి ధర్మస్సూచితః తథా ఉద్యోగపర్వణి "అథాపశ్య న్మహాబాహుః ఋషీవ ధ్వని కేశవః, సోఽవతీర్య రథా త్తూర్ణమభివాద్య జనార్దనః" ఇతి.

*దీనిచే పెద్దల దర్శనమైనప్పుడు వాహనము నుండి దిగవలయునని ధర్మము సూచింపఁబడినది. ఇట్లే యుద్యోగ పర్వమందు గూడ జెప్పఁబడియున్నది. "శ్రీకృష్ణుడు మార్గమునందు వచ్చుచున్న కొందరు ఋషులను చూచి రథమునుండి వెంటనే దిగి నమస్కరించెను." అని యున్నది.

** అనేన వనవాసాయ ప్రస్థితేన ప్రథమదివసే జలాహారేణైవ స్థేయ మితి సూచితం తథా చ వనపర్వణి వనవాసాయ ప్రస్థితాః పాండవాః ఊషుస్తాం రజనీం వీరాః సంస్పృశ్య సలిలం శుచి. ఇతి.

1. వా ॥ రా ॥

+వత్సా లక్ష్మణా! ఈ వనమునం దనేకములైన కందమూలఫలాదులు దొరకును గాని, ఈ రాత్రి నేను జలాహారముతోడనే గడిపెదను.

సౌమిత్రిణోపక్లుప్తాయాం శయ్యాయాం రాఘవ స్తతః,
జలప్రాశ్య నరాహారః సీతయా సహ సుప్తవాన్. 67

పిమ్మట రాముఁడు జలము మాత్రము త్రాగి నిరాహారుఁడై లక్ష్మణునిచే నిర్మింపఁబడిన శయ్యయందు సీతతో గూడ నిద్రించెను.

లక్ష్మణో ఽపి ధనుష్పాణిః పాలయామాస ధర్మవిత్,
పౌరా స్సర్వే సమాగత్య స్థితాస్తస్యా విదూరతః,
తత్ర న్మహీజమూలేషు నిద్రా మాపుః క్రమా త్తతః. 68 ½

ధర్మజ్ఞుఁడైన లక్ష్మణుడును ధనుస్సును కరమందు ధరించి దూరమున నిలిచి వారలను గాపాడుచుండెను. పిమ్మట పౌరులెల్లరును వచ్చి రామునకు దూరముగ నాయావృక్షముల మూలములయందు విడిసి క్రమముగ నిద్రించిరి.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యాకాండే ద్వితీయ భాగే ప్రథమ స్సర్గః.
ఇట్లాశ్చర్యరామాయణమున నయోధ్యాకాండమున
ద్వితీయభాగమున ప్రథమసర్గము సమాప్తము.

---

+ దీనివలన వనవాసమునకు బ్రయాణమగువారు ప్రథమదినమందు జలాహారముతోడనే నివసింపవలయునని సూచింపబడినది. ఇట్లే భారతమున వనపర్వమునందు గూడ కలదు. వనవాసమునకు గృత ప్రయాణులైన పాండవులు "జలపానము మాత్రము చేసి యారాత్రి గడిపిరి." అని చెప్పఁబడియున్నది.

# ద్వితీయస్సర్గః - రెండవసర్గ

[1]యత్క్రించి దవశిష్టాయాం రజన్యాం రాఘవ స్తతః,
ఉత్థాయ తరుమూలేషు ప్రసుప్తాన్పురవాసినః.
అనుసృత్య స్వపదవీం సమీక్ష్యాగచ్ఛతో జనాన్,
నిరపేక్షాన్పుత్రమిత్ర కళత్రాదిషు బంధుషు.
సౌమిత్రి వచనం చేద మబ్రవీత్థిన్న మానసః 1-2½

పిమ్మట రామచంద్రుడు తెల్లవారుజాముననే శయ్యనుండి లేచి పుత్త్రమిత్త్ర కళాత్రాదులయందును గూడ నిరపేక్షులై తనను వెన్నంటి వచ్చి చేరి యొడళ్ళు మఱచి యాయా వృక్షమూలములయందు నిద్రించుచున్న పురజనులను చూచి మిక్కిలి ఖిన్నుఁడై లక్ష్మణునితో నిట్లనియెను.

2యావ దేవం తు సంసుప్తా స్తావ దేవ వయం లఘు,
రథ మారుహ్య గచ్ఛామః పంథాన మకుతోభయమ్,
*పౌరా హ్యాత్మకృతాద్దుఃఖా ద్విప్రమోచ్యాన్నృపాత్మజైః 3-4

*లక్ష్మణా! వీరు నిద్రనుండి లేచులోపుననే మనము నిశ్శబ్దముగ రథమెక్కి వీరికి మనదారి యంతుపట్టని విధమున వెడలుదము. లోకమునందు రాజపుత్త్రులు పురజనులకు తమవలన దుఃఖము కలుగకుండ వారిని కాపాడవలయునుగదా?

3త చ్ఛ్రుత్వా లక్ష్మణో రామం ప్రాహ మే రోచతే వచః,
సుమంత్రోఽథ సుసంయోజ్య రథే వాహా న్సమాగతః,
త్వ మారోహాద్య రామేతి ప్రాంజలిః ప్రాహ వై వచః. 5½

---

*అనేన రాజ్ఞాఽ స్వయం క్లేశ మనుభూయాపి పరజనహిత మాచరణీయ మితి సూచితం తథా చ భారతే శాంతౌ "యథాహి గర్భిణీ హిత్వా స్వప్రియం మనసోనుగం గర్భస్య హిత మాదత్తే తథా రాజ్ఞా ప్యసంశయః ఇతి

* ఇట్లనుటచే రాజు తాను క్లేశమనుభవించియైనను ప్రజలకు హితము సమకూర్చవలయునను ధర్మము సూచితమగుచున్నది. ఇట్లే భారత మందలి శాంతిపర్వములోఁ జెప్పఁబడినది. " గర్భవతులగు స్త్రీలు తమ యిష్టపదార్థములయందు కోరికను జంపుకొని గర్భమున కెట్లు హితమును చేయుచుందురో యట్లే రాజును, ప్రజలను రక్షింపవలయును" అని.

---

1. క. 2 వా.రా. || 3. క.

అనఁగా విని లక్ష్మణుడు నాకును సమ్మతమే యని చెప్పెను. ఇంతలో సుమంత్రుడును గుఱ్ఱములను పూన్చి సిద్ధముచేసిన రథము నచ్చటికి తోలుకొనివచ్చి వెంటనే నీవు రథము నెక్కుమని రామునితో ననెను.

**[*1] తతస్సమాస్థాయ రథం మహారథ స్ససారథిర్దాశరథిర్వనం యయౌ,**
**ఉదఙ్ముఖం తం తు రథం చకార వై ప్రయాణమాంగల్యనిమిత్త దర్శనాత్.6½**

** అనంతర మా మహారథుడగు శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణులతో గూడి రథమెక్కి ప్రయాణమునకు మంగళప్రదములైన శకునములు కనిపించుటచే రథము నుత్తరదిశ కభిముఖముగ జేసి పయనమయ్యెను.

**[1] తతో రామోఽ నుసరత స్స్వమార్గం వీక్ష్య నాగరాన్,**
**కించి ద్దూరం వంచయితు మమార్గేణ వ్రజం స్తతః,**
**యథా పూర్వం తు మార్గేణ రథారూఢో యయౌ ద్రుతమ్. 7-8**

తన మార్గమును గుర్తించి పౌరులు మరల తన్ను వెన్నంటుదురేమో యని వారలను వంచించుటకై రాముడు కొంతదూరమువఱకును రథమును తప్పుదారికి (అనగా నయోధ్య కభిముఖముగా) పట్టించి యటుపిమ్మట యథాపూర్వకముగ మంచిదారికి (అనగా వనమార్గమునకు) రప్పించి త్వరితగమనమున నరిగెను.

**పౌర జానపదాః పశ్చాత్ప్రబుద్ధా రామలక్ష్మణౌ,**
**సీతాం తత్ర త్వనాలోక్య శోకాకులహృద స్తతః**

---

* అనేన ఉత్తరదిశః ప్రశస్తత్వాత్ తదభిగమనం ప్రశస్తమితి సూచితం. తథా చ తైత్తిరీయశ్రుతిః-తస్మాదుత్తరతోఽ భిప్రయాయీ జయతి ఇతి|, తథా చ వనపర్వణి- ఉదఙ్ముఖాశ్శస్త్రభృతః ప్రయయుస్సహ కృష్ణయా ఇతి నారదే నోక్తం ఉద్యోగపర్వణి గాలవంప్రతి - యస్మా దుత్తీర్యతే పాపా ద్యస్మాన్నిశ్శ్రేయసం చరేత్ తస్మాదుత్తారణఫలా దుత్తరే త్యుచ్యతే బుధైః. ఇతి

** ఇట్లనుటచే నన్నిదిక్కులకంటె నుత్తరదిక్కే ప్రశస్తమైన దనియు నాదిక్కు కభిముఖముగా ప్రయాణము చేయుట శ్రేష్ఠమనియు సూచితమగుచున్నది. ఇట్లే తైత్తిరీయశ్రుతిలో" ఉత్తరాభిముఖుఁడై ప్రయాణ మొనర్చువాడు జయమును పొందుచున్నాఁడు." అని యున్నది. అట్లే వనపర్వమునందును చెప్పఁబడియున్నది- "శస్త్రపాణులై పాండవులు త్వరితగతితో నుత్తరాభిముఖులై వెడలిరి. ఉద్యోగపర్వమందు గాలవునితో నారదుడిట్లు చెప్పెను. " పాపమునుండి తరింపఁ జేయునది గావునను, శుభముల నిచ్చునది కావునను, నాదిక్కునకు నుత్తరయని పేరుకలిగె"నని.

---

1 వా

పున స్తద్దృష్టి నైరాశ్య దూయమానాత్మ మానసాః,
కృచ్ఛ్రేణ స్వపురీం గత్వా స్వస్వగేహాన్యగుః క్రమాత్. 9-10

సూర్యోదయమయిన పిమ్మట పౌరులును, జానపదులును మేల్కాంచి సీతారామలక్ష్మణుల నక్కడ కానక దుఃఖితులై యటు నిటు మోహవశమున పరుగు లిడుచు వెదకి వేసారి యింక శ్రీరామచంద్రుని పునర్దర్శనమునందు గూడ నిరాశఁజెంది యెట్టెట్లో తమ పురమును జేరి క్రమముగా తమ తమ యిండ్లకు జేరిరి.

విలోక్య తా న్రామవినాకృతా న్పురీం
సమాగతా న్వ్యాకులమానసాం స్తదా,
పురస్త్రియో ఽ వాప్య శుచం విశేషతో
వినింద్య తాన్స్వీయజనా నథాబ్రువన్. 11

ఇట్లు రాముని వీడి దుఃఖితులై గృహములకు వచ్చిన పౌరులను జూచి యా పురమందలి స్త్రీజనము మిక్కిలి దుఃఖించి తమ తమ జనులను, రాముని దీసికొని రానందులకు చాలఁగ నిందించి పిమ్మట నిట్లు పలికిరి.

యయా సుతః పతిస్త్యక్తౌ సాక మన్యం తు న త్యజేత్,
కైకేయ్యా న వయం రాజ్యే క్షణం వా ఽ పి వసే మహి.
పురా భవతి నో దూరా దనుగచ్ఛామ రాఘవమ్,
వయం పరిచరిష్యామ స్సీతాం యూయం తు రాఘవమ్.
[1]ఇత్యుక్త్వా వ్యలప న్నార్యో ఽ ప్యర్యమా ప్యస్తమాప్తవాన్. 12-13½

ఏ కైకేయి తన పతిని సుతునిఁ గూడ విడిచెనో యా కైక పౌరులమగు మనలను మాత్రము విడుచుటయందును సందేహపడునా? కైకేయీ రాజ్యమందు మన మొక్క క్షణకాల మైనను నిలువఁగూడదు. ఇంక మనమాలస్యము చేసిన రామచంద్రమూర్తి యింకను దూరదేశమునకు వెళ్ళగలఁడు. కావున వానియొద్దకు పోవుదము. మేము సీతా దేవికిఁ బరిచర్య లొనర్చెదము. మీరును శ్రీరామచంద్రుని సేవింపుడుఅని ఇట్లు పురస్త్రీలెల్లరును శోకాంధలై పలుకుచుండగా సూర్యాస్తమయ మయ్యెను.

1. క ||

క్రమేణ గోమతీ ముఖ్యా నదీ స్సంపద్ధురాం స్తథా,
కోసలా న్రాఘవ స్తీర్త్వా సాకేతాఽ భిముఖోఽ బ్రవీత్. **14½**

అచ్చట శ్రీరామచంద్రుడును సీతాలక్ష్మణ సహితుడై రథముపైఁ బ్రయాణము చేయుచు మిక్కిలి రమణీయములైన దృశ్యములచే హృదయమున కానందమిచ్చు గోమతి మొదలగు నదులను, సంపదలచేఁ దులతూగు కోసలదేశములను గూడ దాటి సాకేతాభిముఖుడై యయోధ్యాపురి నిట్లు ప్రార్థించెను.

1ఆపృచ్ఛే త్వాం పురి శ్రేష్ఠే కాకుత్స్థ పరిపాలితే,
*దైవతాని చ యాని త్వాం పాలయంత్యా వసంతి చ. **15½**

+కాకుత్స్థవంశరాజులు పరిపాలించునట్టి యోపురశ్రేష్ఠమా? నాకు వనగమనమున కనుజ్ఞ నొసంగుము. సాకేతపురమును బాలించునట్టి యోదేవతలారా! మీరు గూడ నాకు వనగమనమున కనుజ్ఞ నొసంగుడు.

తతస్త్రిపథగాం దివ్యాం శివతోయా మశైవలామ్,
దదర్శ రాఘవో గంగాం పుణ్యాం ఋషినిషేవితామ్. **16½**

పిమ్మట శ్రీరామచంద్రుడు, మూడు త్రోవలుగఁ బ్రవహించునదియు, నిర్మలమైన యుదకముచే నిండినదియు, ఋషిజన సేవితము నగు గంగా నదిని చూచెను.

2రామోఽథ ప్రాహ తం మిహై వాద్య వసేమహి,
అవిదూరేస్త్వయం నద్యా స్సుమహా నింగుదీతరుః,
వసామ స్తత్తరో ర్మూలే రథం తత్ర నయ ద్రుతమ్,
ఇత్యుక్తో బాఢ మిత్యుక్త్వా సుమంత్రోఽపి తథాఽకరోత్, **17-18½**

---

* అనేన దేశాంతరం గచ్ఛతా నివాసదేశ మామం త్ర్యేవ గంతవ్య మితి సూచితం ఏవం వనపర్వణి గంధమాదనా త్ప్రయాణసమయే ధర్మరాజ కృతపార్థనా- ఆమంత్ర్య వేశ్మాని సరాంసి నద్యః రక్షాంసి చ ధర్మరాజః ఇతి.

\+ ఇటనుటచే దేశాంతరమున కరుగువాడు ప్రయాణసమయమందు స్వదేశమును సంబోధించి యనుజ్ఞ వేడి వెడలవలయునను ధర్మము సూచితము. ఇట్లే వనపర్వమందు" గూడ" గంధమాదనము నుండి ప్రయాణమగు సమయమందు, అచ్చట గృహములను, సరస్సులను, నదులను భూతములను గూడ ననుజ్ఞ వేడి ధర్మరాజు కృత ప్రయాణుడయ్యెను" అని యున్నది.

---

1. వా || రా || 2. క.

అనంతర మా రామచంద్రుడు సుమంత్రునితో నిట్లు పలికెను. సుమంత్రా! నేటికి నేనిచ్చటనే నివసించెదను. ఆనదియొడ్డున కనిపించునట్టి యింగుదీవృక్షము నివాసయోగ్యమై కానవచ్చుచున్నది. ఆ వృక్ష మూలమునందు నివసించెదను. వెంటనే మన రథము నక్కడకు తోలుము. అనగా నటులనే యని సుమంత్రుడు రాముఁడు చెప్పినట్లొనర్చెను.

తస్యా విదూరే వసతి శృంగబేరపురం లసత్,
రాఘవస్య ప్రాణసమో గుహ స్తత్ర నృపోఽవసత్. 19½

అటకు సమీపమందున్న శృంగిబేరమను పేరు గల యొకానొక గ్రామము గలదు. అందు రామునకు ప్రాణసఖుడగు గుహుడను కిరాతరాజొక్కడు కలడు.

[1]స శ్రుత్వా పురుష వ్యాఘ్రం రామం విషయ మాగతమ్,
వృద్ధైః పరివృతోఽమాత్యై ర్జ్ఞాతిభి శ్చాప్యుపాగతః. 20½

ఆగుహుడు తన పురసమీపమునకు, బురుషశ్రేష్ఠుడగు రాము డరుదెంచినాడని విని మంత్రి బంధు పుత్ర మిత్ర కళత్రాదులతో గూడి రాముని దర్శనము చేసికొనుట కరుదెంచెను.

తతో నిషాదాధిపతిం దృష్ట్వా దూరా దుపస్థితమ్,
తత స్సౌమిత్రిణా సాకం సమాగచ్ఛ ద్గుహేన సః,
త మార్త స్సంపరిష్వజ్య గుహో రాఘవ! మబ్రవీత్. 22-23

తన దర్శనమున కరుదెంచుచున్న గుహుని దూరముననే శ్రీరామచంద్రుడు చూచి లక్ష్మణునితో గూడ శ్రీరామచంద్రుడు ప్రీతితో వాని నెదుర్కొనెను.

పిమ్మట గుహుడు రాముని కౌగిలించుకొని దీనుడై యిట్లుపలికెను.

స్వాగతం దేవదేవాఢ్య స్వాగతం తే రఘూత్తమ
లోకనాథ! స్వాగతం తే స్వాగతం తేఽస్తు రాఘవ 24

ఓదేవా! రామచంద్రా! నీకు స్వాగతము. ఓ రఘువంశోత్తమా! నీకు స్వాగతము. ఓ లోకనాథా! నీకు స్వాగతము. ఓ రాఘవ నీకు స్వాగతము.

1. వా. రా.

ధన్యో ఽభూవ మహం రామ! త్వద్దర్శనవశాదహమ్,
కృతార్థో ఽహం కృతార్థో ఽహం కృతార్థో ఽహం న సంశయః.
మత్పిత స్త్వం భక్తమిమం పాతు మాగతవా నసి,
ఇతి మన్యే త్వహం దేవ! భక్తమందార రాఘవ! 25-26

రామచంద్రా! నీ దర్శనవశమున నేను ధన్యుడనైతిని. కృతార్థుడనైతిని. పవిత్రుడనైతిని. తండ్రీ! భక్త మందారా! రామచంద్రా! నీ భక్తుని బవిత్ర మొనర్చుటకే నీవు వచ్చితివని తలంచుచున్నాను.

రామచంద్ర భవత్పాద ధూళిసంసర్గతో ఽధునా
*శృంగిబేరపురం చాపి పవిత్రం మే ఽభవత్ప్రంమ్. 27

* రాఘవ! నీ పాదధూళి యొక్క సంపర్కమువలన నిప్పుడు మాపురము శృంగిబేరపుర మయినను పవిత్రమైనది.

---

* శృంగిబేరపురమితి- శృంగిణః కృష్ణసారాదయః తేషాం బేరాణి కృత్రిమశరీరాణి వంచనేన సజాతీయ మృగగ్రహణార్థాని యస్మిన్ త చ్ఛృంగి బేరపురం"ప్రతిచ్ఛందః ప్రతినిధిర్బేరం చ ప్రతిరూపక మితి వైజయంతీ - తత్రాప్యంత్యవనశృంగిణ స్తత్పురజనవంచనా మజ్ఞాత్వా యథార్థశృంగిణ ఏవ తత్ర స్థితా ఇతి భ్రాంత్యా శృంగిబేరపురీం ప్రతి యదా సమాగతా భవేయు స్తదా తా న్సంహర్తుం తత్ర తత్ర తత్పురస్య చతుర్దిక్షు శృంగ్యాకార కృత్రిమశృంగిణ స్తత్పురవాసిభి స్సంస్థాపితా ఇతి వేద్యం. తాదృశ క్రూర పుర మపి భక్తనివాసత్వా ద్భగవతశ్శ్రీరామచంద్రస్యాపి ప్రాప్యస్థల మభూత్. తస్మాదేవ శృంగి బేరపుర మపీతి కథనం సంగచ్ఛతే. అత్రేదం కించి ద్విచార్యతే రామస్య శృంగిబేరగమనేన పవిత్రస్థానేభ్యో ఽపి భక్తస్థాన మేవోత్కృష్ట మితి, రామ ఏవ గుహనివాసంప్రతి గత ఇత్యనేన భగవా నస్మా న్మార్గయ న్నాగచ్ఛే దితి చ,గుహోద్రుత మాగత్య శ్రీరామ మాలింగితవా నిత్యనేన భగవతి భక్తానాం పూర్ణతయా స్వాతంత్ర్య మస్తీతి చ ద్యోత్యతే - నను గుహస్య నిషాదత్వాత్, నిషాదో మృగఘాతీ స్యాదితి వైజయంత్యా తస్య మృగఘాతిత్వేన గుహతి వంచయతి పరస్వమితి వ్యుత్పత్త్యా వంచకత్వేన  చ జాతితో వృత్తితో గుణశ్చ హీనస్య తస్య భక్తతాయాం కిం మాన మితిచేన్న. తన్నామైవ తస్య భక్తతాయాం మాన మవగమయతి. తథాహి-గుహరక్షణే ఇత్యస్మాద్ధాతోః గుహతి గోపాయతీతి గుహః భగవత్కైంకర్యజన్యాత్మవిజ్ఞానేన ఆత్మానం రక్షతీతి పర్యవసితో ఽర్థ-

అనేన గుహస్య భక్తి ర్వ్యక్తీకృతా. అన్యథా రామస్య హీన సఖ్యకరణదోషాపత్తి రితి జ్ఞేయం. తస్మాదేవ రామాలింగన స్వాతంత్ర్యభాగ్య మేకస్య గుహస్యైవ సంబభూవ. న తు సుమంత్రస్య తతే ఏవ రామో ఽపి గుహం స్వాత్మసఖమితి కథయామాస. ఆత్మా మాహాత్మ్యేతి గుహో నీచ జాతీయ ఇతి భేదం వినా గుహస్యాభిముఖ్యేన రామో గత ఇత్యనేన శ్రీరామచంద్రస్య సౌశీల్యాదిగుణా అపి వ్యక్తకృతాః మహతో మందైస్సహ నీరంధ్రేణ సంశ్లేషో హి సౌశీల్యం.

**పురా రామ! భవత్పాదతీర్థసంసేవనా న్మమ,**
**సంప్రాప్తం వైభవం సర్వం తవేదం మామకం న హి. 28**

రామా! పూర్వము నీ పాదతీర్థము సేవించుటవలన నాకు లభించిన యీ రాజ్యమెల్ల నీదియే. ఇట నాసొత్తేమియు లేదు.

**భక్ష్యం భోజ్యం చ పేయం చ మధూని మధురాణి చ,**
**ఆనీతాని ఫలాదీని గృహాణ త్వం రఘూత్తమ. 29**

చక్కని రుచిగల భక్ష్యములు, భోజ్యములు, పానీయములు, ఫలాదులును గూడ నీకొఱకై తెచ్చితిని, వీనినెల్ల దయతోడ ప్రతిగ్రహింపుము.

---

నను పురా బాలకాండోక్త గుహ ఏవాయ ముతవాన్య ఇతిచే దేక ఏవేత్యవగమ్యతే. తథాహి:- పురా శ్రీరామచంద్ర పాదారవిందక్షాళనేన నిర్ధూత కల్మషస్య నిరీహకస్యాపి గుహస్య భగవత శ్శ్రీరామచంద్రస్య ప్రసాదే నైహికభోగ్యజాతం కతిపయ గ్రామాధిపత్య మూలక రాజ్యపాలనం చ సంప్రాప్తమిత్యేవ వక్తవ్యం త్వత్పాద సంక్షాళనా దేవ లబ్ధరాజ్యోఽహ మిత్యేత దర్థస్య కంఠత ఏవ రామం ప్రతి గుహేన కథితత్వాదితి జ్ఞేయం. అన్యథా గుహం స్వాత్మసఖమితి వాల్మీకి రామాయణే రామేణ కథితత్వేన పురా న కుత్రాపి గుహరామసస్యయోరవర్ణిత త్వేపి తదన్యథానుపపత్త్యా ఇతర రామాయణాదిషు బాలకాండే వర్ణితో గుహః వాల్మీకేర ప్యభిప్రేత ఏవేతి నిశ్చితవ్యమిత్యలం పల్లవి తేన.

* ఇచ్చట శృంగిబేరపుర మనగా నర్థము నిర్వచింపఁ బడుచున్నది. బేరశబ్దమునకు గృత్రిమమని యర్థము. శృంగియనగా జింకయని యర్థము. కావున శృంగిబేరపురమనఁగా కృత్రిమములైన జింకలతో గూడిన పురమని యర్థము. ఆ శృంగిబేరపుర వన ప్రాంతములయందు సంచరించు మృగములను తమ యూరిలోనికిఁ జేరబట్టుకొని పట్టి వధించుటకై శృంగి బేరపురమందలి పౌరులు కృత్రిమములైన శృంగులను (లేళ్లను) నలుదిక్కులందును నిర్మించిరనియు నట్టి క్రూరజనవ్యాప్తమైన పురముగూడ భక్తుని నివాసదేశ మగుటచే శ్రీరామచంద్రునకు గూడ బ్రవేశయోగ్యమైన స్థలమయ్యె ననియుఁ దెలియబడుచున్నది. కావుననే, "శృంగిబేర మైనప్పటికి నాపురము పవిత్రమయ్యె" నను గుహుని వచనము సంగత మగుచున్నది.

ఇచ్చట విశేషములు విమర్శింపబడుచున్నవి. రాముడు క్రూరజన నివాసమగు శృంగిబేరపుర సమీపమున ప్రవేశించె ననుటచేత దివ్యక్షేత్రముల కంటె భక్త నివాసదేశమే యుత్కృష్ట మనియు, "రాముడే గుహుని స్థానమునకు వచ్చెను." అనుటచే భగవంతుడే భక్తుల ననుగ్రహించుటకు వెదకికొనుచు వచ్చు ననియు", గుహుడు వెంటనే వచ్చి శ్రీరామచంద్రు నాలింగనము చేసికొనెను." అనుటచే భగవంతునియందు భక్తులకు సంపూర్ణస్వాతంత్ర్యము కలదనియు వ్యంగ్యమగుచున్నది. ఇందుపై నొక యాశంక కలుగుచున్నది. (ఏమనగా) గుహుడు నిషాదుడుగదా; నిషాదుడనగా మృగములనుఁ జంపువాడని యర్థముగాన గుహుడును నట్టి జాతీయుడే కావునను, గుహధాతువునకు గుహయను శబ్దమునకు వ్యుత్పత్త్యర్థముచే జాతిచేతను, వృత్తిచేతను. గుణముచేతను. గూడ గుహుడు హీనుడని తెలుచుండ నతడు భక్తుడనుటలోఁ బ్రమాణ మేమియను పూర్వపక్షమునకు

ప్రవిశ్య భవనం మే౽ద్య పూతం కురు మహాప్రభో!
ఇత్యుక్తో రాఘవః ప్రాహ సుప్రీతో గుహ మాదరాత్. 29 ½

నీ విపుడు నా యింటి కరుదెంచి మా గృహమును బవిత్ర మొనర్పుము. అనగా విని రాముడు గుహుని నాదరించి ప్రీతితో నిట్లు పలికెను.

న వేక్ష్యామి గృహం గ్రామం చతుర్దశసమా స్సఖే!
గుహ మేవం బ్రువాణ స్తం రాఘవః ప్రత్యువాచ సః. 31

గుహా! నేను పదునాలుగు వత్సరములవఱకును, గృహమునుగాని గ్రామమునుగాని ప్రవేశింపరాదు.

---

సిద్ధాంతము చెప్పబడుచున్నది. గుహుడు మహాభక్తుడని వాని నామమువలననే వ్యక్తమగుచున్నది. ఎట్లనఁగా గుహయను ధాతువునకు రక్షించుటయని యర్థము. ఆ గుహ ధాతువువలన నిష్పన్నమైనందున గుహుడనగా రక్షించుకొనువాడని యర్థము. (అనగా భగవంతుని సేవవలన గలిగిన యాత్మవిజ్ఞానముచేత తన యాత్మను రక్షించుకొనువాడని పర్యవసానము.)

ఇందుచే గుహుని భక్తివిశేషము వ్యక్తీకరింపఁబడినది. గుహుడు భక్తుడే కాకున్న గుహునితోడ స్నేహమువలన హీనజన స్నేహరూపమైన దోషము రామునకు సంభవింపఁగలదని గ్రహింపవలయును.

కావుననే శ్రీమద్భగవదవతారమూర్తి యగు శ్రీరామచంద్రుని నాలింగనముచేసికొను నంతటి స్వాతంత్ర్యభాగ్య మొక్కగుహునకే దక్కినది. వేయేల, అట్టి భాగ్యము రఘుకుల నిత్యసేవకుడైన సుమంత్రునకు దక్కెనా? కాబట్టియే, రాముడును "గుహునికంటె నాకాంతరంగిక భక్తుడు వేరొక్కరుడు లేడని చెప్పియున్నాడు. తాను మహాత్ము డననియు" గుహుడు నీచజాతీయు డనియు భేదమును బరిగణింపక రాముడు గుహుని నెదుర్కొనె ననుటచే శ్రీరామచంద్రుని సౌశీల్యాదిగుణములు వ్యక్తమగుచున్నవి. మహాత్ములల్పులతో సహవాసము చేయుటయేకదా సౌశీల్యము.

బాలకాండమునఁ జెప్పబడిన గుహుడును, ఇచ్చటఁజెప్పబడిన గుహుడును నొక్కడా వేఱగునా- అను సంశయము కలుగును కాని యొక్కడనియే చెప్ప నొప్పును. (ఎట్లన) రాముడు మిథిలాపురమున కేగునప్పుడు నిర్ధనుడగు గుహుడు రామునకు పాద ప్రక్షాళనము చేయుటచే నిష్కల్మషుడును, నిష్కాముడునై యుండియు శ్రీరామానుగ్రహముచే సమస్తమైన ఐహిక భోగములు కలవాడై కొన్ని గ్రామముల కాధిపత్యమును కూడ కలవాడయ్యెననియే చెప్పవలసియున్నది. గుహుడు కంఠోక్తిగ రామునితో" నీపాదప్రక్షాళనము వలన గలిగిన మాహాత్మ్యమువలననే నాకీ రాజ్యము వచ్చిన"దని చెప్పియుండెను. అందువలన బాలకాండమునఁ జెప్పబడిన గుహుడే యితడని స్పష్టము. మఱియు గుహుడొక్కడే కానిచో వాల్మీకి రామాయణమున గూడ గుహుని దన ప్రాణమిత్రునిగా రాముడు చెప్పియుండుటచేతను గుహునకు రామునకు సఖ్యమున్నట్లు పూర్వమెచ్చటను వర్ణింపబడకపోయినను మైత్ర్యన్యథానుపపత్తిచే ఇతర రామాయణములయందు బాలకాండమున వర్ణింపబడిన గుహుడు వాల్మీకికిఁ గూడ నభిప్రేతుడేయనియు నతడే యితడనియు తేలుచున్నది.

అర్చితాశ్చైవ హృష్టాశ్చ భవతా సర్వధా వయం,
దిష్ట్యా త్వాం గుహ! పశ్యామి అరోగం సహ బాంధవైః. 32

సఖా! నీవు మమ్ముల ననేకవిధముల పూజించితివి. మంత్రి బంధుమిత్రపరివారముతోడ నిన్ను చూచుటవలన నాకెంతయు సంతసమైనది.

యత్త్విదం భవతా కించి త్ప్రీత్యా సమభికల్పితమ్,
సర్వం త దనుజానామి న హి వర్తే ప్రతిగ్రహే. 33

నీవు ప్రేమతో నాకొఱకై సమస్తపదార్థములను సిద్ధముచేసితివి. కాని యవియెల్ల నేను ప్రతిగ్రహించుటకు వీలులేదు.

కుశ చీనాంబరధరం ఫలమూలాశినం చ మామ్,
విద్ధి ప్రణిహితం ధర్మే తాపసం వనగోచరమ్. 34

ఓ మిత్రమా! నన్నిక నారచీరలు ధరించి, కందమూలఫలములను భక్షించుచు కాలక్షేపము చేయుచు తాపసుల ధర్మముల ననుష్ఠించు వానినిగా నెఱుంగుము.

అశ్వానాం ఖాదనే నాహ మర్థీ నాన్యేన కేనచిత్,
[1]ఇత్యుక్త్వా లక్ష్మణానీతం జలం రామ స్సమాదదే. 35

నీవు గుఱ్ఱములకు వలయు నాహారపదార్థములను మాత్రము సిద్ధపరుపుము మఱియేదియు నేను కోరుటలేదు. ఇట్లు పలికి పిమ్మట రాముడు లక్ష్మణునిచే తేబడిన జలమునే భోజ్యముగ గ్రహించెను.

జ్ఞాత్వా సమాగతం రామం శృంగిబేరజనా స్తథా,
ఆగత్య రామం సీతాం చ దూరా ద్వీక్ష్య మిథో ఽబ్రువన్. 36

పిదప రామచంద్ర ప్రభువు వచ్చినట్లు శృంగిబేరపురమందలి జనులందరును విని వెంటనే యటకు వచ్చి దూరమునుండి సీతారాములను జూచి వారిని గూర్చి తమలో తామిట్లు చెప్పుకొన జొచ్చిరి.

కథం ను మాతాపితరౌ బంధవో నాగరా స్తథా,
తత్యజు స్సుకుమారాంస్తాన్సురద్రూపా నిమా నహో. 37

1. క.

ఇట్టి సుకుమారులును, సుందరాకారులును నగు సీతారామలక్ష్మణులను, వీరితల్లిదండ్రులును, బంధువులును, పౌరులును ఎట్లు విడువగల్గిరో గదా?

**తేషాం మధ్యే కేచి దాహూ రేవం దశరథ స్సుతమ్,**
**వివాసయే న్నచే ద్రామ దర్శనం నః కథం భవేత్. 38**

వారిలో మఱికొంద రిట్లనిరి. దశరథుడు తనకొడుకును నూరినుండి వెడలగొట్టకుండినచో శ్రీరాముని దర్శనము మనకెట్లు కలుగగలదు? కాన దశరథు డెంతయు మనచేఁగొనియాడఁ దగినవా డనిరి.

**ఇతి సంభాషయంత స్తే సమాగత్య తదంతికమ్,**
**నత్వా స్తుత్వా రాఘవం త మాజ్ఞయా తస్య తే యయుః. 39**

ఇట్లు శృంగిబేరపురవాసులగు జనులు సీతారామలక్ష్మణులను గూర్చి తమలో తాము చెప్పుకొనుచు రాముని సమీపమునకు జేరి నమస్కరించి స్తుతించి వానియనుజ్ఞఁ గైకొని తిరిగి తమపురమున కరిగిరి.

**గుహానీత ఫలాదీని సుమంత్రో జానకీ తతః,**
**బుభుజాతే రాఘవస్య వచసో న హి లక్ష్మణః. 40**

పిమ్మట గుహుడు తెచ్చిన ఫలములు మొదలైన వానిని సీతయు, సుమంత్రుడును రాముని యాజ్ఞచే భుజించిరి . కాని లక్ష్మణుడు మాత్రము భుజించలేదు.

**సీతారాఘవయోః పశ్చా త్పర్ణశయ్యే మనోహరే,**
**గుహో ఒకరోత్తథా శయ్యాం లక్ష్మణస్యాపి దూరతః. 41**

అనంతరము గుహుడు సీతారాముల కొకవైపునను, కొంచెము దూరముగ లక్ష్మణున కొకవైపునను మెత్తని చిగురుటాకు పాన్పుల నేర్పఱచెను.

**సీతారామౌ సుషుపతుః క్రమా త్తత్పర్ణశయ్యయోః,**
**తతో గుహస్తు సౌమిత్రిం వచనం త్విద మబ్రవీత్. 42**

క్రమముగా నాపర్ణశయ్యలందు సీతారాములు నిద్రించిరి. ఆ వెనుక గుహుడు సౌమిత్రితో నిట్లనెను.

**సౌమిత్రే! స్వపిహి త్వం చ శయ్యా మాశ్రిత్య తావకీమ్,**
**ధనుష్పాణి రహం రాత్రౌ పాలయిష్యామి రాఘవమ్. 43**

లక్ష్మణా! నీవు గూడ నీ కొఱకు నాచే నమర్పఁ బడిన శయ్యయందు నిద్రింపుము. ఈ రాత్రియెల్ల నేను ధనుర్ధరుడనై రాముని బాలింపగలను.

ఇత్యుక్తో లక్ష్మణ స్త్వాహ గుహమేవ మవిశ్వసన్,
గత్వా స్వపిహి గేహే త్వం రాఘవం పాలయా మ్యహమ్. 44

అనగా విని గుహునివిషయమై నమ్మకము లేనివాడై లక్ష్మణుడు గుహునితో నిట్లు పలికెను. నీవు నీగృహమున కరిగి నిద్రింపుము. నేను రాముని పాలింపగలను. (అని పలికెను)

కైకేయీ సుతవ చ్చాయం భ్రాతృద్రోహం సమాచరేత్,
ఇత్యవిశ్వస్య సౌమిత్రిం న శేతే స్మ గుహస్తదా. 45

భరతునివలె నీ లక్ష్మణుడును భ్రాతృద్రోహ మాచరించు నేమో యని సందేహముతో గుహుడు జాగరూకుడై లక్ష్మణుని నమ్మజాలక రాముని స్వయముగఁ గాపాడుచుండెను.

కైకేయీసుతరాజ్యస్థః కిరాతోఽయం గుహః పునః,
ఆచరే ద్రాఘవే ద్రోహ మిత్యవిశ్వస్య తం గుహమ్,
లక్ష్మణో జాగరూకస్స న్పాలయామాస రాఘవమ్. 46-47

కైకేయీ పుత్త్రుడైన భరతుని రాజ్యమునందు నివసించు నీకిరాత రాజగు గుహుడును ప్రభువు కానున్న భరతునకు సంతోషము కలుగునని భ్రమించి యొకవేళ రామునకు ద్రోహ మొనర్చునేమో యని సందేహించి లక్ష్మణుడును గుహుని నమ్మక రామరక్షణమునకై మేలుకొనియే యుండెను.

ద్వావ ప్యేవ మవిశ్వాసౌ న నిద్రాం ప్రాపతుస్తదా,
పృథక్తరో రథస్థిత్వా రామం స్థండిలశాయినమ్.
నిరీక్ష్య చింతయంతౌ తౌ జాగరూకా వుభౌ స్థితౌ,
గుహ స్సౌమిత్రి మాహేదం సీతారామా వథోద్దిశన్. 48-49

ఇట్లొకరినొకరు మనస్సులలో సందేహించుచు గుహలక్ష్మణు లిర్వురును నిద్రింపక జాగరూకులై రామునిఁ గాపాడుచుండిరి ఇట్లు వారిర్వురును వేరువేరుగా వృక్షమూలములయందు నిలవబడి కేవలము భూమియందు పరుండి నిద్రించుచున్న రాముని గూర్చి మిక్కిలి చింతించిరి. పిమ్మట లక్ష్మణునితో తమ మనోవిచారమును దెల్పుచు గుహుడిట్లు పలికెను.

**హా కీదృశం రాఘవస్య మత్పితుః కష్టమాగతమ్,**
**మజ్జనన్యాశ్చ జానక్యాః కైకేయీమూలత స్సఖే. 50**

అక్కటా! నాతండ్రి రామచంద్రున కెంతటి కష్టదశ సంభవించినది?అయ్యో యే పాపమెఱుగని నాతల్లియైన యీ సీత యా దుష్టురాలగు కైకేయి వలన నెన్ని యిక్కట్ల పాలైనది.

**శర్కరాకంటకాకీర్ణే సీతారామౌ వనే సఖే!**
**సంచరేతాం కథం పద్భ్యాం తుల్యాభ్యాం కుసుమైస్తు హా. 51**

సఖా! లక్ష్మణా! శిలలు, కంటకములు మొదలైన వానిచే కఠోరములైన యీ యరణ్యభూములయందు సుకుమారులైన యీ సీతారాములు కుసుమములవంటి పాదములు కందగా నెట్లు సంచరింతురో కదా?

**యస్యాః పితా విదేహో౽భూ దింద్రస్యాపి సఖాచయః,**
**రాజా చ శ్వశురో యస్యాః రాఘవః పతిరేవ చ,**
**సా౽పి స్థండిలశయ్యా౽భూత్కీదృక్కష్ట ముపస్థితమ్. 52½**

మిత్రమా! ఏ సీత మహాశ్రీమంతుడైన విదేహ రాజునకుఁ గూఁతురై, దేవేంద్రుని యర్ధసింహాసనము నెక్కి యతని మైత్రిని బడసిన దశరథునకు కోడలై, సకలసద్గుణ సంపూర్ణుడైన శ్రీరామభద్రునకు భార్యయై యొప్పినదో యాయమ్మ నేడు కఠినమైన భూశయ్యయందు నిద్రింప వలసివచ్చెఁగదా? ఆహా! ఎంత కష్టదశ సంప్రాప్త మయ్యెను!

**రాజసౌధే రత్నమయే పర్యంకే హేమభూషితే,**
**హంసతూల్యాం తు శయ్యాయాం నిద్రితా వధునా త్విమౌ,**
**వస్త్రేణాపి విహీనాయాం శయ్యాయాం హా వినిద్రితౌ. 53-54**

ఓ సోదరా! లక్ష్మణా! రత్నఖచితములైన రాజసౌధములందు కుందనపు పట్టెమంచములయందు హంసతూలికా తల్పంబులపై హాయిగ నిద్రించునట్టి యీ సీతారాములు నే డీ కారడవులలో పాషాణసదృశమైన నేల పై నిద్రించవలసి వచ్చెఁగదా? ఆహా యెంతకష్టము (అని గుహుడు తన మనోవిచారమును లక్ష్మణునితో చెప్పి దుఃఖించెను).

లక్ష్మణోఽపి తదా ప్రాహ స్వవిచారం ముహుర్ముహుః,
ఏవం పరస్పరం కించిత్కాలం సంభాష్య తావుభౌ,
పరస్పరం తు విశ్వస్తా వభూతాం గుహలక్ష్మణౌ. 55 ½

పిమ్మట లక్ష్మణుడును సీతారాముల విషయకమైన తన మనస్సునందలి విచారమును గుహునితో చెప్పి విచారించెను. ఇట్లు గుహలక్ష్మణు లిర్వురును కొంత సేపు సంభాషించిన పిదప తమ మనస్సులందలి దురూహలను దూరము చేసికొనిరి.

తతో గుహం సముద్దిశ్య సౌమిత్రిః ప్రాహ తత్త్వవిత్,
మిత్రభూతోఽసి మే నూనం భవా న్భ్రాతృసమోఽపి చ,
విచారం మాఽగమస్తేఽహం వచ్మి తత్త్వం తు తచ్ఛృణు. 56-57

అనంతరము గుహునితో లక్ష్మణుఁడిట్లనెను. గుహా! నీవు నాకు స్నేహితుఁడవే కాదు. మఱియు నాకు భ్రాతృసముఁడవు. సీతారాములను గూర్చిన విచార మేమాత్రమును నీవు మనమం దుంచఁదగదు. తత్త్వమును చెప్పెద నాలకింపుము.

*సుఖదుఃఖప్రదం నాస్తి పరం కర్మ వినా భువి,
స్వకర్మవశతో దుఃఖం సుఖం వా లభతే నరః 58

* పురాకృత కర్మమును మించి మఱియేదియు సుఖదుఃఖములను గల్పించునది లేదు. తానాచరించిన కర్మను బట్టియే నరుడు సుఖమును గాని దుఃఖమునుగాని పొందుచున్నాడు.

---

*అత్రేదం కించి ద్విచార్యతే అత్రకర్మణ ఏవ సుఖదుఃఖాదికం జాయత ఇత్యుక్తం. తత్ర కించి ద్విమృశ్యతే కర్మణ ఏవ ఫలముత పరమేశ్వరాదితి సందేహః. కర్మణ ఏవ ఫలమితి పూర్వపక్షః. జ్యోతిష్టోమే నేతిశ్రుత్యా కర్మణస్స్వర్గసాధనత్వస్య విధానాత్. న చాశుతరవినాశినః కథం కాలాంతర భావిఫలసాధనత్వమితి వాచ్యం శ్రుత్యవగత కరణత్వ నిర్వాహాయ కర్మైస్వావస్థాయాం ఫలం స్వర్గాదిక ముత్పాద్య వినశ్యతి. తచ్చ ఫలం కర్త్రా స్వసంపాదితధాన్యాదివత్ కాలాంతరే ఉపభుజ్యతే ఇతి వా కథ్యతే. అన్యథా శ్రుత్యవగత స్వర్గసాధనతా యాగస్య భజ్యేత అతః కర్మణ ఏవఫలం, అన్యథా ఈశ్వరా త్ఫలమిత్యంగీకారే సర్వసాధారణా దీశ్వరా ద్విచిత్రఫలం కథం భవేత్, విచిత్ర ఫలప్రదానే చ ఈశ్వరస్య వైషమ్యనైర్ఘృణ్యే స్యాతాం, యద్ధి తత్పరిహారాయ కర్మానురోధేన ఈశ్వరః ఫలం దదాతీతి కల్ప్యతే తర్హ్యావశ్యకాత్కర్మణ ఏవ ఫలమిత్యస్తు కిమీశ్వరేణ ఇతి పూర- పక్షః.

సంయోగశ్చ వియోగశ్చ శత్రుర్మిత్రం చ సంపదః,
సంసారే భ్రామ్యమాణానాం క్రమశ స్సంభవంతి హి 59

సంయోగముగాని, వియోగముగాని, శత్రువులుగాని, మిత్రులుగాని, సంపదగాని, దారిద్ర్యముగాని - సంసారమునందు తిరుగు వారలకు క్రమముగా సంభవించుచున్నవి.

---

సిద్ధాంతస్తు -ఈశ్వర ఏవ ఫలదాతా"అన్నాదో వసుదాన" ఇతి శ్రుత్యా ఈశ్వరస్య ఫలదాతృత్వావగమాత్. సర్వశక్తేః పరమేశ్వరస్యైవ తత్త త్కర్మానురూపఫలప్రదానే సమర్థత్వాచ్చ. న చ వైషమ్య నైర్ఘృణ్యయోః ప్రసంగః. ఏషహ్యేవసాధుకర్మ కారయతీతి శ్రుత్యా కర్మస్వరూప మపేక్ష్యైవ ఫలప్రదాతృత్వావగమేన వైషమ్య నైర్ఘృణ్యయో రప్రసక్తేః, తస్మాదీశ్వర ఏవ ఫలదాతా, ఈశ్వరస్య ఫలదాతృత్వానంగీకారే కులాలానధిష్ఠిత దండాదేరివ చేతనానధిష్ఠిస్య కర్మణః కారణత్వానుపపత్తేః కర్మణః ఫలదాతృత్వం చిరప్రధ్వస్తత్వా దనుపపన్నం. న చ స్వావస్థానవేళా యాం కర్మణః ఫలం జన్యత ఇతి వాచ్యం తత్కిం భోక్త్రా సంబద్ధ మసంబద్ధం వా, న తావదాద్యః, తదానీ మేవానుభవప్రసంగాత్. న ద్వితీయః భోక్తృ సంబంధాభావే ఫలం త్వ వ్యాఘాతాత్, అజ్ఞాతసుఖదుఃఖయోః ప్రమాణాభావాచ్చ. నచాపూర్వాదికం ద్వారమాసాద్య కర్మ ఫలజనకమితి వాచ్యం. ప్రమాణాభావాత్, న చ శ్రుతిప్రతిపన్న స్వర్గసాధన త్వానుపపత్తిరేవ మానమితివాచ్యం. అన్నాదో వసుదాన ఇతి, మత్ప్రసాదా దవాప్నోతి శాశ్వతం పదమవ్యయం. ఇత్యాది భగవద్వచనేన చ ప్రసన్నా దీశ్వరా త్ఫలమిత్యవగమేన ఈశ్వరప్రసాదద్వారా కర్మణః ఫలజనకత్వసంభవేన అనుపపత్తే రభావాత్ కర్తైవ ఫలజనకమితి, తస్మాదీశ్వర ఏవ ఫలదాతా- ప్రకృతే లక్ష్మణవాక్యస్యాపి ఈశ్వరప్రసాదద్వారా కర్మసుఖదుఃఖాదిరూపం ఫలం జనయతీత్యేవ తదాశయః

"ఫలమత ఉపపత్తేః" ఇతి ఫలాధికరణేఽపి సూత్రభాష్యే సమ్యగిదం విచారితమిత్యల మతివిస్తరేణ.

* కర్మమే సుఖదుఃఖరూపమగు ఫలమును బుట్టించుచున్నదని యిచ్చట లక్ష్మణునిచేఁ జెప్పఁబడినది. ఇందువిషయమై కొంచెము విమర్శింపఁబడుచున్నది.

కర్మవలన ఫలము కలుగునా? లేక పరమేశ్వరునివలన ఫలము కలుగునా? అని సంశయము కలుగును. స్వర్గాది భోగములకు సాధనముగా కర్మ చెప్పఁబడియుండుటచే కర్మవలననే ఫలము కలుగునని జైమినిమతము.

మనము చేసిన యాగాదిరూపమగు కర్మ వెంటనే నశించిపోవుచున్నదిగదా? కాలాంతరమందు కలుగఁబోయెడు స్వర్గాదిరూప ఫలమునకు కర్మసాధన మెట్లగునని యాశంక కలుగును. కాని కర్మఫల వాదులు చెప్పు సమాధాన మేమనఁగా శ్రుతులయందు ఫలసాధనముగా కర్మను చెప్పియుండటచే దానిని నిర్వహించుటకై కర్మ తన యునికి సమయముననే స్వర్గాదిరూపమగు ఫలమును బుట్టించి నశించుననియు నా స్వర్గాదిరూపమగు ఫలమును, కర్త తాను సంపాదించుకొనిన ధనాదులను కాలాంతరమున ననుభవించునని చెప్పవచ్చుననియు నట్లు కర్మ ఫలసాధనము

విధాత్రా విహితం యద్య త్తదలంఘ్యం సురాసురైః,
. గృహభార్యపుత్త్రమిత్రభోగాస్స్యుర్మోహమూలకాః. 60

విధివిహితము తప్పించుకొనుటకు సురాసురులేని సమర్థులు కారు. గృహములు, దారాపుత్త్రులు మొదలగువారలు, మఱియు నీ సంసారమంతయు మోహమూలకము.

---

కాదనినచో యాగాదిరూపమగు కర్మ స్వర్గసాధనమను శ్రుతులకు భంగము కలుగును గాన కర్మయే ఫలసాధన మనియు, నీశ్వరునివలన ఫలము కలుగునని యంగీకరించినచో సర్వసాధారణమైన యీశ్వరుని వలన చిత్రవిచిత్రమైన ఫలము కలుగుట యసంభవ మనియు విచిత్రమైన ఫలముకూడ నీశ్వరుని వలననే కలుగు ననినచో వైషమ్యనైర్ఘృణ్యములను దోషములు (అనఁగా నొకజీవునకు సుఖము నొకజీవునకు దుఃఖము గలిగించుటచే నందఱియందు సమభావము లేకపోవుట యను వైషమ్యదోషము. నైర్ఘృణ్యమనగా నిర్దయత్వమను దోషము) ఈశ్వరునకు సంభవించును గాన తద్దోషపరిహారార్థము కర్మ ననుసరించి సుఖదుఃఖాది రూపఫలమును నీశ్వరుడు గల్పించుచున్నాడని చెప్పుకొనవలసివచ్చును. కాన నావశ్యకమగు కర్మయే ఫలజనకమని చెప్పనొప్పునుగాని యీశ్వరునితోఁ బ్రయోజనము లేదనియు జైమిని మొదలగు బూర్వపక్షుల మతము.

సిద్ధాంతమే మనఁగా, ఈశ్వరుడే సుఖదుఃఖాది ఫలములకుఁగారణ భూతుడు కాని కర్మ ఫలకారణము కానేరదు. ధనము నిచ్చువాడు, అన్నము నిచ్చువాడు పరమేశ్వరుడు అను నర్థమిచ్చు "అన్నాద"అను మొదలగు శ్రుతులవలన నీశ్వరుడే ఫలదాతయని తెలియఁబడు చుండుటవలనను సర్వశక్తులు గల పరమేశ్వరుఁడే వారువారు చేసిన కర్మలకుఁదగిన ఫలము నిచ్చుటయందు సమర్థుఁడనియు కర్మ ద్వారకముగానే ఈ ఈశ్వరుడు ఫలము నిచ్చునుగాన పైన చెప్పిన వైషమ్యనైర్ఘృణ్యదోషములు నీశ్వరున కంటవనియు, గాన నీశ్వరుఁడే ఫలదాతయనియు, నివ్విధముగ నీశ్వరునకు ఫలదాతృత్వము నంగీకరింపనిచో కుమ్మరివానిచే నధిష్ఠింపఁబడని దండము కుండలు మొదలగు వానిని జేయుట కుపయోగింపని విధముగ చేతనానధిష్ఠితమగు కర్మఫల కారణమగుటకు వలనుపడదనియు, కర్మ పూర్వమే నశించినందున ఫలజనక మనుట యుపపన్నము కాదనియు, నొకవేళ కర్మచేసిన కాలముననే కర్మ ఫలమును పుట్టించి నశించునని చెప్పెడి పక్షమునను భోక్తతో సంబంధించి ఫలమును కలిగించిన దనినచో నప్పుడే ఫలానుభము కలుగవలయుననెడి దోషము వచ్చుననియు, భోక్తతో సంబంధింపకయే కర్మ ఫలమును బుట్టించినదను పక్షమున ఫలమునకే వ్యాఘాతము వచ్చుననియు, సుఖదుఃఖములు జ్ఞాతములు కావనియు, నొకవేళ మధ్యకర్మవలన నపూర్వ మనునది (పుణ్యము) పుట్టుననియు, కర్మ నశించినను నపూర్వము నశింపదు గాన నపూర్వమును ద్వారముగా బెట్టుకొని కర్మఫలసాధన మగునని చెప్పు పక్షములోఁ బ్రమాణము లేదనియు, నొకవేళ స్వర్గాదిఫలమును గోరిన వాడు యాగరూపమగు కర్మను చేయుమని చెప్పు "స్వర్గకామో యజేత" అను శ్రుతులే ప్రమాణ మనినచో నీశ్వరుడే ధనదాతయనియు, అన్నదాత యనియు జెప్పెడి "అన్నద" అను శ్రుతికిని; ఈశ్వర ప్రసాదమువలననే మనుష్యుడు శాశ్వతపదమును బొందునని చెప్పు"మత్ప్రసాదాత్" అను గీతావాక్యమునకును విరోధము కలుగును కాన నీశ్వరప్రసాదముద్వారా కర్మఫలజనక మనుటలో ననుపపత్తి లేనందున

సుఖస్యానంతరం దుఃఖం దుఃఖ స్యానంతరం సుఖమ్,
ద్వయ మేతద్ధి జంతూనా మలంఘ్యం దినరాత్రివత్. 60

సుఖము వెనుక దుఃఖము, దుఃఖము వెనుక సుఖము - జంతువులకు నహోరాత్రములవలె గ్రమముగా వచ్చుచుండును.

ఏవం విచార్య త్వేకస్మి న్నకుర్యా న్మనుజః క్రుధమ్
మోహమయ్యాం నిశీథిన్యాం శేతే లోక స్సదానఘ.
సర్వభోగేషు వైరాగ్యం యదా స్యా జ్జాగృతి ర్భవేత్. 61½

ఆలోచింపఁగా మనుజు డెవ్వనియందును గ్రోధమును బొందవలసిన యగత్యము లేదని స్పష్టమగుచున్నది. లోకమెల్లప్పుడును మోహమను రాత్రియందు నిద్రించుచుండును. ఎప్పుడు సర్వమునందును విరక్తి కలుగునో యప్పుడు మోహమను రాత్రినుండి జనులు మేల్కొనియెదరు.

గోబ్రాహ్మణ హితార్థాయ భక్తానాం రక్షణాయ చ,
శిక్షణాయాసతాం రామో ధృతవా న్మానుషీం తనుమ్,
యోగమాయైవ సీతాఽభూ ద్దుష్టసంహారహేతవే. 61-62

ఓ మిత్రమా! మఱియొక్క రహస్యమును జెప్పెదను వినుము. గోబ్రాహ్మణులకు హితమాచరించుటకును, భక్తులను రక్షించుటకును, దుష్టులను శిక్షించుటకును శ్రీరాముడు భూమియందు మనుష్యవేషమును ధరించినాడు. సృష్టిస్థితిలయములను జేయు యోగమాయయే సీతగా నవతరించెను.

సీతారామౌ సముద్దిశ్య విచారం మాగమ స్తతః,
ఏవం రామగుణాం స్తైన వద న్రాత్రిం నినాయ సః. 63

---

నీశ్వరుడే సుఖదుఃఖాది ఫలదాత కాని కర్మ సుఖదుఃఖాదిఫలప్రదము కానేరదు అని సిద్ధాంతము. ప్రకృతమువలనఁ "గర్మయే సుఖదుఃఖాది ఫలమును గలుగఁజేయునది" అని చెప్పిన లక్ష్మణుని వాక్యమున కర్థమేమనగా, ఈశ్వర ప్రసాదము ద్వారా కర్మ సుఖ దుఃఖాదిరూపఫలమును బుట్టించునని చెప్పుటయే తదాశయమని గ్రహింపనగును.

కర్మవలన ఫలము కలుగునా, ఈశ్వరునివలన ఫలము కలుగునా? అను చర్చ సూత్రభాష్యమున"ఫలమత ఉపపత్తేః "అనెడి ఫలాధికరణమున విశేషముగ జర్చింపఁబడి తుదకు నీశ్వరునివలననే ఫలమని నిర్ధారితము చేయఁబడినది.

ఇట రాముని గూర్చిగాని, సీతను గూర్చిగాని నీవు విచారమును పెట్టుకొనకుము. ఇట్టి ప్రసంగములతో గుహలక్ష్మణు లిర్వురును రాత్రినంతయు గడపివచ్చిరి.

ఇత్యాశ్చర్య రామాయణే అయోధ్యాకాండే
ద్వితీయభాగే ద్వితీయస్సర్గః సమాప్తః
ఇట్లాశ్చర్యరామాయణమున నయోధ్యాకాండమున
ద్వితీయభాగమున రెండవ సర్గము సమాప్తము.

# తృతీయస్సర్గః - మూడవసర్గ

[1] తతః ప్రాతస్సముత్థాయ నిత్యకృత్యాని రాఘవౌ,
కృత్వా గుహాద్వటక్షీర మానాయ్యా కురుతాం జటాః. 1

ప్రాతఃకాలముననే రాముడు నిద్రనుండి మేల్కాంచి లక్ష్మణుడును, తానును నిత్యకృత్యములను నెఱవేర్చి గుహునిచేత మఱ్ఱిపాలను తెప్పించి దానిని కేశములకుఁ బట్టించుకొని జడలను ధరించిరి.

జటాధృతం రాఘవం తం దృష్ట్వా సూత శ్శుచాన్వితః,
*నేత్రాభ్యాం జలము త్సృజ్య స్పృష్ట్వా కం ప్రాహ రాఘవమ్. 2

*జటాధారియైన యారామచంద్రుని జూచి సుమంత్రుడు మిక్కిలి శోకించి కన్నుల నీరు పెట్టుకొని జలమును స్పృశించి రాముని కిట్లనెను.

వనం వో దర్శయిత్వా వో మజ్జయిత్వా నదీజలే,
సంశయం దూరతః కృత్వా సమానయ పురీం పునః.
అథవా జానకీం వాపి సమానయ పురీం ప్రతి,
ఇత్యాహ మాం పితా తేఽస్తు తథే త్యహమవాదిషమ్,
తథా కురు మహాబాహో పితుస్సంప్రీతయే ధ్రువమ్. 3-4 ½

రామా! నీ తండ్రి నీకు వనదర్శనము మాత్రము చేయించి గంగాస్నానము చేయించి సంశయములెల్లఁ గ్రమముగఁ బోఁగొట్టి మిమ్ములఁ బట్టణమునకుఁ దోడితెమ్మనియు నాతో రహస్యముగఁ జెప్పెను. నేను గూడ నట్లేయని యంగీకరించి వచ్చితిని. కావున నీ తండ్రికి సంతుష్టిని గల్గించుటకై యట్లు చేయుమనెను.

---

* అనేనాశ్రుపాతే జలస్పర్శః కర్తవ్యఇతి సూచితం. తథాహి ఆచమే దశ్రుపాతే చ లోహితస్యాపి సంభవే. ఇతి.

* ఇట "జలమును స్పృశించి " యనుటచే గన్నీరు వచ్చినపుడు జలమును స్పృశింపవలయునని సూచితము. ఇట్లే, కన్నీరు వచ్చినపుడును రక్తము వచ్చినపుడును జలమును స్పృశింపవలయునని ధర్మశాస్త్రమునందును సూచింపఁ బడినది.

---

1. కవిః

ఏతచ్ఛ్రుత్వా సుమంత్రస్య వచనం రాఘవో ఽబ్రవీత్,
మయి ప్రేమానుబంధేన తథోక్తం జనకేన మే. 5 ½

అది విని రాముడు సుమంత్రున కిట్లనియెను. నాయందలి ప్రేమానుబంధముచే నట్లు నాతండ్రి పలికెను గాని సుమంత్రా! యథార్థమును నీవాలోచింపుము.

రాజా శిబి ర్దధీచిశ్చ హరిశ్చంద్రో బలిస్తథా,
రంతిదేవః పురా సత్యపాలనార్థం బహూని వై,
దుఃఖా న్యనుభవంతిస్మ న చైకో ఽహం మహీతలే,
తథా సత్యప్రతిజ్ఞం మాం మనుథాస్త్వం సదా భువి. 6-7 ½

తొల్లి రాజాధిరాజులును చక్రవర్తులు నగు శిబి, దధీచి, హరిశ్చంద్రుఁడు, బలి, రంతిదేవుడు మొదలైన వారెందరో సత్యపాలనమునకై యెన్నెన్నియో కష్టముల ననుభవించినట్లు నీ వెఱుంగవా? యిట నేనొక్కఁడనే కష్టముల ననుభవించుచుంటినా? సుమంత్రా! పూర్వపు రాజులవలె నన్నుగూడ నీ భూమియందు సత్యమైన ప్రతిజ్ఞ కలవానినిగఁ దెలిసికొనుము.

సత్యాతిక్రమణే సూత! త్రిలోక్యా మయశో భవేత్,
శ్రేష్ఠానా మయశో లోకే శతమృత్యుసమం హి తత్. 8 ½

ఓ సుమంత్రా! సత్యమునుండి తప్పినవాఁడు ముల్లోకములయందును నపకీర్తిపాలై ముప్పుజెందును. సజ్జనుల కపకీర్తి కలుగుట యనునది శత మృత్యువులతో సమానమని తెలియుము.

త్వం తు పితృసమో లోకే హితకారీ భవానివ,
న భూత ఇత్యహం వేద్మి నిర్బంధం మా కురుష్వ మామ్,
ఇత్యుక్త్వా ఽథ మహీజాం తా మాహ రామస్త్విదం వచః 9-10

నీవు నాకు తండ్రివంటి వాడవనియు, హిత మాచరించువాడ వనియు, నీవంటి హితకారి లోకమందుండఁబోడనియు. నేనెఱుగుదును. ఇంక. నన్ను నీవు నిర్బంధమొనర్ప గూడదు అని సుమంత్రునకు నచ్చఁజెప్పి రాముడు సీతవంకఁ జూచి యామెతో నిట్లనెను.

ప్రియే! త్వం నగరం గచ్ఛే ర్యది తే శ్వశుర స్తథా,
మాతా మే నాగరాశ్చాపి తుష్యేయు ర్నగరీం వ్రజ. 11

ప్రేయసీ! నీవయోధ్యకు జనిన యెడల నీ మామయగు దశరథుడును, నాతల్లియగు కౌసల్యయు, సుమిత్రయు, మఱియు, సమస్తమైన బంధువర్గమును, పౌరులును గూడ మిక్కిలి సంతోషించెదరు. కావున నీవు నగరమున కరుగుట నాయభిమత మనియెను.

ఇత్యుక్తా జానకీ ప్రాహ రాఘవం వినయాన్వితా,
పరీక్షితుమనా స్త్వం మాం సర్వజ్ఞోఽప్యవద స్త్వితి,
త్వయా ప్రతివచో వక్తుం నోచితం నాథ! మే సదా,
తథాఽపి వచ్మి శృణుతా న్మమేదం వచనం విభో! 12-13

అని రాముడు పలుకఁగా విని సీత రామునితో తిరిగి వినయముతో నిట్లు పలికెను. నాథా! సర్వజ్ఞుడవయ్యు నీవు గూడ నిట్లు పలికెదవేమి? నన్నిట్లు పరీక్షింపదలచితివా? నీ వచనమునకు తిరుగుచెప్పుట నాకనుచితము. ఐనను, నావాక్యములను దయతో నాలకింపుము.

సూర్యచంద్ర ప్రభా భిన్నా గచ్ఛే త్కింతౌ వినా విభో,
ఛాయాశరీరం సంత్యజ్య భిన్నా భవతి కిం భువి,
తథైవ త్వాం వినా భిన్నా కథం స్థాస్యా మ్యహం వద,
ఇత్యుక్త్వా రాఘవం పశ్చా త్సుమంత్రం ప్రాహ భూమిజా. 14-15

ఆర్యపుత్రా! నీవే చెప్పుము, సూర్యుని నెడబాసి తేజస్సును, చంద్రునకు దూరమై వెన్నెలయు నెన్నఁడైన నుండగలవా? నీడ శరీరమును విడిచి యెన్నడైనను దూరముగ నుండుట సంభవమా? అట్లే నీయర్ధాంగి నగు నేను నిన్ను విడిచి యెట్లు ఒంటరినై నివసింపగలను?ఇట్లు సీత రామునితోఁ బలికి పిమ్మట సుమంత్రునితో నిట్లు పలికెను.

హేసూత శృణు సత్ప్రియా స్సుఖకరీ నాథాంతికే సంస్థితి
స్సాకేతే శ్వశుర స్స్వమాతృసదృశ శ్శ్వశ్రూజన స్సేవకాః,
కైకేయీం తు విహాయ తత్ర నిఖిలాః పుత్రీం యథా మాం పునః
పశ్యేయుశ్చ తథాఽపి నాస్తి విభునాఽయోగాత్సుఖం తత్ర మే. 16

సజ్జనశేఖరా! వినుము. పతివ్రతయగు స్త్రీకి భర్తయొక్క సమీప మందుండుటయే సౌఖ్యప్రద మైనది. అయోధ్యయందు నాకు మాతృసమానలగు కౌసల్యా మొదలైన యత్తలును, బంధువులును, సేవకులును, వేయేల, కైకేయిని విడిచి తక్కిన సాకేతనివాసు లెల్లరునుఁ గూడ నన్ను తమ పుత్రికగ చూచుకొనుచు నాదరింతురు. ఐనను నాభర్త నా సమీపమున లేనందున నాకచ్చట సౌఖ్యముండుట యసంభవము.

**కిం చ మే విపినే సౌఖ్యమృష్యాశ్రమ నిరీక్షణాత్,**
**నానామృగేక్షణాద్యత్స్యాత్తత్సాకేతే సుఖం న మే. 17**

మఱియుఁ జిత్రవిచిత్రములైన మృగములను, వృక్షములను, పక్షులను, మనోహరములై ఋషిజన సేవితములు నగు వనభూములను జూచుచు నరణ్యములందు నివసించుటకంటె నాకు సాకేతపుర నివాసము సౌఖ్యకరము కాదని యెఱుఁగుము

**పశ్చాత్సుమంత్రమాహేదం వచనం రాఘవః పునః,**
**సుమంత్ర నగరం గత్వా వద మే వచనా దిమాన్. 18**

పిమ్మట రాముడు సుమంత్రునితో నిట్లనియెను. సుమంత్ర !విన్నావు గదా? ఇంక నీవు నగరమున కరిగి యీవాక్కులనే నా తండ్రికి వినిపించి నాపలుకులుగా నీ క్రింది వారికెల్ల నిట్లు చెప్పుము

**కైకేయ్యై సముదాహర ప్రథమతో రామోఽ టవీ ప్రాప్తయే**
**దీక్షాం ప్రాప్య తతార చ త్రిపథగాం గ్రామేష్వతిష్ఠన్నితి,**
**వక్తవ్యౌ పితరౌ త్వయా మమ నతిం తూక్త్వా తతస్తౌ పున**
**ర్ధర్మార్థాత్మజ దండకానన గతిశ్శోచ్యా న హీయం త్వితి. 19**

ఓ సుమంత్రా! నీవు సాకేతపురమును జేరిన వెంటనే ముందుగా కైకతో నిట్లు చెప్పుము. రాము డరణ్యావాసమునకు దీక్షఁబూని, గంగానదిని దాటి గ్రామములను, పల్లెలను బ్రవేశింపక యడవిలో బ్రవేశించెనని.(చెప్పుము) పిమ్మట నా తల్లిదండ్రులకు నా నమస్కారములను ముందు వినిపించి ధర్మరక్షణమునకై దండక వనమున కరిగిన రాముని గూర్చి చింతింపవలదనియు చెప్పుము.

యథా దశరథో రాజా మాం న శోచే త్తథా కురు,
కైకేయీమివ కౌసల్యాం పూజయస్వేతి మేఽ నుజః,
వక్తవ్యో భరతస్సూత త్వయా మద్వచనాద్విభుః. 20 ½

సుమంత్రా! మఱచెదవు సుమా! నా తండ్రి దశరథుడు నావిషయమై శోకమేమియుఁ బెట్టుకొనని తీరునఁ జూడవలయును. కైకతో సమముగాఁ గౌసల్యనుగూడ నీవు పూజింపుమని నావచనముగా నా సోదరుడును రాజు నగు భరతునితోఁ జెప్పుము.

ఇతి రామేణ సందిష్టః సుమంత్రోఽప్యాహ రాఘవమ్,
త్వయా విరహితోఽయోధ్యాం ప్రవిశేయ మహం కథమ్,
*సేవకం తవభక్తం మాం కథం త్వం త్యక్తుమిచ్ఛసి,
ఇత్యుక్తో రాఘవః ప్రాహ సుమంత్రం సాంత్వయ న్వచః 21-22 ½

* ఇట్లాజ్ఞాపింపఁగా సుమంత్రుడు రాముని కిట్లనియెను. రామా! నీవు లేని యయోధ్యను నేనెట్లు ప్రవేశింతును? సేవకుడును భక్తుడునగు నన్ను నీ వెట్లు విడువ నిచ్ఛగించితివి? అని సుమంత్రుడు దీనవదనుడై వేడుకొనఁగా శ్రీరామచంద్రుడు వానిని బహువిధముల నోదార్చి యిట్లు చెప్పెను.

రాజ్ఞో దశరథస్య త్వం సుహృ న్మంత్రీ చ సారథిః,
త్వ దభావే పితా నూన మధికం దుఃఖ మేష్యతి,
తదనుజ్ఞాం వినాతేఽ ద్య యుక్త మాగమనం న హి. 23-24

---

* సేవకం తవభక్తమిత్యనేన సేవకోభక్తశ్చ న పరిత్యా జ్యావితి సూచితః. తథా చ భారతే భక్త సేవక శరణాగతానాం త్రయాణాం విషమేష్వపి అపరిత్యాజ్య త్వం ప్రతిపాదితం. ఏవంసతి సేవక స్సుమంత్రః కథం రాఘవేణ పరిత్యజ్యతే ఇతి చే దుచ్యతే, సుమంత్రస్య దశరథమంత్రిత్వేన తదాజ్ఞప్తిం విహాయ తస్య స్వేన నేతుమశక్యత్వాత్కించ స్వప్రవృత్తే స్తద్వారేణైవ ప్రేషయితవ్యత్వాచ్చ సముజ్ఝిత ఇత్యవిరోధః.

* "సేవకుడను, భక్తుడను నగు నన్నేల విడువ నిచ్ఛగించెదవు?" అనుటచే సేవకుడును, భక్తుడును విడువఁ దగినవారు కారని సూచిత మగుచున్నది. ఇట్లే భారతములో "భక్తులను, సేవకులను, శరణాగతులను విషమకాలములయందు గూడ విడువఁగూడదు అని చెప్పఁబడి యున్నది. అట్లే భక్తుడును, భృత్యుడునగు సుమంత్రుని రాముడేల విడచుచున్నాడు? అని ప్రశ్న రాగా సమర్థింపఁబడుచున్నది. సుమంత్రుడు దశరథుని మంత్రిగావున వాని యాజ్ఞ లేక యాతని తాను వెంటఁ గొంపోవుట ధర్మము కాదు కావునను, తన సందేశమును సుమంత్రుడే తీసికొని వెళ్లవలసి యుండటవలనను సుమంత్రు నుపేక్షించుటయైన దని తెలియఁదగును.

సుమంత్రా! నీవు మహారాజైన దశరథునకు స్నేహితుడవును, మంత్రిశేఖరుఁడవును, సారథివి గూడనై యున్నావు, కావున నీవు లేకున్న నాతండ్రి నిశ్చయముగ మిక్కిలి దుఃఖమును పొందఁగలఁడు. మఱియు, మహారాజు ననుజ్ఞలేక నాతోడ నరణ్యమునకు వచ్చుట యయుక్తము.

[1]భూయో ఽబ్రవీ ద్దాశరథి స్సుమంత్రమ్ స్పృశ న్కరేణోత్తమ దక్షిణేన,
సుమంత్ర! శీఘ్రం పునరేవ యాహి రాజ్ఞస్సకాశే భవ చాప్రమత్తః 25

మఱియు రామచంద్రుఁడు దక్షిణహస్తముతో సుమంత్రుని నిమురుచు నిట్లు పలికెను. సుమంత్రా! నీవింక చింత మాని వెంటనే నగరమున కేగుము. రాజుముందు జాగరూకుఁడవై యుండుము.

నివర్తస్వే త్యువాచైవ మేతావద్ధి కృతం మమ,
రథం విహాయ పద్భ్యాం తు గమిష్యామో మహావనమ్. 26

చనుము సుమంత్ర! మఱలి చనుము. ఇంక మేము రథప్రయాణము మాని కాలినడకనే వనమున కరిగెదము.

ఇత్యుక్త స్సుసుమంత్రో ఽపి విపులం దుఃఖ మాశ్రితః,
అయోధ్యాయాస్తు నిర్గంతుం కృచ్ఛ్రా దంగీచకార సః. 27

అనఁగా విని సుమంత్రుడు విఫలమనోరథుడై దైన్యము ముఖమునందు దోప నయోధ్య కేగుట కెట్లెట్లో యంగీకరించెను.

[2]తదానీం మహదాశ్చర్య మభూ త్తత్రవిశేషతః,
అశ్వా నేత్రజలం త్యక్త్వా ఘాసం నాదంతి వైతదా,
గుహాదయో దుఃఖితాస్తే హయ వ్యాకుల తాదృశః. 28½

అప్పుడచ్చట గొప్పయాశ్చర్యము జరిగెను. సుమంత్రుని దైన్యము చూచి రాముని రథమునకుఁ గట్టుకొని వచ్చిన గుఱ్ఱములు గడ్డిమేయుట మాని కన్నుల నీరు కార్వజొచ్చినవి. ఆ గుఱ్ఱము లట్లు దుఃఖమును వెలిబుచ్చుట జూచి యచ్చట నున్న గుహాదు లెల్లరును చాల దుఃఖించిరి.

1. వా 2. క. ||

[1]నావమానయ మే శీఘ్రం మిత్యుక్త స్సగుహస్తతః,
స్వయమేవ దృఢాం నావ మానినాయ సులక్షణామ్. 29½

పిమ్మట నావను శీఘ్రముగఁ దెమ్మని రాముడు గుహునితోఁ జెప్ప నతడు స్వయముగనే వెళ్ళి రాజులు కూర్చుండదగిన దృఢమైన నావను దెచ్చెను.

రామచంద్రం గుహః ప్రాహ ప్రాంజలి ర్వినయాన్వితః,
యద్భవత్పాదయుగళ ప్రక్షాళనవశా దహమ్.
మహోన్నతపదే తిష్ఠం తత్పాదక్షాళనం పునః,
కర్తుం దేహ్యనుజ్ఞాం రామ! ప్రసీద భగవం స్తథా. 30-31½

పిమ్మట గుహుడు వినయముతోడ రాముని సమీపించి యిట్లు ప్రార్థించెను. ఓ రామచంద్రా! పూర్వ మే నీయొక్క పాదయుగమును కడిగి నేను మహోన్నత దశ ననుభవించుచుంటినో, యాపాదములనే యిప్పుడు మఱియొక మారు ప్రక్షాళనము చేయుటకు నాకనుజ్ఞ నొసంగుము. రామా! యీ భక్తుననుగ్రహింపుము.

ఇత్యుక్తో రాఘవః ప్రాహ ప్రహస న్గుహమాదరాత్,
త్వదభీష్టం యథా తిష్ఠ త్తథా త్వం కర్తుమర్హసి. 32 ½

అని గుహుఁడు ప్రార్థింపఁగా రాముడు విని మందహాసముచేయుచు గుహుని కిట్లనియెను. గుహా! నీ యిష్టమెట్లో యటులనే కానిమ్ము. నీ యిష్టమున కడ్డము చెప్పను.

ఇత్యుక్త స్సగుహ స్సద్యో జలమాదాయ తత్క్షణమ్,
రామ పాదాబ్జయుగళం క్షాళయామాస భక్తితః. 33 ½

అనఁగా విని గుహుడు సంతుష్టాంతరంగుడై వెంటనే జలము గొని వచ్చి రాముని పాదయుగ్మమును భక్తిపరవశుఁడై చక్కగఁ గడిగెను.

యస్య నామ స్మృతేర్లోక స్సంసారాంబుధి ముత్తరేత్,
యత్పదస్య త్రయో లోకా న్యూనా స్తస్య పదే గుహః,
ప్రక్షాళ్య తజ్జలం స్వస్య స్వీయానాం చ శిరస్యలమ్.
వికీర్య తత్పాదతీర్థం పీత్వా స్వీయజనైస్సహ,
బ్రహ్మానంద మవాప్యేవ తుష్టస్తుష్టావ రాఘవమ్. 34- 36

3. అ || రా ||

ఎవ్వని నామస్మరణవలన జీవులు సంసారాంబుధిని దాటఁ గలుగుచుండిరో, ఎవ్వని పాదములకు ముల్లోకములును సాటికావో యట్టి జగత్ప్రభువగు శ్రీరామచంద్రుని పాదద్వంద్వమును గుహుడు శుభ్రముగఁ గడిగి యా పాదోదకమును తన శిరస్సునఁ జల్లుకొని స్వజనమును గూడ లోనికి త్రాగ బ్రహ్మానంద మనుభవించుచు నారాము నిట్లభినుతించెను.

**పురా రాఘవ! యత్పాదౌ ప్రక్షాళ్య జనకః! పునః,**
**ఏకోత్తరశతం చాపి కులం తారయతి స్మ వై.**
**యత్పాద రజసా రామ! శిలాస్వర్ణశరీరిణీ,**
**పురా నార్యభవత్పాదౌ ప్రక్షాళ్యాహం కృతార్థకః. 37-38**

ప్రభూ! రామచంద్రా! పూర్వ మే నీ పాదద్వంద్వమును గడిగి జనక చక్రవర్తి పునరావృత్తి రహితముగ నూటయొక్క తరముల వారి నుద్ధరించుకొనెనో, యే నీ పాదధూలివలన నడవిలో పడియున్న చత్రాతి బండ సువర్ణదేహచ్ఛాయ గల సుందరి యైనదో యట్టి నీ పాదములను ప్రక్షాళనము చేసి నేను కృతార్థుఁడనైతిని.

**వృద్ధో విద్యావిహీనోఽహం మూఢశ్చాహం రఘూత్తమ,**
**సర్వథా రక్ష మాం దేవ! మా విస్మర దయానిధే! 39**

వృద్ధుడను, చదువు రాని మూర్ఖుడను. మఱి యిట్టి నన్ను కరుణాపరుడవై రక్షించెదవో మఱచెదవో.

**జయ రాఘవ! గోవింద! జయ సర్వత్ర మాధవ!**
**ఆపన్న జనసంత్రాణ జయతా ద్భగవా న్భవాన్. 40**

ఓ రాఘవ! నీకు నమస్కార మగుఁగాక. ఓ మాధవ! నీకు దిగ్విజయము సంప్రాప్తించుగాక. ఓ ఆపదుద్ధారక! నన్ను రక్షింపుము. ఓ భగవానుడా! నన్ను మఱువకుము.

**రామ కోదండరామేతి స్వీయై ర్భజన మాచరన్,**
**నౌకాంతికం రాఘవాదీ న్నినాయ చ తతో గుహః. 41**

పిమ్మట గుహుడు తాను స్వజనులతో గూడ రామ కోదండరామ యని రామభజనము చేయుచు సీతారామ లక్ష్మణులను భక్తి విశేషముతో పడవదాపునకు తీసికొనివచ్చి మఱియు రామునితో నిట్లనియెను.

ఆరోహతు భవాన్నావం భూమిజా లక్ష్మణాన్వితః,
సంతారయేయ మద్యాహం స్వస్వీయజనాన్వితః. 42

ఓస్వామి! సీతాలక్ష్మణులతో గూడ నీవు నావ నెక్కుము. నాప్రభువగు నిన్ను నేనే స్వయముగ జ్ఞాతిజన సహాయమున నదిని దాటింతును..

ఇత్యుక్తో రాఘవ స్సద్యో నౌకా మారోప్య జానకీమ్,
గుహపాణ్యాలంబనేన నౌకాయామారురోహ సః. 43

అనఁగా విని రాముడు నట్లేయని యాదివ్యమంగళ విగ్రహ యగు సీతను మున్ముందు పడవమీది కెక్కించి గుహుని హస్తము లాధారము చేసికొని తాను గూడ నెక్కెను.

సౌమిత్రి శ్చారుహ త్పశ్చాత్ నావం తు సపరిచ్ఛదః,
తతో గుహ స్స్వీయజనైర్యుతో వాహయతి స్మ తాన్. 44

పిమ్మట లక్ష్మణుడు గూడ నాయుధముల నా నావపై నుంచి తాను గూడ నెక్కెను. అనంతరము గుహుడు తనబంధువులతో గూడి స్వయముగా పడవ నడుప మొదలిడెను.

గంగాయా మధ్యభాగం తు సంప్రాప్య జనకాత్మజా,
[1]సాంజలి ర్వినతా గంగా ప్రాహేదం వచనం తదా. 45

అప్పుడు సీత గంగను దాటుచు పడవ నగభాగమున కరిగిన వెనుక గంగానదికి నమస్కరించి యిట్లు గంగను బ్రార్థించెను.

భాగీరథి నమస్తేఽస్తు నమస్తే సాగరప్రియే!
రామో దాశరథి ర్గంగే త్వత్ప్రసాదవశత స్సుఖమ్,
పితురాజ్ఞాం పూరయిత్వా గచ్ఛతా త్స్వపురీం పునః,
పతిర్మే రాఘవో దేవి! కుశలేన సమాగతః,
అభిషిక్తో యది భవే ద్యక్ష్యే త్వాం సర్వథా త్వహమ్. 46-47½

ఓ భాగీరథి! ఓ సాగరప్రియా! ఓ జగజ్జననీ! నీకు నమస్కారము. నీయనుగ్రహము వలన నాభర్తయగు రామచంద్రుడు జనకుని యాజ్ఞను నెఱవేర్చి సుఖముగ తిరిగి యయోధ్య జేరి రాజ్యమందు బట్టాభిషిక్తు డయ్యేనేని

1. క

సర్వకాలములందు నేమరక నేను నిన్ను పూజించుకొనుచుందును. (భాగీరథీ, సాగరప్రియే! యని గంగను సంబోధించుటచే రాముడు భగీరథసగరుల వంశస్థుడే కాన నవశ్యమును రక్షింపవలసిన భారము నీయందున్నదని సూచితమగు చున్నది)

[1] వనవాసం సమాప్త్యైషః లక్ష్మణేన మయా సహ,
సమేత్య స్వపురీం భూయః కుశలే నాగతో యది.
*గవాం శతసహస్రాణి వస్త్రాణ్యన్నం చ పేశలమ్,
బ్రాహ్మణేభ్యః ప్రదాస్యామి తవప్రియచికీర్షయా. 48-49½

* ఓ గంగాదేవి! రామచంద్రుడు వనవాసము సమాప్తినొందించి నా తోడను లక్ష్మణునితోడను కుశలముగ నిల్లుచేరిన యెడల నీకు ప్రీతి కరముగ బ్రాహ్మణులకు గో సహస్రములను, వస్త్రభూషణాదులను, రుచికరములైన భోజనపదార్థములను దానము చేయఁగలను.

* అత్ర గంగే త్వత్కృపావశత - ఇత్యనేన గంగాయా అనుగ్రహకరణ సామర్థ్యం " యక్ష్యే ఇత్యనేన పూజార్హత్వం" బ్రాహ్మణేభ్యః ప్రదాస్యామి తవప్రియ చికీర్షయా, ఇత్యనేన గంగాయాః ప్రీతిమత్త్వం చ, "సాగరప్రియే. ఇత్యనేన గంగోదధిరాజయో ర్దాంపత్యం చావగమ్యతే. న న్విదం చైతన్య విగ్రహాది నియత మనుగ్రహ రక్షణ సామర్థ్య దాంపత్య ప్రీతి మత్త్వాదికం న జలాత్మికాయాః గంగాయా స్సంభవతి. జలస్య చైతన్య విగ్రహాద్యభావా దితి చేన్న. ఇంద్రాదీనాం మంత్రార్థవాదాది ప్రసిద్ధ విగ్రహాది వద్గంగాయా అపి మంత్రవర్ణేతి హాసాదిప్రసిద్ధ విగ్రహాది సంభవేన ప్రీతిమత్త్వాదీనాం సంభవాత్.

తథాహి "శివేన మా చక్షుషా పశ్య తాపశ్శివయా" ఇత్యాది మంత్రవర్ణేన, ఆదిపర్వణి శకుంతలోపాఖ్యానే శంతను ర్మృగయాం గత్వా గంగాతీరం గతః తదా "దివ్యరూపా చ సా దేవి గంగా త్రిపథగామినీ మానుషం విగ్రహం శ్రీమద్బిభ్రతీ సుమనోహరం రాజానం రమయామాస" ఇత్యాదీతిహాసేన చ ప్రసిద్ధమేవ గంగాయా రక్షణకర్తృత్వ విగ్రహాదిమత్త్వాదికమితి జ్ఞేయం. నను దేవతావిగ్రహాదీనా మేవ సకలప్రమాణవిరుద్ధత్వేన గంగాయా అపి సుతరాం తస్యా సంభవాత్ రక్షణ కర్తృత్వాదిక మనుపపన్న మేవేతి చేన్న. అత్ర మీమాంసకః ప్రష్టవ్యః విగ్రహవంతః కర్మదేవా న సంతి అథవా ఆజాన దేవా న సంతీతి నాద్యః. స్వర్గాద్యర్థతయా జ్యోతిష్టోమాది విధాన వైయర్థ్యాపత్తేః న ద్వితీయః అశరీరస్య స్వర్గాది సుఖభోగా సంభవాత్ జ్యోతిష్టోమాది విధివైయర్థ్య పరిహారాయ జ్యోతిష్టోమాదిఫలభూత స్వర్గోపభోగార్థం దేవాః విగ్రహాదిమంతః అవశ్య మభ్యుపగంతవ్యాః. ఏవం పితృదేవా అపి విగ్రహాదిమంత ఇత్యుత్తరకథాభాగే నావగమ్యతే. తథాహి- పద్మపురాణే రామభద్రేణ యోగవాప్యాం శ్రాద్ధే క్రియమాణే దశరథ తత్పితృపితా మహా స్తం దేశమాగత్య నియంత్రిత బ్రాహ్మణానాం దేహేషు స్థితా స్సృష్ట్వా శ్రాద్ధదేశా దపక్రాన్తాం సీతాందృష్ట్వా కిమర్థ మపక్రాన్తాసీతి పృష్టవంతం రామభద్రం ప్రతి సీతావచనం, శృణు త్వం నాథ యద్దృష్ట మాశ్చర్యం హి మయేదృశం పితా తవ మయా దృష్టో బ్రాహ్మణాంగేషు రాఘవ సర్వాభరణసంయుక్తౌ ద్వావాన్యౌ చ తథావిధౌ దృష్ట్వా త్రపాన్వితా చాహ మపక్రాన్తా తదంతికాత్ ఇతి.

1. వా॥ రా ॥

[1]ఏవం ప్రార్థయమానాం తాం భూమిజాం ప్రతి జాహ్నవీ,
అశరీరేణ వచసా ప్రాహ తత్కర్ణగోచరమ్. 50½

అతఏవ స్వభోగభాగాయ శరీర ముత్పాదయితు మా జ్యాద్యాహుతి ద్రవ్యేస్సూక్ష్మరూపతా మాపన్నై ర్వేష్టితో గచ్ఛతీతి రంహత్యధికరణే ప్రతిపాదితం, అత ఏవ మాతా పితృసంయోగం వినాపి సంకల్పమాత్రేణైవ అనేక శరీరపరిగ్రహణం దర్శయతి. శ్రుతిః 'స ఏకధా భవతి త్రిధా భవతి పంచధా భవతీతి' ఏవం చ యజ్ఞవాట్యాగతానా మదృశ్యత్వ మప్యణిమాద్యష్టైశ్వర్యబలా దుపపన్నం ప్రత్యక్షేణ విరుధ్యతే.

న చ ప్రవాహే సర్వైః ప్రయుక్తానాం గంగాదిపదానాం త దభిమానిదేవతా వాచకత్వం సంభవతీతి వాచ్యం. ఆదిత్యాదిశబ్దానాం జ్యోతిర్మండల ఇవ గంగాది పదానామపి ప్రవాహే లక్షణయైవ ప్రయోగ సంభవేన తద్వాచకత్వ సంభవాత్, ఏవ మేతస్మి న్గ్రంథే తత్ర తత్ర శ్రూయమాణానాం నదీ సముద్రపురీ పర్వత వనస్పతి విమానాదీనాం శ్రుతి స్మృతి పురాణేతిహాసాదిభి ర్విగ్రహాదిమత్వే నావగమాత్ సంబోధ్యత్వాదిక ముపపన్నం.

అపి చాగ్రే "తతో మధ్యాత్సముద్రస్య సాగరస్స్వయముత్థితః" ఇత్యాది, కిం చ జగన్మాత్రస్య ఈశ్వరానుప్రవేశ ప్రయుక్త చైతన్య మాదాయ సంబోధ్యత్వసంభవేన నదీసముద్ర పర్వత విమానాదీనాం సంబోధ్యత్వాదిక ముపపన్న మేవేత్యపి బోధ్య మిత్యలం శాఖాచంక్రమణేన.

* ఇట నోజగజ్జననీ: నీ యనుగ్రహము వలన ననుటచే గంగ కనుగ్రహణ శక్తియు, "నేను నిన్ను పూజించెదను" అనుటచే పూజార్హత్వమును. 'నీకు ప్రియము కలుగుటకై బ్రాహ్మణులకు దాన మీయగలను' అనుటచే గంగకుం బ్రీతి కలుగుటయును, సాగరప్రియురాలా యనుటచే గంగానదికి సముద్రమునకు దాంపత్యసంబంధమును సూచితము లగుచున్నవి. అట్టైన చైతన్య శరీర సంబంధములు గల వానికి నుండవలసిన యనుగ్రహ సామర్థ్యము, రక్షణ సామర్థ్యము, దాంపత్యము మొదలగు ధర్మములు చైతన్య శరీరాదులు లేని జలస్వరూపిణియగు గంగకు సంభవింపవని యాశంక కలుగును. అందుకు సమాధాన మీయబడు చున్నది. ఇంద్రాది దేవతలకు మంత్రములయందును, ఇతిహాసాదులయందును, ప్రసిద్ధమైన శరీరపరిగ్రహము రక్షణ సామర్థ్యము మొదలగునవి యున్నట్లు వర్ణింపఁబడిన విధముననే మంత్రములయందును, ఇతిహాసాదులయందును గంగకు శరీరపరిగ్రహాదులున్నట్లు స్పష్టపడును. ఎట్లన "ఓ జలములారా! శుభప్రదమైన మీచక్షుస్సుతో నన్ను చూడుడు. నన్ను మీ శరీరముతో స్పృశింపుడు " అను నర్థమిచ్చు "శివేన మా" అను మంత్రముచే జలమునకు గూడ శరీరపరగ్రహ ద్రష్టృత్వా నుగ్రహకరణసామర్థ్యము లున్నట్లు స్పష్టమగును. మఱియు. భారతమున, ఆదిపర్వమందలి శకుంతలోపాఖ్యానమందు గూడ గంగకు శరీరపరిగ్రహ మున్నట్లు గోచరమగుచున్నది. (ఎట్లన) "శంతనుడు వేటకరిగి గంగా తీరమందు సంచరించుచుండగా త్రిపథగామినియు, దివ్యస్వరూపిణియు నగు గంగ మనోహరమును, జగన్మోహనమునగు మానుష దేహమును ధరించి యాశంతను మహారాజును వరించి రమించెనని" - ఈ మొదలగు నితిహాసములచేతను, శరీర పరిగ్రహణము గంగకున్నట్లు స్పష్టము. ఇందుపై దేవతలకే శరీర పరిగ్రహణము ప్రమాణ విరుద్ధమని చెప్పుచుండ గంగకు మాత్రము శరీరపరిగ్రహణము మొదలగు వానిని నంగీకరింపమని కొంద రాశంకింప వచ్చును. దానికి సమాధానము చెప్పబడుచున్నది.

1 క.

ఇట్లు ప్రార్థించుచున్న సీతను గూర్చి గంగ యశరీరవాక్కుచే సీతకు మాత్రము కర్ణగోచర మగునటుల నిటులఁ బలికెను.

---

ఈవిషయమై యాశంకించువారలను ప్రశ్నింపవలసియున్నది. దేవతలకు శరీరధారణము లేదనగా కర్మ దేవతలకు లేదనియా? ఆజానదేవతలకు లేదనియా? కర్మదేవతలకు (అనగా నిచ్చట పుణ్యకర్మలు చేసి దేవత్వమును పొందినవారలకు) శరీర పరిగ్రహము లేదనినచో స్వరాదుల నపేక్షించి జ్యోతిష్టోమాది యజ్ఞములను చేయుట వ్యర్థమగునుగాన శరీరసంబంధము లేనిదీ భోగముల ననుభవించుటకు వీలు లేదు కావునను కర్మదేవతలకు శరీరపరిగ్రహమున్నదనియే యొప్పు కొనవలయును. జ్యోతిష్టోమాది యజ్ఞములను చేయుమనెడి విధుల వైయర్థ్యమును పరిహరించుటకై యాజాన దేవతలకును శరీరపరిగ్రహణ మంగీకరింపవలసియున్నది. కావుననే స్వర్గోపభోగము కొఱకై యాజ్యాద్యాహుతి ద్రవ్యములే సూక్ష్మరూపమును పొందియుండు ననియు, పిమ్మట జీవుడు వానితో గూడ స్వర్గమున కేగుననియు వ్యక్తమగుచున్నది.

మఱియు సూత్రభాష్యమున రంహత్యధికరణమునందుఁ గూడ ఈవిషయమై విచారింపబడినది. మాతాపితృసంయోగము లేకున్నను సంకల్పమాత్రముచేతనే యొక్కని కనేక శరీరపరిగ్రహణము కలదని యా క్రింది విధముగ శ్రుతి సూచించుచున్నది. "అతడొకడుగను, ఇద్దరుగను, ముగురుగను, ఐదుగురుగను, అగుచున్నాడు" అని, ఇట్లే యజ్ఞవాటికకు వచ్చిన దేవతల కదృశ్యత్వము, అణిమాద్యైశ్వర్యబలము వలన నుపపన్నమే కాన ప్రత్యక్షవిరోధము కాదు.

పద్మపురాణమందును, స్వర్గస్థులగు పితరాదులకు శరీరపరిగ్రహణ మున్నదని కూడ యీ క్రింది కథవలన స్పష్టమగును. రామచంద్రుడు యోగవాపియందు శ్రాద్ధకర్మ చేయుచుండఁగా దశరథుఁడు తన పితృపితామహులతో గన్పడగా వారలను జూచి సిగ్గుపడి యటనుండి తొలఁగి చనిన సీతను జూచి రాముడు నీ వెందుల కిచటనుండి తొలగితివని యడుగఁగా నారామచంద్రునకు సీత యిటు సమాధానము చెప్పెను. నాథా! ఆ శ్రాద్దదేశమందు నేచూచిన యాశ్చర్యమును విన్పించెదను వినుడు. ఓ రాఘవ! భోక్తలైయున్న బ్రాహ్మణుల యంగములయందు నీ తండ్రిని నేను కన్నారఁగాంచితిని. అట్టి వారిని చూచి సిగ్గుచే నే నా దేశమునుండి తొలంగితిని, అని

ప్రవాహమునందు వ్యవహరింపఁబడెడి గంగాది పదములకు తదధి దేవతలను బోధించుట యసంభవమని యనుటకు వీలులేదు. ఆదిత్యాది శబ్దములకు జ్యోతిర్మండలమునందు వలె గంగాది పదములకును, ప్రవాహమునందు లక్షణచే ప్రయోగము సంభవించును గాక తదభిమాన దేవతా వాచకత్వము గంగాదిపదములకు సంభవించుచున్నది.

ఇట్లే యీ గ్రంథమందు నచ్చటచ్చట వినబడుచున్న నదులకు, సముద్రములకు, పురములకు, పర్వతములకు,వృక్షములకును, విమానములకును సంబోధనము, శరీరపరిగ్రహణము, మొదలగునవి శ్రుతి స్మృతీతిహాసపురా ణాదులవలన వ్యక్తమగుచున్నవి. కాబట్టి సీత ప్రవాహాధిదేవతయగు గంగను సంబోధించి ప్రార్థించుట మొదలగునవి యుపపన్నము లగుచున్నవి.

మఱియు, యుద్ధకాండమందును"సముద్రమధ్యమునుండి సముద్రాధి దేవతయగు సముద్రుడు శరీరధారియై ప్రత్యక్షమయ్యెను."

ఈ మొదలగు సందర్భములచేతను నదీసముద్రాదులకు శరీరపరిగ్రహము స్పష్టమగుచున్నది. ఇదియునుం గాక జగత్తునందంతట నీశ్వరచైతన్యము వ్యాపించియుండుటచే గూడ నా చైతన్యమును బురస్కరించుకొని కూడ నదీ సముద్ర పర్వతాదులయందును భగవచ్చైతన్య ముండుటచే సంబోధించుట, స్తుతించుట, ధ్యానించుట లుపపన్నములు గూడఁగా వచ్చును.

త్వత్ప్రభావం తు జానీయా ద్భువిపూర్ణం జనస్తు కః,
లోకాశ్చ లోకపాలాశ్చ త్వద్దృష్ట్యా జీవితాః పునః.
సిద్ధయోపిహి తే సేవాం కుర్వంతి సతతం పునః,
స్తోషిత్వం గౌరవం దాతుం భూమిజే మమ సాంప్రతమ్.
పతి దేవర సంయుక్తా కుశలే నాగమిష్యసి,
*ఇతి త్రిలోక పావన్యా వచశ్శ్రుత్వా ముమోద సా. 51-53½

ఓ జగజ్జననీ! జానకీ! యీ భూమియందు నీ ప్రాభవమును, సంపూర్ణముగ నెవ్వఁడెఱుంగఁగలడు? ఈ లోకములు, లోకపాలకులు గూడ నీ చల్లని దృష్టి చేతనే జీవించుచుండిరి. అణిమాదిసిద్ధులెల్లరు నెల్లప్పుడును నీ సేవ చేయుచుందురు. ఇట్లుండ నీవు నన్ను స్తుతించుట యనునది నాకు గౌరవ మొసంగుటకే యని తలంచెదను. నీ భర్తతోడను మఱదితోడను నీవు తిరిగి సుఖముగా నగరమునకు రాగలవు. ఇట్లు* పరమపావనియగు గంగ యశరీర

* త్రిలోక పావన్యా ఇతి. గంగామాహాత్మ్యం బహుధా బహుభిః వర్ణితం -
ఇదం హి గాంగం త్యజతా మిహాంగం పునర్నచాంగం యది చాంగమేతి!
కరే రథాంగం శయనే భుజంగం యానే విహంగం చరణే చ గాంగం.
కదాచి న్నాగారి స్సురతటిని వీథీషు విచరన్
సమాకృష్య వ్యాళం సకలమగిల త్కంచన బిలాత్|
చతుర్బాహు ర్భూత్వా తదుపరిలస ద్బాహువసనో
గతో విష్ణో ర్లోకం తవ జనని తీరస్య మహిమా.
వాల్మీకినాప్యుక్తం- త్వత్తీరే తరుకోటరాంతర గతో గంగే విహంగో వరం
త్వన్నీ రే నరకాంత కారిణీ వరం మత్స్యోఽథవా కచ్ఛపః ఇతి.

* పరమపావనియగు గంగ యనుటచే గంగామాహాత్మ్యము కొంచె మిచట వ్రాయబడుచున్నది. ఈ గంగ యొక్క మాహాత్మ్యమును ననేక కవులనేక విధములుగ వర్ణించిరి. (ఎట్లన)

ఈ గంగాతీరమున శరీరమును విడిచిన వారలకుఁ దిరిగి జన్మయే యుండదు. ఒక పక్షమునఁ దిరిగి శరీరము కలిగినను చేతియందు చక్రము, శేషశయ్యను గరుడవాహనమున్ను, పాదతలమున గంగయును గల దివ్యశరీరము గలవాడగును, అని

మఱియు నొక్కచో నిటుల గంగామాహాత్మ్యము వర్ణింపఁబడినది. ఒకప్పుడు గరుత్మంతుడు ఒక కన్నము నుండి ఒక సర్పమును బట్టి లాగి నోటకఱచుకొని తినుచు గంగకుఁ బైభాగమునుండి గగనమార్గమునఁ బోవుచుండగా గరుత్మంతుని నోటినుండి సర్పముయొక్క బొమిక జారి గంగాజలములోఁబడెను. వెంటనే యామృతి నొందిన సర్పమునకు వైకుంఠము నుండి విమానము రాగా నా సర్పము చతుర్బాహువులు కలిగి పీతాంబరధారియైన దివ్యరూపమును ధరించి వైకుంఠమునకు విమానముతో వెళ్ళెను. ఓ గంగాదేవి! నీ తీరముయొక్క మహిమను నెవడు వర్ణింపఁగలడని, (యొక కవి వర్ణించెను.)

వాల్మీకి యీక్రింది విధముగ గంగామాహాత్మ్యమును వర్ణించెను. ఓ గంగాదేవి! నీ తీరమునందు చెట్టుతొఱ్ఱలో నుండెడి పక్షిగాఁ బుట్టుటయైనను శ్రేష్ఠము. మఱియు సకల పాపహారియగు నీనీటిలోమత్స్యముగాఁ బుట్టుటయైన గూడ శ్రేష్ఠమే యని (వర్ణించెను.).

వాక్కుతో సీతకు మాత్రము కర్ణగోచర మగునట్లు బ్రత్యుత్తర మీయఁగ జానకియు వని మిక్కిలి సంతోషించెను.

[1] సర్వేఽప్యుత్తరణం చక్రుర్గంగాయాః పారమేత్య తే,
గుహోఽపి రాఘవం ప్రాహ గమిష్యామి త్వయా సహ,
అనుజ్ఞాం దేహి రాజేంద్ర నోచే త్ప్రాణాం స్త్యజామ్యహమ్,
శ్రుత్వా నైషాదవచనం శ్రీరామ స్తమథాబ్రవీత్. 54-55 ½

ఇంతలో పడవ యవ్వలియొడ్డున చేరెను. పిమ్మట పడవలోని వారంగరును గట్టున దిగిరి. అనంతరము గుహుఁడు వినయమున రాముని సన్నిధి జేరి 'రామా! నేను నీతో గూడ నరణ్యమున కేతేర ననుజ్ఞ నొసంగుము. అట్లనుజ్ఞ నొసంగవేని నేనింక జీవింపఁజాలను' ఇట్లు పలుకుచున్న గుహుని వచనము విని రాముడు తిరిగి యిట్లు పలికెను.

చతుర్దశ సమాస్థిత్వా దండకే పున రప్యహమ్,
ఆయాస్యా మ్యుదితం సత్యం నాసత్యం రామభాషితమ్. 56 ½

గుహా! ఈ పదునాలుగేడులును పదునాలుగు నిమిషములవలె దండకావనమందు గడిపి పుచ్చి తిరిగి వెంటనే రాఁగలను. ఇది సత్యము. రామభాషిత మసత్యము గాదు సుమా!

ఇత్యుక్త్వాఽఽలింగ్య తం భక్తం సమాశ్వాస్య పునః పునః,
నివర్తయామాస గుహ స్సోఽపి కృచ్ఛ్రా ద్వినిర్గతః,
పున స్స్వనగరం ప్రాప్య సుమంత్ర స్యాంతికం యయౌ. 57-58

అని పలికి మహాభక్తుఁడైన గుహు నాలింగనము చేసికొని పలు విధముల నోదార్చి యోదార్చి పురమునకు వీడుకొలిపెను. గుహుడుగూడ నెట్టెట్లో మఱలి మాటిమాటికి వెనుక తిరిగి చూచుచు శృంగిబేర పురాభిముఖుడై తన జ్ఞాతిజనముతో మఱలి చని సుమంత్రుని తిరిగి కలిసికొనెను.

ఇత్యాశ్చర్య రామాయణే అయోధ్యాకాండే
ద్వితీయభాగే తృతీయ స్సర్గః సమాప్తః
ఇట్లాశ్చర్యరామాయణమున నయోధ్యాకాండమున
ద్వితీయభాగమున మూడవ సర్గము సమాప్తము.

1. అ ॥ రా ॥

# చతుర్థ స్సర్గః - నాల్గవ సర్గ

[1] అథా ఽబ్రవీన్మహాబాహుస్సుమిత్రానందవర్ధనమ్,
భవ సంరక్షణార్థాయ సజనే విజనేఽపి వా. 1

పిమ్మట శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో నిట్లు చెప్పెను. జనులు లేని ప్రదేశమందుగాని, జనులున్న ప్రదేశమందుగాని నీవు సీతారక్షణమున జాగరూకుఁడవై యుండవలయును సుమా!

అవశ్యం రక్షణం కార్య మదృష్టే విజనే వనే,
అగ్రతో గచ్ఛ సౌమిత్రే! సీతా త్వా మనుగచ్ఛతు.
పృష్ఠతోఽహం గమిష్యామి త్వాం చ సీతాం చ పాలయన్,
అన్యోన్య స్యేహ నో రక్షా కర్తవ్యా పురుషర్షభ!. 2-3

ఎన్నడును పరిచయము లేని, జనసంచారములేని యీ యరణ్యభూము లందు సీతను తప్పని సరిగా రక్షింపవలయును. కావున నీవు ముందు నడువుము. సీత నిన్ననుసరించి రాగలదు. ఆవెనుక నేను గూడ నిన్నును సీతను గూడ రక్షించుచు రాగలను. ఈ నిర్జనవనమందు మనము జాగ్రత్తతో నొక్కరి నొకరము రక్షించుకొనుచు మెలంగ వలయును.

[2] ఇత్యుక్త్వా రాఘవ స్సద్య స్సీతాలక్ష్మణ సంయుతః,
వినిర్గత్య చర స్పద్భ్యాం కించిద్దూరం గతో జవాత్. 4

ఇట్లు రాముడు లక్ష్మణునితో ఁజెప్పి వెంటనే సీతాలక్ష్మణసమేతుడై బయలుదేరి కాలినడకతోఁ గొంచెము దూరము ప్రయాణము చేసెను.

[3] శిరీషమృద్వీ సా సీతా కించిద్దూరం గతా జవాత్,
గంతవ్యం కియద స్తీతి పృచ్ఛతీ రాఘవం శ్రమాత్,
రామాశ్రుణః కృతవతీ చాద్యావతరణం హ్యభూత్. 5½

దిరిసెనపూవువలె మృదువైన దేహము గల యాసీత వడివడిగఁ గొంతదూరము నడిచి యలసి నిట్టూర్పులు విడుచుచు "నాథా! మనమింక నెంతదూరము పోవలసియున్నది." అని రామునిఁ బ్రశ్నించుచు రామునకుఁ

1. వా ‖ రా ‖ 2. కవిః ‖ 3. కవిః ‖

గన్నుల నీరు గ్రమ్ముునట్లు చేసెను (అనగా సీతావాక్యము వినుట తోడనే రామునకుఁ గన్నులవెంట నీరుకారెనని భావము.)

**ఇతః పరం పదం చైకం గంతుం నాహ మలం త్వితి,**
**ఉపవిష్టా భవ త్సీతా దృష్ట్వా తాం రాఘవః ప్రియామ్,**
**సుదుఃఖితమనా స్సద్యః ప్రాహేదం లక్ష్మణం వచః. 6-7**

ఇంతవరకెట్లో నడచి వచ్చితిని గాని యింక నొక్క యడుగైననుఁ బెట్ట జాలను అని సీత యనుచు నొకచోట చతికిలబడి కూర్చుండెను. ఇట్టి స్థితిలో నున్న తన ప్రేయసిని రాముడు చూచి మిక్కిలి చింతపడి లక్ష్మణునితో నిటులఁ బల్కెను.

**సౌమిత్రే! భూమిజా నూనం ప్రాప్తు మేవం విధాం శుచమ్,**
**పరిణీతవతీ మాం వై నిర్భాగ్యజన శేఖరమ్. 8**

లక్ష్మణా! పాప మీ భూపుత్రి యిట్టి కష్టముల ననుభవించుటకే కాబోలు దౌర్భాగ్య దామోదరుడనగు నన్నుఁ జేపట్టినది.

**ఉచ్ఛూనే పదకంజే ద్వే మధ్యం చాస్యాః ప్రకంపతే,**
**స్వనూపుర సమీకారవ్యాజా న్మధ్యే స్థితా సతీ,**
**శ్రమం న దర్శయ త్యేషా కింకుర్యా మద్య లక్ష్మణ. 9 ½**

లక్ష్మణా! పద్మములవలె మెత్తనైన సీతపాదములు ఎట్లు కంది పోయినవో చూడుము, నడుము వడకుచున్నది. తన కాలియందెలను సవరించుకొను నెపముతో మధ్య మధ్య నిలువబడుచుఁ దనశ్రమను సీత కప్పిపుచ్చుచున్నట్లు తోచుచున్నది. ఏమి చేయుదును?

**శ్రుత్వా మే వచనం గేహే స్థితా చే దీదృశీం శుచమ్,**
**సంప్రాప్తా న భవే దేషా కరణీయం కిమద్య నౌ. 10 ½**

నా మాట విని సీత కష్టమో నిష్ఠురమో యింటియందే యున్నయెడల నిట్టి సంకటములు తటస్థింపకుండెడివిగదా? ఈ సీత యిచ్చటనుండి నడువలేకున్న మనము చేయునదేమి?

**స్వపాద సంవిద్ధ సుకంటకాదీ న్సముద్ధరంతీ చ పదేపదేఽపి.**
**సీతా స్ఖలంతీ చ తరో రధస్తా త్స్థితా ప్రయాతుం క్షమతే న చైషా.11 ½**

అడుగడుగునకు నరికాళ్ళకు గ్రుచ్చుకొనుచున్న ముండ్లను సీత్కారములతో బెఱికివైచుచు, మాటిమాటికి తూలిపోవుచు నడువలేక నడువలేక యీ చెట్టునీడను చతికిలబడినది. ఇంక ప్రయాణము. చేయుటకు జానకికి శక్తిజాలదు.

అన్యత్ర భార్యయా సాకం నిర్గతో మానవః పునః,
కష్టమాప్నోతి సౌమిత్రే! యథా జ్వరచికిత్సకః,
శ్లేష కావ్యస్య క ర్తేవ లుబ్ధస్త్రీసంస్పృతి ర్యథా,
వాయుప్రకోపే సింధుస్థా నౌరివాయం ససంశయః. 12-13½

ఓ లక్ష్మణా! పరదేశమునకు భార్యతోఁ బ్రయాణము చేయు వరుడు, సన్నిపాతరోగికి మందిచ్చు వైద్యుడువలె, శ్లేషకావ్యమును రచించు కవీశ్వరుని విధముగ, దురాశాపీడితురాలగు భార్యతో సంసారముచేయు పురుషుడువలె తుపాను కొట్టినపుడు సముద్రములోని నావవిధముగ కష్టముల పాలగును.

ఇత్యుక్త్వా లక్ష్మణం పశ్చాద్భూమిజా మాహ రాఘవః,
ఆదా వేవ కృశాంగీ త్వం నమ్రా వక్షోజభారతః,
లీలాగతిం న సహసే ఖిన్నాభూ ర్డోలికావిధౌ,
ఏషా త్వం కంటకాకీర్ణా న్భూభాగా న్సంచరేః కథమ్. 14-15½

ఈ ప్రకారముగ లక్ష్మణునితోఁ జెప్పి పిమ్మట శ్రీరామచంద్రమూర్తి సీతతో నిటుల బలికెను. ప్రేయసి! అసలే నీవోపిక లేనిదానవు. పట్టణమం దప్పుడప్పుడు చేయు నుద్యానవన విహారములకే యలసి పోయెడిదానవు. గట్టిగా బంగరపు తూగుటుయ్యేలలో నూగుటకైన నోపలేకపోయెడిదానవు. అట్టి నీవు ముండ్లతుప్పులతో నిండియున్న యీ యరణ్య భూభాగములం దెట్లు సంచరింపగలవు?

ఇత్యుక్తా భూమిజా ప్రాహ వ్యాజేనైవం రఘూత్తమమ్,
నాథ! కంటక ముద్ధర్తుం పాదవిద్ధమహం పునః,
ఉపవిష్టాఽభవం నూనం గంతుం శక్తా భవామ్యహమ్. 16-17

ఇట్లు శ్రీరాముడు పలుకగా విని సీత తన శ్రమను గప్పిపుచ్చు నెపమున రామునితో నిట్లనెను. నాథా! కాలియందు గ్రుచ్చుకొనిన ముండ్లను బెకలించుకొనుట కిచ్చటఁ గూర్చుంటిని, కాని నడువలేక కాదు.

ఇత్యుక్త్వా భూమిజా సద్య స్తూత్థాయ జనకాత్మజా,
ఆత్మశ్రమం ఛాదయంతీ గమనా యోపచక్రమే.
జ్ఞాత్వా సత్యం రాఘవో ఽపి ప్రార్థయామాస వై మహీమ్. 18 ½

ఇట్లనుచు సీత తటాలున లేచి తన మార్గశ్రమమును గప్పిపుచ్చుచు తిరిగి వేగముగ నడువసాగెను. రాముడు మాత్రమందలి సత్యమును నెఱిగినవాడు, గాన సీతకు శ్రమ కలుగకుండ జేయుటకై భూదేవిని నీ క్రింది విధముగఁ బ్రార్థించెను.

[1]అరుణదళనళిన్యాస్స్నిగ్ధ పాదారవిందా
కఠినతనుధరణ్యాం, యాత్యకస్మాత్ఖ్సలన్తీ,
అవని తవ సుతేయం పాదవిన్యాసదేశే త్యజ
నిజకఠినత్వం జానకీ యాత్యరణ్యామ్ 19½

ఓ భూదేవి! ఎఱ్ఱతామరలవలె మిక్కిలి కోమలములైన పాదములు గల నీ పుత్రికయగు సీత కఠినమైన యీ యరణ్యా భూభాగమున నడువజాలక తూలుచు సోలుచు నడచుచున్నది. కావున నీ పుత్త్రికావాత్సల్యము వ్యక్త మగునట్లు సీత యడుగులు మోపుచోట నీ స్వతస్సిద్ధమైన కాఠిన్యమును విడిచి మెత్తగా నుండుమని ప్రార్థించుచున్నాను,

[2]ఇతి రామప్రార్థితా సా సుమతల్పనిభా ఽభవత్,
స్వసుతాపాద విన్యాసదేశే భూః కరుణాయుతా. 20 ½

ఇట్లు రాముడు ప్రార్థింపగనే యది యేమి చిత్రమో సీతకు ముండ్ల తుప్పలతో నిండి కఠినమైన యరణ్యభూమి మెత్తని పుష్ప శయ్యవలె మారిపోయెను (ఇదియెల్ల భూదేవికిఁ దన కూతురునందలి కరుణా విశేషమనియే యూహింపనగు.)

[3]పథి పథికవధూభి స్సాదరం పృచ్ఛ్యమానా
కువలయదళ నీలః కో ఽయ మార్యే తవేతి!
స్మితవికసిత గండం వ్రీడ విభ్రాంత నేత్రం
ముఖ మవనమయంతీ స్పష్ట మాచష్ట సీతా 21½

1. హ || రా || 2. కవిః || 3. హ || రా ||

భూదేవియనుగ్రహ విశేషమున ననాయాసముగ నడచుచున్న తరుణీమతల్లియగు సీతకు మధ్యమార్గమున పాంథస్త్రీలు కొందఱు కన్పడి ప్రేమలొలుకు దృష్టులతో నాదరించి "అమ్మా! నల్లకలువలవంటి దేహకాంతి గల యీ సుకుమారుడెవడమ్మా! ఈతడు నీకేమి కావలయును" అని సీత నడుగగా సీతయు సిగ్గుచే నటించుచు ముసిముసి నగవు కలదియై కనుసంజ్ఞతో నతడు తన భర్తయని వారలకు స్పష్టపడునట్లు సూచించెను.

[1]మధ్యే మార్గం పాంథనార్య స్సీతాం వీక్ష్య పదాతినీమ్,
సుకుమారాం బాష్పవారి ముక్త్వా ప్రాహు రిదం వచః. 22 ½

మఱికొంత దూరమేగిన పిదప మఱికొందరు పాంథ స్త్రీలు (బాటసారులైన స్త్రీలు) కఠోరమయిన యరణ్య భాగమునఁ బాదచారిణియు సుకుమారియు నగు సీతను జూచి కన్నుల నీరుపెట్టుకొనుచు సీతతో నిట్లనిరి.

త్వత్పాదే కుశకంటకా ద్యభిహతి స్స్యాన్మందత స్సంచర,
సోఢుం చాతప మక్ష మాత్రభవతీ మూర్ధ్న్యంబరం నిక్షిప,
శైలీ స్యా త్పదయో ర్హతిస్తు సుభగే చోద్ధృత్య పాదౌ చర,
లగ్నం స్యాదమలాంబరం తవ శుభే శాఖాసు దూరం వ్రజ. 23½

తల్లీ! నీ పాదములు మిక్కిలి కోమలములుగా నున్నవి. మఱి యీ యరణ్యమో కంటకాదులచే నిండియున్నది. కాన కుశకంట కాదులు పాదములకు గ్రుచ్చుకొనకుండ మెల్లగా జాగ్రత్తగా నడిచి వెళ్ళుము. ఎండగూడ చాల నెక్కువగ నున్నది. ఈ యెండ నీ వోర్వలేవు సుమా! ఎండకుఁగొంగైన నడ్డము పెట్టుకొనుము. తల్లీ! పాదములకు రాళ్ళ దెబ్బలు తగులును గాన పాదము లెత్తివైచుచు నడువుము. చెట్లకొమ్మలకు పమిటిచెంగు పట్టుకొనును గాన నట్లు తగలకుండ దూరదూరముగ తొలగి చనుము.

అహో త్వత్సదృశీ కాంతా శ్రమమేతం సహేత కా,
ఇతి పాంథస్త్రియో ఽక్షిభ్యాం వవర్షు ర్బాష్పవారి హా. 24 ½

అబ్బ! యెంతటి శాంతమూర్తివమ్మా! నీవంటి మఱియొక కాంత యిట్టి శ్రమ నోర్వగలదా! ఇట్లు తమకుఁ దోచిన విధముగ సీతకు నుపాయములను జెప్పుచుఁ బాదసంచారమును గూర్చి పాంథస్త్రీలు విచారపడు చుండిరి.

ఇత్యేవం పాంథనారీభిః పరామృష్టా మహీసుతా,
తాసాం ప్రియవచాంస్యుక్త్వా మోదయంతీ గతా ఽభవత్. 25 ½

1. కవిః

ఇవ్విధముగ సీత పాంథస్త్రీలచేఁ బరామర్శ చేయబడుచు వారలను ప్రియమైన మాటలతో సంతోషపెట్టుచు నడచుచుండెను.

**రాఘవాద్యా స్త్రయ స్త్వేవం చరంతః పాదచారతః,**
**క్రమా ద్బహూ న్మహీ భాగాం స్తీర్త్వా *వత్సా నుపాగతాః. 26½**

ఇట్లు సీతారామలక్ష్మణులు ముగ్వురును కాలినడకతో బ్రయాణము చేయుచు మెల్లమెల్లగ ననేక ప్రదేశములను దాటి సాయంకాలమునకు *వత్సదేశమునకు జేరిరి.

**తత్ర మేధ్యా న్మృగా న్హత్వా పక్త్వా భుక్త్వా తత్ర త్రయః,**
***వనస్పతే రథ స్తస్యాం నిశి స్థాతుం త్వనిర్ణయన్. 27 ½**

---

*వత్సానితి - వత్సాన్ వత్సదేశాన్, వాల్మీకిరామాయణే అయోధ్యాకాండే ద్విపంచాశత్సర్గే అంత్యశ్లోకే గోవిందరాజ వ్యాఖ్యానే వత్సదేశాదివ్యవస్థా ప్రతిపాదితా గంగా యమునయో ర్మధ్యే ప్రయాగ ప్రదేశో వత్సదేశః తతః పశ్చిమభాగే పాంచాలః (పంజాబు) యమునాదక్షిణతీరే శూరసేనదేశః తస్మా త్పశ్చిమతో మత్స్యదేశ ఇతి.

* వత్సదేశనిర్ణయము - వాల్మీకి రామాయణమునం దయోధ్యాకాండలో నేబదిరెండవ సర్గయందలి తుది శ్లోకమందు గోవిందరాజ వ్యాఖ్యానమున వత్సదేశాది నిర్ణయమిట్లు కనఁబడుచున్నది. గంగా నదికి యమునానదికిని మధ్యభాగమగు ప్రయాగప్రదేశమునకు వత్సదేశమనియు దానికి పడమటనున్న దేశమునకు శూరసేనదేశ మనియు, దానికి పశ్చిమభాగమున నున్న భూమికి మత్స్యదేశ మనియు (వ్యవస్థ చేయఁబడి యున్నది.)

* అత్రేదం చింత్యం, ఉద్దిష్టపట్టాభిషేకం పూర్వదినే తు రామస్యోపవాసః పట్టాభిషేకదినే రాత్రౌ తమసానదీజలపాన మాత్రం, తతః గంగాతీరే గంగాజలపానం వననిర్గమన దివసాత్తృతీయదివసేఽస్మిన్నేతావదపి భోజనం నాస్తి తస్మాద్దినత్రయ మారభ్యోపవసితత్వాద్రామస్య క్షుదతిరేకా త్ఫలా ద్యసంభవేన చాపద్ధర్మత్వేన మృగమాంసభోజనం రామేణ కృత మితిజ్ఞేయం, నోచేదిదం మృగహననాదికం శ్రీరామస్వభావస్య విరుద్ధమేవ భవేదితి మంతవ్య వస్తుతస్తు "పంచపంచ నఖా భక్ష్యా" ఇతి ధర్మశాస్త్రవచన పర్యాలోచనయా పంచనఖజంతు మాంసభోజనస్య పూర్వయుగేషు శాస్త్రతోప్యనిషిద్ధత్వా ద్రామేణ తథా కృతమపి న దోషావహ మితి జ్ఞేయం.

* పట్టాభిషేక పూర్వదినమునకుఁ బూర్వరాత్రి యుపవాసము, అభిషేకదిన మంతయు నుపవాసము, ఆ రాత్రి తమసానదీజలము మాత్రము త్రాగిరి. పిమ్మట గంగాతీరమున గంగను త్రాగిరి. ఈ దినమింత పర్యంతము భోజనము లేదు మూఁడు దినములనుండి యుపవాసములతో నున్నట్లు తోచుచున్నది. కావునను ఫలాదులు సంభవింపనందునను ఆపద్ధర్మము ననుసరించి మృగమాంసము రాముడు భుజించెనని యెఱుగదగును. లేనిచో రాముని స్వభావమున కిది విరుద్ధముగ గన్పట్టునని తెలియవలయును. వాస్తవికముగ విచారించినచో పూర్వయుగములయందు, "అయిదుగోళ్లుగల జంతువుల మాంసమును భుజింపవచ్చును" అను ధర్మశాస్త్రవచనమును విచారించిన దోషము లేనందునను కూడ రామునిచే జేయబడిన మృగమాంస భోజనము దోషావహము కానేరదని యెఱుగదగును.

*పిమ్మట నచ్చట నొక వృక్షముక్రింద జేరిరి. కొన్ని మృగములను వేటాడి వాని మాంసమును వండుకొని భుజించి సీతారామలక్ష్మణులు ముగ్గురును నాటి రాత్రి యా వృక్షము క్రింద కాలము గడుప నిశ్చయించుకొనిరి.

సాయంసంధ్యా ముపాస్యాథ రాఘవః ప్రాహ లక్ష్మణమ్,
ధ్రువమద్య మహారాజో దుఃఖం స్వపితి లక్ష్మణ,
[1]కృతకామాతు కైకేయీ తుష్టా భవితు మర్హతి. **28-29**

సాయంకాలపు సంధ్యాది కాలకృత్యములైన వెనుక రాముడు లక్ష్మణునితో నిట్లనెను. తమ్ముడా! లక్ష్మణా! మనతండ్రి దశథు డీసమయమున,"నాకొడుకు అడవులలో దుఃఖపడుచు నేమయ్యెనో గదా" యని దుఃఖముతో నేలకఱచుకొని పరుండియుండును. ఇది సత్యము.

ఇక కైకయో తన కోరిక నెఱవేఱెనుగదా యని కులుకుచు నిక చెప్పవలసిన దేమి? కేవలము సంతోషవారాశియందు తూగులాడు చుండును.

సా హి దేవీ మహారాజం కైకేయీ రాజ్యకారణాత్,
అపి, నచ్యావయే త్ప్రాణాన్ దృష్ట్వా భరత మాగతమ్. **30**

ఆ మహారాణియైన కైక తన ముద్దులకొడుకైన భరతుడు మఱలి రాగానే నాకొడుకు యువరాజుగా నుండనేల? ఈ ముసలివాడు రాజుగా నుండు పర్యంతము నాపుత్త్రుడు మహారాజు కానేరడనియు, ఇప్పుడితడు చచ్చినచో నా పుత్త్రుడు మహారాజగు ననియు నాలోచించి రాజ్యము నిమిత్తము, మన తండ్రియు, మహారాజునగు దశరథుని జంపదు గదా!

---

* అనేన కేవలకామాసక్తి ర్నకర్తవ్యేతి సూచితం. తథా చ వనపర్వణి-యశ్చ ధర్మం చ కామార్థం నేతరార్థేషు తిష్ఠతి. మిత్రాణి తస్య నశ్యంతి ధర్మార్థాభ్యాం చ హీయతే ఇతి. న న్వత్ర కైకేయ్యాసక్తహృదయో ధర్మార్థా వనపేక్ష్య కామవశాదేవ పుత్రం పరిత్యక్త వానితి రామేణావగమ్యతే. తదనుపపన్నం ధర్మశీలేన వృద్ధోஉస్మీతి దశరథవచన పర్యాలోచనయా, పితరం సత్య మిచ్ఛామీతి రామవచన పర్యాలోచనయా చ పూర్వ ప్రదత్త వరనిర్వాహణరూప ధర్మార్థమేవ రామ వివాసనేన కామప్రయుక్తత్వాభావా దితిచే త్సత్యం యుద్ధార్థం గమనసమయే కైకేయీ విశేషాసహిష్ణునా రాజ్ఞా యుద్ధభూమ్యాం కైకేయీనయనం కామప్రయుక్త మేవేతి తన్మూలకవర ప్రదాన తత్పరిపాలనాదికం సర్వమపి పారంపర్యేణ కామమూలకమేవేతి రామేణోక్తమితి న విరోధః

* ఇందుచే కేవలము కామాసక్తి కూడదని సూచిత మగుచున్నది. వన పర్వమునందును నివ్విధముగఁ జెప్పబడినది. ఎవ్వడు ధర్మమును కామము కొఱకే యనుష్ఠించునో, యితరమునకై యనుష్ఠింపడో యతనికి మిత్రులు నశింతురనియు ధర్మార్థములచే నతడు రహితుఁ డగుననియుఁ

---

1. వా. రా.

* అర్థధర్మౌ పరిత్యజ్య యః కామ మనువర్తతే,
ఏవ మాపద్యతే క్షిప్రం రాజా దశరథో యథా! 31

* అయిన నొకని నని యేమిలాభము. నిజమునకు ధర్మార్థ కామములను పురుషార్థములలో నిహపర సాధనములగు ధర్మమును అర్థమును విడిచి యెవ్వడు కామమును మాత్రమే సేవించుచుండునో, యతడు దశరథుని వలె గష్టముల పాలు కాగలడు.

మన్యే దశరథాంతాయ మమ ప్రవ్రాజనాయ చ,
కైకేయీ సౌమ్య సంప్రాప్తా రాజ్యాయ భరతస్య చ. 32

మఱియు దశరథుని చావునకును, నన్నడవులపాలు చేయుటకును, తన కొడుకునకు రాజ్యము లభింపజేయుటకు, కైక మనకు దాపురించెను.

కౌసల్యాం చ సుమిత్రాం చ సా ప్రబాధేత మత్కృతే,
*క్షుద్రకర్మాహి కైకేయీ ద్వేష్య మన్యాయ్య మాచరేత్.
తస్మాదిత స్త్వయోధ్యాం త్వం సౌమిత్రే, గంతు మర్హసి. 33½

---

(జెప్పఁబడెను) ఇచ్చట, దశరథుడు కైకేయ్యాసక్తహృదయుడై ధర్మార్థముల నపేక్షింపక కామవశము వలననే పుత్రునిఁ బరిత్యజించెనని రామవాక్యము వలన గోచరమగుచున్నది. కాని యిది యుపపన్నముగా లేదు. " ధర్మము నాచరించుచునే నేను పెద్దవాడ నైతిని" అను లోగడ దశరథ వచనము నాలోచించినను, "తండ్రిని సత్యవంతునిగా జేయ నిచ్ఛయించితి" నని పూర్వము చెప్పిన రాముని వాక్యము నాలోచించినను పూర్వమునం దీయబడిన వరములను నిర్వహించుట రూపమగు ధర్మార్థమే రామ వనవాసమనియు, కామ ప్రయుక్తమైనది కాదనియుఁ దేలుచుండఁగా గామవశముచే దశరథుడు పుత్రుని వెడలగొట్టెనని రాముడు పలుకుట యుక్తముగా లేదని యాశంక కలుగును. అది సత్యమేకాని యుద్దార్థమై దశరథుడు వెళ్ళునపుడు కైకేయీ వియోగము సహింపలేక యుద్ధభూమికిఁ గైకనుగూడ తీసికొని వెళ్ళుట కామవశముచేతనే కాన తన్మూలకమగు వరదానము నావరపరిపాలనము మొదలగున వన్నియు పరంపరగ కామమూలకము - లనియెడి యభిప్రాయముచేతనే రాముడు దశరథుని కామాసక్తునిగా చెప్పుట యుక్తమేయని తెలియనగును.

*నను న తే౽౦బామధ్యమా మాతా గర్హితవ్యా కథంచన, ఇతి వదతో రామస్య సర్వపురుషార్థప్రువస్య కథ మేవం విధః కైకేయీనిందా ప్రధానా ఉక్తయో యుజ్యంత ఇతిచేదుచ్యతే, నేదం పూర్ణమనసా రామేణ ప్రతిపాదితం కిం తు సౌమిత్రే స్స్వాంతం పరీక్షితు మేవోక్తం, అయోధ్యా మిత ఏవ త్వం గచ్ఛేతి శ్రీరామో లక్ష్మణం ప్రతి వక్ష్యతి తన్మత మనువర్తితు మేవ ముక్తమితి వా జ్ఞేయం.

సపత్నికొడుకునగు నేను రాజ్యపాలనములో తన కుమారున కడ్డము వచ్చుటను కోపముతో పాపిష్ఠురాలగు కైక నాతల్లి యగు కౌసల్యను నా కష్టకాలుడవగు నీయొక్క తల్లియగు సుమిత్రను గూడ నన్యాయముగా నెట్టి కష్టముల పాలు చేయునోకదా! **మిక్కిలి తుచ్ఛమైన బుద్ధిగల కైకేయి గిట్టనివారి కన్యాయ మాచరింపకుండునా? కావున లక్ష్మణా! నీవు వెంటనే పయనమై యయోధ్య కేగుట మంచిదని తలచెదను.

మయా హి చిరపుష్టేన దుఃఖసంవర్ధితేన చ,
విప్రా యుజ్యత కౌసల్యా ఫలకాలే ధిగస్తుమామ్. 34 ½

నా తల్లి నన్నుఁ గని పెంచి పెద్దవానిని చేసెను. అనేక బాధలు పడుచు నన్ను బ్రతికించెను. అట్టి కన్నతల్లిని నావలన సౌఖ్యమనుభవింపవలసిన కాలమున ప్రయత్నపూర్వకముగ వదలిపెట్టితిని. ఛీ!ఛీ! ఆ తల్లికి నేను గూడ నొక కొడుకునా? నేనున్నను లేకున్నను నొక్కటే కదా?

** ఇత్యుక్త్వా విలపంతం తం సమాశ్వా స్యాహ లక్ష్మణః,
* నైత దౌపయికం రామయదిదం పరితప్యసే,
విషాదయసి సీతాం చ మాం చైవ పురుషర్షభ! 35-36

---

*భరతునివంటి ధర్మాత్ముడు కైకవంటిదాని కెట్లు పుట్టె నన్నంత మాత్రముచేతనే కైకను నిందింపకుమని యిదివరలో లక్ష్మణునితోఁ బలికినవాడును, సమస్త పురుషార్థములయందుకూడ కోరిక లేనివాడు నగు రాముడు కైకవిషయమై యిప్పుడింత పరుషముగ మాటాడునా? యని సందేహము. కాని రాముడు నిండుమనస్సుతోఁ బలికిన విషయము కాదు. లక్ష్మణుని మనమును బరీక్షించుటకై చెప్పిన మాటయే. "లక్ష్మణా! నీ విప్పుడే బయలుదేరి యయోధ్య కరుగుము" అని రాముడు లక్ష్మణునితో చెప్పుచున్నందున లక్ష్మణ మతము ననుసరించుటకు చెప్పినమాటగా గ్రహింపవలయును.

** విలపంతమితి -శ్రీరామస్య పరమకరుణాశాలిత్వేన స్వానురక్తజన దుఃఖాసహిష్ణుత్వా ద్విలాపః న తు వస్తుతః వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖిత ఇత్యుక్తేరితి.

*పురషర్షభ ఇత్యనేన పురుషర్ష భస్య న హి తాపో యుక్త ఇతి, రామ, ఇత్యనేన రామస్య విషాదయితృత్వం చ న యుక్తమితి చ ద్యోత్యతే.

* ఇచ్చట రాముడు విలపించెనను దాని యభిప్రాయ మేమనగా, శ్రీరాముడు పరమ కరుణారసము కలవాడగుట చేత తనయందనురక్తులగు జనుల దుఃఖమును సహింపలేని వాడగుట వలన విలాపమే కాని వాస్తవికముగ కాదని తెలియదగును "మనుష్యుల కేమాత్రము వ్యసనము కలిగినను రాముడు మిక్కిలి దుఃఖంపడును"నని పూర్వమునందు చెప్పబడినది.

* "పురుషర్షభ!" అనుటచే పురుషశ్రేష్ఠునకు సంతాప ముండుట యుక్తముకా దనియు" రామ!" యనుటచే లోకమును సంతోషపెట్టు స్వభావము గల నీవు సీతకును నాకును విషాదము గలిగించుట యుక్తము గాదనియు వ్యంగ్య మగుచున్నది.

*ఇట్లు పలుకుచు విలపించుచున్న రాముని తమ్ము డోదార్చుచు నిట్లు పలికెను.* ఓ పురుషర్షభ! రామచంద్రా! నీ విట్లు పరితాపపడుచు సీతను, నన్ను గూడ సంతాప పెట్టుచుండుట నీకుఁ దగినపనిగాదు.

**1*న హి తాతం న శత్రుఘ్నం న సుమిత్రాం పరంతప!**
**ద్రష్టు మిచ్ఛేయ మద్యాహం స్వర్గం వాపి త్వయా వినా. 37**

* రామచంద్రా! నీవిక్కడ దుఃఖపడుచు నన్నింటికిఁ బొమ్మంటివిగాని నామనస్సు నాలోచింపవైతివి, నిన్నువిడిచిన పిమ్మట నాకు జనకుడేల? జనని యేల? తమ్ముడేల? ఆ స్వర్గమే వచ్చినను నేల? యని సమాధానము చెప్పెను.

**విజనే తు వనే సుప్త్వా నిశి తస్యాం తరో రథః,**
**సూర్యోదయా త్పరం తస్మాత్తద్దేశా త్తే ఏనిర్గతాః 38**

పిమ్మట నానిర్జనవనమందు వారు ముప్పురు నొక వృక్షము యొక్క క్రింది భాగమునం దారాత్రి నివసించి మఱల సూర్యోదయమైన పిమ్మట నచ్చటనుండి బయలుదేరిరి.

---

1* ఏతస్యా ఏవ పరమాభక్తి రుచ్యతే "పునర్విశ్లేషభీరుత్వం పరమాభక్తి రుచ్యతే ఇతి, సైవముక్తి కారణం ఏత దేవ భగవతా ప్రతిపాదితం "భక్త్యా పరమయా వాపి ప్రపత్త్యా వామహాముసే ప్రాప్యోఽహం నాన్యథా ప్రాప్యః మమకైంకర్యలిప్సుభిరితి"అనేన మర్కటకిశోర న్యాయః ప్రదర్శితః.

*దీనినే పరమభక్తియని చెప్పుదురు. భగవంతునితో వియోగము వచ్చునేమో యని భయపడుటయే పరమభక్తియని చెప్పబడినది. అట్టి పరమభక్తియే ముక్తిసాధన మగును. ఇట్లే భగవద్వచనముగూడ నున్నది. పరమభక్తిచేగాని, శరణాగతిచేగాని నా కైంకర్యము చేయువారలకు నేను ప్రాప్యుడనేకాని యితరవిధముల నేను ప్రాప్యుడ గాను అని దీనినే మర్కటకిశోరన్యాయమందురు అనగా కోతిపిల్ల తనతల్లి యెన్నిగంతులు పెట్టినను, ఏమి చేసినను, తనతల్లిని విడువక కడుపును కఱచుకొనియే యుండును. తల్లిని విడచి పొమ్మన్న నది యెట్లు పో గలదు నాగతియు నంతియే యని లక్ష్మణుని భావము.

+"వారొక యడవినుండి మఱియొక యడవి కరుగుచు" అను నర్థమిచ్చు(తే వనేన వనంగత్వా) అను మూలమునకు విశేషార్థము వ్రాయబడుచున్నది.

2** **తే౨**, వనేనేతి-తే, రామాదయస్త్రయః వనేన వనం గత్వా వనాద్వనం గత్వా, యద్వా, అవనేన వనం గత్వా, అన్యోన్యరక్షణేన వనం గత్వా" అగ్రతో గచ్ఛ సౌమిత్రే సీతా త్వామనుగచ్ఛతు పృష్ఠతోఽహం గమిష్యామి. త్వాం చ సీతాం చ పాలయ న్నిత్యుక్తత్వాత్, యద్వా, అవనేన పితృవచన పరిపాలనేన హేతునా వనంగత్వా యద్వా, అవనేన లోకరక్షణేన

2** తే వనేన వనం గత్వా బహూ న్దేశా న్మనోరమాన్,
అదృష్ట పూర్వాన్పశ్యంతః ప్రయాగం సముపాగతాః. 39

ఇట్లు +వారొక యడవినుండి మఱియొక్క యడవి కరుగుచు క్రమముగ ననేక అరణ్య ప్రదేశములను దాటి యచ్చటచ్చట గన్పట్టు విచిత్ర ప్రయాగ యను తీర్థరాజమును జేరుకొనిరి.

భరద్వాజాశ్రమం ప్రాప్య మునే ర్దర్శన కాంక్షిణౌ,
అగ్న్యగారే స్థితం శ్రుత్వా మునిం దూరే స్థితా స్త్రయః. 40

ఇట్లు సీతారామలక్ష్మణులు ముప్వురును ప్రయాగ తీర్థమును చేరుకొని యచ్చట నున్న భరద్వాజాశ్రమమున కేగి యా మునిదర్శనమునందుఁ గోరిక గలవారై యాతఁడు హోమశాలయందున్నట్లచ్చటి మునికుమారులవలన తెలిసికొని ద్వారదేశమునందే యుండి యతని యగ్నికర్మ సమాప్తి యగు వఱకును ప్రతీక్షించుచుండిరి.

తత్రాగతవటుం దృష్ట్వా రామః ప్రాహ చ హేవటో!
రామో దాశరథి స్సీతాలక్ష్మణాభ్యాం సమన్వితః,
ఆస్తే బహిర్వనస్యేతి హ్యుచ్యతాం మునిసన్నిధౌ. 41 ½

---

హేతునా రావణాది దుష్టనిబర్హణముఖేన లోకరక్షణార్థం తేషాం వనగమనం, యద్వా తేవృ దేవన ఇతి ధాతోర్భావే ల్యుట్ తేవనేన దేవనేన అనాయాసేనేత్యర్థః యద్వా తేవనం పాదసంచార ఇతి కోశోక్త్యా సూతవిసర్జనానంతరం రథాదవరుహ్య పాదసంచారేణ వనంగ త్వేత్యర్థః యద్వా, అవనేనసహ వనంగత్వా మధ్యేమధ్యే స్థలప్రదేశం వనం చ గత్వేత్యర్థః యద్వా, వనేన జలేన సహితం వనం నతు మరుకాంతార మితివార్థః

(తే) = సీతారామలక్ష్మణులు ముప్వురును, (వనేన) వనమునుండి వనం= మఱియొకవనమునుగూర్చి, (గత్వా) = వెడలి "లక్ష్మణా! నీవు ముందు నడువుము. సీత నిన్ననుసరించి నడువగలదు. ఆ వెనుక నేను గూడ నిన్నును సీతను రక్షించుచు రాఁగలను; అని మున్ను రాముడు చెప్పినట్లు (తే) =వారలు, (అనేన) = ఒకరినొకరు రక్షించుకొనుటచే, (వనం =వనమున, గత్వా = నడచి, లేక (అవనేన) = వనమును గూర్చి, (గత్వా) = వెళ్ళి,లేక తేవృఅను ధాతువునుండి భావార్థమున ల్యుట్ రూపమునుండి సిద్ధమైన (తేవనేన) అను పదమునకు ననాయాసమని యుర్థము గాన (తేవనేన) అనాయాసముగ, (వనం) = వనము కానట్టి ప్రదేశమునుండి (వనం) = వనమును గూర్చి (గత్వా) = పొంది (అనగా వృక్షాదులు లేని ప్రదేశమునుండి వనప్రదేశముల కరిగి యని భావము) లేక (తే) వారలు (వనేన) = జలసహితమగు భూమినుండి, (వనం) = నిర్జలమగు వనమును, (గత్వా) = వెళ్ళి యని యర్థము.

అప్పుడు రాము డక్కడ తిరుగుచున్న యొకబ్రహ్మచారిని బిలిచి యతనితో నిట్లు పలికెను. ఋషికుమారకా! నీవు భరద్వాజముని వర్యుని సన్నిధానమునకేగి వారితో దశరథపుత్త్రుడగు రాముడు సీతా లక్ష్మణ సహితుడై తమ దర్శనమునకై వాకిట నెదురుచూచుచున్నాడు" అని భరద్వాజమునితోఁ జెప్పుమనెను.

తచ్ఛ్రుత్వా సహసా గత్వా పాదయోః పతితో మునేః,
స్వామి న్రామ స్సమాగత్య వనాద్బహి రుపస్థితః,
సభార్య స్సానుజ శ్శ్రీమా నాహ మాం దేవసన్నిభః
*భరద్వాజాయ మునయే జ్ఞాపయస్వ యథోచితమ్. 42-43½

ఇట్లు చెప్పగా విని యా బ్రహ్మచారి వెంటనే భరద్వాజుని సన్నిధికేగి యాతని పాదములకు నమస్కరించి "ఓ స్వామీ! రామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై మన యాశ్రమదేశమునకు వచ్చి పర్ణశాల వెలుపల తమ దర్శనమును ప్రతీక్షించుచు నిలచియున్నవాడు దేవసమానుడైన రాముడు. *భరద్వాజముని సన్నిధికేగి తగిన సమయమును చూచి నన్నాయనకు నెఱుకపఱుపుము" అని నీ వద్దకు నన్ను పంపెను.

---

* భరద్వాజ ఇతి - భరద్వాజో నామ ప్రజాభరణశీల ఇత్యర్థః। ఇత్థం నిరుక్తమృగారణే -" ఏష ఏవ బిభ్రద్వాజః ప్రజా వైవాజ స్తా ఏష బిభర్తియద్బిభర్తి తస్మాద్భరద్వాజ"ఇత్యాచక్షత ఇతి, యద్వా, వాజంరేతః వాజీకరణమిత్యాదౌ తథాప్రయోగాత్ బిభ్రద్వాజం భరద్వాజః నిత్యబ్రహ్మచారీత్యర్థః భరద్వాజోహ త్రిభి రాయుర్భిః బ్రాహ్మచర్యమువాసేతి శ్రుతేః.

కిం చ భరద్వాజశబ్ద వ్యుత్పత్త్యర్థస్తు భరద్వాజేనైవం వర్ణితః, తథాహి - అనుశాసనికే 142 అధ్యాయే. శ్లో॥ భరేఽ సుతాన్ భరే పోష్యాన్ భరే ద్విజాన్ భరే భార్యా మహం వాజా ద్భరద్వాజోఽస్మి శోభనే ఇతి.

* భరద్వాజుడను పదమునకు ప్రజలను రక్షించు స్వభావము కలవాడని యర్థము.

మృగారణ గ్రంథమందుఁగూడ "వాజ అనగా ప్రజలను, భరత్ భరించు వాడుగాన భరద్వాజు డందురు" అని యున్నది. లేక వాజ మనగా రేతస్సును (భరత్) భరించువాడుగాన భరద్వాజుడనియు చెప్ప నొప్పును. అనగా నస్ఖలిత బ్రహ్మచారియని భావము. "భరద్వాజుడు బ్రహ్మచర్యనిష్ఠచేత త్ర్యాయుషపర్యంతము నుండెనని శ్రుతిగూడ గలదు.

ఇంతేకాక భరద్వాజ శబ్దమునకు వ్యుత్పత్త్యర్థము భరద్వాజుడే. భారతమున అనుశాసనికమందు 142 వ యధ్యాయమందు నిటుల జెప్పెను" పుత్త్రులు కానివారలను, పోష్యులను, దేవతలను, బ్రాహ్మణులను, భార్యను నేను భరింతును గాన నా పేరు భరద్వాజు డందురు అని.

తస్య తద్వచనం శ్రుత్వా శీఘ్ర మానీయతామితి,
వటుం సంప్రేష్య సోఽప్యగ్నేః కార్యం సాంత మథాకరోత్. 44½

అనగానే భరద్వాజుడు వెంటనే లోపలఁ బ్రవేశపెట్టుమని వటువున కాజ్ఞాపించి పంపెను. పిమ్మట శీఘ్రముగ తా నగ్ని కార్య విధిని బూర్తిచేసికొనెను.

**ఆనీతో వటునా రామ స్సీతాలక్ష్మణసంయుతః,**
****హుతాగ్ని హోత్రం తం దృష్ట్వా ప్రణామ మకరోద్ద్రుతం. 45½**

బ్రహ్మచారియు సీతాలక్ష్మణసహితుడైన రాముని భరద్వాజుని సన్నిధికిఁ దోడ్కొనివచ్చెను. అప్పుడు రాముడు* ననుష్ఠానము పూర్తియయ్యెనని తెలిసికొని వెంటనే యా మునివరునకుఁ బ్రణమిల్లెను.

న్యవేదయ దాత్మానంచ తస్మై లక్ష్మణపూర్వజః,
పుత్రౌ దశరథ స్యావాం భగవన్ రామలక్ష్మణౌ,
భార్యా మమేయం వైదేహీ కల్యాణీ జనకాత్మజా,
పిత్రా నియుక్తా భగవన్ ప్రవేక్ష్యామ స్తపోవనమ్. 46-47 ½

పిమ్మట రామచంద్రు డాభరద్వాజముని శేఖరునకు తమ నెల్లెఱుక పఱచుకొనెను. "ఓ భరద్వాజ! మే మిర్వురమును రఘువంశ సంభూతుడగు దశరథ మహారాజునకుఁ బుత్రులము. నాపేరు రాము డందురు. నాతమ్ముడగు నితనిని లక్ష్మణు డందురు. ఈమె జనకుని కూతురును నా యర్ధాంగియు నగు సీత. మేము ముప్వురమును మా తండ్రి యానతి చొప్పున వనవాసమునకుఁ బ్రయాణమైతిమి.

**హుతాగ్ని హోత్రమిత్యనేన కర్మకాలే అభివాదన నిషేధో ద్యోత్యతే, సమిత్పుష్ప కుశాజ్యాంబు మృదన్నాక్షత పాణికం జపం హోమం చ కుర్వాణం నాభివాదయతే ద్విజ ఇత్యుక్తే రితి జ్ఞేయం

ఇట ననుష్ఠానము పూర్తి యయ్యెనని తెలిసికొని రాముడు మునికి నమస్కరించెను అనుటచే ననుష్ఠానము చేసికొను కాలమందు వందనము కూడదని వ్యక్తమగుచున్నది " సమిధలు, పుష్పములు, దర్భలు, నెయ్యి, మట్టి, అక్షతలు, అన్నము హస్తమందున్నపుడును, జపహోమాదులు సల్పుచున్నప్పుడును బ్రాహ్మణులకు వందనము చేయుట యనుచితము " అని ధర్మశాస్త్ర వచనము గలదు

* అనేన బ్రాహ్మణేనాపి రాజ్ఞాం మధుపర్కాదినా పూజా కర్తవ్యేతి సూచితం.

తథా చ మనుః రాజర్త్విక్స్నాతక గురూన్, ప్రియశ్వశుర మాతులాన్ అర్హయే న్మధుపర్కేణ పరిసంవత్సరాత్పునరితి. అస్యాయ మాశయః - ప్రథమం స్వగృహాగతానా

* తస్య తద్వచనం శ్రుత్వా రాజపుత్రస్య ధీమతః,
ఉపానయత ధర్మాత్మా గా మర్ఘ్య ముదకం తతః,
నానావిధా నన్నరసాన్ వన్యమూల ఫలాశయాన్,
తేభ్యో దత్వా భరద్వాజో రాఘవం ప్రాహ భక్తితః. 48-49 ½

అని చెప్పఁగా విని ధర్మజ్ఞుడైన భరద్వాజుడును సజ్జనోత్తంను డగు నారామునకు, *గోవును, అర్ఘ్యమును, ఉదకమును, ఇచ్చి (అనగా మధుపర్క పూజచేసి) యనేక విధములైన రుచికరములగు భక్ష్య భోజ్య పానీయములను, కందమూల ఫలములను భుజింప నర్పించి భక్తియుక్తుడై రాఘవునితో నిట్లు పలికెను.

అహం వేద్మి పరాత్మానం మాయామానుషవిగ్రహమ్,
జానామి జ్ఞానదృష్ట్యాఽహం జాతయా త్వదుపాసనాత్,
అవతార రహస్యం చ వనవాసం చ రామ తే,
ఇతః పరం త్వాం కిం వక్ష్యే కృతార్థోఽహం రఘూత్తమ. 50-51 ½

---

మృత్విగా దీనాం మధుపర్కః కర్తవ్యః| సంవత్సరానంతరం ప్రత్యాగమనేఽపి కర్తవ్యమేవ| యజ్ఞవివాహ యోస్తు సంవత్సరాత్ప్రాగపి పునరాగతానాం మధుపర్కః| శ్రోత్రియస్య రాజ్ఞో మధుపర్కః, అశ్రోత్రియస్యరాజ్ఞః, ఆసనాదిక మేవేతి గ్రాహ్యం.

అని చెప్పఁగా విని ధర్మజ్ఞుడైన భరద్వాజుడును సజ్జనోత్తంసుడగు నారామునకు,** గోవును, అర్ఘ్యమును, ఉదకమును, ఇచ్చి అనగా పానీయములను, కందమూలఫలములను భుజింప నర్పించి భక్తియుక్తుడై రాఘవునితో నిట్లు పలికెను.

** ఇచ్చుట " రామునకు, గోవును, అర్ఘ్యమును, ఉదకమును, ఇచ్చి మధుపర్క పూజ చేసెను. "అనుటచే తన గృహమునకు శ్రోత్రియుడు క్షత్రియుఁడు వచ్చినప్పుడు బ్రాహ్మణుడు కూడ నా క్షత్రియుని బూజింపవలసినదే యను ధర్మము సూచిత మగుచున్నది.

ఇట్లే మనువుగూడఁ జెప్పెను. " రాజులను, ఋత్విక్కులను, స్నాతకవ్రతులను, స్నేహితులను, తనకుఁ బిల్లనిచ్చిన మామను, మేనమామను, తన గృహమునకు వచ్చినపుడు మధుపర్కము మొదలగు వానిచేఁ బూజింపవలయును అని" అనగాఁ బైన జెప్పఁబడిన వారు తిరిగి సంవత్సరములోపల వచ్చినచో మధుపర్కాదులు లేక సామాన్యసత్కారము చేయవలయు ననియు, సంవత్సరము దాటినట్లయిన నట్లే మఱల మధుపర్కాదులచే పూజింపవలయు ననియు యజ్ఞము, వివాహము మొదలైన వాటియందుమాత్రము సంవత్సరములోపల ఋత్విజుడు, స్నాతకుడు తిరిగివచ్చినను మధుపర్కము మొదలైన వానిచే బూజింపవలయుననియు మఱియు శ్రోత్రియుడగు రాజు వచ్చినచో మధుపర్కాదుల చేత సత్కరించవలయు ననియు, నశ్రోత్రియుడైన రాజు వచ్చినప్పుడాసనము మొదలగునవి మాత్రమిచ్చి సత్కరింపవలయు ననియుఁ జెప్పబడినది.

ఓ రాఘవా! నిన్ను మాయామానుష విగ్రహుడగు పరాత్పరునిగ నెఱుంగుదు. నిన్నుపాసించుటవలనఁ గలిగిన జ్ఞానదృష్టిచేత నీ యవతార రహస్యమును, వనవాసమను నెపమును గూడ నే నెఱింగితిని. ఇంక వేయి మాటలేల? ఓ రాఘవా! నీ యాగమన దర్శనముల వలన నేను కృతార్థుడనైతిని.

---

* ప్రయోగస్య పుణ్యతమత్వం వనపర్వణి ప్రతిపాదితం.

ధౌమ్యః - యత్రాయజత భూతాత్మా పూర్వమేవ పితామహః। ప్రయాగమితి విఖ్యాతం తస్మా ద్భరతసత్తమ॥ తతః పుణ్యతమం నాస్తి త్రిషులోకేషు భారత! ప్రయాగం సర్వతీర్థేభ్యః ప్రవదం త్యధికం విభుం। శ్రవణా త్తస్య తీర్థస్య నామసంకీర్తనాదపి। మృత్తికాలంభనాద్వాపి సర్వపాపైః ప్రముచ్యతే। ఇతి శ్రుతిః 'సితాసితే సరితౌ యత్ర, సంగతే, తత్ర ప్లుతాసో దివ ముత్పతంతి, యేవైతన్వాం విసృజన్తి ధీరా, స్తేజ నాసోఽ మృతత్వం భజన్తే ఇతి. పాద్మే 146 అధ్యాయే - శ్లో॥ మా గవీన్ రశ్వమేధి న్మఖకృదహమితి బ్రహ్మహన్మా చ బైషీః పాతక్యస్మీ తి పుణ్యే మహత్మి చ దురితే కో మదః కాచబీతిః। మాఘేమాసి ప్రయాగే మకరగత రవౌ మజ్జతాం సజ్జనానాం మద్బిందుర్వా ధునీతే మదమపి భయమప్యత్ర వేదాః ప్రమాణం। యత్ర గంగా చ యమునా యత్రచైవ సరస్వతీ, తత్ర స్నాత్వా చ పీత్వా చ ముక్తిభాగీ న సంశయః॥ ఇతి. ధత్తేభిత్శ్చామరచారుకాంతీ సితాసితే యత్ర సరిద్వరేణ్యే। ఆద్యో వట శ్ఛత్రమి వాతిభాతి స తీర్థరాజో జయతి ప్రయాగః॥ ఇతి.

* ప్రయాగ ప్రదేశము పుణ్యదేశమని భారతమున వన పర్వమందుఁబ్రతిపాదింపఁ బడినది.

ధౌమ్యుడిట్లు ధర్మరాజుతోఁ జెప్పెను." సమస్త చరాచర భూత ప్రపంచమున కాదిభూతుడై వెలుంగుచున్న పరమేష్ఠి (అనగా బ్రహ్మ) పూర్వ మిచ్చట యాగమొనర్చిన హేతువున నాదేశమునకు బ్రయాగ యని ప్రసిద్ధి వచ్చినది కావున నీ ప్రయాగ క్షేత్రమును మించిన పుణ్యతమమైన క్షేత్రము మఱియొక్కటి ముల్లోకములయందును లేదు. ఈ ప్రయాగ తీర్థము పేరువిన్నను, నామసంకీర్తనము చేసినను, ఈ తీర్థమందలి మృత్తికను స్పృశించినను సమస్త పాపములును నశించును." ( అని చెప్పబడినది)

మఱియు శ్రుతిగూడ నిట్లు గలదు.

తెల్లనిజలము నల్లనిజలమును గల గంగాయమునానదు లెచ్చట కలిసి ప్రవహించుచున్నవో యచ్చట స్నానమాడిన వారు స్వర్గమున కరుగుచున్నారు. ఎవ్వ రీ గంగా యమునా సంగమ ప్రదేశమందుఁ(అనఁగా ప్రయాగమున) శరీరత్యాగ మొనర్చుచున్నారో వారు కేవల మమృతత్వముఁ బొందుచున్నారు. అని.

మఱియు పద్మపురాణమునందు 146 వ యధ్యాయమందు గూడ నిట్లున్నది.

ఓ యశ్వమేధయాగము చేసిన మహనీయుడా! నేను యజ్ఞముల యందెల్ల గొప్ప యజ్ఞమును జేసితిని గదాయని గర్వపడకుము నీ గర్వ మింకను సాగదు ఓ బ్రహ్మహత్యాదోషము చేసిన పాపిష్ఠుడా! నేను పాతకిని గదాయని భయపడకుము. నీకింక భయము లేదు మాఘమాసమందు సూర్యుడు మకరమందు బ్రవేశించియుండఁగాఁ బ్రయోగ తీర్థమున స్నానమాడినను, ఒకనీటిబిందువును

అవకాశో వివిక్తో ఽయం మహానద్యో స్సమాగమే,
*పుణ్యశ్చ రమణీయశ్చ వసత్విహ భవా న్సుఖ,
ఇత్యుక్తో రాఘవః ప్రాహ భరద్వాజమునిం పునః. 52-53

**ఈ యాశ్రమభూములు జనసంచారము లేనివి. మఱియు నిచ్చట గొప్పగొప్పనదులు ప్రవహించుచున్నవి. ఇచ్చట ప్రదేశములు చాలా మనోహరములు, పుణ్యప్రదములు కూడ నై యున్నవి; కావున నీ విచ్చట సుఖముగ నుండి కాలమును గడుపవచ్చును అనగా విని రాముడు భరద్వాజునితో తిరిగి యిట్లనియెను.

అనుగ్రాహ్యా స్త్వయా బ్రహ్మన్ వయం క్షత్రియబాంధవాః,
భగవన్నిత ఆసన్నః పౌరజానపదో జనః,
ఆగమిష్యతి వైదేహీం మాం చాపి ప్రేక్షకో జనః 54½

ఓ బ్రహ్మర్షి పుంగవా! క్షత్రియులమైన మమ్మనుగ్రహింపుము. ఇచ్చటికి పట్టణము దగ్గరగ నుండుటచే పౌరులు నన్ను జానకిని చూచుట కొఱకు వచ్చెదరు.

వివిక్తం తు మునే బ్రూహి కంచి దాశ్రమ ముత్తమమ్,
ఇత్యుక్తః ప్రాహ భగవాన్ భరద్వాజో ఽపి రాఘవమ్. 55 ½

---

స్పృశించినను జనులకు స్వర్గ ప్రాప్తి కలుగును. కాన నో యశ్వమేధము చేసినవాడ, నీ మదమును విడువుము. ఓ బ్రహ్మఘ్నుడా! నీవు భయమును విడువుము. ఇందుకు వేదములే ప్రమాణము. (అనఁగా ఓయశ్వమేధి! నీ కంటె గొప్పది ప్రయాగ యుండగా నీకు గర్వమేల యనియు, బ్రహ్మఘ్నుడా! నీదోషమును బోగొట్టునట్టి ప్రయాగయను తీర్థరాజము భూమియం దవతరించి యుండగా నీకు భయమేల యనియు భావము) ఎచ్చట గంగానదియు, యమునానదియు, సరస్వతీనదియు, గలసి ప్రవహించుచున్న వో యచ్చట స్నానము చేసి తన్నదీజలమును పానము చేసినవాడు నిస్సంశయముగ ముక్తి నందుచున్నాడు " అని మఱియొక చోటఁ జెప్పఁబడియున్నది.

" ఏ తీర్థ రాజు సితా సితములగు వింజామరల వలె గంగా యమునా నదీమతల్లు లిరుగెలంకుల వెలయ ననాదిసిద్ధమైన యక్షయ వటవృక్షము ఛత్రమై వెలుఁగ కన్నులపండువై గన్పట్టునో. యా క్షేత్ర రాజము ప్రయాగ క్షేత్రమని ప్రసిద్ది కెక్కి భూమియందు వెలుంగు చున్నది" (అని మఱియొకచోట జెప్పబడినది)

ఓ మునిశేఖరా! జనసంపర్కములేని యొక యుత్తమోత్తమ మగు నాశ్రమదేశమును మా నివాసమున కుచితమగు దాని నాలోచించి చెప్పుము. అని రాముఁడడుగఁగా సర్వజ్ఞుడగు నాభరద్వాజుడు దీర్ఘముగా నాలోచించి రాఘవున కిట్లనియెను.

**ఏతస్మాదాశ్రమా ద్రామ! దశక్రోశావధౌ గిరిః,**
***చిత్రకూటాభిధో హ్యస్తి నానాముని నిషేవితః. 56**

*ఓ రామచంద్రా! ఇచ్చటకు పది క్రోశముల దూరమునందుఁ జిత్రకూటమను పర్వతము కలదు. దాని సమీపమున వాల్మీకి మొదలగు ననేకులు ఋషిపుంగవు లాశ్రమము లేర్పఱచుకొని నివసించుచున్నారు. అది మీ నివాసమునకు మిక్కిలి యనుకూల ప్రదేశము.

**ఋషయ స్తత్ర బహవో విహృత్య శరదాం శతమ్,**
**తపసా దివ మారూఢాః కపాలశిరసా సహ,**
**రామ! తే వాసయోగ్యం తం మన్యే దేశ మహం ధ్రువమ్. 57-58**

అచ్చట ననేక ఋషిశేఖరులు చిరకాలము తపమ్మొనర్చి తన్మహిమచే దేహముతో గూడ స్వర్గమున కరిగియున్నారు. ఆ ప్రదేశము మీకు నివాసయోగ్య మగునని తలంచెదను.

---

* చిత్రకూటమహిమాతిశయో వనపర్వణి ప్రతిపాదితః తతో గిరి వరశ్రేష్ఠే చిత్రకూటే విశాంపతే, మందాకినీం నమాసాద్య నదీం పాపప్రమోచనీం, తత్రాభిషేకం కుర్వాణః అశ్వమేధఫలం వ్రజేత్|| ఇతి

చిత్రకుటాద్రి శిఖరదర్శనా త్పాపసంక్షయః||ఇతి.

* చిత్రకూట పర్వత మహిమావిశేషము భారతమునందలి వనపర్వమందిట్లు ప్రతిపాదింపఁబడినది.

" చిత్రకూట పర్వతము పర్వతములలో నెల్ల నుత్తమోత్తమ మైనది. దాని సమీపమందు ప్రవహించునదియు, పాపములను బోగొట్టునట్టిదియు నగు గంగానదియందు స్నానమాడిన వారికి నశ్వమేధ యాగ ఫలముతో సమమైన పుణ్యఫలము చేకూరగలదు" అని.

. మఱియుఁ జిత్రకూట పర్వత శిఖర దర్శనముచే పాపక్షయ మగు ననియు నొక్కచో జెప్పఁబడినది

**తతో భరద్వాజమునిప్రక్లుప్త, మహోపచారైశ్చ కథా ప్రసంగైః,**
**సంజాతహర్షః ప్రియయానుజేన, రాత్రిం సుఖం తత్ర నినాయ రామ. 59**

పిమ్మట భరద్వాజునిచే నొనర్ప బడిన యుపచారములకు కథా ప్రసంగములకును రాముడు మిక్కిలి సంతుష్టుడై భార్యతోడను, సోదరునితోడను, నాటిరాత్రి యచ్చటనే గడిపెను.

**తతః ప్రభాతే తు నృపాత్మజౌ తౌ పూర్వాహ్నికం తత్ర విధాయ పశ్చాత్,**
**మునిం నమస్కృత్య తదుక్త మార్గ మాశ్రిత్య సీతాసహితా వగాతామ్.60**

తెల్లవారిన పిమ్మట రామలక్ష్మణు లిర్వురును ప్రాతఃకాలానుష్ఠానములను దీర్చికొని యా వెనుక, భరద్వాజమునికి నమస్కరించి యతడు చెప్పిన మార్గము ననుసరించి యతడు చెప్పిన గుర్తులంబట్టి సీతారక్షణ విషయమున జాగరూకులై పయనమైరి.

***క్రమా త్సంప్రాప్య కాళిందీం శుష్కవంశై ర్మహాప్లవమ్,**
**కృత్వాఽఽరోప్య స్త్రియం తత్ర తావారుహ్య చ తేరతుః. 61**

వారలు క్రమముగ కాళిందీనదిని సమీపించి యచ్చటి యెండిన వెదురుకఱ్ఱలతో నొక పెద్ద తెప్పను నదీతీరణమున కనువుగ నిర్మించుకొని దానియందు సీతను జాగ్రత్తగ నెక్కించి తాముకూడ నెక్కి యానదిని భద్రముగ దాటిరి.

---

*అనేక బాహుభ్యాం నదీతరణం కర్తవ్యం న భవతీతి సూచితమ్

తథాచాపస్తంబః.

"వర్జయే ద్బాహుభ్యాం నదీతరణం నావం చ సాంశయికీ"మితి.

* "వెదురుకఱ్ఱల తెప్పచే నదిని దాటిరి" యనుటచే బాహువులచే నదీతరణ మొనర్పగూడదను ధర్మము సూచింపబడినది. ఇట్లే యాపస్తంబుడుగూడ.

"చేతులతో నీదుకొని నదిని దాటకూడ దనియు సందేహాస్పదమగు నావచేకూడ నదిని దాటగూడదనియుఁజెప్పెను.

సముత్తీర్య తు కాళిందీం ప్లవేన మహతా త్రయః,
నిర్గతా యమునారణ్యే న్యగ్రోధం సముపాగతాః. 62

వారు ముప్వురును పై విధముగఁ దెప్పచే నదిని దాటి యమునానది నానుకొనిన వనమున బయలుదేరి శ్యామవృక్షమను ప్రసిద్ధిగల వటవృక్షమును సమీపించిరి.

*న్యగ్రోధం సముపాగమ్య వైదేహీ వాక్య మబ్రవీత్,
నమస్తేఽస్తు మహావృక్ష! పారయే న్మే వ్రతం పతిః
ఇత్యుక్త్వా సాంజలిం కృత్వా పర్యగచ్ఛ ద్వనస్పతిమ్. 63 ½

*ఆ వట వృక్షమును సమీపించిన పిమ్మట జానకి యిట్లు పలికెను. ఓ మహావృక్షమా! నీకు నా నమస్కారము. నాభర్త ఈ వనవాసవ్రతమును పూర్తియొనర్చున ట్లనుగ్రహింపుము. ఇట్లని యంజలి ఘటించి యా వృక్షమునకుఁ బ్రదక్షిణ మొనర్చెను. (ఈ వృక్షము చిరకాలము నుండి యున్నదియును నాశ్రితాభీష్టముల నొనగూర్చునదియు నని ప్రసిద్ధి గలది).

నిర్గత్య క్రోశమాత్రం తౌ తతో గత్వా చ రాఘవౌ,
సీతయా సహితౌ వీరౌ నివాసం చక్రతు ర్వనే. 64 ½

పిమ్మట వారు ముప్వురు నటనుండి బయలుదేరి యొక్కక్రోశము దూరము చని సీతాసహితులై యా యమునానది ప్రాంతారణ్యమందు నివసించిరి.

తస్యాం రాత్ర్యా ముషిత్వా తే తస్మింస్తు యమునావనే,
ప్రాతరుత్థాయ రామాద్యా శ్చిత్రకూటం వినిర్గతాః. 65 ½

ఆ రాత్రి యంతయు నా యమునాతీరస్థమగు వనమందు నివసించి ప్రాతః కాలముననే లేచి, వారుముప్వురును మెల్లగా చిత్రకూటగిరికి బయనమైరి.

---

* అనేక మార్గస్థో వనస్పతి ర్నమస్కారాదిపూర్వకం ప్రార్థనీయ ఇతి సూచితం.

కించ, ఆసాతే అగ్నిరస్తు=స్వస్తి తేస్తు వనస్పతే, ఇతి ఋచానుమంత్రయేతే త్యభిహితం.

*ఇచ్చట "వటవృక్షమునకు సమస్కరించెను" అనుటచే మార్గము నందున్న వృక్షరాజమును నమస్కారాది పూర్వకముగ బ్రార్థింపవలయునను ధర్మము సూచింపఁబడినది. మఱియు "ఆసాతే అగ్నిరస్తు" అనుమంత్రముచే గూడ నభిమంత్రించవలయుననికూడ గలదు.

తత స్తౌ పాదచారేణ గచ్ఛంతౌ సహ సీతయా,
రమ్య మాసేదతు శ్శైలం చిత్రకూటం మనోరమమ్. 66 ½

పిమ్మట సీతాసహితులై కాలినడకతో నారామలక్ష్మణులు మనోహరమైన యాచిత్రకూటపర్వతమును చేరుకొనిరి.

సమీక్ష్య తే గిరిం రమ్యం నానాపక్షిగణై ర్యుతమ్,
లతావృక్షసమాకీర్ణం మధురోదకసంయుతమ్.
బహుమూలఫలం తత్ర స్థాతు మైచ్ఛం శ్చిరం త్రయః. 67 - 68

అట్లు రమ్యమును, పక్షిగణయుతమునగు ననేకవిధములైన వృక్షములతో వ్యాప్తమైనదియు, మధురములైన యుదకములతో గూడి యున్నదియు, ననేక విధములగు కందమూల ఫలాదులచే సమృద్ధ మైనదియు నగు చిత్రకూటమును వారలు జూచి చాల యానందించి యచ్చట నివాస మేర్పఱచు కొనుట కిచ్ఛగించిరి.

ఇత్యాశ్చర్య రామాయణే అయోధ్యాకాండే
ద్వితీయ భాగే చతుర్థస్సర్గః సమాప్తః

ఆశ్చర్యరామాయణమున అయోధ్యాకాండమున ద్వితీయభాగమున
చతుర్థసర్గము సమాప్తము.

# పంచమస్సర్గః - ఐదవ సర్గ

1 అథ సంప్రాప్య వాల్మీకే రాశ్రమం తే త్రయశ్శుభమ్,
తత్ర దృష్ట్వా సమాసీనం నేము ర్వాల్మీకిముత్తమమ్. 1

అటు పిమ్మట సీతారామలక్ష్మణులు ముప్పురును కుశలముగ వాల్మీకి మహాముని యాశ్రమమును జేరి యచ్చట నొక్కచోట ఋషిజన పరివేష్టితుడును, సుఖాసీనుడు నైయున్న యావాల్మీకి మహామునిని దర్శించి యాయన పాదములకు వందన మొనర్చిరి.

నిరీక్ష్య రాఘవం సీతాలక్ష్మణాభ్యాం సమన్వితమ్,
వాల్మీకి స్సహసోత్థాయ విస్మయా నిమిషేక్షణః,
ఆలింగ్య రాఘవం ప్రాహ ధన్యోఽహ మభవంత్వితి. 2½

సీతా లక్ష్మణ సహితుడైన రామచంద్రునిఁ జూచి మహర్షియు నానంద పరవశుడై యాసనమునుండి చివాలున లేచి యా శ్రీరామచంద్రునిం గౌగిలించుకొని రాఘవా! ధన్యుడను, ధన్యుడను అని పలికెను.

2 తా న్మహర్షిః ప్రముదితః పూజయిత్వాఽథ ధర్మవిత్,
ఆస్యతామితి చోవాచ స్వాగతం తు నివేద్య చ. 3½

పిదప రాముని స్వాగత మడిగి ధర్మజ్ఞుడైన యా వాల్మీకిముని వారిని యథావిధిగఁ బూజించి యాసనముల గూరుచుండుడని ప్రార్థించెను.

తతః ప్రాహ మునిం రామః ప్రాంజలి ర్వినయాన్వితః,
సర్వం జానాసి ధర్మజ్ఞ యదర్థం వయమాగతాః,
వదాస్మి న్వస్తు మస్మాకం నివాసస్థాన ముత్తమమ్,
సీతయా సహితః కాలం కించి దత్ర నయామ్యహమ్. 4-5½

పిమ్మట రాముడంజలిబద్ధుడై మునివరున కిట్లనెను. ఓ ధర్మజ్ఞశేఖరా! మేమిచ్చట కెందుల కేగుదెంచితిమో నీకు తెల్లమే కదా! కావున నీ యరణ్యమందు మాకు నివసింప ననువగు నివాసస్థాన మొక్కటి సెలవిండు. సీతాలక్ష్మణ సహితుడనై కొంతకాల మీయరణ్యమున గడుప నాకు నిచ్చ గలదు.

---

1. కవిః ॥ 2. వా ॥ రా ॥

**ఇతి రామేణ కథితో వాల్మీకిః ప్రాహ రాఘవమ్.**
**భగవ న్సర్వభూతాని స్థానం సాధారణం తవ,**
**వచ్మి తే శ్రుణు రామాహం విశేషస్థాన ముత్తమమ్. 6 - 7**

అన విని వాల్మీకి రామచంద్రున కిట్లనెను. 'రామా! యిదియెంత చిత్రముగ నున్నది. సమస్త భూతములకును స్థానమగు నీకు నివసించుటకు నేను నివాస మేర్పఱచుటయా! కానిమ్ము నాటక మాడింతువుగాక, చెప్పెదను వినుము. రామచంద్రా! సర్వభూతములును నీకు సాధారణ స్థానము గదా! విశేషస్థానమును చెప్పెదను వినుము.

**1ధర్మాధర్మౌ పరిత్యజ్య త్వామేవ భజతో ఽనిశమ్,**
**సీతయా సహ తే రామ తస్య హృత్సుఖమందిరమ్. 8**

ఎవ్వడు ధర్మాధర్మములను బరిత్యజించి యెల్లప్పుడును నిన్నే భజించుచున్నాడో, వాని హృదయమే గదా, సీతాసహితుడవగు నీకు సుఖమందిరము.

**నిరహంకారిణ శ్శాంతా యే రాగద్వేషవర్జితాః,**
**సమలోష్టాశ్మ కనకా స్తేషాం తే హృదయం గృహమ్. 9**

ఓ రామభద్రా! అహంకారమును వీడి రాగద్వేషములను విడిచి శాంతులై యెవరు మట్టియందును, బంగారమునందును సమదృష్టి గలిగి వర్తించుచుందురో వారి హృదయమేగదా నీకు విశేషస్థానము.

**త్వయి దత్త మనోబుద్ధి ర్యస్సంతుష్ట స్సదా భవేత్,**
**త్వయి సంన్యస్త కర్మా య స్తన్మన స్తే శుభం గృహమ్. 10**

ఎవ్వఁడు మనస్సును నీయందు లగ్నము చేసి సంతుష్టుడై కర్మఫలమును నీకర్పణము చేయుచుండునో యాతని హృదయమే గదా నీకు శుభ మందిరము.

**యో న ద్వేష్ట్యప్రియం ప్రాప్య ప్రియం ప్రాప్య న హృష్యతి,**
**సర్వం మాయేతి నిశ్చిత్య త్వాం భజే త్తన్మనోగృహమ్. 11**

ఎవ్వఁడు తన కప్రియము కలిగినప్పుడు ద్వేషింపక సుఖము లభించెనని సంతోషపడక యీ జగత్తంతయు మాయామయమని నిశ్చయించుకొని

1. అ. రా. ||

సచ్చిదానందుడవగు నిన్నే భజించుచున్నాడో, వాని హృదయమే గదా! నీకు రమణీయ మగు నివాస మందిరము.

పశ్యంతి యే సర్వగుహాశయస్థం
త్వాం చిద్ఘనమ్, సత్య మనంతమేకమ్
అలేపకం సర్వగతం వరేణ్యమ్
తేషాం హృదబ్జే సహ సీతయా వస, 12

భగవానుఁడా! ఏజనులు నిన్ను సమస్తభూతముల కంతరంగుడవనియు చిత్స్వరూపుడ వనియు, సత్య స్వరూపుడ వనియు, నద్వితీయుడ వనియు, మాయచే స్పృశింపఁబడని వాడవనియు, సర్వవ్యాపి వనియు, పరాత్పరుడ వనియు, తెలిసికొనుచున్నారో వారి హృదయపుండరీకమను మందిరమున లెస్సగా సీతాసమేతుడవై నివసింపుము.

నిరంతరాభ్యాసదృఢీకృతానాం
త్వత్పాదసేవాపరినిష్ఠితానామ్,
త్వన్నామ కీర్త్యాహతకల్మషాణాం
సీతాసమేతస్య గృహం హృదబ్జే. 13

ఎవ్వరు నిరంతరాభ్యాస పాటవముచే మనస్సును నిశ్చలముగఁజేసి నీ పాదసేవయందు లగింపజేసి నీ నామసంకీర్తనముచే సమస్త పాతకమును బోగొట్టుకొని నిత్యానందులై యుందురో, వారి హృదయ పద్మమే గదా! సీతాసహితుడవగు నీకు నివాసమందిరము.

రామచంద్ర భవన్నామ మాహాత్మ్యం వేత్తికో భువి,
యన్నామోచ్చారణాదేవ మహర్షిత్వ మహం గతః. 14

ఓ రామచంద్రా! ఎవ్వని నామమును, వ్యత్యస్తముగ నుచ్చరించిన మాత్రముననే నేను మహర్షుల పదవి నందితినో యట్టి నీనామసంకీర్తనమహిమను తెలిసికొన గల సమర్థు డీ భూమియందెవ్వాడు గలఁడు?

జాత్యాఽహం బాడబః పూర్వం వృషలాచారతత్పరః,
శూద్రాయాం బహవః పుత్రా ఉత్పన్నా మే క్రమాద్విభో. 15

ఓ రాఘవా! నా జన్మవృత్తాంతమును జెప్పెద నాలకింపుము. నేను తొలుత బ్రాహ్మణుడ నయ్యు, దురాచారములకు లోనై స్వభార్యను విడిచి యొక శూద్ర స్త్రీని బెండ్లాడి యామెయందు చాల సంతతింగూడ బడసితిని.

**తత శ్చోరైశ్చ సంగమ్య చోరోఽహ మభవం పురా,**
**ధనుర్బాణధరో నిత్యం జీవానా మంతకోపమః. 16**

పిమ్మట జీవనము జఱుగక దొంగలలో జేరి నేను నొక దొంగనై ధనుర్బాణములు ధరించి జీవుల హింసించుచు కొంతకాల మట్లు సంచరించితిని.

**ఏకదా మునయస్సప్త వనే దృష్టా మయా తతః,**
**తానన్వధావం లోభేన తేషాం సర్వపరిచ్ఛదాన్.**
**గ్రహీతుకామ స్సప్తర్షీన్ తిష్ఠతేత్యహ మబ్రవమ్,**
**దృష్ట్వా మాం మునయోఽపృచ్ఛన్కిమాయాఽసి ద్విజాధమ! 17-18**

ఒకప్పుడు నేనొక్క వనమున సంచరించుచుండగా నేడుగురు మహర్షులు గుంపుగ నరుదెంచుటఁ జూచి వారి సర్వస్వమును హరింప వలయునను నాశతో నిలుడు, నిలుడనుచు వారిని వెన్నంటి పరుగిడితిని, అప్పుడు వారు నన్ను జూచి, ఓరీ! బ్రాహ్మణాధమా! యెందులకై మమ్ము వెన్నంటి వచ్చుచున్నాడవని యడిగిరి.

**అహం తానబ్రవం కించిదాధాతుం మునిసత్తమాః**
**పుత్రదారాదయ స్సంతి బహవో యే బుభుక్షితాః. 19**

నేనప్పుడు వారితో "నాకలిమంట కోర్వలేని నాభార్య పుత్త్రులను బోషించు కొనుటకై కొంతధనము మీవద్ద నపహరించుట కరుదెంచుచున్నా"నని పలికితిని.

**తతో మామూచు రవ్యగ్రాః పృచ్ఛ గత్వా కుటుంబకమ్,**
**యోయో మయా ప్రతిదినం క్రియతే పాపసంచయః,**
**యూయం తద్భాగినః కిం వా నేతి వేతి పృథక్పృథక్**
**వయం తిష్ఠేమ భోస్తావ దాగమిష్యతి వై భవాన్. 20 - 21**

పిమ్మట వారు శాంతులై నాతో నిట్లనిరి అట్లైన నీవిప్పుడు గృహమున కేగి నీదారాపుత్రాదుల నొక్కరొక్కరిని వేర్వేరుగా బిలిచి "నేను ప్రతిదినమును మీ పోషణకై యెన్నియో పాపము లొనర్చుచున్నానుగదా! అపాపములయందు మీరుగూడ భాగమును బంచుకొందురా! పంచుకొనరా!" యని యడుగుము. నీవు తిరిగి వచ్చువరకును మేమిచ్చటనే యుండెదము.

**తథేత్యుక్త్వా గృహం గత్వా మునిభి ర్యదుదీరితమ్,**
**అపృచ్ఛం పుత్త్రదారాదీం స్త్రైరుక్తో ఒహం రఘూత్తమ!**
**పాపం తవైవ తత్సర్వం వయం తు ఫలభాగినః. 22 ½**

అని ఋషులు పలుకఁగా నేను సరియేయని గృహమున కేగి మునులు వాక్రుచ్చినట్లు నాదారపుత్రాదులను వేర్వేరుగా బిలిచి యడిగితిని. వారు నాకిచ్చిన సమాదానమును వినుము "మేము నీవు సంపాదించి తెచ్చిన దనాదుల ననుబవించువారమే, కాని నీవాచరించు పాపముతో మాకు నిమిత్తములే" దనిరి

**తచ్ఛ్రుత్వా జాతనిర్వేదో విచార్య పునరాగమమ్,**
**మునీనాం దర్శనాదేవ శుద్ధాంతః కరణో ఒభవమ్. 23 ½**

ఆ మాటలు వినుటతోడనే కొంత వైరాగ్యము కలుగగా గొంత చింతించి తిరిగి యా ఋషిపుంగవుల వద్దకు వచ్చితిని వారి పునర్దర్శనమగు నప్పటికే నాయంతఃకరణము పరిశుద్ధ మయ్యెను

**రక్షధ్వం మాం మునిశ్రేష్ఠా గచ్ఛంతం నిరయార్ణవమ్,**
**ఇత్యగ్రే పతితం దృష్ట్వా మా మూచు ర్మునిసత్తమాః.**
**ఉత్తిష్ఠోత్తిష్ఠ భద్రం తే సఫల స్సత్సమాగమః,**
**ఉపదేక్ష్యామహే కించి త్తుభ్యం తేనైవ మోక్ష్యసే. 24 - 25 ½**

వెంటనే నేను వారిపాద పద్మములందు సోలి "ఓ మహానుభావులారా! పాపసముద్రమునఁబడి యూపిరాడక తన్నుకొనుచున్న నన్ను రక్షింపుడు రక్షింపుడు" అని బిగ్గరగ నేడ్చుచున్న నన్నుఁజూచి కరుణామయులగు నా ఋషిపుంగవులు నన్ను లెమ్మని "నీకు భద్రమగు"నని యోదార్చి" సజ్జనసాంగత్యము సర్వశ్రేయములకును మూలము, కావున మేము నీకొక్క చిన్న యుపదేశ మిచ్చెదము దానివలననే నీకు పాపవిముక్తి యగును.

ఇత్యుక్త్వా మాం తతస్సర్వే సమాలోచ్యపరస్పరమ్
దుర్వృత్తిమా నయం నూనం తథాఽపి శరణం గతః.
ప్రయత్నా ద్రక్షణీయోఽయమితి నిశ్చయమాస్థితాః. 26 - 27

అని పలికి వారొకరి మొగమువంక నొకరు చూచుకొనుచు నీదుష్ట వర్తనుడగు ద్విజాధముడు సజ్జనులకు నుపేక్షణీయుడే కాని శరణాగతుడు గాన ప్రయత్న పూర్వకముగ మోక్ష మార్గోపదేశమున రక్షింపవలయును అని తుదకు నిశ్చయించుకొనిరి.

పశ్చా ద్రాఘవ తే నామ వ్యత్యస్తాక్షరపూర్వకమ్,
ఉపదిశ్య సదాఽత్రైవ జప నిశ్చల మానసః.
ఆగచ్ఛామః పునర్యావత్తావ త్త్వం జప నిశ్చలః,
ఇత్యుక్త్వా ప్రయయు స్సర్వే మునయో దివ్యదర్శనాః. 28- 29

పిమ్మట నోరామభద్రా! యాసప్తర్షులు నీ నామమును తలక్రిందుగా మరా యని యుపదేశించి మేము తిరిగి వచ్చువరకు నిచ్చటనే నిలచి నిశ్చలమనస్కుడవై జపింపుమని చెప్పి యంతర్ధాన మొందిరి.

అహం యథోపదిష్టం తై స్తథాకరవ మంజసా,
జప న్నేకాగ్రమనసా బాహ్యం విస్మృతవా నహమ్. 30

పిమ్మట నేనును నాదివ్యజ్ఞానులగు ఋషిపుంగవు లుపదేశించిన విధముగ భక్తి శ్రద్ధలతో "మరా మరా"యని జపించుచు క్రమముగ నీ బాహ్య ప్రపంచ నెల్ల మఱచితిని.

ఏవం బహుతిథే కాలే గతే నిశ్చలరూపిణః,
సర్వసంగవిహీనస్య వల్మీకోఽభూ! న్మమోపరి. 31

ఇట్లు కొంతకాలము నిశ్చల మనస్కుడను,సర్వసంగ పరిత్యాగిని గూడనై జపింప గా నాపై నొక్కగొప్ప పుట్ట మొలిచినది.

తతో యుగసహస్రాంతే ఋషయః పునరాగమన్,
మా మూచుర్నిష్క్రమస్వేతి తచ్ఛ్రుత్వా తూర్ణ ముత్థితః. 32

ఇట్లు వేయియుగములు గడచిన వెనుక పూర్వము నాకుపదేశ మిచ్చిన ఋషులు తిరిగి నాకడకు వచ్చి "నాయనా! పుట్టనుండి బయటకు రమ్ము" అని పిలువగానే నేనును పుట్టనుండి బయల్వెడితిని.

వల్మీకా న్నిర్గతశ్చాహం నీహారాదివ భాస్కరః,
మామప్యాహు ర్మునిగణా వాల్మీకి స్త్వం మునీశ్వర!
ఇత్యుక్త్వా తే యయు ర్దివ్యగతిం రఘుకులోత్తమ! 33 ½

మంచుచాటు నుండి వెల్వడు భాస్కరుని చందమున పుట్టనుండి బయల్వెడిన నన్నుజూచి యాఋషి శేఖరులు నాకు వాల్మీకి మహర్షియని నామ కరణమొనర్చి యంతర్ధాన మందిరి

[1] అహం తే రామనామ్నశ్చ ప్రభావా దీదృశో ఽభవమ్,
అద్య సాక్షా త్ప్రపశ్యామి ససీతాం సహలక్ష్మణమ్. 34 ½

కావున నో రామా! నీ నామ ప్రభావమువలననే యిట్టివాడనైతిని. ఇప్పుడు నేను సీతాలక్ష్మణసహితుడవగు నిన్ను బ్రత్యక్షముగ జూచుచున్నాను.

ఆగచ్ఛ రామ! భద్రం తే స్థలం సందర్శయామ్యహమ్,
ఏవముక్త్వా మునిశ్శ్రీమా న్మధ్యే పర్వత గంగయోః,
స్థలం సందర్శయిత్వా తు జగామ స్వాశ్రమం మునిః. 35-36

అని వాల్మీకి యానందపరవశుడై పలికి మఱియు నిట్లనియెను. ఓ రామచంద్రా! యిటు రమ్ము. నీ నివాసమునకు యోగ్యమైన స్థలమును గనబఱచెదను అని వాల్మీకి మహర్షి యారామచంద్రుని వెంటఁగొంపోయి చిత్రకూటపర్వతమునకును, గంగానదికి మధ్యభాగమందొక స్థలమును జూపించి తాను తన యాశ్రమమున కేగెను

తతో లక్ష్మణ మాహేదం వచనం రాఘవః పునః,
వంశా న్శాఖా స్సమానీయ వాతవృష్ట్యవినశ్వరమ్,
పర్ణశాలా దృఢం రమ్యా నిర్మితవ్యా త్వయా ద్రుతమ్. 37 ½

పిమ్మట రాముడు లక్ష్మణునితో నిట్లు పలికెను. వెదురువాసములను,

1. కవిః

చెట్ల కొమ్మలను, తెచ్చి గాలికిని వానకును జెడకుండునట్లు దృఢమును నందమునగు నొక పర్ణశాలను నిర్మింపుము.

ఇత్యుక్తో లక్ష్మణో గత్వా వంశాదీ నానయ ద్ద్రుతమ్
పర్ణశాలాం నిర్మితవాన్ దృఢాం రమ్యాం చ విస్తృతామ్ 38½

అన విని లక్ష్మణుడు వెంటనే బయలుదేరి వెదురు మొదలగు వానిని తెచ్చి గట్టిదియు నందమైనదియు నగు నొకవిశాలమైన పర్ణశాలను నిర్మించెను.

వేదిస్థల విధానాని చైత్యాన్యాయతనాని చ,
ఆశ్రమస్యానురూపాణి స్థాపయామాస రాఘవః. 39 ½

ఇచ్చట తమయాశ్రమమునకు ననువగు నరుగులను, దేవమందిరములను శ్రీరామభద్రుఁడేర్పఱచెను.

తత స్సౌమిత్రి మాహేదం రాఘవో ధర్మతత్త్వవిత్,
సంపాదయ త్వం సౌమిత్రే మృగమాంసం చ సత్వరమ్,
గర్తవ్యం వాస్తుశమనం సౌమిత్రే చిరవాసిభిః. 40-41

పిమ్మట రాముడు లక్ష్మణున కిట్లనెను, లక్ష్మణా! ఈ ముహూర్తము చాల శ్రేష్ఠమైనది. గృహమందు చిరనివాసము చేయ గోరువారు వాస్తుశాంతి చేయవలయునుగాన వెంటనే నీవు కొన్ని మృగములను వేటాడి మాంసమును తెమ్మనెను.

తత స్సౌమిత్రిణానీత మైణేయం మాంస ముత్తమమ్,
పత్రపుష్పఫలాదీంశ్చ దృష్ట్వా రామో ముమోద సః. 42

పిమ్మట లక్ష్మణుడు తెచ్చిన మృగమాంసమును, పత్రములను, పుష్పములను, చూచి రాముడును మిక్కిలి సంతోషించెను.

పశ్చా ద్వారుణ మజ్జనం ప్రథమతః కృత్వా గణేశం భజన్,
*పుణ్యాహం చ సమాప్య వాస్తుశమనం కృత్వా తతో రాఘవః
సంపూజ్యాపి చ గేహదైవతగణం మంత్రా న్పఠ న్స్వై స్వయమ్,
కృత్వా భూతబలిం ప్రవిశ్య సదనే సీతాయుతో ఽమోదత. 43

పిమ్మట శ్రీరామచంద్రుడు నదీస్నానమాచరించి, పరిశుద్ధుడై విఘ్నేశ్వరుని బూజించి పుణ్యాహవాచనము గావించి వాస్తుశాంతి నిర్వహించి గృహదేవతలఁ బూజించి స్వయముగా మంత్రములను బఠించుచు, భూతములకు బలి నొసంగి సీతాసహితుడై యాపర్ణశాలయం దానందముగ బ్రవేశించెను.

---

*అత్ర బహుషు బాడబేషు సత్స్వపి తైర్వినా స్వయమేవ వాస్తుమంత్ర పఠనాదికం సర్వం యాజనరూపం కర్మ రామేణైవ కృత మిత్యవగమ్యతే, తదనుపపన్నం! యజన యాజ నాధ్యయనాధ్యాపన దానప్రతిగ్రహరూపేషు షట్కర్మసు బ్రాహ్మణస్యైవాధికారాత్!షణ్ణా మేతేషాం మధ్యే ప్రదమ తృతీయపంచమేష్వేవ క్షత్రియస్యాధికృతత్వాచ్చ యాజనరూపే కర్మణి క్షత్రియస్యాధికారసంభవేన బ్రాహ్మణవిహితం యాజనరూపం కర్మ రాఘవేణ కథ మాచరితమితిచే దత్రోచ్యతే. యాజనాధ్యాపన ప్రతిగ్రహరూప కర్మత్రయస్య బాడబానాం వృత్త్యర్థత్వేన కథితత్వాత్ తదనాచరణేఽపి బాడబానాం న హి ప్రత్యవాయో భవేత్ వర్ణాశ్రమధర్మవిధీ ననుసృత్యైకస్య వృత్త్యాన్యో న జీవేదితి తదాశయః. అతో వృత్త్యంతరవతః క్షత్రియస్య యజనాధ్యయనదానే ష్వేవాధికృతి స్స్యాత్, నహ్యపరేషు త్రిష్వధికృతి ర్భవేత్. తథాఽపి యాజనాదీనా మపరేషాం త్రయాణాం వృత్త్యర్థతయా కరణం వా లుబ్ధతయా కరణం వా న యుక్తం క్షత్రియాణా మిత్యేవ శాస్త్రాశయః, న త్వవసరేసతి తదనుష్ఠాననిషేదః. యధా గృహనిర్మాణాదేః కర్మణ స్తక్షకధర్మత్వేఽపి రామకర్తృక తన్నిర్మాణ కరణం దృశ్యతే, యధా కౌశికః క్షత్రియోఽపి త్రిశంకునా క్రతుం కారయామాస తదా రామోఽత్ర యాజనరూపం కర్మ కృతవానితి జ్ఞేయం తథా చ వృత్త్యర్థత్వేన తత్కరణే దోషో నాన్యథేతి నిశ్చితవ్యం.

*ఇచ్చట బ్రాహ్మణశ్రేష్ఠురు లనేకులు కలిగియున్నను వారి నుపేక్షించి వాస్తుమంత్రపఠనము మొదలగు సమస్త క్రియాకలాపమును రాముఁడే స్వయముగా నిర్వర్తించుకొనినట్లు వ్యక్తమగుచున్నది. ఇది యుక్తముగా లేదు.

(1) విధ్యుక్తములగు క్రియలు చేయుట (2) చేయించుట. (3) వేదమును చదువుట. (4) చెప్పుట (5) దానమిచ్చుట. (6) పుచ్చుకొనుట- అనునీయారు కర్మలయందును మొదటిదియు, మూడవదియు, నైదవదియు నగు, మూడుకర్మలయందు మాత్రమే క్షత్రియుల కధికారము చెప్పబడి యుండుటచేత యాజన కర్మయందు (కర్మచేయించుటయందు) క్షత్రియుల కధికారము లేదు, కావున బ్రాహ్మణునకు విహితమైన యాజనకర్మయందు (అనఁగా వాస్తుకర్మ చేయించుట యందు) రాముడు ప్రవర్తించుట ధర్మశాస్త్ర విరుద్ధమని యాశంకరాగా సమాధానము చెప్పఁబడుచున్నది. కర్మల చేయించుట, వేదము చెప్పుట, దానము పుచ్చుకొనుట యను నీ కర్మత్రయము బ్రాహ్మణులకు జీవనోపాయములైన వృత్త్యర్థముగాఁజెప్పుటచేత నాకర్మత్రయ మాచరింపకున్నను బ్రాహ్మణులకు దోషము లేదనియు, వర్ణాశ్రమ ధర్మముల ననుసరించి యొకకులమునకు విహితమైన వృత్తిచే మఱియొక కులీనుడు జీవింపకూడదనియు దానికరము. కావున మఱియొక వృత్తి కల్గిన క్షత్రియునకు యజ్ఞముచేయుట, అధ్యయనము చేయుట. దానమిచ్చుట యను నీ కర్మత్రయమునందే యధికారము కాని యితరములగు యాజనాదికర్మల మూటియందు నధికారము లేదను మాట వాస్తవమే కాని యాజనము మొదలగు కర్మత్రయమును క్షత్రియులు వృత్త్యర్థమై బెట్టుకొని కాని, ధనాశచేగాని కర్మను చేయించుట యుక్తము కాదనియే శాస్త్రాశయముగాని, యవసరమైనప్పుడు పూర్వోక్తము లగు యాజనాది కర్మత్రయమును సమాచరింపఁగూడదని కాదు.

సత్త్వాశ్రమానుగుణ సద్బలిపీఠ దేవ
గేహాదికమ్ నిఖిలమప్యథ కల్పయిత్వా!
వేదోక్తమంత్రవిధినా చ సురార్చనం తు
కుర్వ న్గృహే వసతి మౌనిజనై స్సమిద్ధ్యః. 44

పిమ్మట రామచంద్రు డాశ్రమమున కనుగుణములగు బలిపీఠములు, దేవతామందిరములు మొదలగువానిని గల్పించుకొని వేదోక్తవిధిచే దేవతార్చనాదికమును నిర్వర్తించుకొనుచు నచ్చట మునిజనులతో గూడి సుఖముగఁ గాలము బుచ్చుచుండెను.

సీతే కింశుకవృక్షజాల మభితో నిర్గంధపుష్పైర్యుతమ్
పశ్యేమాం సహకారవృక్షవితతిం పశ్యాత్ర రమ్యాం స్తరూన్,
పశ్యేమాం మధుపట్టికాం బహు మధుస్రావాన్వితాం బర్హిణః
కూజచ్చిత్రవిచిత్రపక్షినివహా న్వృక్షేషు పశ్య ప్రియే. 45

ఒకప్పుడు సీతతో వనవిహారము సల్పుచు రామభద్రు డాప్రేయసికి వనరామణీయకములను వేర్వేరుగ నిరూపించి చూపుచు నిట్లు చెప్పఁదొడంగెను. ప్రేయసీ! యీకింశుకవృక్షజాలమును తిలకించితివా? గంధరహితములయ్యు నేత్రానంద మొనర్చు పుష్పగుచ్ఛములచే నత్యంత శోభితములై చూడజూడ గడు నందముగా నెట్లు గానవచ్చుచున్నదో? సీతా! ఆ తియ్యమామిడిగున్న పొదలను గమనించితివా? యెంత యందముగ నున్నవో? అత్యధికముగ మధువును స్రవించు నీ తేనెతుట్టెలను కనిపెట్టితివా? యెంత పెద్దవిగ నున్నవో? అవిగో యా నెమలి పిండు లెంత యొయ్యారముగ సంచరించు చున్నవో చూడుము. భళీ! యీ పూపొదరిండ్ల దూరి చిత్రాతిచిత్రముగఁ గూయుచు గంతు లిడు నీ పక్షికులమును కన్నఁ గన్నులపండువు గదా!

పశ్యేమా న్కలకంఠశారికశుకాలాపా న్మనోజ్ఞా న్పునః
పశ్య ప్రేయసి సత్ఫలై ర్వినమితా న్వృక్షా న్నికుంజాం స్తథా,
పశ్యేమాశ్చ లతాస్సుగంధకుసుమై ర్వ్యాప్తా మృగీణాం చయం
వేణూనాం నినదం మిళింద మధురారావం శ్రుణు ప్రేయసి! 46

---

గృహనిర్మాణాదులు తక్షకధర్మములైనను (అనగా వడ్రంగి ధర్మమైనను) రామునిచే పర్ణశాలా నిర్మాణము నవసరమగుటచే నెట్లు నమాచరింపబడినదో, మఱియు క్షత్రియు డయ్యును విశ్వామిత్రుడు త్రిశంకునిచేత యజ్ఞమునెట్లు తప్పనిసరి యగుటచే చేయించుటకుఁ బూనుకొనెనో, యట్లే రాముడును నిచ్చట యాజనకర్మ చేసెనని యెఱుంగునది. కావున నొకరివృత్తిని మరియొకరు వృత్తిగా గ్రహింప కూడదుగాని, తప్పని సరియైనప్పు డా కర్మలను తాను స్వయముగఁ జేసికొన్నను దోషము లేదని భావము.

అదె! యాధ్వని నాలకింపుము. కలకంఠశారిక శుకాదిపక్షి నివహమ్ముల కలనాదమ్ములు కలసిమెలసి యెంత హృదయాహ్లాద మొనర్చు చున్నవో? సీతా! యీచెట్లచాల్పులు ఫలభరమ్మున వినమితములై నీకు ఫలమ్ముల నందిచ్చుచున్నట్లున్నవి. కనుగొమ్ము. ఈ పొదరిండ్లు పుష్పములు కానుకగా నర్పింపమో యన్నట్లు పత్రములను కరముల నిన్ను బిల్చుచు గుత్తముగ బూచిన పుష్పగుచ్ఛములఁ గన్పఱచుచున్నవి. గమనించితివా? అబ్బ! ఆతుమ్మెదదండు జుమ్మని రేగి నీకుఁబాటలు వినిపింపనేయన గ్రమ్ముకొని వచ్చుచున్నది. నీయందములైన దృష్టుల వాని సత్కరింపుము. ఓహో నీ! చెలికత్తెలు కాబోలు నాంయాడుులేళ్ళు, పాపము వాటిని పిలిచి పలుకరింపఁగూడదా, ఆ వినిపించుచున్న నాదమేదియో గుర్తించితివా? వేణునాదము తుమ్మెదల హుంకారనాదములతో నేస్తమాడి నీవీనులకు విందొనర్పవచ్చుచున్నదేమో!

ఇత్యేవం భూమిజాయాస్తు దర్శయ న్రాఘవః పునః,
చిత్రకూటే విచిత్రాణి తోషయన్నాస జానకీమ్. 47

ఇట్లు నేత్రానందకరములగు నా చిత్రకూట పర్వతమందలి ప్రకృతి శోభలను సీతకు చవులూర చూపించి చెప్పుచు రాముడామెకు వనవాసక్లేశము నెల్ల సుఖమయముగాఁ దోచునట్లు చేసెను.

ఏవం రామో భూమిజయా లక్ష్మణేన సమన్వితః,
సర్వసౌఖ్యాన్వితో దుఃఖ మజాన న్విప్రవాసనాత్,
చిత్రకూటాశ్రమే తస్థౌ సుఖ మాత్మగృహే యథా. 48-49

ఇట్లు రాముడు సీతాలక్ష్మణ సహితుడై వనవాస దుఃఖము నెల్ల మరచి చిత్రకూటపర్వతమునందు తనగృహమందున్నయట్ల సుఖముగ నుండెను.

ఇత్యాశ్చర్య రామాయణే అయోధ్యాకాండే ద్వితీయభాగే పంచమస్సర్గః సమాప్తః
ఆశ్చర్యరామాయణమున, అయోధ్యాకాండమున ద్వితీయభాగమున పంచమసర్గ సమాప్తము.

# షష్ఠస్సర్గః - ఆరవసర్గ

[1]తత స్సమాపృచ్ఛ్య గుహం ప్రతస్థే
నిశమ్య పాంథా త్సరథ స్సుమంత్రః,
స్థితం భరద్వాజవనే ప్రయాణం
శ్రీచిత్రకూటంప్రతి రాఘవస్య. 1

పిమ్మట రాముడు భరద్వాజాశ్రమము చేరి, యటనుండి చిత్రకూటమునకు ప్రయాణ మయినట్లు బాటసారులవలన సుమంత్రుడు విని గుహుని సెలవడిగి రథమెక్కి యయోధ్యకు బయలుదేరెను.

రథమాస్థాయ సాయాహ్నే సూతోఽయోధ్యాం జవాద్గతః,
క్రమా ద్దశరథం ప్రాప్య పుత్త్రశోకాకులం నృపమ్,
నత్వా తం రామసందేశం ప్రాహ సూతో యథాతథమ్. 2½

అట్లు రథారూఢుడై యానాటి సాయంకాలమునకే యయోధ్యకు జేరుకొని రాజగృహమున కేగి పుత్రశోకముచే బీడితుడైన దశరథుని దర్శించి నమస్కరించి రాముని సందేశమున్నది యున్న ట్లాతనికి వినిపించెను.

తథా లక్ష్మణసందేశ మేవం ప్రాహ నృపం తు సః,
లఘ్వ్యాః కేకయపుత్ర్యాస్తు వచోమాత్రా త్సుదుర్నయాత్,
*ప్రజా స్సర్వా విరు ద్ధైతా స్స్యు త్కథం నృపతి ర్భవాన్,
ఇత్యేవం భరతం బ్రూహి సుమంత్రేత్యాహ లక్ష్మణః. 3-4 ½

---

*అనేన సకలజ నోద్వేగకరో రాజా రాజ్యం న ప్రాప్నోత్యేవ, కథంచి త్ప్రాప్తరాజ్యోఽపి తస్మా ద్భ్రశ్యతీతి సూచితం తథాహి-యస్మా ద్బిభ్యతి భూతాని మృగవ్యాధా న్మృగా ఇవ సాగరాంతామపి మహీం లబ్ధ్వాసౌ పరిహీయతే, ఇత్యుక్తం.

*ఇట్లనుటచే ప్రజలకు విరుద్ధముగ నుండు రాజునకు రాజ్యము ప్రాప్తించదనియు, నొకవేళ రాజ్యప్రాప్తి గలవాడైనను వెంటనే రాజ్యభ్రష్టుడు కాగలడనియు సూచిత మగుచున్నది. దీనికిఁ బ్రమాణము కలదు. వేటకానిని జూచి లేళ్ళు పరువులు పెట్టినట్లు రాజునుం జూచి ప్రజలు భయపడుచుందురు. ఆ రాజు చతుస్సముద్రముద్రితమైన యీధరామండలము నంతయు సంపాదించినను వెంటనే రాజ్యభ్రష్టు డగుచున్నాడు.

---

1. వా ॥ రా ॥

*పిమ్మట లక్ష్మణుడు భరతునకుఁ జెప్పుమని తనతోఁ జెప్పినమాటలను గూడ దశరథునకు సుమంత్రు డివ్విధముగ వినిపించెను. స్వల్పబుద్ధి గల కైకయొక్క చెడుమాటలవలన రాముని నరణ్యమునకుఁ బంపుట యనుచిత మనియు, ప్రజల కందరికి విరుద్ధముగా నీవు రాజ వెట్లగుదువో చూచెద ననియు భరతునకు చెప్పు"మని.

**తద్వచశ్శ్రుతిసంజాతమనోవ్యాకులతాయుతః,**
**తదా దశరథః ప్రాహ సుమంత్రం వచనం శుచా. 5½**

ఆలక్ష్మణుని వాక్కులను సుమంత్రుడు చెప్పగా విని దశరథుడు దుర్భరమైన మనోవ్యాకులతకు లోనై సుమంత్రునితో నిట్లనెను.

***భవితవ్యతయా నూన మిదం హి వ్యసనం మహత్,**
**కులస్యాస్య వినాశాయ ప్రాప్తం సూత! యదృచ్ఛయా. 6½**

సుమంత్రా! యిట్లు నే ననుభవింప వలసిన కారణ ముండుట చేతనే నే నెవరితోను సంప్రదించక స్వేచ్ఛగా నింతసాహసకార్యము చేసితిని. ఈ మహాకష్టము దైవికముగకుల వినాశనమునకై సంప్రాప్త మైనది.

---

*అనేన మంత్రిసూతసుహృజ్జనై రనాలోచ్య స్వేనైవ విచార్య కార్యకరణే మహా ననర్థో భవతీతి సూచితం తథా చ సభాపర్వణి యుధిష్ఠిరం ప్రతి చతుర్దశసు రాజదోషే ష్వేకచింతనమపి పరిగణితం నారదేన.

నాస్తిక్య మనృతం క్రోధః ప్రమాదో దీర్ఘసూత్రతా; ఆదర్శం జ్ఞానవతా మాలస్యం పంచవృత్తితా। ఏకచింతన మర్థానా మనర్థజ్ఞైశ్చ మంత్రణం। నిశ్చితానా మనారంభో మంత్రస్యాపరిరక్షణం। మాంగల్యస్యాప్రయోగశ్చ ప్రసంగో విషయేషు చ। కచ్చి త్త్వం వర్జయే దేతా న్రాజదోషాం శ్చతుర్దశ॥ ఇతి.

*వ్యా. ఇట్లనుటచే మంత్రులు, సుతులు, మిత్త్రులు మొదలగు నాప్తవర్గముతోడ నాలోచింపక రాజకీయ కార్యము లాచరించుట రాజున కెన్నడును ధర్మము కాదని సూచిత మగుచున్నది. ఇట్లే సభాపర్వమందు ధర్మరాజుతో పదునాలుగు రాజదోషములను నారదుడు నిరూపించి చెప్పుటలో నొక్కడు కార్యాలోచనము చేయుట గూడ నా పదునాలుగు రాజదోషములలో జేర్చి చెప్పెను.(అని యేవనగా)

దేవుడు లేడనుట, అబద్ధము లాడుట, ఎల్లప్పుడు ముక్కోపియై యుండుట. అజాగ్రత్త, దీర్ఘాలోచనము, సజ్జనుల నెన్నడును దర్శింపకుండుట, మాంద్యము, ఇంద్రియలోలత్వము, ఒక్కడుగ కార్యాలోచన చేయుట, తనకనర్థమును గలుగజేయు జనులతో నాలోచన చేయుట, నిశ్చితములగు కార్యముల నారంభింపక పోవుట, ఆలోచించిన విషయమును దాచకుండుట, మాంగల్య సూచకములైన పనులయం దశ్రద్ధ వహించుట, భోగ్యవస్తువుల యందనురాగము, (అను నీ పదునాలుగు రాజదోషములను నీవు విడిచిపెట్టితివి గదా యని నారదుడు ధర్మరాజును ప్రశ్నించెను.)

**రాజ్ఞో విలాపశ్రవణేన పశ్చా త్సంజాతశోకాకులమానసా చ**
**తతోఽబ్రవీ త్సూత మిదం వచస్తు శ్రీరామమాతా విపదంబుధిస్థా.7½**

ఇట్లు దశరథుడు సుమంత్రునితోఁజెప్పి విలపించుచుండగా నాపత్సముద్రములో నున్న కౌసల్య సుమంత్రునితో నిట్లు పలికెను.

**సుమంత్ర యత్ర రామోఽస్తి తత్ర మాం నయ సత్వరమ్,**
**తం వినా క్షణమప్యత్ర జీవితుం నోత్సహే హ్యహమ్. 8½**

సుమంత్రా! నా శ్రీరామచంద్రుడున్న చోటికి నన్నుగూడ గొంపొమ్ము. వానినిఁ జూడక నేనింక క్షణకాల మేనియు జీవింపఁజాలను.

**యది తం నానుగచ్ఛేయ మహం ప్రాప్స్యామి వై మృతిమ్,**
**ఇతి తం ప్రార్థయామాస కౌసల్యా పుత్రలాలసా. 9½**

సుమంత్రా! నా కొమరుని యొద్దకు నన్ను వెంటనే జేర్చవేని నేను తప్పక మృత్యుపున కెరకాఁగలను అని బహువిధముల పుత్రమోహితయై కౌసల్య సుమంత్రునిఁ బ్రార్థించెను.

**సుమంత్రోఽపి తత స్సాంత్వ వచనై స్సాంత్వయంశ్చ తామ్,**
**కౌసల్యాం ప్రాహ వచనం తత్సంతాపనివారకమ్. 10½**

సుమంత్రుడును కౌసల్యను పలువిధముల నోదార్చి ఆమె సంతాపమును నివారించుచుఁ గౌసల్యతో నిట్లనెను.

**[2] వ్యవధూయ చ సంతాపం వనే వత్స్యతి రాఘవః,**
**లక్ష్మణశ్చాపి రామస్య పాదౌ పరిచర న్వనే. 11½**

అమ్మా! శ్రీరామచంద్రుడు వనవాసమువల్లనైన సంతాపమునెల్ల మఱచి సుఖియై యున్నాడు. లక్ష్మణుడును రామపాదములను సేవించుచు మహానంద మనుభవించుచు సుఖముగా నున్నాడు-సీతయు నంతకంటె సంతోషముగ నున్నది.

---

1. కవి 2. వా ॥ రా ॥

*న శోచ్యా స్తే నచాత్మా తే న చ శోచ్యో నరాధిపః,
ఇదం హి చరితం లోకే ప్రతిష్ఠాస్యతి శాశ్వతమ్. 12½

*అమ్మా!వారడవులలోఁగష్టపడుచున్నారని వారినిగూర్చిగాని, నన్ను విడిచి నాకింత దుఃఖము కలిగించిరియని నిన్నుగూర్చిగాని, రాజు వానిని నడవులకుఁబంపిరని రాజునుగూర్చి గాని నీవు దుఃఖపడవలసిన పనిలేదు. వీరిచరిత్రము స్థిరమై కీర్తితోడ భూమియందు నిలుచును.

[1]గ|| తతః కౌసల్యా సుమంత్రకృతసాంత్వనశతమ ప్యనాదృత్య
ధృతమునివేషం ససీతం రామం వనగతం విచింత్య ఉపభుజ్య
చ నివిశ్య చ హంసతూలికాతల్పం సమాకర్ణ్య చ శ్రుతి
సుఖవీణా వేణుమృదంగ కలరవాన్ విహృత్యచ హర్మ్యప్రాసాద
తలేషు సుకుమారో రాజకుమారః కథమిదానీం వివిధవృక
వరాహ వనమహిష సింహాది వన్యమృగాకీర్ణే వనే ఉపభుంజ
న్వన్య మాహారం సంవిశన్కఠోరతర పాషాణదంతురితదేశాన్
ఉప శృణ్వన్ హృదయవిదారణ వివిధకాకఘూక భేకాదిశబ్దాన్
శోకాకులహృదయో రామభద్రః కాం వా వృత్తిం వర్తయేత్. 13½

పిమ్మట గౌసల్య సుమంత్రుని యోదార్పుమాటలను గూడ శోకావేశమున బెడచెవిని పెట్టి రాముని పలుమారులు తలంచుకొని యిట్లు వాపోవఁజొచ్చెను. అహా! మృదువైన దుకూలములు ధరించు నా కన్నతండ్రి రామచంద్రు డానారచీరలు ధరించి కఠినములైన వనభూములందు సంచరించుచు నెట్లున్నాడోగదా! నా యయ్య రుచ్యములగు వంటకములు భుజించి విశ్రమించి హంసతూలికాతల్పమందు సుఖనిద్రచెంది యల్లన మేల్కాంచి శ్రవణసుఖముగ వీణావేణు మృదంగాదుల యొక్క మధురములైన గానముల నాకర్ణించి రత్నస్థగిత హర్మ్యముల యందు ప్రాసాదముల యందు సంచరించువాడే! అట్టిసుకుమారుఁడు రామచంద్రుఁ డిప్పుడనేక సింహ శరభ శార్దూలాది క్రూరజంతువుల కునికిపట్టై భయంకరములైన యక్కఠిన పాషాణ మయమ్ములగు

*అత శ్చిరకాలావస్థాయి యశస్సంపాదకః క్లేశో నశోచ్య ఇతి సూచితం.

*ఇట్లనుటచే చిరకాల స్థాయియగు యశస్సును సంపాదించుటకైన కాని, లోక క్షేమమునకై కాని పడెడి శ్రమమునకు విచారపడరాదని సూచిత మగుచున్నది.

1. క||

నరణ్యభూములందు సంచరించుచు గాయకసురులు భక్షించుచు హృదయములను బ్రద్దలు చేయునట్టి వివిధపక్షి రావముల నెట్లాకర్ణించుచు మనుచున్నాఁడో కదా? కటకటా, నా తండ్రి నారాముడు, దుఃఖములపాలై యెట్లుండెనోకదా?

**ఇతి రామంతు సంస్మృత్య సా విలప్యాఽహ భూపతిమ్.** 14½

ఇట్లు కౌసల్య రాముని స్మరించి స్మరించి విలపించి పిదప దశరథునిత నిట్లు పలికెను.

[1] **తథాహ్యత్తు మిదం రాజ్యం హృతసారాం సురామివ,**
**న నియంతు మలం రామో నష్టసోమమి వాధ్వరమ్.** 15½

రాజా! నాపుత్త్రుఁడొకవేళ నిచ్చటికి వచ్చునేమోకాని భరతుడు తిరిగి రాజ్యమును సమర్పింతునన్నను పాలించుటకు మాత్ర మిచ్చగింపడు

నాపుత్త్రుఁడింక, సారరహితమగు సురనువలె, సోమములేని యజ్ఞమునువలె నీ రాజ్యమును ముమ్మాటికి నొల్లండు. ఇతరులు పాలించి విడిచిన యీనిస్సారమైన రాజ్యము నేలుటకు నా కొడుకంత చెడిబ్రతికిన వాడు కాడు.

**స పుత్రాపి హతాఽహం చ రాజం స్త్వన్మూలతోఽధునా,**
**హతాః ప్రజాః హతం రాజ్యం త్వత్ప్రియా సుఖినీ భవేత్.** 16½

రాజా! నీమూలమున నాశనమైన దానను నేనొకతెనే గాను. నీవంటి యవివేకి రాజగుటవలన ప్రజలు, రాజ్యము సర్వము నాశనమైనది. నీ ప్రియురాలగు కైకమాత్రము తనకొడుకు రాజ్యభోగముల ననుభవించుచుండ హాయిగా నుండఁగలదు.

**తచ్ఛ్రుత్వా వచనం రాజా కౌసల్యాం ప్రాహ దుఃఖితః,**
**ప్రసాదయే త్వాం కౌసల్యే రచితోఽ యం మయాంజలిః.** 17½

ఈప్రకారము కౌసల్య కఠినముగాఁబలుకఁగా విని దశరథుఁడు మిక్కిలి దుఃఖితుఁడై కౌసల్యతో నిట్లనెను. దేవీ! నీకు నేనపరాధము చేసినవాడను. నీకంజలి ఘటించుచున్నాను. నన్ను క్షమింపుము.

---

1. వా ||

పతి ర్దైవం హి నారీణాం గుణీ వా నిర్గుణోఽపి వా,
నార్హసే విప్రియం వక్తుం దుఃఖితాఽపి సుదుఃఖితమ్. 18½

దేవీ!పతివ్రతలగు స్త్రీలకు, గుణవంతుడైనను, గుణహీనుఁడైనను, భర్తయేగదా! ప్రత్యక్షదైవము. గోరిచుట్టుపై రోకటిపోటన్నట్లు, పుత్రవియోగముతో దుఃఖించుచున్న నన్ను నీవు కఠినపు మాటలతో మఱింత దుఃఖ పెట్టుట దగునా?

ఇత్యేవం సాంత్వ్యమానా సా భర్తారం ప్రాబ్రవీ ద్వచః,
జానామి ధర్మం ధర్మజ్ఞ త్వాం జానే సత్యవాదినమ్. 19½

ఇట్లనేక విధములఁ దన్ను వేడుకొనుచున్న దశరథునిగూర్చి కౌసల్య తిరిగి యిట్లనెను నాథా! ధర్మజ్ఞ శేఖరా! నేనును ధర్మ మెఱుంగుదును. నీవు సత్యవాదివనియు నెఱుంగుదును.

పుత్రశోకాకులతయా యదయుక్తం మయేరితమ్,
క్షంతు మర్హసి నాథ! త్వ మితి తం ప్రాహ సా నృపమ్.
*శోకో నాశయతే సర్వం నా స్తి శోకసమో రిపుః. 20½

నాథా! నీవు నన్ను శాసింపఁదగిన వాడవుగాని ప్రార్థింపఁదగినవాడవు కావు. నీవు సత్యమునందు ప్రేమ కలవాడవని నేను తెలియనిదానను కాను. పుత్రశోకముచే నే నేమయినను నయుక్తములు పలికియున్నను వానినెల్ల క్షమింప వేడుచున్నాను - అని కౌసల్య దశరథుని పలువిధముల ప్రార్థించి మఱియు నిట్లనెను. నాథా! శోకము సామాన్య దుర్గుణము కాదు. సర్వమును నశింపఁజేయుచున్నది. ఈలోకమునందు *జనులకు శోకమును మించిన శత్రు వింకొక్కటి లేదు.

---

*అనేన శోకావిష్టస్య కృత్యాకృత్య వివేకభంగో భవేత్, అత స్సర్వనాశకర శ్శోక స్సర్వధా పరిత్యాజ్య ఇతి సూచితం స్త్రీపర్వణి ధృతరాష్ట్రంప్రతి సంజయః -

**కిం శోచసి మహారాజ న శోచన్ విందతే పరం, ఇతి.**

ఇట్లనుటచే శోకావిష్టునకు మంచి చెడు లనువివేకము భగ్నమై పోవును కాన సర్వనాశకరమగు శోకము త్యజింప వలయునని సూచిత మగుచున్నది

స్త్రీపర్వమందు ధృతరాష్ట్రునితో సంజయు డిట్లు చెప్పినట్లున్నది రాజా!యెందులకూరక శోకించెదవు శోకముచే నాముష్మికము కూడ చెడునని

ఏవం హి కథయంత్యాస్తు కౌసల్యాయా శ్శుభం వచః,
మందరశ్మి రభూ త్సూర్యో రజనీ చాభ్యవర్తత. 21½

కౌసల్య యారీతిని పలుకుచుండఁగనే సూర్యుఁ డస్తమించెను. అల్లనల్లన చీకట్లతోపాటు రాత్రియు నరుదెంచెను.

ప్రతిబుద్ధః క్షణేనైవ రాజా దశరథః పునః,
స్వకృతం మునిపుత్రస్య వధరూపం చ దుష్కృతమ్,
స్మృత్వా సంతప్తహృదయః కౌసల్యా మిద మబ్రవీత్, 23

పిమ్మట దశరథు డారవనాటిరాత్రి క్షణకాలము నిద్రించినట్లుండి వెంటనే మేల్కొని తానుపూర్వము చేసిన మునివధ మనమునకు దగిలి హృదయమందు శల్యమై వేధింప మహావ్యాకులుండై కౌసల్య కిట్లనెను.

*య దాచరతి కల్యాణి శుభం వా యది వాశుభమ్,
తదేవ లభతే భద్రే కర్తా కర్మజ మాత్మనః. 24

ఓ కల్యాణి!లోకమునందు మనుష్యుడు మేలుగాని కీడుగాని పరులకు నేది చేయునో దానినే ఫలకాలమున ననుభవించును. కాని యొకటి చేసిన మఱియొక్క ఫలముండదు.

---

ఆనేన శుభ మశుభం వా స్వేనకృతం కర్మ స్వసదృశ ఫలదానాయ కర్తార మనుసర త్యేవేతి సూచితం.

*ఇట్లనుటచే, శుభములైనను, అశుభములైనను, స్వకృతములైన కర్మలు ఫలము నొసంగుటకై కర్తననుసరించియే యుండునని సూచిత మగుచున్నది

తథాచ స్త్రీపర్వణి ధృతరాష్ట్రంప్రతి విదురవచనం

శయానం చానుశేతే చ తిష్ఠంతం చానుతిష్ఠతి, అనుధావతి ధావంతం కర్మ పూర్వకృతం నరః||ఇతి.

ప్రకృతే ఋషేః పుత్రవియోగకరణేన మమాపి పుత్రవియోగః ప్రాప్త ఇతిభావః

ఇట్లే స్త్రీ పర్వమునందున్నది. స్వకృతమైన సుకృతము నడచుచున్న వాని ననుసరించి నడచుచున్నది. పరువులెత్తు వాని ననుసరించి పరువులెత్తుచున్నదని(ప్రకృత సారాంశ మేమనఁగా దశరథుడు పూర్వమున మునికుమారుని జంపి యతని తల్లిదండ్రులగు గ్రుడ్డి మునిదంపతులకుఁ బుత్రవియోగమును గల్పించుటంజేసి యిప్పుడు దశరథునకును బుత్రవియోగము ప్రాప్తమయ్యెనని భావము.)

***అవిజ్ఞాయ ఫలం యో హి కర్మత్వే వానుధావతి,**
**న శోచే త్ఫల వేళాయాం యథా కింశుకసేచకః. 25**

ఓదేవీ! వివేకహీనుఁడు మామిడిచెట్లను నఱికి మోదుగుపూల కాంతిని జూచి మోదుగులను బెంచినట్లు నేనును రాగల కీడు నూహింపలేక నాశనమై పోవుటకు గొప్పపాపమును చేసితిని, చెప్పెదను వినుము.

**పురాఽహం శబ్దవేదీ సన్నేకదా మృగయామటన్,**
**వ్యాయామకృతసంకల్ప స్సరయూ మన్వగాం నదీమ్. 26**

పూర్వకాలమందు (అనగా నిన్ను వివాహమాడక పూర్వము) ఒకనాడు వ్యాయామందాసక్తిచే వేటకై సరయూనదీ ప్రాంతమున కేగి ఘోరజంతువులు నీళ్ళుత్రాగురేవున మాటు కల్పించుకొని యుంటిని.

**అథాంధకారే త్వశ్రౌషం జలే కుంభస్య మజ్జతః,**
**అచక్షుర్విషయే ఘోషం వారణస్యేవ నర్దతః. 27**

నే నా నదియొద్దున జేరునప్పటికి లోకమెల్ల చీకట్లు క్రమ్మి రాత్రి కాఁజొచ్చెను. ఆచీకటియందొక ఋషికుమారుడు కడవను నీటియందు ముంచుచుండగా బయలుదేరిన శబ్దమును నీటియందు మునిగిన యేనుగు శబ్దమని యప్రత్యక్ష మగుటచే భ్రమించితిని.

**అమందం నిశితం బాణం త్వముంచం తస్యచోపరి,**
**మదస్త్రపీడిత స్సద్యో మునిపుత్రోఽభవ త్తదా. 28**

వెంటనే మెల్లఁగా వాడియైన బాణము నొకటి యావైపునకు వదలితిని. పిమ్మట హాతాతా! యను నార్తనాదము వినవచ్చుటచే మునిపుత్రుని గొట్టితినని తెలిసికొంటిని.

---

*అనేన భావిఫలగురులాఘవాదివిచారపూర్వకం కర్మ కర్తవ్యం నత్వవిచార్యేతి సూచితం.

అభియుక్తోక్తిరపి - ఉచిత మనుచితం వా కుర్వతా కర్మజాతం పరిణతి రవధార్యా యత్నతః పండితేన, ఇతి.

ఇట్లనుటచే రాబోవు ఫలములయొక్క గురులాఘవములను విచారించుచుఁ గర్మ చేయవలయునని సూచితమగు చున్నది.

దీనికభియుక్తవచనము కూడ కలదు.

ఉచితమునుగాని యనుచితమునుగాని మనుష్యుడు కర్మచేయునప్పు డాకర్మయొక్క పరిణామమునుగూడ ముందు బాగుగ విచారించి చేయవలయునని.

తదంతికగతం ప్రాహ మునిపుత్త్రస్తు మాం ప్రతి,
పిపాసితాంధగుర్వర్థం జల మాహర్తు మాగతః,
[1]నిరాగసంప్లుతాఽంధౌ మాం పితరౌ మే హతౌ త్వయా. 29½

తెలిసికొని వెంటనే యాతనిని సమీపింపఁగా నామునిపుత్త్రుడు నాకిట్లనెను. మిక్కిలి దాహపీడితులై యున్న నాతల్లిదండ్రులకు జలము గొంపోవ నిటకు వచ్చితిని. నీవు నన్ను జంపుటయే కాక యంధులగు నా తలిదండ్రులను గూడ నిష్కారణముగ జంపినవాడ వైతివి.

పితుస్త్వమేవ మే గత్వా శీఘ్ర మాచక్ష్వ సత్వరమ్,
సముద్ధర శరీరా న్మే శల్యం త్వం బాధితస్య మే. 30½

నీవు శీఘ్రముగ నా తల్లిదండ్రు లున్నతావునకుఁ బోయి యీజలకలశము నిచ్చి వారి కీ వార్తను దెలియఁజెప్పుము. ముందు నా శరీరమందలి యీ శల్యమును బెఱికి నా బాధను నివర్తింపుము.

ఇతి తద్వచనా ద్రాజ్ఞా సముద్ధృతశర స్తతః,
మునిపుత్త్రోప్యగా ద్దిష్టాం గతి మన్యసుదుర్లభామ్. 31½

అనఁగా వాని మాటలు విని నేనును శరమును మునిపుత్రుని శరీరము నుండి యూడఁబెఱికితిని. వెంటనే మునిపుత్త్రుడును పరలోకమునకుఁ జనెను.

మునిపుత్త్రోఽక్తమార్గేణ పూర్ణకుంభ మహం పునః,
ధృత్వాఽఽశ్రమం మే విశత శ్శబ్దం శ్రుత్వాఽథ తౌ పునః,
మత్వా స్వపుత్త్రం మాం తూర్ణ మాయాహీత్యూచతు స్తతః 32-33

పిమ్మట నేను నతడు చెప్పిన మార్గమునుబట్టి జలపూర్ణమగు గలశముతో గూడ నమ్ముని యాశ్రమమును జేరుకొంటిని. అట్లాశ్రమమున బ్రవేశించుచున్న నా కాలిచప్పుడు విని యా మునిపుత్త్రుని తల్లిదండ్రులగు నా మునిదంపతులు నన్ను తమ పుత్త్రకునిగా నెంచి నాయనా! శీఘ్రముగా నిటు రమ్మని పిలిచిరి.

క్షత్రియోఽహం దశరథ స్తవపుత్త్రో న చాభవమ్,
గజభ్రమాన్మయా పుత్త్ర స్తే హత శ్శబ్దవేదినా,
*శేష మేవం గతే యత్స్వా త్త త్తసీదతు మే మునిః. 34½

*అనేన మహాత్స్వపరాధినా అప్రసాదనే మహానన్నర్థో భవతీతి సూచితం అతఏవ తపస్యత శ్శమీకస్య కంఠే మృతం సర్పం పరిక్షిప్యత మప్రసాద్య గతస్య పరీక్షిత శ్శృంగిశాపా దనర్థస్సంపన్నః

1. కవిః ||

*అప్పుడు నేనిట్లు వారికి సమాదానము జెప్పితిని నేను మీ పుత్త్రుడను గాను, దశరదుడను పేరుగల క్షత్రియుఁడను గజమను భ్రమచే నేను మీ పుత్త్రుని శబ్దవేది యను నస్త్రము సందించి కొట్టితిని అంత మీ పుత్త్రుడు మృతిజెందినాఁడు ఈ జరిగిన యపరాదమునకు నన్ను క్షమింపుడు

**తచ్ఛ్రుత్వా పితరౌ తస్య విలప్యావదతాం చ మామ్**
**చితిం కురు ద్రుతం రాజ న్నావాం యావ స్సురాలయమ్. 35½**

అనఁగా విని యా యంధులగు ఋషిదంపతులు చాలసేపు విలపించి నాతో నిట్లనిరి. రాజా!ఇంక మాకు మాత్ర మీ లోకముతోఁ బనియేమి? ఒక చితి నేర్పఱచుము మేమును దానియందుఁబ్రవేశించి స్వర్గమును జేరుకొందుము

*పుత్త్రవ్యసనజం దుఃఖం య దేతన్మమ సాంప్రతమ్,
ఏవం త్వం పుత్త్రశోకేన రాజ న్నంతం కరిష్యసి,
ఇతిశాపం దదౌ మహ్యం మహర్షి స్తదనంతరమ్. 36-37

పుత్త్రశోకరూపమైన దుఃఖమును మాకు నీవు కలిగించితివి గావున నిట్లే నీవును బుత్త్రశోకముచేతనే మరణించఁగలవు అని యా యంధుడైన ముని నన్ను శపించెను

**మమ సాహాయ్యతః పుత్త్రసన్నిధిం ప్రాప్య జాయయా,**
**తమాలింగ్య విలప్యాథ మత్తక్ర ప్తచితౌ మునిః,**
**ప్రవేశ్య సాకం పుత్త్రేణ జాయయా త్రిదివం గతః. 38½**

---

*ఇట్లనుటచే సజ్జనులకు పొరపాటున నపచారము జరిగినప్పుడు వెంటనే యనుగ్రహింపవేడకున్న గొప్ప యనర్థము సంప్రాప్తించఁ గలదని సూచిత మగుచున్నది కావున నే తప మొనర్చుకొనుచున్న శమీకమహర్షి కంఠమందు పరీక్షిత్తనురాజు మృతసర్పమును జుట్టి యతని యనుగ్రహమును వేడక గృహమున కరిగినందున పరీక్షిన్నరేంద్రునకు శృంగియను శమీకపుత్త్రుని శాపమువలన ననర్థము ప్రాప్తించినది

* అత్రేదం జ్ఞేయం

శూద్రాయాం వైశ్యా జ్జాతస్య మునికుమారస్య కరణ జాత్యవగమాత్ బుద్ధి పూర్వకవధాభావా ద్రాజ్ఞో బ్రహ్మహత్యాదోషో నా స్తీతి

ఇచ్చటఁదెలియఁదగు విశేష మొండుగలదు శూద్రస్త్రీయందు కోమటికిఁ బుట్టిన సంతానమయిన మునికుమారకుడు కరణజాతిలో జేరినవాడు గనుకనున్ను, బుద్ధిపూర్వకమగు వధ కాదు కావునను, దశరధునకు బ్రహ్మహత్యాదోషము లేదని తెలియదగును

పిమ్మట వారు నాసహాయమున పుత్త్రునికళేబరము నొద్దకుఁజేరి యా మునిదంపతు లాశవము నాలింగనము చేసికొని పలువిధముల విలపించి నే నేర్పఱచిన చితియందు బ్రవేశించి పుత్త్రుని చేర నరిగిరి.

**ఏవం తస్మి న్స్వభార్యే తు సపుత్త్రే స్వర్గతే తతః,**
**తద్వధం చింతయం శ్చాహం నగరీం తు సమాగతః.**
**తస్యాయం కర్మణో దేవి! విపాక స్సముపస్థితః,**
***అపథ్యైస్సహ సంభుక్తో వ్యాధి మన్నరసో యథా. 39-40½**

అ ట్లా మునిదంపతులు పుత్త్రసహితముగ స్వర్గమున కేగిన పిమ్మట నా మునివధనే విచారించుచు నయోధ్యకు వచ్చితిని. అపథ్యపదార్థములతో భుజించిన యన్నరసముచే వ్యాధి వృద్ధినందినట్లు నేను చేసిన దుష్కర్మవలన గలిగిన పరిణామమే యిది యని కౌసల్యతో జెప్పెను.

**తదహం పుత్త్రశోకేన సంత్యక్ష్యా మ్యద్యజీవితమ్**
**దుర్వృత్తమపి కః పుత్త్రం త్యజే ద్భువి విచక్షణః,**
**కశ్చ ప్రవ్రాజ్యమానో వా నాసూయే త్పితరం సుతః. 41½**

ఆ శాపఫలముగ నే నిప్పుడిట్లు పుత్త్రశోకమున జీవితమును విడిచి పుచ్చెదననుచు పుత్త్రుడు దుష్టుడైనను వానిని చేతులార విడువ నిచ్ఛగించు తండ్రి లోకమందెచ్చట నైన నుండునా! విడువఁబడెనుపో, ఆపుత్త్రకుడు తండ్రితోఁబోరాడక యసూయ యేని బడక యిల్లువీడిపోవు వాడుండునా!

**యది మాం సంస్పృశే ద్రామ స్సకృ దద్య లభేత వా,**
**యమక్షయ మనుప్రాప్తా ద్రక్ష్యంతి న హి మానవాః. 42½**

నేను జీవించియుండగనే నా రామచంద్రుడిప్పు డొక్కమారు నన్ను స్పృశించినను నాకంటికిఁ గనిపించినను బాగుండును గదా! మృతి నొందిన పిమ్మట బంధువులను జూడలేరు గదా!

---

*అనేన సమశనాధ్యశనవిషమాశనేసతి వ్యాధి ర్భవతి అత స్తత్పరిత్యాజేదితి. తథా చ వాగ్భటే "పథ్యాపథ్యమిశ్రం సమశనం,భుక్తస్యోపరిభోజన మధ్యశనం, అకాలే భోజనం విషమం త్రీణ్యేతాని మృత్యుం వా ఘోరా న్వ్యాధీన్వా సృజన్తి"

*ఇటనుటచే రోగము సమశనముచేతను, అధ్యశనముచేతను, విషమాశనముచేతను సంభవిచుచున్నదని సూచిత మగుచున్నది.

ఇట్లే వాగ్భటమందుగూడ"పథ్యాపథ్యపదార్థసమ్మేళనము, సమశనమనియు, భుజించిన వెంటనే తిఱిగి భుజించుట యధ్యశనమనియు, అకాలభోజనము విషమాశనమనియు, ఈ మూడువిధము లైన భోజనములును మృత్యువును గాని, గొప్పవ్యాధిని గాని పుట్టించుచున్నవి. అని చెప్పఁబడియున్నది.

హారాఘవ! మహాబాహో! హా మమాయాసనాశన!
హా పితృప్రియ! మే నాథ! హాద్య క్వాపి గత స్సుత!
హా కౌసల్యేఽనుశిష్యామి హా సుమిత్రే తపస్విని.
హా నృశంసే! మమామిత్రే కైకేయి! కులపాంసని!
ఏవం రామజనన్యాశ్చ సౌమిత్రే ర్మాతు రంతికే,
శోచ న్దశరథ స్సద్య స్తత్యాజ ప్రాణపంచకమ్. 43-45½

ఓ రాఘవ! హావీర! నాయాయాసమును బటాపంచలొనర్చు నాకుమారకా!ఓ పితృప్రియ! తండ్రి! యెక్కడి కరిగితివి? హా దేవీ! కౌసల్యా! నేనింక జీవింపను. ఓ మందభాగినీ! సుమిత్రా! ఓ కులనాశనీ! కైకా! యని రాముని స్మరించుచు స్త్రీమతల్లులైన కౌసల్యా సుమిత్రల ముందు శోకించుచు, దశరథుడు క్రమముగా నసువులను వీడి పరలోకమునకుం జనెను

ఇత్యాశ్చర్యరామాయణ అయోధ్యకాండే ద్వితీయభాగే షష్ఠస్సర్గః సమాప్తః,
అశ్చర్యరామాయణమున, అయోధ్యాకాండ
ద్వితీయభాగమున ఆరవసర్గ సమాప్తము.

# సప్తమస్సర్గః - ఏడవ సర్గ

[1] తతః ప్రాత ర్యథా పూర్వం వందిషు స్తుతికారిషు,
నైశ్చైతన్యం నృపం జ్ఞాత్వా మృతం తం వ్యలపన్ స్త్రియః. 1

ప్రాతః కాలమైన పిదప వందిజనము స్తుతు లొనర్చుచుండ నెప్పటివలె మేలుకొనక చైతన్యరహితుడై శయ్యయందు దశరథుఁ జూచి స్వర్గస్థు డయ్యెనని తెలిసికొని యంతఃపుర స్త్రీజన మెల్లఁ జాలగ విలపించిరి.

కౌసల్యా గతచైతన్యం రాజాన మవలోక్య సా,
విలపంతీ చ బహుధా ప్రాహేదం కైకయీం వచః. 2

చైతన్యరహితుడై చచ్చిపడియున్న తన నాథునిఁజూచి సాధ్వియగు కౌసల్య యనేకవిధముల నేడ్చి యేడ్చి కైకేయి నుద్దేశించి యిట్లనెను.

త్యక్త్వా మా విపినం గతో మమసుతో భర్తాఽప్యగా న్మే దివమ్
నాహం జీవితు ముత్సహే మృత మిమం భర్తార మాలింగ్య వై,
*వేక్ష్యామ్యద్య హుతాశనం ధ్రువ మహం భూమ్యాం స్థితి ర్మే వృథా
కై కేయి త్వదభీప్సితం తు ఫలితం నిష్కంటకా త్వం భవ. 3

---

*నన్వత్రేయ మాశంకా "మృతే భర్తరి యా నారీ బ్రహ్మచర్యవ్రతేస్థితా, సా మృతా లభతే స్వర్గమ్"ఇతి పరాశర వచనపర్యాలోచనయా వినానుగమన మవస్థాన స్యైవ విశేష ఫలవత్త్వే నావగమాత్ బహుఫల మవస్థానం పరిత్యజ్యానుమరణం కరిష్యామీతి కథ ముక్తవతీ కౌసల్యేతి చేన్న, భర్తు స్సహచరీ భూయా జ్జీవతోఽజీవతోఽపి వా, ఇతి సంగ్రహవాక్య పర్యాలోచనయా అనుమరణస్యాపి విశేషఫలవత్త్వేన ప్రతిపాదనాత్ ఉభయవిధశాస్త్రానురోధే నోభయమపి తుల్యఫలం ధర్మం చేత్యవగమ్యతే అత ఏవ కౌసల్యావస్థితి రప్యుపపన్నా భవతీతి జ్ఞేయమ్.

*ఇచ్చట నొక యాశంక పొడముచున్నది."భర్త చనిపోయిన వెనుక యే వనిత బ్రహ్మచారిణియై వ్రతమనుష్ఠించునో యామె శరీర పతనానంతరము స్వర్గమును చేరఁగలదు."అను పరాశరుని ధర్మశాస్త్రవచనము నాలోచింపఁగా సహగమనముకంటె భర్త చనిపోయిన వెనుక స్త్రీ జనమునకు బ్రహ్మచర్యమును జరుపుచుండుటయే విశేషఫల ప్రదమని తేలుచున్నదిగదా? ఇట్టి విశేషఫలప్రదమగు నివాసము మాని కౌసల్య యల్పఫలప్రదమగు సహగమనమునే యేల చేయుదు ననుచున్నది?అను ప్రశ్నకు సమాధానము చెప్పఁబడుచున్నది.

---

1. కవిః

నా కొడుకు నన్ను విడిచి యడవులపాలై పోయినాడుగదా? నా పతియు స్వర్గమును జేర నేగెనుగదా? ఇంక నీ భూమియందు నేనెట్లు జీవింపఁగలను. నేను నీ మృతుఁడైన భర్తతోఁగూడ *నగ్నియందుఁబ్రవేశించి ప్రాణములను బాసెదను. నే నిక భూమియందు బ్రతుకుట వ్యర్థము, కైకా! నీ యభీప్సిత మంతయు పలించినట్లే గదా? ఇంక నిష్కంటకముగ రాజమాతవై కులుకుచు సుఖింపుము

తతో మంత్రిముఖా స్సర్వే సమాలింగ్య మృతం పతిమ్,
పరిదేవయమానాం తాం కౌసల్యాం సమసాంత్వయన్. 4

అట్లు మృతుడైన భర్తను గౌగిలించి దుఃఖించుచున్న కౌసల్యను మంత్రులు మొదలగువారెల్ల బహువిధముల నోదార్చిరి.

పురోహితానుమత్యా తే తైలద్రోణ్యాం తు భూమిపమ్,
సంవేశ్య మంత్రిణ స్సర్వే వసిష్ఠ మిద మబ్రువన్. 5

పిమ్మట వసిష్ఠుని యనుమతిఁగొని మంత్రిముఖ్యు లా దశరథుని శరీరమును నూనెతొట్టియందు భద్రపఱచి వసిష్ఠునితో నిట్లు పలికిరి.

రాజా స్వర్గమవాప లక్ష్మణయుతో రామోఽటవీం ప్రాప్తవాన్,
శత్రుఘ్నో భరతశ్చ కేకయపురేద్వౌ రాజగేహే స్థితౌ,
యః కశ్చిత్త్రియతాం నృపః కులగురో శీఘ్రం త్వయైవాద్య నః,
రాష్ట్రం నూన మరాజకం తు విలయం ప్రాప్నోతి యస్మాద్ధ్రువమ్. 6

ఓ మునిశేఖరా! దశరథుఁడు స్వర్గము చేరినాడు. లక్ష్మణ సహితుడై రాము డరణ్యముల పాలైవాడు. భరతశత్రుఘ్ను లిర్వురును కేకయ రాజు గృహమందున్నారు. రాజులేని రాజ్యము విలయమును బొందఁగలదు. కాన సర్వజ్ఞులగు తమరే యేవిధమున నైన నొక రాజు నేర్పరుపవలయును.

---

* భర్త బ్రతికియున్నను, మృతుడైనను, భార్య యతని ననుసరించియే యుండవలయును'అను సంగ్రహవాక్యము నాలోచింపఁగా సహగమనమునకును విశేషఫలము కలదని స్పష్ట మగుచుండుటచే పై రెండు విధముల శాస్త్రముల ననుసరించి భర్తతో సహగమనము చేయుటయు, యావజ్జీవము బ్రహ్మచర్యముతో నుండుట యను నీ రెండునుగూడ సమానఫలప్రదములైన ధర్మము లేయని స్పష్టము కావుననే కౌసల్య సహగమనము చేయఁబూనుటయుఁ దిటిగి చేయకుండుటయు నుపపన్నములే యని తెలియనగును

*[1] యథా హ్యనుదకా నద్యో యథా వా ప్యతృణం వనమ్,
అగోపాలా యథా గావ స్తథా రాష్ట్ర మరాజకమ్. 7

జలరహితములగు నదులవలె, తృణవిహీనమైన యరణ్యముఁబోలె కాపరిలేని గోవుల పగిది, యరాజకమగు రాజ్యమును జెల్లాచెదరై పోవును.

[2] జయంతసిద్ధార్థముఖాన్వసిష్ఠ స్తతస్సమాహూయ వచో బభాషే,
సాశ్వై ర్యుధాజిన్నగరం త్వవాప్య వాచ్యో భవద్భి ర్భరతో విశోకైః. 8

అని మంత్రులు పలుకఁగా విని వసిష్ఠుడు జయంతుడు, సిద్ధార్థుడును మొదలగు కొందరిని బిలిపించి యిట్లు పలికెను. మీరు వెంటనే గుఱ్ఱములమీఁద యుధాజిత్తునగరమున కేగి యిచ్చటి సమాచార మేమియు వెలిబెట్టక మోముల విన్నదనంబును దోపనీక భరతున కిట్లు చెప్పవలయును.

పురోహిత స్త్వాం కుశలం ప్రాహ స్సర్వే చ మంత్రిణః,
ద్రుత మాగచ్ఛ సాకేత మిత్యాహ భగవా న్గురుః. 9

మీగురువగు వసిష్ఠుడును మీ మంత్రులందరును నిన్ను గుశల మడిగినా రనీయు, సర్వజ్ఞుఁడైన వసిష్ఠుఁడు నిన్ను సాకేతమునకు వెంటనే రమ్మనినా రనియు మాత్రమే చెప్పవలయును.

శ్రీరామవనవాసం వా రాజ్ఞో మరణమేవ వా,
మా వదంతు భవంతస్తు భరతాయ ప్రమాదతః. 10

శ్రీరామచంద్రుని వనవాసముఁ గాని, దశరథుని స్వర్గవాసమును గాని పొరపాటుననైన భరతునకుఁ దెలియనీయఁగూడదు సుమా!

---

*అత ఏవ రాజధర్మే అరాజకదేశే రాజప్రతిషేధ పూర్వకం లౌకిక వైదికవ్యవహారయో రన్వయ వ్యతిరేకాభ్యాం రాజాధీనత్వం ప్రతిపాద్య వ్యవహారసిద్ధ్యర్థం తపశ్చర్యాదినా బ్రహ్మాణం ప్రసాద్య రాజానం మనుం సంపాద్య తస్మై భాగం కల్పితవంత ఇత్యుక్తం.

*కావుననే రాజధర్మమునందుఁగూడ నిట్లు చెప్పఁబడియున్నది. పూర్వము దేశ మరాజకముగ నుండఁగాఁ గొందరు లౌకిక వైదిక వ్యవహారములు రాజాధీనములని నిశ్చయించి యా వ్యవహారసిద్ధికొఱకై తపస్సు మొదలగువానివలన బ్రహ్మనుఁబ్రసన్నునిగా జేసికొని యాతని యనుమతిచే మనువును రాజునుగా మొదట సంపాదించి యతని యందు రాజ్యభారమును నిలిపి యతనికిఁగూడ నారవభాగమును గల్పించినారని.

---

1. వా॥ రా॥ 2. కవిః

ఇత్యేవం కథితా దూతా స్తూర్ణం నిర్గత్య వాజిభిః.
ఉదఙ్ముఖాశ్చ పంథాన మనుస్ర త్యాతివేగగైః.
మాలిన్యాదినదీ స్తీర్త్వా బహూ న్దేశా నతీత్య చ,
కురుజాంగల బాహ్లిక కాశ్మీరాంశ్చ క్రమా ద్గతాః.
త్యక్త్వాఽహర్నిశయో ర్భేదం శ్రాంతవాహా దినత్రయమ్
నీత్వా తే మార్గమధ్యే తు చతుర్థదివసే నిశి.
శతయోజనదూరస్థం గిరివ్రజపురం గతాః. 11-13½

అని వసిష్ఠు డాజ్ఞాపింపగా దూతలు వెంటనే వాయువేగమున నరుగు గుఱ్ఱముల నెక్కి యుత్తరాభిముఖులై పయనము సాగించి త్వరితగమనమున మాలిని మొదలైన నదులను దాటికురు, జాంగల, బాహ్లిక, కాశ్మీరాద్యనేక దేశముల నతిక్రమించి రాత్రింబవ ళ్ళను భేదమునుగూడ గణింపక మిక్కిలి యలసటతోగూడిన యశ్వవాహనములపై మూడురోజులు మార్గమందుఁ బ్రయాణముఁ గావించి నాల్గవనాటి రాత్రి కయోధ్యకు నూరామడల దూరమున నున్న గిరివ్రజ పురమును బ్రవేశించిరి

యస్యాం రాత్రౌ తు వివిశు ర్దూతా స్తత్పుటభేదనమ్,
తస్యాం రాత్రౌ తు దుస్స్వప్నో భరతేన నిరీక్షితః.
1*పతంత మద్రిశిఖరా త్కలుషే గోమయహ్రదే,
స్వప్నే పితర మద్రాక్షీ చ్చంద్రం చ పతితం క్షితౌ. 14-15½

---

*అత్ర భరతేన స్వప్నదర్శనస్య శీఘ్రఫలదర్శనాత్ యేన యాదృశ స్స్వప్నో దృష్టస్తస్య తాదృశం పలం బవతీతి సూచితం బృహస్పతిః స్వప్నాధ్యాయే "స్వప్నస్తు ప్రదమే యామే సంవత్సరవిపాకినం ద్వితీయే చాష్టబిర్మాసై స్త్రిబి ర్మాసై స్త్రియామికం, చతుర్థే యామికే స్వప్నో మాసైకేన ఫలం భవేత్, అరుణోదయవేళాయాం దశాహేన ఫలం భవేత్, గవాం దోహనవేళాయాం సద్య స్స్వప్నఫలం బవేత్""ఇతి

*ఇచ్చట భరతుని స్వప్నమునకు శీఘ్రఫలదర్శనము కలుగుట వలన, నెవ్వఁడెట్టి స్వప్నమును గాంచునో వాని కట్టి స్వప్నఫలము లభించునని సూచిత మగుచున్నది. బృహస్పతిగూడ స్వప్నాధ్యాయ మందిట్లు వచించియున్నాడు "ప్రదమయామమందు వచ్చిన స్వప్నము సంవత్సరము లోపున ఫలము నిచ్చును రెండవజామున వచ్చిన స్వప్న మెనిమిది మాసములలో ఫలము

---

1. వా ॥ రా ॥

*ఏ రాత్రియందు దూతలు గిరివ్రజపురమును బ్రవేశించిరో యా రాత్రియందే భరతుడు తన తండ్రి పర్వతాగ్రమునుండి గోమయపు మడుగులోఁ బడినట్లును, చంద్రు డాకాశమునుండి భూమియందుఁ బడినట్లును గలఁ గాంచెను.

[1] దుస్స్వప్నం భరతే సద స్యథ వదత్యాత్మీయవర్గేణ తే
దూతా శ్చాపి సమేత్య తంచ భరతం నత్వాబ్రువ న్నిశ్చచః
సర్వేషాం కుశలం తథాపి తు భవాన్ శీఘ్రం సమానీయతా
మిత్యేవం గురు రాహ తే భరత!తత్క్షిప్రం వినిర్గచ్ఛతాత్. 16 ½

పిమ్మట భరతుడు వికలమనస్కుడై తన స్వప్నవృత్తాంతమును తన బంధువులకు వినిపించుచుండఁగా నయోధ్యనుండి వచ్చిన దూతలు గూడ నచ్చటకు వచ్చి భరతునకు నమస్కరించి యిట్లు పలికిరి. అయోధ్యయం దందరకును గుశలము. నీకులగురువగు వసిష్ఠుడు నిన్ను వెంటనే దోడ్కొని రమ్మని మమ్ము పంపినాడు. కావున నీవు వెంటనే ప్రయాణము కమ్ము.

ఇత్యుక్తో భరతో దూతాన్ సర్వేషాం కుశలం పునః,
పిత్రాదీనాం చ బంధూనాం పప్రచ్ఛైకైకశ స్తదా. 17 ½

అని దూతలు చెప్పఁగా విని భరతుఁడు, తల్లిదండ్రులు మొదలగు నాత్మీయుల క్షేమములను బ్రత్యేకముగ మఱలమఱల నడుగగా దూతలు తిరిగి యిటుల బలికిరి.

కుశలా స్తే నరవ్యాఘ్ర! యేషాం కుశల మిచ్ఛసి,
వసిష్ఠేన వయం రాజన్ నేతుం త్వాం ప్రేషితా ద్రుతమ్,
విలంబం మా కురు క్షిప్రం నిర్గచ్ఛానుజసంయుతః. 18-19

ఓ రాజా! యందరకును గుశలమే. "మిమ్ము శీఘ్రముగఁ దోడ్కొని రమ్మని వసిష్ఠుడు మమ్ములను బంపినాఁడు, నీయనుజునితో గూడ వెంటనే పయనము కమ్ము."అని భరతుని పలువిధముల తొందరపెట్ట జొచ్చిరి.

---

నిచ్చును. మూఁడవజామున వచ్చిన స్వప్నము మూడుమాసములలోగా ఫలము నిచ్చును. నాల్గవ జామునందు వచ్చిన స్వప్నము మాసము లోపుగనే ఫలితము నిచ్చును. అరుణోదయవేళయందు వచ్చిన స్వప్నము పదిరోజుల లోపల ఫలము నిచ్చును. గోదోహనవేళయందు వచ్చిన స్వప్న మప్పటికప్పుడే ఫలము నిచ్చును"అని.

---

2. కవిః

ఇతి దూతవరై రుక్తో భరత స్సతు దుఃఖితః,
స్వీయాపదం వినిశ్చిత్య త మాపృచ్ఛ్య చ మాతులమ్.
రథ మారుహ్య భరత శ్శత్రుఘ్నేన వినిర్గతః,
అతీత్య వై జనపదా నతిక్రమ్య చ పర్వతాన్.
సప్తమే దివసేఽయోధ్యాం క్రమా దేత్యాఽహ సారథిమ్. 20-21½

ఇట్లు దూతల ప్రేరేపణచే భరతుడు రాత్రివచ్చిన దుస్స్వప్నమునకు ఫలముగా స్వీయజనములో నెవ్వరికో యాపద వచ్చియుండుట నిశ్చయమని తలచి దుఃఖితుడై తన మేనమామ మొదలగువారిని సెలవడిగి శత్రుఘ్నునితో గూడ రథాధిరూఢుడై యయోధ్యకుం బయనమై యనేక నదులను, పర్వతములను, పట్టణములను దాటి గిరివ్రజపురమునుండి బయలుదేరినది మొదలుగ నేడవనాటికి నయోధ్యం బ్రవేశించి సారథి కిట్లనెను.

[1] అలక్ష్మీకాని పశ్యామి కుటుంబిభవనా న్యహమ్,
అపేతమాల్యశోభాని అసంమృష్టాజిరాణి చ. 22½

సూతా!యేమిది!యీ గృహస్థుల గృహము లెల్లం బాడుపడినవి వోలె ముగ్గులు మొదలగు నలంకరణములు లేక కళావిహీనములై కానవచ్చుచున్నవే?

దేవాగారాణి శూన్యాని న చ భాంతి యథా పురా,
ఇతి పృచ్ఛ న్సారథిం తం భరతః ఖిన్నమానసః,
క్రమా ద్రాజగృహం ప్రాప నిస్తేజస్కం తు సానుజః,
అనవేక్ష్య చ రాజానం యయౌ మాతృగృహం తు సః. 23-24½

ఈ దేవాలయము లెల్ల శూన్యములై యున్నవేమి! అని సారథిని బలువిధముల గ్రుచ్చిగ్రుచ్చి యడిగి భరతుడు చాల ఖిన్నుడై క్రమముగ రాజగృహమున ననుజసహితముగం బ్రవేశించి దశరథుడు కన్పింపనందున సరాసరి మాతృగృహమును జేరనేగెను.

తత స్స్వసందర్శన జాతతోషాం, త్యక్త్వా సువర్ణాసన మాపతంతీమ్,
స్వమాతరం తాం భరతః ప్రణమ్య, పప్రచ్ఛ చైవం జననీం తు పశ్చాత్.
25½

1. వా ॥ రా ॥

పిమ్మట తాను కన్పడినందువలన మిక్కిలి సంతసించుచు బంగరు పీఠమునుండి లేచి తన కెదురువచ్చుచున్న తల్లికి నమస్కరించి భరతు డామెతో నిట్లు పలికెను.

[1]మాత స్తాతః క్వ యాతః సురపతిభువనం హా కుతః పుత్రశోకా,
త్కోఽసౌ పుత్ర శ్చతుర్ణాం త్వ మవరజతయా యస్యజాతః కి మస్య,
ప్రాప్తోఽసౌ కాననాంతం కిమితి నృపగిరాం కిం తథాఽసౌ బభాషే,
మద్వాగ్బద్ధః ఫలం తే కిమిహ తవ ధరాధీశ తాహా! హతోఽస్మి. 26½

అమ్మా! నా తండ్రి యెచ్చట కేగినాడు? అనగా విని కైక భరతున కిట్లు సమాధానము చెప్పెను. కుమారా! నిన్ను రాజునుగా చేయవలయునని నేను కుతూహలపడి నీ తండ్రి పూర్వము నాకొసంగుదు నన్న వరములలో నొకదానిచే రామున కరణ్యావాసమును, రెండవ దానిచే నీకుఁ బట్టముఁ గట్టుటయుఁ గోరఁగా సత్యశీలుడైన నీతండ్రి నామాటలనుండి తప్పించుకొనలేక రాముని వనముల కంపి యాపుత్రవియోగదుఃఖ మనుభవింపఁజాలక తుదకు స్వర్గస్థుడయ్యెను.

ఇతి తస్యా వచ శ్శ్రుత్వా నిపత్య భరతః క్షితౌ,
ఆర్తస్వరేణ విలపన్ ప్రాహ తాం జననీం పునః. 27½

కర్ణవిదారకములగు నావాక్యములను విని భరతుడు (మొదలునరికిన చెట్టుచందమున) భూమిపైఁబడి (మూర్ఛిల్లి యంతలో దెలివిఁ దెచ్చుకొని) యార్తస్వరముతో విలపించుచు మరల తన తల్లితో నిట్లు పలికెను.

[2] అభిషేక్ష్యతి రామం| రాజా యజ్ఞం ను యక్ష్యతే,
ఇత్యహం కృతసంకల్పో హృష్టో యాత్రా మయాసిషమ్. 28 ½

నాయన్న రామునకుఁ బట్టాభిషేక మహోత్సవమో, లేక నాతండ్రి దశరథుఁడు యజ్ఞము నారంభించెనో యని కన్నులపండువుగ జూడ నూహించి యరుగుదెంచితినిగాని యిట్టి దురంతము చెవిని బడునని తలంప నయితిని గదా!

హతోఽస్మిరాజా నిహతః హతో లోకశ్చ దుర్మతే,
రామప్రస్థాపికాయాశ్చ పతిఘ్న్యాశ్చ తవోదరే,
దశమాసా మయా నీతాః హా లోకే నిందితోఽస్మ్యహమ్. 29-30

---

1. వా || రా || 2. హ || రా ||

హా!నన్ను చంపితివిగదె!దుర్మతీ!మూర్ఖురాలా! నీ మూలమున రాజు నశించినాఁడు. లోకమెల్ల నశించినది. సవతికొమరుని నట్టడవులకుఁదఱిమితివి. భర్తప్రాణములను దీసిన నీయట్టి పాపిష్ఠురాలి కడుపున పదిమాసములు పడియున్నందువలన లోకమున నేనుగూడ నిందితుడనైతిని. నాపాపమునకు ప్రాయశ్చిత్తముం గలదా?

కంఠే ఽవసజ్య పాశం వా విషం పీత్వా ఽథవా శఠే,
త్యజ ప్రాణాంశ్చ దుర్మేధే జల మగ్నిం ప్రవిశ్య వా. 31

దుష్టురాలా! ఇంక నీవేల బ్రతికియుంటివి?కంఠమున కుఱిబెట్టుకొనిగాని, విషము త్రావిగాని, జలాగ్నులయందుఁ బడిగాని చచ్చిపొమ్ము. నీదుష్కృత్యమున కిదియే ఫలము.

*త్వామద్య నిహనిష్యామి నోచే ద్రామస్య దుర్యశః,
అకరో న్మాతృహత్యాం తు రాఘవ స్యానుజ స్త్వితి. 32

---

*నను "ఆచార్యశ్చ పితా చైవ మాతా భ్రాతా చ పూర్వజః, నార్తే నాప్యవమంతవ్యాః" ఇత్యాది మనువచన పర్యాలోచనయా మాతృనిందాయాః ప్రతిషేధావగమాత్ భరతేన కథం మాతృనిందా కృతా?ఇతిచేన్న, అధర్మమార్గ ప్రవృత్తా గుర్వాదయో ఽపి రాజ్ఞా శిక్షితవ్యా ఇతి.

తథా చ మనుః.

"నాదండ్యో నామ రాజ్ఞో ఽస్తి యస్మి న్ధర్మే ఽవతిష్ఠతీతి"ఏవం చ కైకయీ భర్తు ర్మరణసంపాదక రామవివాసన కరణా న్మహాపరాధవతీతి తస్యా దండో యుక్తః.

బృహస్పతిరపి.

"గురూన్ పురోహితా న్విప్రా న్వాగ్దండే నైవ దండ యేత్"ఇతి వచనపర్యాలోచనయా ప్రకృతే మాతుః కైకేయ్యాః గురుత్వాత్ వాగ్దండనం యత్కృతం తద్యుక్తమేవేతి.

*ఇచట నొక యాశంక కలదు "గురువు, తండ్రి, తల్లి, అన్న మొదలైననా రపకర్తలైనపుడుగూడ దూషించుటగాని, యవమానించుటగాని తగదు "ఈ మొదలగు మన్వాది వచనముల నాలోచింపఁగా మాతృనింద సర్వదా కూడదని తెలుచుండఁగా భరతుడు కైకనెట్లు దూషించెను? అను నాశంకకు సమాధానము చెప్పబడుచున్నది.

"అధర్మమార్గమందుఁబ్రవర్తించుచున్నపుడు గురువు మొదలగు వారినేని రాజు శిక్షింపవలయును"అని.

*రాముని యనుజుడు మాతృహత్య గావించెనని శ్రీరామునకు దుర్యశము వచ్చునని వెఱచెదనుగాని లేకున్న నిన్నీపాటికి చంపియుందును గదే! పాపినీ!

తచ్ఛ్రుత్వా కైకయీ ప్రాహ భరతం నిర్విశంకితా,
కిం మయాపకృతం తేద్య గర్హసే మాం పునఃపునః.
పితా తే స్వర్గతో రాజా భ్రాతరౌ చ వివాసితౌ,
బహునా కిం ప్రలాపేన భుఙ్క్ష్వ భోగాన్ యథా సుఖమ్. 33-34

ఆమాటలు విని కైక తిరిగి నిర్భయముగ భరతున కిట్లనెను. నన్ను మాటిమాటికిట్లు నిందించెదవేల? నేను నీకేమి యపకారము చేసితిని? నీ తండ్రి స్వర్గమున కరిగినాడు, నీ సోదరులు దేశాంతర మేగినారు. ఇంక నూరక యేల యీ ప్రలాపములు?యథేష్టముగ రాజ్యసుఖము లనుభవింపుము.

ఇత్యుక్తో భరతః ప్రాహ కై కేయీం భర్త్సయ న్నిదమ్,
ప్రస్థాప్య వనవాసాయ కథం రామం న శోచసి.
నివర్తయిత్వా రామం చ తస్యాహం దీప్తతేజసః,
దాసభూతో భవిష్యామి సుస్థితే నాంతరాత్మనా. 35-36

అ మాటలు విని భరతుడు మండిపడి (తోకత్రొక్కిన త్రాచుచందమునఁ) గైకను దద్దరిల్లఁజేయుచు నిట్లు పలికెను. రాము నరణ్యమునకుం దఱిమి పశ్చాత్తాపమైన లేక కులుకుచున్నావా? ఇదిగో, నానిశ్చయ మాలకింపుము. ఇప్పుడే పోయి నేను రాముని వనవాసమునుండి మరల్చి తెచ్చి మహాపూజ్యుడును, తేజస్వియునగు నారామచంద్రునకు త్రికరణశుద్ధిగ దాసుఁడ నయ్యెదను. (నా కతనిసేవకంటె నీలోకమున వాంఛింపఁదగినది మరేదియును లేదు).

---

మనువునిట్లు చెప్పియున్నాడు.

'అధర్మప్రవృత్తిగలవా డెంతపూజ్యుడైనను రాజదండనకుఁబాత్రుడు కావలసినదే'అని. ప్రకృతమునందు గైక భర్తృమరణకారణమైన రామవివాసమునకు మూలమైనదిగాన మహాపరాధిని యైనది. కావున నామెను భరతుడు దండించుట యుక్తమే యని భావము.

బృహస్పతియు నీక్రిందివిధముగఁ జెప్పెను.

"గురువులను, పురోహితులను, విప్రులను పరుషవాక్కుల చేత మాత్రమే దండింపవలయును"అని. ఈవచనము నాలోచించినను ప్రకృతమునందు భరతునకుఁ గైక గురువర్గమునందుఁ జేరినదిగాన కైక నుద్దేశించి భరతుని వాగ్దండన యుక్తమే యని భావము.

కౌసల్యా భరతం సమాగత మితి జ్ఞాత్వా తదాక్రోశత,
స్తం ద్రష్టుం చ సముత్సుకాఽఽస భరత స్సందూష్యతాం కైకయీమ్,
కౌసల్యాం సముపాగతోఽనుజయుతః స్వం వీక్ష్య శోకాధికామ్,
కాశ్యప్యాం తు నిపత్య తాడితవతీం చోరస్థ్సలం వై ముహుః. 37

ఇంతలో గౌసల్యభరతు డరుదెంచినట్లు వాని యార్తధ్వనివలన గుర్తెఱింగి వానిని జూచుటకు సంసిద్ధయై యుండెను. భరతుడును గైకను బలువిధముల దూషించి సోదరయుతుడై బయలుదేరి కౌసల్యాసమీపమునకు వచ్చుచుండగా దననుజూచి శోకవ్యాకులత్వముచే భూమిపైపడి విలపించుచున్న కౌసల్యాను సమీపించెను.

పర్యష్వజేతాం దుఃఖార్తాం రుదంతౌ సోదరౌ చ తౌ,
ఆలింగ్య భరతం సాధ్వీ రామమాతా యశస్వినీ.
కృశాతిదీనవదనా సాశ్రునేత్రేద మబ్రవీత్.
పుత్ర! త్వయి గతే దూర మేవం సర్వ మభూ దిదమ్. 38-39

అట్లు శోకవ్యాకులయై యున్న కౌసల్యను భరతశత్రుఘ్ను లిర్వురును గౌగిలించి వాపోవజొచ్చిరి. కౌసల్యయుఁ బుత్రకుల నాశ్లేషించి దీనవదనయై కన్నీరు లేరులై పరవ భరతునితో నిట్లు పలికెను. పుత్రకా! నీవు దూరదేశమున నుండునంతలో నింతటి ముప్పు జరిగిపోయినది.

పుత్ర స్సభార్యో వనమేవ యాతః, సలక్ష్మణో మే రఘురామచంద్రః
చీరాంబరో బద్ధజటాకలాప, స్సంత్యజ్య మాం దుఃఖసముద్రమగ్నా. 40

సీతాలక్ష్మణ సహితుఁడై నాకొడుకు శ్రీరామచంద్రుడు జటావల్కలములను ధరించి నన్ను దుఃఖసముద్రమున ముంచి యడవుల కేగినాడు.

ఇదం తే రాజ్యకామస్య రాజ్యం ప్రాప్త మకంటకమ్,
తవ మాతా ద్రుతం మాం చ వనం ప్రేషయితుం క్షమా. 41

ఇక రాజ్యకామివైన నీ వీ రాజ్యము నెల్ల నిష్కంటకముగ నేలుకొన వచ్చును. నీతల్లి నన్నుగూడ వనముల కనుపుట కర్హురాలు.

ఇత్యుక్త్వా విలపంతీం తాం కౌసల్యాం వీక్ష్య మాతరమ్,
పాదౌ గృహీత్వా భరతః ప్రాహేదం వచనం మహత్. 42

ఇట్లు పలువిధములఁ బ్రలాపించుచు విలపించుచున్న కౌసల్యను జూచి మిక్కిలి ఖిన్నుడై భరతు డామెపాదములయందు వ్రాలి యిట్లు వేడుకొనెను.

కైకేయ్యా యత్కృతం కర్మ రామరాజ్యాభిషేచనే,
అన్యద్వా యది జనామి సా మయా నోదితా యది,
మాత ర్మే భవితాఘం తు బ్రహ్మహత్యాశతోద్భవమ్. 43½

తల్లీ! రామపట్టాభిషేకమునకు నా తల్లి యగు కైక యొనర్చిన యంత రాయము గాని మఱి యే యకృత్యము గాని, యామె నాతో ననక పూర్వము నే నెఱింగియున్న నూరుబ్రహ్మహత్యలవలనఁ గలుగు పాపఫలమును నే ననుభవింతును.

1* పరిపాలయమానస్య రాజ్ఞో భూతాని పుత్త్రవత్,
తతస్తు ద్రుహ్యతాం పాపే యస్యార్యో నుమతే గతః. 44½

*శ్రీరామచంద్రుని వనమున కనుపుట నా కిష్టమైయున్న నేను సమస్త ప్రజలను, దనసంతానమునువలె సంరక్షించునట్టి రాజునకు ద్రోహము చేసిన వచ్చు మహాపాతకమునకు గురియయ్యెదను.

హత్వా వసిష్ఠం ఖడ్గేన చారుంధత్యా సమన్వితమ్,
భూయా త్తత్పాప మఖిల మనుజానామి యద్యహమ్. 45 ½

మఱియు నీదురంతమును నేనెఱింగియున్న నరుంధతీ సహితుడైన వసిష్ఠుని దెగనఱికినఁ గలుగునట్టి పాపము నాకుఁ గలుగును.

---

*అనేన సమ్యక్పరిపాలనం కుర్వతో రాజ్ఞః ద్రోహో న కర్తవ్య ఇతి సూచితం గారుడేఽపి, యేచ స్వామిద్రుహో మర్త్యా మృగవ్యాధ్యా భవంతి వై ఇతి

*ఇట్లనుటచే ధర్మపరిపాలనా కుశలుఁడగు రాజునకు ద్రోహ మొనర్పరాదను ధర్మము సూచిత మగుచున్నది గారుడమందుఁగూడ "ధర్మ పరుడైన రాజును హింసించు ప్రజలు మరుజన్మమం దాటవికజనులై జనింతు"రని

---

1. వా ॥ రా

**తథా తు శపథైః క్లిష్టే శ్శపమాన మచేతనమ్,
భరతం శోకసంతప్తం కౌసల్యా వాక్య మబ్రవీత్. 46½

**ఇట్లు కర్ణకఠోరములైన శాపవాక్యములతోఁదన్ను నిందించికొనుచు శోకవ్యాకులత నొందియున్న భరతుని జూచి కౌసల్య యిట్లు పలికెను.

మమ దుఃఖ మిదం పుత్ర భూయ స్సముపజాయతే,
శపథై శ్శపమాన స్త్వం ప్రాణా నుపరుణత్సి మే. 47½

తండ్రీ! నీ మాటలవలన నాదుఃఖము మఱింత ప్రబలుచున్నది. ఈ కఠోరవాక్యములచేత నిన్ను నీవు నిందించుకొనుచు నా ప్రాణముల నరికట్టుచున్నావు.

భరతస్యాగమం శ్రుత్వా వసిష్ఠో మంత్రిభిస్సహ,
దుఃఖితం భరతం దృష్ట్వా ప్రాహేదం సాంత్వపూర్వకమ్. 48½

ఆ కౌసల్య భరతునితో నిట్లు పలుకుచుండగా భరతుని రాకను గుర్తెఱింగి వసిష్ఠుడు మంత్రిజన సహితుడై వచ్చి దుఃఖితుడై యున్న భరతు నోదార్చుచు నిట్లు పలికెను.

స్థవిర స్తే పితా నూనం భుక్త్వా మర్త్యసుఖం భువి,
బహుభి ర్దక్షిణై రిష్ట్వా చాంతే స్వర్గమవాప సః. 49½

భరతా! ఏల దుఃఖించెదవు? నీతండ్రి కేమి? కావలసినంత భూలోకసుఖ మనుభవించి సత్పుత్త్రులను గాంచి యజ్ఞముల ననేకముల నాచరించి భూతతృప్తి నెఱవేర్చి ఋణత్రయ విముక్తుడై హాయిగ స్వర్గమున విశ్రమింప నేగినాడు.

అశోచ్యం తం శోచసి త్వం వృథైవ భరతాధునా,
ఆత్మా నిత్యోఽవ్యయ శ్శుద్ధః జన్మనాశాదివర్జితః,
శరీరం జడ మత్యర్థ మపవిత్రం వినశ్వరమ్,
విచార్యమాణే శోకస్య నావకాశః కథంచన. 50-51½

---

**అనేన ప్రాప్తం సంశయం శపదేనాపి పరిహారే దితి సూచితం

**ఇట్లనుటచే సంశయము ప్రాప్తించినప్పుడు శపదవాక్యములచే నైనను దాని నివారించికొని సత్యము నిలబెట్టుకొనవలయునని దర్మము సూచిత మగుచున్నది

శోకింపదగని నీ తండ్రిని గుఱించి వ్యర్థముగ నేల శోకించెదవు? ఆత్మ నశించిన దనియా లేక దేహము నశించిన దనియా నీవు దుఃఖపడుట? ఆత్మ నిత్యమైనది. జన్మనాశాదులు లేనిది. కావున నెల్లప్పుడు నుండు దానిని గూర్చి దుఃఖించుట యనవసరము. శరీరము అను శబ్దము లోనే నశించునది యను నర్థ మున్నదిగాన ననిత్యమై నశ్వరమైన శరీరము నశించినదని దుఃఖించుట యంతకంటె వెఱ్ఱితనము కాన దేహత్యాగ మొనర్చిన యాత్మను గుఱించిగాని యనిత్యమైన దేహమునుగుఱించి గాని చింతింప నవసరము లేదు.

**పితా వా తనయో వాఽపి యది మృత్యువశం గతః,**
**మూఢా స్త మనుశోచంతి స్వాత్మతాడనపూర్వకమ్. 52½**

తండ్రిగాని, కొమరుఁడు గాని, యితరబంధువులుగాని మృత్యువువాత పడినచో మూర్ఖులు తెలియక యురస్తాడనాదులతో నూఱక విలపించెదరు.

**జన్మవాన్యది లోకేఽస్మిన్ తర్హి తం మృత్యు రన్వగాత్,**
**తస్మా దపరిహార్యోఽయం మృత్యు ర్జన్మవతాం సదా. 53½**

లోకమునందు జన్మించినాడన్న నెప్పటికేని మృత్యువువాతపడుట తప్పదు. కావున పుట్టినవానికి చా వనుల్లంఘనీయము.

**బ్రహ్మాండకోటయో నష్టా స్సృష్టయో బహవో గతాః,**
**శుష్యంతి సాగరా స్సర్వే నై వాస్థా క్షణజీవితే. 54½**

ఇట్లనేకబ్రహ్మాండకోటు లుద్భవించినవి;పెరిగినవి;వినష్టములు నైనవి. సాగరములుకూడ శుష్కించుచున్నవి. ఈ లోకమందు నిలుకడగ నిలిచియుండున దేదియో చెప్పుము.

**ఆత్మా న మ్రియతే జాతు జాయతే న తు వర్ధతే,**
**ఆనందరూపో హ్యేకశ్చ నైనం శోచితు మర్హసి. 55½**

ఓ భరతా! ఆత్మ జననము లేనిది గనుక నెప్పుడును నశింపదు. పెరుగునదియు గాదు. ఆత్మ సచ్చిదానందరూప మైనదియు నద్వితీయ మైనదియు నై యున్నది. కావున నీవు దీనినిగూర్చి దుఃఖింపఁ బనిలేదు.

[1] పూర్వం భూపతి రన్యదుర్లభగుణశ్శాంతో మరున్నామకః,
కీర్త్యా శక్రజయో ఽమితం ధన మలం దాతా ద్విజేభ్యో ఽనిశమ్,
జ్ఞానీ లోకహితే రతో బుధనుతః కృష్యావినా స్వాంభువమ్,
రాష్ట్రే స్వస్య తపోబలా త్ఫలయితా సో ఽప్యాపకాలాన్మృతిమ్. 56½

ఓ భరతా! పూర్వకాలమున మరుత్తను రాజుండెను. అతడితర దుర్లభమైన సద్గుణసంపద గలవాడును, శాంతుడును, కీర్తిచే నింద్రుని గూడ మించినవాడును, ప్రతినిత్యము బ్రాహ్మణులకు విస్తారముగ ధనమును దానము చేయువాడును, జ్ఞానియును, ప్రజాక్షేమమును జేసినవాడు నైయుండెను. అట్టి మరుత్తుడను రాజుకూడ కాలవశముచే మృతినొందెను.

అన్య ద్వచ్మ్యుతధే స్సుతస్య వితతే యజ్ఞే సుహోత్రస్య వై
సౌవర్ణీం తు వవర్ష వృష్టి మతులాం యజ్ఞేతు శక్రో ముదా
సౌవర్ణా జలజంతవ స్సమభవ న్నైకే తటాకే తదా
తత్సౌవర్ణచయప్రదో ద్విజతతేః కాలాత్సుహోత్రో మృతః. 57 ½

ఓ భరతా!నీకు మఱియొక సంగతిని౾ జెప్పెదను వినుము. ఉతధి కుమారుడగు సుహోత్రుడు వార్షిక సత్రయాగమును జేయుచుండ నతని యజ్ఞమునకు సంతోషించి దేవేంద్రుడు సువర్ణవర్షమును యజ్ఞభూమి సమీపమున వర్షింప౾జేసెను. ఆ యజ్ఞభూమి సమీపమున నున్న తటాకములలో సువర్ణజల జంతువు లేర్పడెను. ఆసుహోత్రుడు నా సువర్ణజలజంతువులను బ్రోగుచేయించి యా బంగారపు రాశి నంతయు యజ్ఞాంతమునందు బ్రాహ్మణులకు దానము చేసెను. అట్టి సుహోత్రుడుకూడ కాలవశముచే మృతినొందెను.

సర్వే కాలవశా ఏవ తస్మా త్సంత్యజ్య వై శుచమ్,,
తైలద్రోణ్యాః పితు ర్దేహ ముద్ధృత్య భరతాధునా.
ఔర్ధ్వదైహికకృత్యం త్వం కర్తుం యత్నం సమాచర,
ఇత్యుక్తేన నృప స్తేన తైలద్రోణ్యా స్సముద్ధృతః. 58-59 ½

ఓ భరతుడా!పై విషయములను విచారించిన నందరును కాలమునకు వశ్యులే కావున నీవు బాగుగ నాలోచించి దుఃఖమును విడిచి తైలద్రోణినుండి

1. కవిః

(నూనెతొట్టెనుండి) మీతండ్రిమృతకళేబరమును బైకిఁదీసి యౌర్ధ్వదైహిక కృత్యములను జేయఁ బ్రయత్నింపుము, ఇవ్విధముగ గురువగు వసిష్ఠునిచేఁ జెప్పఁబడిన భరతుడును ధైర్యము నవలంబించి తైలద్రోణినుండి మృతకళేబరమును బైకి దీసెను.

**రాజానం మణిభూషితే సుశయనే సంవేశ్య ఋత్విగ్గురూ**
**నాచార్యాం స్త్వరయ న్నృపస్య భరత స్సద్యాజ్ఞికై రగ్నిషు**
**అగ్నే ర్వేశ్మన ఉద్ధృతేషు నృపతౌ సంవాహితే వాహకై**
**స్తస్యాగ్రే వికిరత్సు భూషణచయం భృత్యేష్వగాద్వై చితిమ్. 60 ½**

పిమ్మట దశరథుని మృతకళేబరమును మణిభూషితమగు శయనము నందు బరుండబెట్టి ఋత్విక్కులను గురువులను భరతుడు తొందర పెట్టుచు, యాజకులు శ్రౌతాగ్నుల నగ్ని శాలలనుండి తోఁదేఱ, వాహకులు దశరథుని మోయగా, ముందుభాగమున భృత్యజనులు మణిభూషణాదులను వెదజల్లుచు నడువగా భరతు డనుజపురోహితమంత్రి జనసమేతుడై మృతకళేబరమును పితృవనమునఁ బ్రవేశపెట్టెను.

**చందనాగరుకాష్ఠై స్త మధిరోప్య కృతాం చితమ్,**
**తతో హుతాశనం కృత్వా జగుస్సామాని సామగాః. 61 ½**

పిమ్మట చందనము, అగరు మొదలగు కాష్ఠములచేఁ బేర్పఁబడిన చితియందు భరతుడు మృతకళేబరమును జేర్చి ఋత్విజులు సామములను బఠింపగా నగ్నిని రగుల్కొల్పెను. పిమ్మట భరతుడు పదిదినములు నిత్యకర్మ మొదలగు వానిని సక్రమముగ జరిపెను.

**తతో దశాహే భరతేన సార్థం, నృపాంగనా మంత్రిపురోహితాశ్చ,**
**కృత్వోదకం తే భరతేన సాకం, పురం తు పశ్చా ద్వివిశు స్సశోకాః. 62 ½**

అనంతరము దశమదినమున భరతునితోగూడ మంత్రిపురోహితాది వర్గమంతయు సరయూనదికి వచ్చి దశరథునకు ధర్మోదకాదుల నిచ్చి విషణ్ణవదనులై యెల్లరును పురమును బ్రవేశించిరి.

*యి దాశౌ చ కాలోఽభూ త్త్వా వ దాశౌచినోఽఖిలాః,
అక్షారలవణా భూమిశయనాది సమన్వితాః. 63 ½

*అశౌచ కాలము పూర్తియగువఱకు జ్ఞాతులు మొదలగు వారలు కారము, ఉప్పు మొదలగు నిషిద్ధపదార్థములను విడిచి బ్రహ్మచర్యము జరుపుచు భూమిపై మాత్రమే శయనించుచు కాలము గడపిరి.

---

*అనేనాశౌచిభిః యావదాశౌచం నియమవద్భి స్థేయ మితి సూచితం. ప్రేతపత్నీవిషయే విశేష మాహాపస్తంబః.

'యావజ్జీవం ప్రేతపత్నీ బ్రహ్మచర్యం క్షారలవణవర్జనం'చేత్యాది. సంగ్రహే విధవాధర్మా విశేషతః ప్రతిపాదితాః. 'అనుయాతి న భర్తారం యది దైవా త్కథంచన, తథాఽపి శీలం సంరక్ష్యం శీలభంగా త్పతత్యధః, పితా చ మాతా చ భర్తృవర్గ స్తథైవ చ, తద్వైగుణ్యాదపి స్వర్గా త్పతిః పతతి నాన్యథా. ఏకాహార స్సదా కార్యో న ద్వితీయః కదాచన, విధవాకబరీబంధో భర్తృబంధాయ జాయతే. పర్యంకశాయినీ నారీ విధవా పాతయే త్పతిం; నైవాంగోద్వర్తనం కార్యం స్త్రియా విధవయా క్వచిత్, విష్ణోస్తు పూజనం కార్యం పతి బుద్ధ్యా చ నాన్యథా, కంచుకం న పరీదధ్యాత్ వాసో న వికృతం వసేత్'ఇతి.

*ఇట్లనుటచే,

అశౌచము వచ్చినవారు అశౌచము పూర్తియగునంతవరకు నియమ వంతులై యుండవలయునని సూచిత మగుచున్నది.

ప్రేతపత్ని విషయమై అపస్తంబుడు విశేషమును చెప్పినాడు. 'ప్రేతపత్ని జీవితాంత పర్యంతము బ్రహ్మచర్యమును జరుపుచు కారము, ఉప్పు మొదలగు వస్తువులను విసర్జించవలయు'నని.

సంగ్రహమను ధర్మశాస్త్రమునందు విధవాధర్మములు విశేషముగఁజెప్పఁబడినవి: 'వైధవ్యమునుఁబొందిన స్త్రీ భర్త ననుసరించి సహగమనమును జేయుటకు వీలుపడకున్న శీలమును రక్షించుకొనుచుండ వలయును. శీలమునకు భంగము కలిగినచో విధవ పతితురా లగును. ఇంతియే కాక పతితురాలైన విధవయొక్క తల్లిదండ్రులు భర్తృవర్గములో మూడుతరముల వారునుగూడఁ బతితు లగుదురు. విధవయగు స్త్రీ యొక్క మారు రోజునకు భుజించవలయును. రెండుమార్లెన్నడును భుజింపఁగూడదు. విధవయగు స్త్రీ కేశములను బెంచి జడవేసినచో నామెయొక్క లోకాంతరమందున్న పతి బంధింపఁబడును. ఏ విధవ పర్యంకమందు శయనించునో యామె తన పతినిఁ బతితునిగ నొనర్చుచున్నది. విధవయగు నారి యభ్యంగనము చేసికొనరాదు. భగవత్పూజనుగూడ పతిబుద్ధిచేఁ జేయవలయును. రవికెను ధరించుకొనరాదు. రంగు చీరలు ధరింపరాదు.'అని.

పశ్చా*ద్దశాహే విగతే నృపాత్మజ, శ్శుచిత్వయుక్తోఽనుజ సంయుతో దినే,
ఏకాదశే ద్వాదశకే యథావిధి, శ్రాద్ధాది కృత్యాని చకార భక్త్యా. 64½

*పదియవదినము కడచిన వెనుక భరతుడు శుచియై యేకాదశ ద్వాదశాహస్సులయందు భక్తిశ్రద్ధలతో శ్రాద్ధకృత్యములను నిర్వర్తించెను.

పితు రుత్తమలోకాప్త్యై ద్విజేభ్యో భరత స్తదా,
*వస్త్రాన్నధనధాన్యాదిదానా న్యాచరతి స్మ సః. 65 ½

---

*దశాహే సంస్కారదినా ద్దశాహే ఇత్యర్థః. అహితాగ్నీనా మాశౌచస్య సంస్కారదిన మారభ్యైవ గణనీయత్వాత్. నను"శుద్ధ్యే ద్విప్రో దశాహేన ద్వాదశాహేన భూమిపః"ఇతి మన్వాది వచన పర్యాలోచనయా క్షత్రియాణా మేకాదశ ద్వాదశాహ పర్యంత సూతకస్య విద్యమానత్వేన తదనంతరమేవ సూతకనివృత్తి దర్శనాత్, దశాహే విగతే శుచిత్వ మాపేతి కథ ముక్త మితిచేన్న, 'సర్వేషామేవ వర్ణానాం సూతకే మృతకేఽపి వా!దశా హాచ్ఛుద్ధి రేతేషా మితి శాతాతపోఽబ్రవీత్' ఇతి వచన పర్యాలోచనయా సర్వవర్ణ సాధారణ్యేన దశాహానంతరమేవ సూతకనివృత్త్యవగమేన తదభిప్రాయకత్వాదితి జ్ఞేయం.

*అహితాగ్నులకుఁ బ్రేతసంస్కారము జరిగిన దినము మొదలు కొని యాశౌచకాలము నిర్ణయింపఁబడినది కావునఁబదియవదినము కడచిన వెనుక ననగా సంస్కారదినము మొదలుకొని పదియవదినము కడచిన వెనుక నని యర్థము.

బ్రాహ్మణులకుఁ బదిదినములు అశౌచమనియు, క్షత్రియులకుఁ బండ్రెండు దినములు అశౌచ మనియు మన్వాదిస్మృతులయందుఁ జెప్పఁబడి యున్నందున క్షత్రియులకుఁ బండ్రెండవ దినమువఱకు నశౌచ ముండునని తెలుచుండఁ బదియవదినము చనిన వెనుక భరతుడు శుచియైనట్లిచ్చట నెట్లు చెప్పఁబడినది యని యాశంక కలుగును. దానికి సమాధానము చెప్పబడుచున్నది.

"అన్ని వర్ణములవారికి జాతాశౌచమృతాశౌచములయందుఁ బదిదినములు కడచిన వెనుక శుద్ధియగు నను శాతాతపవచనము నాలోచింపగా నన్నివర్ణముల వారికిఁ బదియవదినము గడవగనే సూతకనివృత్తి యగునని తేలుచున్నందున నిచ్చటఁ బదియవదినము గడచిన వెనుక భరతుడు శుచి యైనట్లు చెప్పుటలో దోషము లేదని తెలియనగును

*అనేన పరలోకగతానా ముత్తమలోక ప్రాప్త్యర్థం దానాని కర్తవ్యానీతి సూచితం. అత ఏవ ధృతరాష్ట్రేన పరలోకం గతా న్భీష్మాదీ నుద్దిశ్య దానాని కృతానీతి ప్రతిపాద్యతే ఆశ్రమవాసికే: "సువర్ణ మణిరత్నాని దాసీదాస మజావికం, ఉద్ది శ్యోద్దిశ్య సర్వేభ్యో దదౌ స నృపసత్తమ"ఇతి.

*తండ్రికి నుత్తమలోకప్రాప్తి కలుగుటకై భరతు డప్పుడు బ్రాహ్మణులకు వస్త్రదానము, అన్నదానము, గో, భూమి, ధన, ధాన్యములు మొదలగు దానముల నాచరించెను.

పశ్చా చ్ఛోధనకర్మాపి విధాయ భరతః పునః, 66
శత్రుఘ్నసహిత స్సర్వ మౌర్ధ్వ దైహికకర్మ తత్,
సమాప్తి మనయ త్స్వారై శ్లాఘనీయం యథా తథా 67
త్రయోదశే తు దివసే పురోహితముఖా జనాః,
**దుఃఖితం భరతం సాంత్వవచనైః పర్యసాంత్వయన్ 68

పిమ్మట భరతుడు స్థలశోధనము (అస్థినిక్షేపాదికర్మను) చేసెను. ఇట్లు భరతుడు శత్రుఘ్నసమేతుడై పితృయజ్ఞమును యథావిధిగ బూర్తిచేసెను. **పదుమూడవదినము నందు మంత్రిపురోహితాదులు దుఃఖితుడైయున్న భరతుని ననేక విధములగు శాంతవాక్యములతో నోదార్చిరి.

"పితృకర్మ మొదలగు కర్మలను జేసిన పిమ్మట శుచిత్వము కలిగిన వారిని గూర్చి పురాతనమైన యితిహాసములను దుఃఖోపశమనార్థము పెద్దలు చెప్పవలయు"నని.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యాకాండే
ద్వితీయభాగే సప్తమ స్సర్గః సమాప్తః
ఆశ్చర్యరామాయణమున అయోధ్యాకాండ
ద్వితీయభాగమున సప్తమసర్గము సమాప్తము.

---

*ఇట్లనుటచే పరలోకమున కేగినవారికి నుత్తమలోక ప్రాప్తి కొరకు దానములు బ్రాహ్మణుల కీయవలయునని సూచితమగు చున్నది కాఁబట్టియే ధృతరాష్ట్రుడు పరలోకగతులైన భీష్మాదులకు సంప్రీతికరముగ దానముల నిచ్చెనని ఆశ్రమవాస పర్వమందు గూడఁజెప్పఁబడినది. "సువర్ణమును, మణులను, రత్నములను, మేకలను, గొఱ్ఱెలను, దాస దాసీజనమును భీష్మాదుల నుద్దేశించి దాన మొసంగెను"అని.

**అనేన క్లేశసమయే శోకపరిహరణీభిః కథాభి స్సమాధానం కర్తవ్య మితి సూచితం. తథా చ యాజ్ఞవల్క్యః:- "స్నాతా నపవదేయు స్తా నితిహాసైః పురాతనైః"ఇతి.

**ఇట్లనుటచే నాపత్సమయములయందు శోకమును బోగొట్టునట్టి కథలను జెప్పి యోదార్చవలయునని సూచిత మగుచున్నది. యాజ్ఞవల్క్యమునియు నిటులనే చెప్పెను

## అష్టమ స్సర్గః - ఎనిమిదవ సర్గ

[1] పశ్చా ద్ద్వారతలాగతాం స్వజనకస్వర్గస్థితేః కారణమ్
రామస్యాపి వివాసనం కృతవతీం కుబ్జాం సమీక్ష్య క్రుధా,
'శత్రుఘ్నో తు వికృష్య తాం భువి బలా త్సంపాతయిత్వా పదా
పాణిభ్యామపి తాడయ త్యల మథారోదీ త్తు సా మంథరా. 1

అనంతరము ద్వారములోనికి వచ్చినదియును, తన తండ్రి స్వర్గస్థుడగుటకు గారణ మైనదియును, రాముని నడవికిఁ బంపుటకు హేతురాలు నగు మంథరను శత్రుఘ్నుడు చూచి కోపావేశమున నా మంథరను బలముకొలది క్రిందికిలాగి పడవేసి కాలిచేఁ దన్నుచు, చేతులతో మోదుచుండ నా మంథర బిగ్గరగ నేడ్వసాగెను.

తచ్ఛ్రుత్వా కైకయీం తూర్ణ మాగత్య స్వనిషేధినీమ్,
సంతాడయితు ముద్యుక్తే తస్మి న్సంత్యజ్య మంథరామ్. 2
రక్ష రక్ష సుతే! త్యేవ మాక్రోశంతీం తు కైకయీమ్,
దూరా త్సమీక్ష్య చాగత్య భరతోఽనుజ మబ్రవీత్. 3

ఆ యేడ్పును కైక విని లోపలినుండి పరుగిడుచు వచ్చి శత్రుఘ్నుని వలదని నిషేధింపగా నప్పుడు మంథరను విడిచి కైకనుఁ గొట్టుటకు శత్రుఘ్నుడుద్యమింపగా నామె "పుత్త్రకా! రక్షింపుము! రక్షింపు"మని భరతుని బిల్వగా భరతుడు తొందరగా వచ్చి శత్రుఘ్నునితో నిటుల బలికెను.

కుబ్జాం వాఽకైకయీం వాఽపి త్వం వాఽహం వాఽనుజాధునా,
సంహరేవ యది ద్వౌ చే చ్ఛ్రుత్వా నౌ రాఘవ స్త్యజేత్. 4

సోదరా! మంథరనుగాని, కైకనుగాని మనము హతము చేసినచో మనలను స్త్రీహంతకులనుగా దలచి రామచంద్రుడు దరికి జేరనీయడు సుమా! అందువలననే నింతదనుక నుపేక్షించితిని.

---

1. కవిః

స్త్రీహంతకా వితి స్వాంతే మత్వాఽఽవాభ్యాం రఘూత్తమః,
నాభిభాషేత ధర్మాత్మా తస్మా ద్విరమతా ద్భవాన్. 5

ఇంతియే కాక స్త్రీహంతకులని మనతో రామచంద్రుడు సంభాషింపనుగూడ నిష్టపడడు. కాన నీవు నుపేక్షింపుము.

తత శ్శత్రుఘ్న నిర్ముక్తా కైకేయీ మంథరాం ముహుః,
ఆశ్వాసయంతీ గేహస్య నినాయాభ్యంతరం ద్రుతమ్. 6

అనంతరము శత్రుఘ్నుని బారినుండి కైక తప్పించుకొని మంథర నోదార్చుచు నామెనుగూడ దీసికొని లోపలికి వెళ్లెను.

యదా కదాచి చ్ఛత్రుఘ్నో నిశ్శేషం నః కరిష్యతి,
సానుక్రోశాం తు కౌసల్యాం శరణం యామ సత్వరమ్,
ఇతి దాసీజన స్సర్వః కైకేయ్యా స్సమచింతయత్. 7½

మనమిప్పుడు వెళ్లి దయాదాక్షిణ్యములు గల కౌసల్యను శరణు పొందుదము. లేకపోయిన మనమందరము నెప్పుడో యొకప్పుడు శత్రుఘ్నుని చేతిలోఁ జచ్చువారలమే యని, శేషించిన కైకపరిచారికలు మంథరదురవస్థను జూచి భయపడి పై విధముగా నిశ్చయించుకొనిరి.

దినే చతుర్దశే మంత్రిపురోహితముఖా స్తతః,
సభాయాం భరతం త్వేవ మవద న్వినయాన్వితాః. 8½

పదునాల్గవదినమున మంత్రిపురోహితులు మొదలగువార లందరును సభాస్థలమునందున్న భరతునితో వినయపూర్వకముగ నిటుల విన్నవించిరి.

[1]ప్రవ్రాజితే రామభద్రే రాజన్యపి దివం గతే. 9
శరణం త్వాం కాంక్షమాణా నస్మాం స్త్వం పాతు మర్హసి,
అభిషిక్తో భవా నద్య పరిపాలయతు క్షితిమ్. 10

ఓ రాజపుత్రా! మీ తండ్రిగారు స్వర్గస్థులైనారు. రామచంద్ర మూర్తియా, యరణ్యమున కేగెను. కావున రాజ్య మరాజకము గాకుండగ నీవే రక్షకుడవుగ నుండుమని కోరుచున్న మమ్ములను రక్షింపనర్హుడవు. కాన మాకోరికను సఫలముచేయ వెంటనే పట్టాభిషిక్తుడవై రాజ్యమును బాలింపుము.

1. వా ‖ రా ‖

ఇత్యుక్తో భరతః ప్రాహ సబాష్ప స్త్వాన్సగద్గదః,
జ్యేష్ఠస్య రాజతా నిత్య ముచితా హి కులస్య నః,
నైవం భవంతో మాం వక్తు మర్హంతి కుశలా జనాః. 11 ½

పై విధముగ మంత్రులు మొదలగు వారలు పలుకగా భరతుడు కన్నీరు కార్చుచు గద్గదస్వరమున వారలతో నిట్లు చెప్పెను. మీరలు మావంశధర్మముల నెరిగిన వారలయ్యు నిటుల బలుకుట నా యభాగ్యమని తలచెదను. జ్యేష్ఠుడు రాజుగా నుండుట మావంశములో నాచారము గాని,కనిష్ఠుడు రాజుగా నుండుట యే కాలముననైనను జరిగెనా! వంశాచారమునకు విరుద్ధముగ నేను ప్రవర్తించెదనని యనుకొంటిరా! మీరలిట్లు చెప్పదగదు.

రామః పూర్వో హి నో భ్రాతా భవిష్యతి మహీపతిః. 12
ఆనయిష్యా మ్యహం జ్యేష్ఠం భ్రాతరం రాఘవం వనాత్,
సర్వోపాయైరపి విభుర్న చాగచ్ఛతి చే త్తదా,
అహం తత్రైవ వత్స్యామి సౌమిత్రిరివ సేవకః. 13½

మనకు రామచంద్రమూర్తియే రాజుగ నుండదగును. మాయన్నగారగు రామచంద్రునే వనమునుండి సర్వవిధములఁ బ్రయత్నించి తీసికొని రాగలను. సర్వవిధముల యత్నించినను రామచంద్రమూర్తి రానియెడల నేనుగూడ లక్ష్మణునివలె రామునిసేవ చేయుచు నచ్చటనే యుందును. ఇది నానిశ్చయము.

[1] నిరర్థకసమారంభా ద్భవద్భిస్తు విరమ్యతామ్,
సర్వే ప్రయాణం కుర్వంతు రామానయనసౌహృదాః, 14½
ఇత్యుక్త్వా మంత్రిణః పశ్చా ద్భరతః కృతనిశ్చయః,
ఆదిదేశ సమీకృత్యై చాధ్వన శ్శిల్పినో బహూన్. 15½

కావున మీరలు వ్యర్థప్రయత్నములను విరమింపుడు. రాముని తీసికొని వచ్చుటలో మీర లందరును సుహృద్భావమును గన్పఱపుడు. ఇట్లు కృతనిశ్చయుడైన భరతుడు పైవిధముగ మంత్రులతోఁ జెప్పి మార్గపరిశోధనాదులకై వెంటనే శిల్పిజనుల ననేకుల నాజ్ఞాపించెను.

1. కవిః

భూప్రదేశవిదః పశ్చా ద్యంత్రకర్మకృత స్తథా,
శిల్పిన స్తక్షకాం శ్చాపి సూత్రకర్మకృత స్తథా.
భరతాజ్ఞావశా త్సర్వే నిర్గతాశ్చ పురా ద్ద్రుతమ్,
అవృక్షేషు చ దేశేషు వృక్షా నారోపయంతి తే.
కేచి త్కుఠారై ష్టంకైశ్చ దాత్రై శ్ఛిందంతి వై తథా,
నరేంద్రమార్గస్స తదా రమ్యోఽభూ చ్ఛిల్పినిర్మితః. 16-18½

అనంతరము భూప్రదేశములను బాగుగ గుర్తెరిగినవారును, యంత్రపు పనులను జేయువారలును, శిల్పులును, వడ్రంగులును, నూలుపని చేయువారలును మొదలగు పనివాండ్రందరును భరతుని యానతిచే మార్గపరిశోధన, మార్గసమీకరణములకై పురమునుండి బయలు దేరిరి. అందులోఁ గొందరు చెట్లు లేని ప్రదేశములలో చెట్లు నాటు చుండిరి. మరి కొందరు లతాగుల్మాదులను గొడ్డళ్ళు మొదలగు వానిచే దెగగొట్టుచుండిరి. ఇవ్విధముగ శిల్పిజనము నిమ్నోన్నత ప్రదేశములను సమము చేసి రాజమార్గమును నందముగ నేర్పరచి యావృత్తాంతమును దిరిగివచ్చి భరతునకు విన్నవించిరి.

దినత్రయాంతరే మార్గం సమీకృత్య తు శిల్పినః,
గత్వా తే భరతం నత్వా ప్రాహు ర్మార్గం సమీకృతమ్. 19 ½

ఆపని చేయువారలు మూడు దినములలో పైవిధముగ మార్గము నంతను సమముచేసి భరతునియొద్దకేగి నమస్కరించి మార్గమంతయు సమీకృత మయ్యెనని చెప్పిరి.

చతురంగబలం సర్వ ముద్యోజయితు మంజసా,
సుమంత్రం ప్రేషయామాస భరతో ధర్మతత్పరః. 20 ½

పిమ్మట భరతుడు చతురంగ బలమును వెంటనే ప్రయాణసన్నద్ధము చేయవలసినదిగా సుమంత్రునితోఁ జెప్పెను.

ప్రభాతాయాం చ శర్వర్యాం భరత శ్చోదితే రవౌ,
సజ్జం రథం సమాస్థాయ ప్రతస్థేఽనుజసంయుతః. 21 ½

మఱుదినమున సూర్యోదయమైన పిమ్మట సిద్ధముచేసి తీసికొని రాబడిన రథమును భరతుడు శత్రుఘ్న సహితుడై యెక్కి పయన మయ్యెను.

**అభియాన్తం తు భరతం సర్వే మంత్రిముఖా జనాః,**
**అనుసృత్య యయుః పశ్చా ద్రథా నాస్థాయ సంభ్రమాత్,**
**చతురంగబలం చాపి పృష్ఠత శ్చాగ్రతోఽ ప్యగాత్. 22 ½**

పయనమై వెళ్ళుచున్న భరతు ననుసరించి మంత్రులు, పురోహితులు మొదలగువారలు రథారూఢులై బయలుదేరిరి. చతురంగ బలము కొంత ముందుఁ గొంత వెనుకను వెళ్ళుచుండెను.

**రామానయనసంజాతహర్షా స్సర్త్యో నృపస్త్రియః,**
**కౌసల్యాద్యా వినిర్గత్య రథా నారుహ్య వై యయుః. 23 ½**

కౌసల్య మొదలగు రాజస్త్రీ లందఱును రామునిఁ దీసికొని వచ్చెదము గదా యను సంతోషముతో రథములు మొదలగు వాహనముల నెక్కి పయనమైరి.

**పౌరజానపదా స్సర్వే నిర్యయుశ్చ క్రమా త్తతః,**
**మణికారాః కుంభకారా స్సూత్రకర్మకృత స్తథా,**
**దంతకారా స్సుధాకారా స్తథా కంబళధావకాః,**
**రజకా స్స్నాపకా వైద్యా స్తథా ధూపకృతోఽపి చ.**
**మాయూర కోచ్ఛాదకాశ్చ నిర్యయు శ్శిల్పినో జనాః,**
**ఏవం పరిచరా స్సర్వే భరతేన వినిర్గతాః. 25-27**

పౌరులు మొదలగు వారును గ్రమక్రమముగ బయలుదేరిరి. మణికారులు, కమ్మరులు, నూలు లాగువారలు, దంతపుపని చేయువారలు, సున్నపుపని చేయువారలును, కంబళులను బాగుచేయువారలును, చాకలులు, ప్రభువులకు స్నానము చేయించు వారలు, వైద్యులు, స్నానము చేసిన వెనుక ధూపము వేయువారలు, నెమలుల నాడించువారలును, ప్రభువులు స్నానము చేసిన వెనుక శరీరమును తుడుచువారలును, శిల్పిజనులు మొదలగు పరిచారకు లందరును భరతుని వెంట బయలుదేరిరి.

**భరతేఽప్యేవ మఖిలైః పౌరజానపదై స్సహ,**
**వినిర్గతే తదా దేవా భీతా శ్శక్ర మథాబ్రువన్. 28**

ఈ ప్రకారముగ భరతుడు సకల సైన్యముతో బయలుదేరి వెడలు చుండగ, స్వర్గలోకమున దేవత లాందోళనముతో దేవేంద్రునిగూర్చి యిటులఁ బలికిరి.

[1] భరతో రామనికటం యాతి తం చే న్నివర్తయేత్,
రావణాద్యసురేభ్యో న స్థిరా బాధా భవిష్యతి. 29

మహేంద్రా! భరతుడిపుడు రాముని నెట్లయినను దిరిగి యయోధ్యకు దీసికొని వచ్చునట్టి ప్రయత్నమున రామసమీపమునకు సర్వసైన్యముతో వెడలుచుండెను. అట్లు వనమునుండి రాముని భరతుఁడు మరలించినట్లైన మనకుఁ బూర్వమువలెనే రావణుఁడు మొదలగు రాక్షసులవలన బాధ స్థిరముగ నుండగలదు.

అద్య ప్రతిక్రియా నూనం విచింత్యా భవతా విభో,
ఇత్యుక్తో మఘవా దేవై శ్శారదాం స్మృతవాం స్తతః. 30

మహాప్రభూ!యిప్పుడే యేదైన ప్రతిక్రియ నాలోచింపుము. ఇట్లు దేవతలు విన్నవింప దేవేంద్రుడు సరస్వతీదేవిని స్మరించెను.

శారదాఽపి సమాగా ద్వై మహేంద్రసదస స్తదా,
మరుత్వా నపి వాగ్దేవీం ప్రార్థయామాస నైకధా. 31

సరస్వతియును దేవేంద్రునిసభకు వెంటనే వచ్చెను. దేవేంద్రుడు శారదాదేవి ననేకవిధముల నీక్రిందివిధముగ బ్రార్థించెను.

శారదే! శారదేఽస్మాకం రక్ష నో వాగ్విశారదే,
త్వత్ప్రసాదాత్తు కైకేయీ రాఘవం కాననం ప్రతి,
ప్రస్థాపయామాస పరం వృథా భవతి తచ్ఛృణు. 32-33½

ఓ శారదా! ఓ వాగ్విశారదా! భక్తసుఖంకరీ! మమ్ములను నాపదనుండి తొలగించి రక్షింపుము. లోగడ నీయనుగ్రహమువలన కైక రాముని నడవులకుఁ బంపినందున సంతసము నొందితిమి. కాని యది యంతయు నిపుడు వ్యర్థమగుచున్నది. ఆసంగతిని జెప్పెదను వినుము.

భరతో రాఘవం భూయ స్సాకేతం నేతు మంజసా,
వినిర్గతోఽభూ ద్దేవ్యద్య తథా తేన కృతం యది,
అస్మాకం రక్షసాం బాధా యథా పూర్వం భవిష్యతి. 35

యథార్థముగ భరతుడు రాము నరణ్యమునుండి మరలించి తీసికొని వచ్చుటకుఁ బురజనులతోఁగూడ రామసమీపమునకు వెళ్లుచుండెను. ఇది యిట్లు జరిగినచో రాక్షసబాధ పూర్వమువలె స్థిరముగ నుండగలదు.

1. భర. రా. సా. కవిః.

**తస్మా త్ప్రసన్నా దేవి! త్వం తద్బుద్ధిం భరతస్య తు,**
**పరావర్తయ దేవా న్నః పరిపాలయ శారదే! 36**

ఓ దేవీ! యా కారణమువలన నీవనుగ్రహించి భరతుని బుద్ధిని నెటులైన మరలించి మమ్ములను రక్షింపుము.

**ఇతి శక్రేణ సా దేవీ ప్రార్థితా ప్రాహ తం వచః.**
**సహస్రాక్షోఽపి చ భవాన్ తత్త్వం పశ్యతి నో విభో,**
**బ్రహ్మవిష్ణుమహేశానాం శక్తయో యన్మతిం పునః,**
**న పశ్యేయు స్తన్మతిం కః పరావర్తయితుం క్షమః 37-38**

ఇట్లు దేవేంద్రుడు సరస్వతీదేవినిఁ బ్రార్థింప నద్దేవి మహేంద్రునితో నిటులఁ బలికెను. మహేంద్రా! నీవు సహస్రాక్షుడ వయ్యును తత్త్వమును నెరుగనందునకుఁ జింతిల్లెదను. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల శక్తులుకూడ నే భరతుని బుద్ధిని గనుఁగొనలేవో, యట్టి భరతుని బుద్ధిని నెవ్వడు మరల్పగలడో యూహింపుము

**భాస్కర స్యాంతికే యద్వ త్తమః స్థాతుం న హి క్షమమ్,**
**తథా మాయా న మే స్థాతుం భరతస్యాంతికే క్షమా. 39**

సూర్యుని సమీపమునఁ జీకటి యుండని విధమున నా మాయికతా శక్తి కూడ భరతుని సమీపమునకుఁబోయి యుండలే దనుట యథార్థము.

**భరతస్య హృదబ్జేతు సీతారామౌ యతః స్థితౌ,**
**నాలం వంచయితుం సంతం భరతం కోఽపి భూతలే. 40**

సీతారాములు నిరంతరము భరతుని హృదయపుండరీకమున నుండుటచే నేనే కాక యితరు డెవ్వడునుకూడ భరతుని వంచింప లేడనుట నిక్కువము.

**ఇత్యుక్త్వా శారదా దేవీ బ్రహ్మలోకం గతాఽభవత్.**
**చక్రవాకా యథా రాత్రౌ దేవతా వ్యాకులా స్తథా,**
**సిద్ధ్యసిద్ధీ యత స్తస్య భరతస్య శయే స్థితే. 41**

ఇవ్విధముగ సరస్వతి దేవేంద్రునితోఁజెప్పి బ్రహ్మలోకమున కేగెను. సిద్ధ్యసిద్ధులు భరతుని హస్తగతములై యున్నందున రాత్రియందుఁ జక్రవాకములవలె నప్పుడు దేవతలు వ్యాకులతఁ జెందిరి.

పశ్చా త్స్వార్థపర శ్శక్ర స్స్వమాయాం భరతోపరి,
తద్బలస్యోపరి తథా త్వవిచార్య ప్రయుక్తవాన్. 42½

అనంతరము స్వార్థపరుడగు దేవేంద్రుడు తన దేవమాయను భరతుని మీదను నతని సైన్యముమీదను బ్రయోగించెను.

తన్మాయా భరతం చాపి వసిష్ఠాదీ న్మునీ న్వినా,
సర్వా న్పురజనాం స్తత్ర మోహయామాస నైకధా. 43
మహేంద్రమాయయా తత్ర జనా స్సర్వే నిజాం పురీమ్,
గంతుకామా వసంతిస్మ సంత్యజ్య భరతం పునః. 44

ఆదేవమాయయును భరతుని వసిష్ఠాది మహర్షులను విడిచి శేషించిన పురజనులను భరతుని సైన్యమును మోహింపఁజేసెను. అందువలనఁ బురజనులును చతురంగ బలము కూడ భరతుని విడిచి యయోధ్యకు బోవల్లయునను కోరికతో నుండిరి.

పదాతీనాం తదా పాదా మహేంద్రస్యైవ మాయయా,
సూచీవిద్ధా ఇవాత్యంతం బభూవు ర్గంతు మక్షమాః. 45

ఇదియునుంగాక దైవమాయచే సైన్యములోని పదాతుల (కాల్బలము యొక్క) పాదములు సూదులతోఁ గ్రుచ్చబడిన విధముగ బాధ కలవై నడుచుటకు సమరములు కాకుండెను.

వాహనాద్యాశ్రితానాం చ మనో వైకల్య మాగతమ్,
శిరోభ్రమశ్చ కేషాంచి దన్యేషాం తు మనోభ్రమః. 46
అక్షిభ్రమశ్చ కేషాంచి దజాయత తదా పునః,
అయోధ్యాం ప్రతి గంతుం తే జనా స్త్వభిముఖాస్థితాః 47

వాహనముల నెక్కిన జనులకును దైవమాయచే మనస్సులు వికలములు కాజొచ్చినవి. కొందరికి శిరోభ్రమము, మఱికొందఱికి నేత్రభ్రమము, మఱికొందఱికి మనోభ్రమము - నివ్విధముగఁ గలిగెను. జనులందఱును దిరిగి యయోధ్యకు వెడలుట కభిముఖులై యుండిరి.

కర్ణాకర్ణికయా చైత న్నిశమ్య భరత స్తతః
స్వప్రయాణం తు నిర్విఘ్నం కురుతా ద్భగవ న్నితి,
ప్రార్థయామాస మనసా రంగేశం కులదైవతమ్. 48

పిమ్మట భరతుడు తన పరిచారజనములోఁ గలిగిన మనోవైకల్య వృత్తాంతమును గర్ణాకర్ణికగ విని తన ప్రయాణమును నిర్విఘ్నముగఁ జేయవలసినదిగాఁ దన కులదైవమగు రంగనాయకుని బ్రార్థించెను

**తద్ధ్యానమాత్రేణ మహేంద్రమాయా**
**స్థాతుం నశక్తా భరతస్య సైన్యే,**
**సంత్యజ్య తత్సైన్య మరం జగామ**
**రంగేశ భీతా త్రిదివం క్రమాద్వై. 50**

ఇట్లు భరతుడు తన యిష్టదేవతా ప్రార్థనము జేయుటతోడనే యింద్రమాయయును, రంగేశుడు తనను హతముచేయునను భయముతో భరతుని సైన్యమును విడిచి స్వర్గమున కేగెను.

**నాహం తస్యాంతికే స్థాతు మశక్తేతి బిడౌజసమ్,**
**మాయాఽ ప్యువాచ గత్వా త న్ని స్త్రైజస్కోఽభవ ద్ధరిః. 51**

పిమ్మట దేవేంద్రునితో నిటుల దేవమాయ చెప్పెను. నేను భరతుని సమీపమున నుండజాలక తిరిగి వచ్చితిని- అని చెప్పుటతోడనే యింద్రుడు తెల్లబోయెను.

**మిథిలేశోఽపి రామం తు చిత్రకూటోపరిస్థితమ్,**
**నృపం మృతం చ భరతం రామానయనయాయినమ్,**
**శ్రుత్వా చాంతఃపుర స్త్రీభిః ప్రతస్థే రామసన్నిధిమ్. 52½**

రాముడు సీతాలక్ష్మణసమేతుడై పితృవాక్యపాలనమునకై యడవి కేగి చిత్రకూటమునం దున్నట్లును, దశరథుడు మృతినొందినట్లును, భరతుఁడు రాముని దీసికొని వచ్చుటకుఁ జిత్రకూటమునకుఁ బయన మైనట్లును జనకుఁడు కర్ణాకర్ణికగ విని తానుకూడ మితపరివారముతోఁ జిత్రకూటమునకు బయలువెడలెను.

**యస్మి న్దినే తు భరతో మహాసైన్య సమన్వితః,**
**ప్రతస్థే చిత్రకూటాద్రిం జనకోఽపి వినిర్గతః. 53½**

ఏదినమున భరతుడు సైన్యముతోఁ జిత్రకూటమునకు బయనమయ్యెనో యాదినముననే జనకుఁడును చిత్రకూటమునకుఁ బయన మయ్యెనని తెలియందగు.

భరతోఽపి స్వసైన్యేన బహూ న్జనపదాం స్తతః,
కోసలా న్సమతీత్యాగా ద్గంగాం త్రిపథగాం క్రమాత్,
గంగాతీరే సర్వసైన్యం స్థాపయామాస సోఽప్యథ. 54-55

అచ్చట భరతుడు తనసైన్యముతో ననేక గ్రామముల నతిక్రమించి, కోసలదేశమును దాటి, గంగాతీరమునకుఁ జేరి యచ్చటఁ దన సైన్యమును నిలుచున ట్లానతిచ్చెను.

దృష్ట్వా రాజసుతస్య సైన్య మతులం శ్రీ కోవిదార ధ్వజమ్
స్వాత్మ న్యేవ మచింతయచ్చ బహుధా దాశాధిపో వై గుహః,
కింవా రాజ్య మకంటకం త్వభిలషన్ వన్యా వయం రాఘవౌ
హంతుం త్వే త్యుత రామమిత్ర మితి మాం హంతుం సమాయాతి వా. 56

ఆసమీపమున నున్న దాశరాజగు గుహుడు భరతుని చతురంగసైన్యమును, నిక్ష్వాకువంశపు రాజులకు చిహ్నమైన కోవిదారధ్వజమునుఁజూచి తన మనమునం దనేకవిధములుగ నాలోచింపఁజొచ్చెను. (ఎట్లన) ఈ భరతుఁడు తన రాజ్యలక్ష్మిని స్థిరపరచుకొనుటకును, శత్రురహితముగఁ జేసికొనుటకును నడవిలో నున్న రామ లక్ష్మణులను గూడ జంప నుద్దేశముతో వెడలుచుండెనా? లేక, రాముని మిత్రుఁడ నని నన్ను నా పరిజనమును హతము చేయ వచ్చుచుండెనా? యని.

ఇ త్యేవం హృది సంశయేన సహిత స్సంచింత్య కర్తవ్యతామ్
సన్నద్ధేన మయాఽపి భావ్య మితి వై నిశ్చిత్య పశ్చాద్గుహః,
స్వీయా నాహ జనా న్భవద్భి రధునా స్థేయం ప్రమాదం వినా
నౌకాపంచశతీం త్వవంతు సశరా స్సంతో భవంతోఽఖిలాః. 57

ఇవ్విధముగ గుహుఁడు మనస్సునందు సందేహపడుచుఁ గర్తవ్యము నాలోచించి పిమ్మటఁ దానుకూడఁ దగిన సన్నాహముతో నుండవలయునని నిశ్చయించి, యాత్మీయులతోఁ నిటులఁజెప్పెను. మీరందఱును జాగ్రత్తగ నుండి ధనుర్బాణములను ధరించి మన యైదువందల పడవలను గాపాడవలయును.

దుష్టాశయేన భరతో యది చాఽగతస్స్యా
త్సంతారయేమ న హి తం చ చమూం చ గంగాం
వేత్తుం తదాశయ మహం ప్రథమం వ్రజామి
స్థేయం భవద్భి రఖిలై రధునాఽప్రమత్తైః.
* ఇతి స్వీయా స్సమాజ్ఞాప్య ఫలమూలాద్యుపాయనః,
శృంగిబేరపురాధీశో భరతం సముపేయివాన్. 58-60

భరతుఁడు దుష్టబుద్ధితో వచ్చినట్లు తెలిసినచో నతనినిగాని యతని సేననుగాని మనము దాటింపఁగూడదు. నేను ముందుగ వెళ్ళి భరతుని యాశయమునుఁ దెలిసికొని వచ్చెదను. మీరుమాత్రము కడుజాగ్రత్తగ నుండవలయును. ఇవ్విధముగఁ దన జనులను గుహుఁడాజ్ఞాపించి కందమూలములు *ఫలములు మొదలగువానిని కానుకలు గాఁదీసికొని భరతుని సమీపమున కేగెను.

ఏవం నృపాత్మజ ముపేత్య గుహోఽబ్రవీ త్తం,
దేశోఽయ మాఢ్య తవ చాహ మపి త్వదీయః
ఆనీత మేత మఖిలం ఫలమూల వర్గమ్,
స్వీకృత్య రాత్రి మతివాహ్య భవా న్వ్రజేచ్ఛ్వః. 61-62

ఇవ్విధముగ గుహుఁడు భరతుని సమీపించి యిటులఁ బలికెను. ఓ రాజా! యీదేశము నీదై యున్నది. నేనును నీవాఁడను. నేను తీసికొని వచ్చిన ఫలవర్గమును స్వీకరించి యీ రాత్రి నిచ్చటనే కడపి రేపటి యుదయమున వెళ్లవలసినది.

పశ్చా ద్గుహోక్తి ముపశ్రుత్య తు రాజపుత్ర
స్తద్దత్త భోజ్య మభినంద్య త మాహ భూయః,
సంతర్తు మేత దతులం ప్రభవే త్కథం ను
గాంగం జలం మమ చమూ ర్వద మిత్ర నూనమ్. 63

---

*అనేన పూజ్యానాం దర్శనం రిక్తహస్తేన న కర్తవ్య మితి సూచితం. తథా చ భారతే 'రిక్తపాణిర్న పశ్యేత్తు రాజానం దైవతం గురుం'ఇతి.

*ఫలములు మొదలగువానిని గుహుఁడు తీసికొని భరతసమీపమునకు వెళ్లెననుటచే, పూజ్యుల సమీపమునకుఁ బోవునప్పుడు రిక్తహస్తములతోఁబోఁగూడదనెడి ధర్మము సూచిత మగుచున్నది. భారతమునందు నివ్విధముగనే చెప్పఁబడినది."రాజసమీపమునకు, దేవతాసమీపమునకు, గురుసమీపమునకు శూన్యహస్తములతోఁబోగూడ"దని.

అనంతరము భరతుఁడు గుహునివచనమును విని యతనిచేఁ దేబడిన ఫలవర్గమును నభినందించి యతనితోఁ నిటులఁబలికెను. ఓమిత్రమా! యీగంగాజలమును నేను సైన్యసహితముగ దాటునట్టి యుపాయము నాలోచించి చెప్పుమనెను.

**తచ్ఛ్రుత్వా భరతం గుహోఽవద దితిస్వామిం స్త్వదీయాచమూ**
**రాస్తే కాలసమీరణాహతచలత్కల్లోలపాళిర్యథా**
**శంకా మే సమభూ త్తతో మమ గురౌ శ్రీరాఘవే త్వం ధ్రువం**
**దోషం వాంఛసి నో యది ప్రియసఖ త్వాం తారయేయం చమూమ్. 64**

అది విని గుహుఁడు భరతునితోఁ నిటులఁ బలికెను. ఓ రాజా! నీ సైన్యము ప్రళయకాలవాయువుచే నెగురగొట్టబడి చలించు సముద్రతరంగ పంక్తివలె మహాభీకరముగ గన్పట్టుచున్నందున నాకు సందేహము పొడముచున్నది. నా గురువగు శ్రీరాముని విషయమై నీవు దుష్టమగు తలంపుతో నుండని పక్షమున నేను స్వజనముతో గూడ మాకున్న యైదువందల నావలతో మిమ్ములను మీ సైన్యమును గూడ దాటింపగలను.

**ఇత్యుక్తో భరతః ప్రాహ సాశ్రునేత్రో గుహం ప్రతి,**
**కైకేయ్యా దుష్టయా చైత త్కృతం వై మందభాగ్యయా,**
**తద్గర్భజనిదోషేణ శంక్యోఽహ మభవం సఖే! 65½**

పైవిధముగ గుహుడు పలుకగ భరతుఁడు కన్నీరు గార్చుచు నిట్లుఁ బలికెను. ఓ మిత్రమా! దుర్మార్గురాలు, దురదృష్టురాలును నగు కైకవలన నిదియంతయు జరిగెను. ఆమెగర్భమునందు పుట్టుటయను దోషముచేతనే నేనును సందేహింపదగినవాఁడ నైతి.

**ప్రోషితే మయి కైకేయ్యా కృత మేత న్న వేద్మ్యహమ్.**
**రామస్యానయనార్థాయ వ్రజా మ్యద్య ధ్రువం సఖే!**
**సత్యపూర్వం వదా మ్యేతద్విశ్వాసం కురు వాచి మే. 66-66**

నేను పరదేశమున నుండగాకైక యిట్టి దుష్కృత్య మొనర్చెను. ఈ విషయమును నే నేమాత్రము నెరుగను. నేనిప్పుడు రాముని దీసికొనివచ్చుటకే నిశ్చయముగ వెళ్లుచున్నాను. సత్యముగఁ జెప్పుచున్నాను. నామాటయందు విశ్వాసము నుంచుము.

యత్ర రామో నరవ్యాఘ్రః పద్మపత్రాయతేక్షణః,
సీతా చ యత్ర వైదేహీ లక్ష్మణో భ్రాతృవత్సలః,
తత్ర గచ్ఛామి మిత్రాహ మానేతుం రాఘవం పురమ్,
రాఘవ స్సహి మే భ్రాతా జ్యేష్ఠః పితృసమో మతః.
తం నివర్తయితుం యామి కాకుత్థ్సం వనవాసినమ్.
భృత్యోఽహం వై సదా తస్య నాన్యథా త్వం విచింతయ,
యథా త్వం రామభక్తోఽసి తథాఽ హం రామభక్తిమాన్. 68-70½

పుండరీకాక్షుఁడును, పురుషశ్రేష్ఠుఁడు నగు రాముఁడును భ్రాతృవత్సలుఁడగు లక్ష్మణుఁడును పతిభక్తి గల సీతయు నెచ్చట నుండిరో యచ్చటకు వెళ్లి వారినిఁ బురమునకుఁ దీసికొనివచ్చుటకు వెళ్లుచున్నాను. రాముఁడు జ్యేష్ఠభ్రాతయుఁ బితృసముఁడును గాన నతఁడు రాజుగా నుండఁదగినవాఁడగును. నీవు వేరువిధముగ నాలోచింపకుము. నీ కెటుల రాముఁడనిన భక్తియో యటులనే నాకును రామునియందు భక్తి తాత్పర్యములు మెండు.

రామో యత్ర పురా సుమిత్ర భవతా దృష్ట స్సదారానుజః
యత్రాశేత మమ ప్రభుర్జనకజాయుక్తో రఘూత్తంసకః,
తత్ర త్వం నయ మాం ప్రదర్శయ తదిత్యుక్తో గుహ స్సోఽపి తమ్
నీత్వా తచ్ఛయనస్థలం తు విభవే సందర్శయామాస వై. 71½

ఓ మిత్రమా! యేస్థలమునందు రామచంద్రమూర్తి సీతాలక్ష్మణసమేతుఁడై నీచేఁ జూడఁబడెనో, ఏస్థలమున సీతాసమేతుఁడై రాముఁడు శయనించెనో యా స్థలమును నాకుఁ జూపింపుము- అని భరతుఁడు పలుకగా గుహుఁడు భరతునిఁ దీసికొని వెళ్లి రాముఁడు శయనించిన స్థలమునుఁ జూపించెను.

దృష్ట్వా పర్ణసమా స్తృతంతు భరతో దుఃఖాన్విత స్తత్థ్సలమ్
ప్రాహేదం వచనం గుహం ప్రతి సఖే యా భూమిజా వై పురా
హైమే సౌధతలే సువర్ణ ఖచితే పర్యంకభాగే ముదా
సుప్త్వాఽత్ర కథం ను సా జనకజా శేతేస్మ భూమౌ తు హా. 72½

భరతుఁ డాపర్ణశయ్యను జూచి దుఃఖపడి గుహునితో నిటులఁబలికెను. ఓ మిత్రమా! యే సీత సువర్ణప్రాసాదములయందు రత్నఖచితమగు మంచమున హంసతూలికా శయ్యయందు శయనించెడిదో, అట్టి సీత నామూలకముగ నిట్టి కఠోరమైన భూమిమీద శయనింపవలసి వచ్చెగదా? ఆ తల్లి కెంత కష్టము వచ్చినది?

సీతారాఘవయో స్సమాగత మిదం కష్టం తు మన్మూలత
స్సౌమిత్రే స్సఫలం హి జన్మ భవతో జన్మాఽపి సార్థం ధ్రువమ్
ఇత్యుక్త స్స గుహోఽవదచ్చ భరతం రాజ్యం స్వహస్తాగతమ్
కో వా భూమితలే భవానివ విభో సంత్యక్తు మిచ్ఛే త్కిము. 73½

ఓ మిత్రమా! సీతారాములకు నానిమిత్తముగ నెంతకష్టము వచ్చినది! విచారింపగా లక్ష్మణుని జీవితము సార్థకమైనది. రామభక్తుఁడ నగు నీజీవితముకూడ సఫలమైనది అని భరతుఁడు పలుకగా గుహుఁడు తిరిగి భరతునితోఁ నివ్విధముగఁ బలికెను. ఓ రాజపుత్రా! చేతిలోనికి వచ్చిన రాజ్యలక్ష్మిని నీవలె లోకమున నెవ్వఁడు విడువ నిచ్ఛయించునో నిజము చెప్పుము. నీవంటి విరక్తునిఁద్రిలోకములయందు వెదకి చూచినను గానము.

ధన్య స్త్వం భరత త్వయా భువి సమం సత్యం న పశ్యా మ్యహమ్
వక్తారస్తు వసంతి ధర్మనిచయం నానుష్ఠితః కైశ్చన,
సుభ్రాతృత్వ మిదం తవాద్య భరత! శ్లాఘ్యం యశ స్తే బుధై
ర్లోకే శాశ్వత మస్తు రాఘవపదద్వంద్వార్చనార్థం తవ. 74-75½

ఓ రాజపుత్రా! నీవు ధన్యుఁడవు. నిజముగా నీతో సమానుఁడైన వానిని ముల్లోకములయం దెచ్చటను గానము. లోకములో ధర్మములను జెప్పువార లనేకు లుండవచ్చును. కాని యా ధర్మముల ననుష్ఠించువారలు మాత్రము వెదకినను గన్పడరు.నీ భ్రాతృవాత్సల్యము దేవతలచేఁ గొనియాడదగినదై యున్నది. శ్రీరామ పాదారవిందసేవ ప్రధానముగఁ గల నీ యొక్కకీర్తి లోకమున శాశ్వతమై యుండును.

ఇత్యుక్తో భరతః ప్రాహ శృంగిబేరపురాధిపమ్,
[1] అహం, రామస్య దాసా యే తేషాం దాసస్య కింకరః
యది స్యాం సఫలం జన్మ మమ భూయా న్న సంశయః. 76½

ఇవ్విధముగ గుహుఁడు పలుకగా భరతుడు తిరిగి యా గుహునితో నిటులఁ బలికెను. నీవు నన్నింతగా స్తోత్రము చేయ నర్హుడను గాను. రాముని దాసులకు దాసానుదాసులుగా నుండినవారలకు నేను దాసుడుగా నుండినచో నా జీవిత మప్పుడేమైన సఫల మగునేమో చెప్పజాలను.

---

1. అ. రా.

భ్రాత ర్జానాసి యది త త్కథయస్వ మమాఖిలమ్,
యత్ర తిష్ఠతి తత్రాహం గచ్ఛా మ్యానేతు మంజసా,
ఇత్యుక్తః ప్రాహ భరతం శృంగిబేరపురాధిపః. 77-78

సోదరా!యిప్పుడు మా రామచంద్రమూర్తి నివసించియున్న ప్రదేశము నీకుఁ దెలిసియున్నయెడల నాకుఁ జెప్పుము. రామునిఁ దీసికొని వచ్చుటకు నేనచ్చటికి వెళ్లుదును అని భరతుడు పలుకగా గుహుడు భరతునితో నిట్లు పలికెను.

చిత్రకూటాద్రినికటే మందాకిన్యా విదూరతః,
జానక్యా సహితో రామ స్సుఖ మాస్తే కిల ప్రభుః,
తత్ర గచ్ఛామహే ప్రాత ర్గంగాం తర్తు మిహోర్హసి. 79½

ఓ రాజపుత్రా! గంగానదికి సమీపమున చిత్రకూటపర్వతమునందు ప్రభువగు రామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై సుఖముగ నున్నాడు. మనమచ్చటికి వెళ్లుదముగాక!నీ వీ రాత్రి యిచ్చటనే యుండి రేపటి యుదయమునఁ బ్రయాణము చేయవలసినది.

[1] ఇత్యుక్త్వా స్వజనై స్తేషాం పౌరాణాం తద్బలస్య చ,
తస్యాం రాత్రౌ భోగ్యజాత మానయామాస వై గుహః. 80½

ఇవ్విధముగ గుహుఁడు భరతునితోఁజెప్పి స్వీయజనులనుఁ బిలిచి వారలచే భరతుని సైన్యమునకు నారాత్రియందుఁ గావలసిన సకలభోగ్య వస్తువులనుఁ దెప్పించి యిప్పించెను.

[2] ప్రాత స్సోఽపి గుహ స్తస్య నావః పంచశతాని హ,
సమానయ త్ససైన్యస్య తర్తుం గంగాం మహానదీమ్. 81 ½

ప్రాతఃకాలముననే గుహుఁడు తన పరివారజనముచే నైదువందల నావలను దీరమునకు దెప్పించి భరతుని సైన్యమునంతను గ్రమముగ వానియందెక్కించి గంగను దాటింపఁజేసెను.

స్వయమేవానినాయైకాం రాజనావం గుహ స్తదా,
ఆరోప్య భరతం తత్ర శత్రుఘ్నం రామమాతరమ్,
వసిష్ఠం చ తథాఽన్యత్ర కైకేయీం చాన్యయోషితః,
వాహయామాస చ గుహః పరం పారం నినాయ తాః. 82-83½

---

1. కవిః 2. అ. రా.

గుహుఁడు స్వయముగ రాజనావను దీసికొని వచ్చి దానియందు భరతశత్రుఘ్నులను గౌసల్యను వసిష్ఠుని గూర్చుండబెట్టి; కైక మొదలగు రాజస్త్రీలను మఱియొక నావయందుఁ గూర్చుండ నేర్పరచి తాను స్వయముగ నారాజనావను నడిపి వారిని గంగ దాటించి యవతలియొడ్డునఁ జేర్చెను.

**తతో నిర్గత్య భరత స్సర్వసైన్య సమన్వితః,**
**గుహేన సహితో గత్వా భరద్వాజాశ్రమాంతికమ్,**
**సంస్థాపయామాస దూరే త్వాశ్రమస్యాఖిలాన్ జనాన్. 84-85**

అనంతరము భరతుడు జటాధారియై సమస్త సైన్యముతోఁగూడి గుహుని గూడ వెంటఁదీసికొని ప్రయాణమై యనేకారణ్య ప్రదేశములను దాటి క్రమముగ భరద్వాజాశ్రమ సమీపమునకుఁ జేరి తన సైన్యము నంతను నమ్ముని యాశ్రమమునకు బాధ కలుగకుండఁ గొంతదూరముననే నిల్పెను.

**ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యాకాండే ద్వితీయభాగే అష్టమ స్సర్గః సమాప్తః**
**ఆశ్చర్యరామాయణమున అయోధ్యాకాండ ద్వితీయభాగమున అష్టమసర్గము సమాప్తము.**

# నవమస్సర్గః - తొమ్మిదవసర్గ

*[1] అథ శత్రుఘ్నసహితో భరతో గురుణా సహ,
నిరీక్షితుం భరద్వాజం యయౌ తస్యోటజం ప్రతి. 1

*అనంతరము భరతుఁడు శత్రుఘ్న సహితుడై పురోహితుని వెంటబెట్టుకొని భరద్వాజమహర్షిని జూచుటకు నమ్ముని పర్ణశాల కేతెంచెను.

తతో భరద్వాజముని ర్వసిష్ఠం శత్రుఘ్న మార్యం భరతం చ వీక్ష్య,
ఆనీయ తా నాసనపాద్యముఖ్యై స్సంపూజ్య పప్రచ్ఛ సుఖాగతిం తాన్. 2

అనంతరము భరద్వాజ మహర్షియును తన యాశ్రమమునకు వచ్చుచున్న వసిష్ఠ భరత శత్రుఘ్నులను జూచి తా నెదురేగి వారలను దీసికొనివచ్చి యర్ఘ్యపాద్యాదులచేఁబూజించి కుశలప్రశ్న లడిగెను.

భరద్వాజాయ మునయే భరతోఽపి ప్రణమ్య సః,
నివేదయామాస తస్మై చాత్మాన మనుజం తథా. 3

భరతుడు నమస్కారపూర్వకముగఁ దనను శత్రుఘ్నునిఁగూడ భరద్వాజున కెరుకపరచి తాను సైన్యసమేతముగ చిత్రకూటమునకు వెళ్లుచున్నటులఁగూడ జెప్పెను.

---

*అనేన వినీత వేషేణైవ రాజ్ఞా తపోవనం, పురోహితం పురస్కృత్య ప్రవేష్టవ్యమితి సూచితం. తథా చాదిపర్వణి శకుంతలోపాఖ్యానే దుష్యంత స్సేనాం ప్రతి- "మునిం విరజసం ద్రష్టుం గమిష్యామి తపోవనం, యుష్మాభిః స్థీయతా మత్ర యావ దాగమనం మమ"ఇతి; "పురోహితసహాయశ్చ జగామాశ్రమ ముత్తమ"మితి చ.

*ఇచ్చట భరతుఁడు సైన్యమును దూరమందుంచి పురోహితుని వెంటబెట్టుకొని భరద్వాజాశ్రమములోఁబ్రవేశించె ననుటచే రాజు వినయవేషముతోఁబురోహితుని ముందుంచుకొని తపోవనముఁబ్రవేశించవలయునను ధర్మము సూచిత మగుచున్నది ఆదిపర్వమున శకుంతలోపాఖ్యానమున నిటులనే కన్పడుచున్నది. దుష్యంతుడు తన సైన్యముతో నిటులఁజెప్పెను. 'నేను కణ్వమహర్షిని జూచుటకు తపోవనమున కేగుచున్నాను. నేను వచ్చువరకు నిచ్చట నే యుండు'డని చెప్పి తాను పురోహితుని దీసికొని కణ్వాశ్రమముఁబ్రవేశించెను. అని.

---

1. కవిః

[1] ఆసీనం భరతం సమీక్ష్య తు మునిః ప్రాహాథ వాక్యం త్విదమ్
ప్రోన్మూల్యాద్యతనారిశేష మఖిలం రాజ్యం తు నిష్కంటకమ్
కర్తుం త్వం చతురంగసైన్యసహితో యాస్యద్య వా కిం వద
ఇత్యుక్తో భరత స్సుదుస్సహశుచా వ్యాప్తో ఽబ్రవీ త్తం మునిమ్. 4

అనంతరము భరద్వాజుడు సుఖాసనాసీనుడై యున్న భరతునిఁ జూచి యిటులఁ బలికెను. 'ఓ భరతా! శత్రుశేషమును లేకుండఁ జేసి రాజ్యమును నిష్కంటముగచేసికొనుటకు (అనగా రామలక్ష్మణులను హింసించుటకు) చతురంగ సైన్యముతోఁ జిత్రకూటమునకు వెడలు చుంటివా యేమి? నిజము చెప్పుము? అని మహర్షి పలుకగా భరతుడు మిక్కిలి సహింప శక్యము కాని దుఃఖముతో భరద్వాజమహర్షితో నిట్లనెను.

సర్వజ్ఞో ఽపి భవాన్ మదాశయ మలం జ్ఞాతుం సమర్థో ఽపి మామ్
పృచ్ఛ త్యేవ ముదంత మద్య భగవ న్వచ్మి శ్రుణు త్వం గతమ్,
కైకేయ్యా ఽఽచరితం పపాత మయి త ద్దుష్కృత్య మేత న్మయా
న జ్ఞాతం గురుసాక్షికం కిమపి తత్కాలే ఽపి నాహం స్థితః. 5

ఓ భరద్వాజమహర్షీ! నీవు సర్వజ్ఞుడ వయియుండియు నామనోగతమును దెలిసికొనుటకు సమర్థుడ వయ్యు నిట్లడుగుచుంటివి. కాన జరిగిన వృత్తాంతమును జెప్పెదను వినుడు. నేను గ్రామములో లేనప్పుడు నా తల్లియగు కైక దుర్బుద్ధితో నాచరించిన యీ రామవనవాసరూప మగు దుష్కృత్యమునుబట్టి నేనును మీకు సందేహాస్పదుడ నైతిని. కాని గురుసాక్షికముగ నేనివ్విషయము నేమాత్రము నెరుగను.

రామో దైవసమో ఽవితుం భువ మలం నాహం సమర్థో ఽల్పధీః
దాసో ఽహం సతతం చ తస్య తు మునే!రాజ్యం తదీయం ధ్రువమ్,
గత్వాద్య త్వభిషిచ్య రాఘవవిభుం తత్రైవ తస్మా త్పురమ్
త్వానేతుం చతురంగసైన్యసహితో రామాంతికం యామ్యహమ్. 6

దైవసమానుడగు రామచంద్రుడు భూమినిఁ బాలించుటకు సమర్థుడు కాని యల్పబుద్ధి గల నేనా పాలించునది? నేనెప్పుడును రామునకు దాసుడను. నిశ్చయముగ రాజ్య మతనిదికాని నాది కాదు. నేనిప్పుడు రాముని సన్నిధానమున

---

1. క ||

కేగి మా రామప్రభువును నచ్చటనే పట్టాభిషిక్తునిఁజేసి యచ్చటనుండి తిరిగి పురమునకుఁ దీసికొని వచ్చుటకుఁ జతురంగ సైన్యముతోఁగూడ రాముని సమీపమునకుఁ బోవుచుంటిని.

[1]భవత్పాదయుగం మేఽద్య ప్రమాణం మునిసత్తమ!
ఇత్యుక్త్వా భరతః పాదౌ మునేః పస్పర్శ వై రుదన్. 7

ఓ మునివర్యా! యీ విషయమున మీ పాదయుగళమే ప్రమాణమని చెప్పి దుఃఖపడుచు భరతుడు మునిపాదములను స్పృశించెను.

[2]పశ్చా ద్ధార్మిక కైకయీసుతవచ శ్శ్రుత్వా ముదం ప్రాప్తవాన్
ప్రాహేదం మునిరా ద్వచ స్త్వవ మతిం ధర్మానపేతా మహమ్
జానన్నేవ పురైవ తద్దృఢకృతే సంపృష్టవాన్ త్వాం పునః
శోకం మా కురుతాద్గతం ప్రతి భవాన్ జానామి భక్తిం చ తే. 8

అనంతరము భరద్వాజమహర్షి, ధార్మికుడగు భరతుని వాక్యములను విని యిటుల నతనితోఁ బలికెను. ఓ భరతా!నీవు ధర్మబుద్ధి కలవాడవని నేనింతకుఁ బూర్వమే విని యుండియు దానిని దృఢపరచుటకు నేనిప్పుడు తిరిగి నిన్నడిగితిని. గతమునుగూర్చి నీవు దుఃఖింపకుము. నీవు రామునియందు భక్తిగలవాడవని నే నెరుగుదును.

దుఃఖం న తావ త్కర్తవ్యం రామార్థేఽపి త్వయాఽధునా,
వర్తతే చిత్రకూటాద్రౌ రామ స్సత్యపరాక్రమః. 9

ఓ భరతా! నీవు రాముని విషయమున దుఃఖింపఁబనిలేదు. సత్యపరాక్రముడగు రాముడు చిత్రకూట పర్వతమున సుఖముగ నున్నవాడు.

[3]త్వయి తత్రగతే వాఽపి ప్రాయోఽసౌ నాగమిష్యతి,
తథాఽపి తత్ర గచ్ఛ త్వం య దసౌ వక్తి త త్కురు. 10

నీ వచ్చటకు వెళ్లినను తిరిగి రాముడు పురమునకు రాడని తలచెదను. అయినను నీ వచ్చుటకు వెళ్లుము. మీయన్న యెట్లు చెప్పిన నట్లు నడుచుకొనుము.

1. అ. రా. 2.నార. రా. 3. కవిః.

*ఆతిథ్యం కర్తు మిచ్ఛామి ససైన్యస్య తవానఘ!,
అద్య భుక్త్వా ససైన్య స్త్వం శ్వో గంతా రామసన్నిధిమ్. 11

*ఓ భరతా!నీ సైన్యమునకును నీకును నాతిథ్యము నిచ్చుటకు నాకుఁ గుతూహలముగ నున్నది. కాన నేటి దిన మిచ్చటనుండి రేపటి దినమున సైన్యముతోఁగూడ రాముని సమీపమునకు వెళ్లుము.

[1] తచ్ఛ్రుత్వాఽఽహ నృపాత్మజోఽపి వచనం త్వేవం భరద్వాజ తే
పాద్యార్ఘ్యాది సమస్యయాద్య కృతయా మేఽలం ఫలాద్యైరపి,
కిం చాలం మధురేణ యోగివర! తే వాక్యామృతేనాపి మే
తస్మా దప్యుపచారయంత్రణ మిదం కార్యం న భూయస్త్వయా. 12

ఆ భరద్వాజుని వచనములను భరతుడు విని తిరిగి యా మహర్షితో నిటులఁ బలికెను. ఓ భరద్వాజ మహర్షీ! నీవు.నా కిపుడు చేసిన యర్ఘ్యపాద్యాది విధులచేతను, కందమూల ఫలాదులచేతను, నాకు దృప్తి యయ్యెను. అవియే చాలును. ఇదియునుగాక మీమధుర వాక్యామృత పానముచేఁ దృప్తినొందితిని. ఇంక వేఱుగ నుపచారమును దలంపకుము.

ఇతి తద్వచనం శ్రుత్వా భరతం ప్రాహ వై మునిః,
చమూం తే నాగరా న్ద్రష్టుం సమీహా మమ జాయతే. 13
ఆగచ్ఛేతి భరద్వాజ స్త్వానీయ భరతం తతః,
సేనానివేశనికటం సమాగా ద్ద్రష్టుకాముకః. 14
తత్రస్థితా న్జనా న్దృష్ట్వా రామస్మరణకారిణః,
పృచ్ఛతి స్మ ముని స్తేషా మాశయం వేత్తు ముద్యతః. 15

---

*అనేన సమాగతస్య రాజ్ఞ స్సానుచరస్యైవాతిథ్యం కర్తవ్య మితి సూచితం. తథా చైతరేయబ్రాహ్మణే.

యావంతః ఖలు వై రాజాన మనుయాంతి తేభ్య స్సర్వేభ్యః ఆతిథ్యం క్రియతే"ఇతి.

*భరద్వాజు డిచ్చట భరతున కాతిథ్య మిచ్చెదనని చెప్పుటచే పరివార జనముతో గూడ రాజు తన యాశ్రమమునకు వచ్చినప్పుడు ఆతిథ్యము నీయవలయునను ధర్మము సూచింపఁబడినది. అవ్విధముగనే యైతరేయబ్రాహ్మణమునఁగూడఁ గన్పడుచున్నది. 'రాజుతో నెంత పరివారము వచ్చునో వారికందరికిని, రాజునకును నాతిథ్యము చేయవలయు'నని.

---

1. కవిః

పైనచెప్పిన భరతుని వాక్యములను భరద్వాజమహర్షి విని తిరిగి యిటులఁ బల్కెను. ఓరాజపుత్రా! నీవుసైన్యమును దూరమునందుంచనేల? నగరవాసులను, నీ సైన్యమునుఁజూడ నాకుఁ గుతూహలముగ నున్నది. ఆ సైన్యసమీపమునకు రమ్ము, వెళ్ళుదమని భరతునిఁగూడ దీసికొని వారల జూడఁ గోరికతో సైన్యమున్న చోటునకు భరద్వాజుడు వచ్చి యచ్చటి జనులనుఁజూడ నందరును రాముని స్మరించువారలుగాను, రాముని విషయమై మాట్లాడుకొనువారుగాను గన్పడగా వారల యభిప్రాయమునుఁ దెలిసికొనగోరి భరద్వాజుడు వారల నిట్లు ప్రశ్నించెను.

విసృజ్య స్వీయసద్మాని త్యక్త్వా౽౽త్మీయజనాం స్తథా,
పౌరా భవంత స్సర్వే౽పి కిమర్థం కుత్ర నిర్గతాః. 16

ఓ పౌరులారా! మీరలందరును మీ మీ గృహములను, భార్యా పుత్రాదులను విడిచి యెచ్చటకు నెందుకుఁ బోవుచుంటిరో చెప్పుడు?

ఇతి పౌరాశయం జ్ఞాతుం పప్రచ్ఛైకైకశో మునిః,
పౌరాశ్చ తే మునిం ప్రాహు స్సర్వే వినయపూర్వకమ్.
వినా రామేణ నాస్మాక మర్థో౽యోధ్యాపురే మునే!
యత్ర రామో గత స్తత్ర గచ్ఛామో౽ద్య వయం త్వరమ్.
రామో౽యోధ్యా మవాప్నోతి యది భూయో వయం పునః,
అయోధ్యాం సముపేష్యామో నోచే త్తత్ర వసేమ వై,
పితా చ జననీ బంధు రస్మాకం రామ ఏవ హి. 17-19½

ఇవ్విధముగ భరద్వాజుడు పౌరుల యభిప్రాయమునుఁ దెలిసి కొనుటకుఁ బ్రత్యేకముగ నొక్కొక్కని నడుగ వార లిట్లు వినయపూర్వకముగ నమ్మునికి సమాధాన మిడిరి."ఓ మునివర్యా! రామచంద్రుడు లేని యయోధ్యాపురముతో మాకుఁ బ్రయోజనము లేదు. ఎచ్చటకు రామచంద్రుడు వెళ్లెనో యచ్చటికే మేమును వెళ్ళుచుంటిమి. మా రామచంద్రప్రభువు తిరిగి యయోధ్యాపురమునకు వచ్చిన యెడల మేమును తిరిగి యయోధ్యకు వచ్చెదము, రామభద్రుడు రానిచో మేమును నచ్చటనే యుండిపోదుము. మాకు రాముడే తండ్రి, రాముడే తల్లి. రాముడే బంధు"వనిరి.

ఇతి తేషాం వచ శ్ర్శుత్వా ముని స్స్వాంతే త్వచింతయత్,
మత్తో ఽ ప్యమీ రామభక్తా దృశ్యంతే చాధికా ఇవ,
తపసో మే వ్యయేనాపి తత్త్వం వేద్యం మయా ధునా,
ఇతి నిశ్చిత్య మనసి ప్రాహాథ భరతం మునిః. 20-21½

పై విధముగ వారల వచనములను విని భరద్వాజుడు తన మనస్సునం దిట్లాలోచించెను. ఈ పౌరులందరును రామభక్తిలో నాకంటె నధికులుగా వీరల మాటలవలనఁ గన్పడుచుండిరి. వీరల భక్తి యెంత వరకు నిజమో నా తపస్సును వ్యయపరచియైనను నే నిపుడు కనుగొనియెద నని మనమున నిశ్చయించి పిమ్మట భరతునితో నిటుల పల్కెను.

అహ మిచ్ఛామి భవతా మాతిథ్యం కర్తు మాశ్రమే,
మా వద త్వం ప్రతివచ శ్చాంగీకురు వచో మమ. 22

ఓ భరతా! మీ కందరకు నాతిథ్యమును నా యాశ్రమమునఁజేయ గోరుచుంటిని; కాన, నీవు ప్రతివచనమునుఁ జెప్పక తప్పక నావచనము నంగీకరింపుము.

ఇత్యుక్తో భరతః ప్రాహ భరద్వాజమునిం తతః,
వాగ్గౌరవ మలం తేఽద్య శ్రమోఽస్మ న్మాస్తు తే మునే. 24½

ఇట్లు చెప్పగా భరతుడు భరద్వాజమునితో నిటులఁ బల్కెను. ఓ మునివర్యా!నీ వాగ్గౌరవమే మాకు చాలును. వేరుగ నాతిథ్యమునకు నిమంత్రింపవలయునా?మావలన మీకు శ్రమ కలుగుటకు నేనిష్టపడను.

ఇతి తస్య వచ శ్శ్రుత్వా భరద్వాజోఽబ్రవీ చ్చ తమ్,
న కోఽపి మే శ్రమో రాజ న్నంగీకురు వచో మమ,
గత్వాఽహం సిద్ధవ త్కృత్వా సకలం క్షణమాత్రతః,
పున రాగత్య సర్వా న్వ స్సమానేష్యా మ్యహం ద్రుతమ్. 25-26½

అని భరతుడు పలుకగా భరద్వాజమహర్షి తిరిగి భరతునితో నిట్లు చెప్పెను. ఓ రాజపుత్రా! మీ వలన నా కెంతమాత్రము శ్రమము లేదు. నామాట నంగీకరింపుము. నేను నా యాశ్రమమున కేగి సమస్తమును క్షణమాత్రమున సిద్ధముచేసి తిరిగివచ్చి మిమ్ముల నందరనుఁదీసికొని వెళ్ళెదను.

ఇత్యుక్త్వా తం భరద్వాజ స్స్వాశ్రమం తు ప్రవిశ్య సః,
స్నాత్వాఽగ్నిశాలాం సంప్రాప్య విదధ్యౌ దేవతాః క్రమాత్. 27½

ఇట్లు భరద్వాజమహర్షి భరతునితోఁజెప్పి తన యాశ్రమమును బ్రవేశించి స్నానముచేసి యగ్నిశాలను బ్రవేశించి దేవతల నీక్రింది విధముగఁ గ్రమముగ ధ్యానించెను.

రాజ్ఞ స్సైన్యయుతస్య కర్తుమధికం త్వాతిథ్య మిచ్ఛామ్యహం
సోమాఽరం తు చతుర్విధాన్ననివహ స్సంసృజ్య తాం వై త్వయా,
త్వష్ట స్త్వం తు విచిత్రభర్మవిలసత్ప్రాసాదహర్మ్యాన్వితం
శీఘ్రం కల్పయ సప్తయోజనయుతం దేదీప్యమానం పురం. 28½

ఓ సోమదేవా! సైన్యసహితుడగు భరతునకు నేను గొప్పవిందు చేయుదలచితిని. నీవు చతుర్విధములైన యన్నరాసులను సకల భోగ్యపదార్థములను క్షణమాత్రములో సృజింపుము. ఓ త్వష్టప్రజాపతీ! నీవు చిత్రవిచిత్రమైన బంగరుమేడలతో నొప్పెడి సప్తయోజనపరిమితమగు పురమును సకలవస్తుసమృద్ధిచే నొప్పునట్లు క్షణములో నిర్మింపుము.

గ. యాః కిల క్షిత్యంతరిక్షయోః ప్రాక్ప్రత్యక్ప్రవ హిన్యో వాహిన్యః
ఇహైకమత్యేనాగత్య కాశ్చన సృజంతు మైరేయం, కాశ్చన
పరిస్రవంతు మధురాం సురాం, కాశ్చన వహంతు ఖండితపుండ్ర
కాండ వినిస్సృత రసమాధురీచోదకం చోదకమ్, అపి చ మయా
సమాహూతా దేవగంధర్వాః ఘృతాచీప్రభృతయ శ్చాప్సరోగణాః,
సరసీరుహాసన సదన గతాశ్చ దివ్యావారవనితాః సర్వా అపి
తుంబురుణా సహ మదాశ్రమం సమాయాంతు యచ్చోత్తరాసు
కురుభూమిషు హృద్య ముద్యానం యదపి చ రాజరాజపురోపకం తేఽ
తిపావనం వనం, తదపి మదా శ్రమచత్వరేషు సత్వరం సంనిధత్తాం.
29½

ఓ భూమ్యంతరిక్షములందలి మహానదులారా! మీరలందరు నైకమత్యముతో నిచ్చటకు వచ్చి మీలో గొందరు మైరేయమును (సారాను) సృజింతురుగాక. మరికొందరు మధురమగు సురను స్రవింతురుగాక. కొందరు విరువబడిన చెఱకుగడనుండి స్రవించుచున్న మధురరసముతో సమానమగు

నుదకమును గల్పింతురుగాక. మఱియు నాచేత నాహ్వానింపఁబడిన దేవతలు, గంధర్వులు, ఘృతాచి మొదలగు నప్సరః స్త్రీలును, బ్రహ్మసభలో నృత్యము చేయు వేశ్యలును, నింద్రసభలోని వారవనితలు నందరును తుంబురునితో ఁగూడ నా యాశ్రమమునకు క్షణమాత్రములో వచ్చెదరుగాక, మఱియు నుత్తరకురు భూములందు మనోహరమగు నుద్యానవనమును, నలకా పట్టణ ప్రాంతమునందలి యుద్యానవనమును నా యాశ్రమమునకు క్షణములో వచ్చుగాక. (అని భరద్వాజుడు పైవారలను-ధ్యానించెను.)

**ఇతి దేవాంశ్చ గంధర్వా న్నదీనదవనాని సః,**
**సమాధిసహితో దధ్యౌ సకలా న్యాయయుః క్రమాత్. 30½**

ఇట్లు భరద్వాజముని దేవతలను, గందర్వులను, నదులను, నుద్యానవనములను మొదలగు నేయే దేవతాదులను ధ్యానించెనో, ఆయా దేవగంధర్వాదు లందరును సంకల్పమాత్రముననే క్షణములో సర్వము సిద్ధము చేసిరి.

**గ. తదను మణిఖచితశాతకుంభ స్తంభసహస్రనిర్మితచతు శ్శాలామ్,**
**అభ్రంకష శుభ్రహర్మ్య ప్రాసాదవలభినిబద్ధమణి**
**తోరణాం స్ఫటికమణిమయశయనాసనై రుపశోభితా మవా**
**ఙ్మానసగోచరవిచిత్రచమత్కారా మభినవవై డూర్యసన్నిభ**
**శాద్వలచ్ఛన్నా మపరిమితపచేళిమఫలభరవినమిత కపిత్థపనస**
**సహ కారాదితరువిపుల శాఖాకృతప్రచ్ఛాయ శీతలతలాంసప్తయో**
**జనపరిమితాం పురీ మనంతచమత్కారకర్మా విశ్వకర్మా క్షణే**
**నైవ మునిశాసనా త్సంకల్పమాత్రేణ కల్పయామాస. 31½**

అనంతరము సువర్ణస్తంభసహస్రముచే నిర్మింపబడిన చతుశ్శాలలును, నాకాశము నొరయుచున్న శుభ్రమైన మేడల పైభాగమున వ్రేలాడ గట్టబడిన మణితోరణములును, స్ఫటికపు పలకలచే నేర్పరుపబడిన యాసనములును, వైడూర్యమణులతో సమానమగు శాద్వలములును, పండియున్న ఫలములచే వంగియున్న వెలగ, పనస, మామిడి మొదలగు ఫలవృక్షములయొక్క కొమ్మల నీడలును గల సప్తయోజన పరిమితమును, వాక్కునకును మనస్సునకును

గోచరముకాని చమత్కారము గల ప్రకాశమానమైన యొక పట్టణమును సకల సంపదలతోఁదులఁ దూగునటుల ననంతచమత్కార కర్మలఁ జేయు విశ్వకర్మ క్షణములో సంకల్పమాత్రముననే భరద్వాజముని శాసనముచే నిర్మించెను.

ధృత్వాఽఽజ్ఞాం శిరసా మునే స్తదను సద్భక్ష్యాదిరాశిం స్తథా
దధ్యాజ్యాది సరాంసి సూప మతులం కూపం పయోవాపికామ్,
ముద్గాన్నామితశర్కరాన్న విలసచ్చిత్రాన్న దధ్యన్నస
త్క్షీరాన్నాది సదన్న రాశినివహం సోమః క్షణేనాసృజత్. 31

అనంతరము భక్ష్యరాసులను, నెయ్యి, పెరుగు మొదలగువాని సరస్సులను, సూపకూపమును, పాలబావిని, ముద్గాన్నము (పులగము), శర్కరాన్నము (చక్రపొంగలి), చిత్రాన్నము (పులిహోర), దధ్యన్నము (దధ్యోదనము), క్షీరాన్నము మొదలగు నన్న రాసులను, భోజ్యపదార్థముల నన్నిటిని భరద్వాజమునియానతిచే సోమదేవత సంకల్పమాత్రముచే సృజించెను.

కిం చ స్వర్ణసహస్రకోటిచషకా న్సౌవర్ణ భూషాచయం
రత్నానాం నిచయం ససర్జ ధనద స్సౌవర్ణవాసాంసి చ,
ఇంద్రః ప్రేషయతి స్మ నందనవనం వార స్త్రియ స్స్వస్థితాః
బ్రహ్మాఽప్యాత్మసదస్థ్సా వారవనితా స్సంప్రేషయామాస సః. 33½

ఇదియునుంగాక కుబేరుడు కోట్లకొలది సువర్ణపానపాత్రలను మరియు, సువర్ణాభరణములను, రత్నాభరణములను, బంగారు చెఱగు వస్త్రములను భరద్వాజానుజ్ఞచేఁ గల్పించెను. మఱియు దేవేంద్రుడు తన నందనవనమును, తన సభాస్థలమున నృత్యము చేయు నప్సరః స్త్రీలనుఁగూడఁ బంపెను. బ్రహ్మయును తన సభాస్థలము నందు నృత్యగానములను జేయు వారవనితలను (వేశ్యలను) బంపెను.

ఏవం సర్వేఽమరా స్తూర్ణం సమాహూతా మహర్షిణా,
కల్పయామాస నిఖిలం వస్తుజాతం తదాశ్రమే. 34½

ఈ ప్రకారము భరద్వాజునిచే నాహూతులగు సకల దేవతలును నమ్మునియాశ్రమమున సకల వస్తుసమూహమును గల్పించిరి.

గ. తదను మునినా సమాహూతా స్సర్వేపి భరతాను యాయిన స్సకలసంపద్భరం పురం ప్రవిశ్య పరితో విహరంతః క్రమా ద్దివ్యహర్మ్యేషు వివిశుః, తదను నూత్నరత్నఖచిత సోపాన మనోహరసౌధశిఖర ముపకల్పిత రాజాధిరాజోచితసిం హాసనం, మహేంద్రమందిరోపమ మతినిబిడజనసంచారనీరంధ్ర నిరుద్ధమార్గసంరక్షణ విచక్షణకంచుకిప్రదర్శిత పదవీవికాసం, విరాజమానరాజమందిరం, తదద్భుతసదనసంవిధాననిధ్యాన జనిత కౌతుకై ర్మంత్రిపురోగమాదిభి స్సమన్వితో భరతః ప్రవివేశ, ప్రవిశ్య చ శారదసమయసముదితసుధాకరమండలపాండుర మాతపత్రం, తన్మరీచినిచయరుచిరే చామరే భద్రాసనం చ రామభద్రాయ వినివేద్య, స్వయం సచివాసనే చోపవివేశ. అథ సోఽపి క్షణా దేవ మునిశాసనా దుపగతా స్సువర్ణమౌక్తిక ప్రవాళాది దివ్యభూషణభూషితా స్సరసిజాసన ధనాధినాథ ప్రేషితాః వింశతివింశతిసహస్రసంఖ్యాకా దివ్యావారసుందరీః క్షిప్రమద్రాక్షీత్. అథ తేషు దర్శనమాత్రేణైవ పురుషోన్మాదక రూపధేయేషు నందనవనాగతే ష్వలంబుసాద్యప్సరోగణేషునృత్యత్సు, మహారాజభరతోపకంఠే గాయత్సు చ, భరద్వాజతపో మహిమ్నా చిత్ర మేక మిద ముదజృంభత. 35½

అనంతరము భరద్వాజుని యానతిచే సమస్తమైన భరతపరివారజనము సకలసంపద్భరమగు నప్పురమును బ్రవేశించి, యంతట విహరించుచు గ్రమముగ సువర్ణప్రాసాదములయందుఁ బ్రవేశించిరి. నూతనరత్న ఖచితమగు సోపానములచే మనోహరము సౌధశిఖరములు గలదియును, రాజాధిరాజులకుఁ దగిన సింహాసనముచే నొప్పుచున్నదియును, మహేంద్ర మందిరముతో సమాన మైనదియును, దట్టముగ జనముచే మార్గ మరికట్టబడకుండగఁ గాపాడు వేత్రధారులచేఁ జూపింపఁబడిన మార్గము కలదియు నగు దివ్యమైన రాజమందిరమును భరతుడు దివ్యభవన సందర్శన కుతూహలము గల మంత్రిపురోహితాదులతోఁగూడ బ్రవేశించెను. ఇట్లు భరతుడు ప్రవేశించి శరత్కాల చంద్రచంద్రిక వలె ధవళమగు నాతపత్రమును, అట్టి కాంతి గల యందమైన వింజామరలను, రాజసింహాసనమును రామభద్రునకై విడిచి తాను, మంత్రులు కూర్చుండఁ దగిన యాసనమునందుఁ గూర్చుండెను

పిమ్మట భరద్వాజమునిశాసనమువలన గుబేరునిచేఁ బంపఁబడిన యిరువది వేల వేశ్యాస్త్రీలును, బ్రహ్మదేవునిచేఁబంపఁ బడిన యిరువదివేల స్త్రీలును సువర్ణరత్నభూషణ భూషితలగు దేవవేశ్యలును వచ్చి తమతమ పనులను నెరవేర్చుచుండిరి. మరియు స్వసందర్శనమాత్రముచేతనే పురుషుల కున్మాదమును గలుగఁజేయు సౌందర్యముచే నొప్పుచున్న యప్సరః స్త్రీలు కొందరు నందనవనమునుండి వచ్చి భరతుని సమీపమున నృత్యగానములను జేయ నారంభించిరి. ఇట్లు జరుగుచుండ భరద్వాజ తపోమహిమచే నింకను గొప్ప యాశ్చర్యములు జరిగెను.

**అశ్వత్థా అపి నర్తకా స్సమభవన్ బిల్వాస్తు మార్దంగికాః**
**కిం చారణ్యలతాః స్త్రియాం సురుచిరం రూపం గృహీత్వా పునః,**
**మైరేయం తు పిబంతు పాయస మిదం భక్ష్యాని మాంసాని వై**
**చిత్రాన్నాని జనాస్స్వదం త్వితి జనా న్సంప్రార్థయంతి స్మ తాన్. 36½**

పిమ్మట నమ్మునితపోమహిమచే భరద్వాజాశ్రమమునందలి యశ్వత్థ వృక్షములు సహితము నర్తకవేషములను ధరించి నృత్యమునుఁ జేయసాగినవి. మారేడుచెట్లు మార్దంగికవేషములను ధరించి మృదంగములను వాయింప నారంభించినవి. ఆశ్రమములోని లతలన్నియు స్త్రీరూపములను ధరించి భరతుని పరివారజనమునకుఁ బరిచర్యలు చేయమొదలిడినవి.

**ఏకైకం పురుషం తు సప్తవనితా స్సంవేష్ట్య చాష్టౌ స్థితా**
**స్తా స్స్వేకా పరిమార్జనం తు కురుతే కాచి త్తథా స్నాపనమ్**
**అన్యా భోజయతి స్మ కాచన రసా న్సంపాయయంతీ స్థితా**
**భూషాలంకృతి మాతనోతి చ పరా సంవాహనం కాచన. 37½**

ఒక్కొక్కపురుషుని సమీపమున నేడెనమండ్రుగురు స్త్రీలు చుట్టుకొని యీక్రింది విధముగఁ బరిచర్యలు చేయుచుండిరి. వారిలో నొక్కతె స్నానము చేయించుచుండెను. మరియొక్కతె శరీరమునుఁ దుడుచుచుండెను. ఇంకొక్కతె భోజనము పెట్టుచుండెను. ఇంకొక్కతె పండ్లరసముల నందిచ్చుచుండెను. వేరొక్కతె యలంకారముల నలంకరించుచుండెను. ఇంకొక్కతె పాదముల నొత్తుచుండెను.

**హయా న్గజా న్ఖరా నుష్ట్రాం స్తథైవ సురభే స్సుతాన్,**
**అభోజయ న్వాహనపా స్తేషాం భోజ్యం యథావిధి. 38½**

కొందరు పురుషులు గుఱ్ఱములకు, ఏనుగులకు, ఒంటెలకు, వృషభములకును యథావిధిగ నాహారపదార్థముల నందిచ్చుచు భుజింపఁజేయుచుండిరి.

గ. తదను నిరవద్యహృద్యమద్య నిషేవణముషితధిషణాః, ఘనఘనసారమృగమదపంక సంకలితచందన సంరూషితావయవా, సమున్నత పృథుల కుచకుంభసంఘర్షణ ముఖకమలచుంబన సరసభాషణాదిసముదంచితకిలకిలాంచితాభి రప్సరోభిః కాంచనమయేషు మంచేషు పంచేషు వశంగతాః, దైవా దతర్కిత మప్రాకృతం సుఖ మనుభవంతః కి మయం స్వర్గ ఏవాస్మాభి రుపభుజ్యతే కి మానందభూమా ఽయ మపవర్గః, ఇతి మనసా వితర్కయంతః, కతిచన మదిరాస్వాదమదవశా దత్యంతం నృత్యంతః, హసంత శ్చాట్టహాసం, గాయంతో గానవాద్యాని, పరిధావంతో నిష్కారణం, ఉచ్చిందంతః ప్రసూనమాల్యాని, చిర మాసాం బభూవుః అథ కథంచన కించిదివ విగళితమద పారవశ్యాః సమంతా దుద్వీక్ష్య భక్ష్యరాశీ నక్షుధితా అపి భక్షయిత్వా పరాం తృప్తి మభ్యాగమన్. 39½

అనంతర మచ్చటి జనులు హృద్యమైన మద్యములను సేవించుచు నందుచేఁ గలిగిన చెడుబుద్ధి గలవారలై, పచ్చకర్పూరము కస్తూరి మొదలగు సుగంధ ద్రవ్యములచే మిళితమైన మంచిగంధమునుఁ బూసికొని యప్సరః స్త్రీల కుచకుంభసంఘర్షణ ముఖచుంబన సరససల్లాపములతో మునిగితేలుచు సువర్ణమంచములయం దప్సరః స్త్రీలతోఁగూడ మన్మథపారవశ్యమును బొందుచు, దైవికముగా సంప్రాప్తమైన యప్రాకృత దివ్యసౌఖ్యము ననుభవించుచు "మన మనుభవించునది స్వర్గమా? లేక, ఆనందఘనమగు మోక్షమా? "అని మనస్సులలో వితర్కించుచున్న వారలైయుండిరి. మద్యపానముచేతఁ గలిగిన మత్తుచేఁ గొందరు నృత్యము చేయుచుండిరి. మరి కొందరు నిష్కారణముగ నవ్వుచుండిరి. కొందరు సంగీతముల బాడుచుండిరి. మత్తుచేతనే కొందరు నిష్కారణముగఁ బరుగులిడు చుండిరి. ఆ మద్యపానమహిమచే నొడలెరుగక పుష్పమాలికలను ద్రెంచి వైచుకొనుచుండిరి. పిమ్మట గొంచెము మత్తత తగ్గగా నటునిటు వారలు సంచరించుచు క్షుత్తు లేకపోయినను భక్ష్యములను భక్షించుచుండిరి.

గ. ఇత్థ మనితరసాధారణైశ్వర్య తపశ్చర్యాధుర్యస్య
మునే స్తపోబలేన సంపాదితై స్సకలకామై రుపతర్పితాః
భరతానుయాయినః పరితో విహరంతః, క్వచి దతిమధురపాయస
కర్దమితకూపం, క్వచన సకలజనమనోరథపూరణనిపుణకామ
ధేనుకం, క్వచన మధురసాసారవర్ష నిఖిలశాఖికదంబకం,
క్వచన మైరేయవాపికాం, క్వచిదపి ప్రతప్తచరణాయుధాదిమాంసం
క్వచన దధిమధుఘృతదుగ్ధాది సరాంసి చ, క్వచి త్తత్రతత్ర
చిత్రకంబళనిచయం, క్వచన హాటకసంపుటోదరనిక్షిప్తచందన
క్షోదం, క్వచిదపి పరిశోధి తాదర్శం, క్వచిదపి కనకకరండమండనం,
క్వచన విచిత్రతనుత్రగణం, క్వచిత్క్రీడాసరోభిరుపశోభితం,
స్వప్నే ఽప్యదృష్టచర మశ్రుతపూర్వ మపూర్వరూప మాశ్రమోద్దేశ
మవలోకయన్తః, కిం మహా నయం విలోక్యతే స్వప్నః,
కిముతాయ మస్మాభి రనుభూయతే చిత్తవిభ్రమః, కిముత
కేనాపి ప్రయుక్తేయం శాంబరీమాయా, కిమిదం గంధర్వపురీ
విజృంభితం! భవతు యథా కథంచిత్, అస్తు సత్యం తదిద
మాచంద్రతారకం, అహో! మహదిదం సంవిధానమాతిథ్యవిధేః,
అహో! తపఃప్రభావో భరద్వాజమునేః, అహో! కౌశలం విశ్వకర్మణ,
అహో జనురద్య సఫలమస్మాక మితి మిథః కథ యన్తః
సర్వే ఽ ప్యానందవిస్మయ స్తబ్ధహృదయా స్సంజజ్ఞిరే. 40½

ఈ ప్రకారముగ నసాధారణైశ్వర్య తపశ్చర్యలు గల భరద్వాజుని తపోబలముచేతను కల్పితములైన సకల కామోపభోగములచేఁ దృప్తినొందింపఁబడిన భరతుని సేవకులు పురజనులును యథేష్టముగ నచ్చటచ్చట విహరించుచు నొక్కచో మధురపాయసకూపములును మఱియొక్కచోటున సకలజన మనోరథములను బూర్తిచేయు కామధేనువులును, ఇంకొక్కచోట మద్యపు బావులును, వేఱొక్కచోటఁ బచనము చేయఁబడిన కోళ్లమాంసపురాశియు, మఱియొక్కచోటఁ బెరుగు, నెయ్యి, పాలు మొదలగువాని సరస్సులును, ఇంకొక్కచోట రత్నకంబళరాసులును, మఱియొక్కచో సువర్ణపు బరిణెలయం దమర్పఁబడిన మంచిగంధపుచూర్ణమును, వేఱొక్కచోటఁ జిత్రవిచిత్రమైన కవచములు, మఱియొక్కచోటఁ గ్రీడాసరోవరములు గలిగి శోభిల్లుచున్నదియు నదృష్టచరము నశ్రుతపూర్వము నపూర్వరూపమును గల యా యాశ్రమమునంతను

గలియఁజూచుచు నిట్లు తలంచుచుండిరి. ఈ కన్పడున దంతయు స్వప్నమా! లేక మనచే ననుభవింపబడునది మనోవిభ్రమమా! లేక ఎవ్వనిచేతనైనఁ బ్రయోగింపబడిన శాంబరీమాయయా! లేక గంధర్వనగరీవిలాసమా! కానిమ్ము ఏది యెట్లున్నను నిది యంతయు సత్యమై యాచంద్రతారకముగా నుండిన బాగుండును. ఏమి! యాశ్చర్యముగా నున్నది యీ యాతిథ్యము! ఏమి భరద్వాజుని మహిమము! విశ్వకర్మయొక్క కౌశలమెంత యాశ్చర్యము! మనజన్మములు సార్థకము లయినవి - అని పరస్పరము జనులు చెప్పుకొనుచు నానందపరవశులై యుండిరి.

భరద్వాజో ఽథ నిర్గత్య సర్వా న్రాజానుయాయినః,
సమేత్య తా న్స్వయం ప్రాహ తన్మనో జ్ఞాతుకాముకః. 41½

అనంతరము భరద్వాజుఁడు భరతుని పరివారజనమును పురజనులను గలిసికొని వారల యాశయములను దెలిసికొనుటకు వారల నిటులఁబ్రశ్నించెను.

రామాంతికం గమ్యతే వా భవద్భిః స్థీయతే ఽత్ర వా,
అయోధ్యా గమ్యతే వాపి బ్రూతాభీష్టం తు మే ఽద్య వః. 42½

ఓ పురజనులారా! మీరలందరును రామునిసమీపమున కేగెదరా? లేక యిచ్చటనే యుండెదరా? లేక తిరిగి యయోధ్య కేగెదరా? మీ యభీష్టమేమి? యని భరద్వాజుడు ప్రశ్నించెను.

ఇతి పృష్టా భరద్వాజమునినా తే ఽఖిలా జనాః,
ప్రత్యూచు స్తం మునిం నత్వా సానందా వినయాన్వితాః. 43½

పైవిధముగ భరద్వాజుడు ప్రశ్నింపగా వారలు ఆనందముతో వినయపూర్వకముగ బదులు నమ్మునితో నిటులఁ పలికిరి.

స్థిర మేత త్సుఖం న స్స్యా దత్ర తిష్ఠేమ వై వయమ్,
నమస్కారో ఽస్త్వయోధ్యాయై దండకేభ్యో నమో నమః,
భరతాయ నమోవాకః రామాయాస్తు నమస్కృతిః,
భవత్కృపా యది వసే దస్మాసు మునిసత్తమ!
స్థాస్యామో ఽత్ర వయం నూన మర్థో ఽన్యత్ర తు నా స్తి నః,
యథా స్థిరం భవే త్సౌఖ్య మనుగృహ్ణీష్వ న స్తథా. 44-46½

ఓ భరద్వాజమునీ! యిప్పుడు మాకుఁ గలిగిన యీ సౌఖ్యానుభవము స్థిరముగా నుండెడి యెడల నిచ్చటనే యుండెదము. అయోధ్యాపురమున కొక నమస్కారము. దండకవనమున కంతకంటె నమస్కారము. భరతునకొక నమోవాకము చెప్పెదము. శ్రీరామున కిక్కడ నుండియే యొక నమస్కారము చెప్పెదము. కాని యెచ్చటికిని వెళ్లము. నీదయ సంపూర్ణముగ మాయందుండవలె గాని మా కెచ్చటను బనిలేదు. ఇచ్చటనే యుండుట స్థిరము. నీవు కూడ నటులనే యనుగ్రహింపుమని భోగాపేక్షతో నిటులఁ బలికిరి.

**ఇతి తేషాం వచ శ్శ్రుత్వా తేషాం భక్తిం చ రాఘవే,**
**విదిత్వా కృత్రిమాం చాగా న్ముని ర్భరతసన్నిధిమ్. 47½**

పైవిధముగ వారు పలుకగా భరద్వాజుడు విని వారలకు రాముని యందున్న భక్తి కృత్రిమభక్తి కాని నిజమైనది కాదని గ్రహించి యచ్చటినుండి భరతుని సమీపమున కేగెను.

భక్ష్యభోజ్యాదికా న్సర్వా న్విసృజ్య స్వేన కల్పితాన్,
కందమూలఫలాదీని భుక్త్వా గురుజనైస్సహ,
కథయంతం రామగుణా న్భరతం వీక్ష్య విస్మితః,
మనుతే స్మ ముని స్స్వాంతే భక్తం భరతమేవ సః. **48-49½**

భరతుడు నివసించిన రాజభవనములో నతని నిమిత్తమై కల్పింపఁబడిన సమస్తరాజభోజ్యములగు పదార్థముల నెల్లను భరతుడు విసర్జించి కందమూల ఫలాదులను మాత్రము కొంచెము భుజించి దర్భాసనమునఁ గూర్చుండి వసిష్ఠాది గురుజనముతో రాముని గుణములను ముచ్చటించుచు రామునకుఁ దనమూలముగఁ గలిగిన కష్టమును గూర్చి విచారపడుచుండెను. అట్టి భరతుని భరద్వాజముని చూచి యాశ్చర్యము నొంది భరతుని మహాభక్తునిగా తనమనమునందు నిశ్చయించెను.

**తతో భరద్వాజముని ర్భరతం ప్రాహ వై వచః,**
**భక్తాగ్రేసర మేకం త్వాం జానామి భువనే త్వహమ్.**
**క స్స్వహస్తాగతం రాజ్యం స్వబుద్ధ్యా త్యక్తు మిచ్ఛతి,**
**సర్వే కృత్రిమభక్తాశ్చ తే జనా భోగలంపటాః.**
**ఏక ఏవ భవా న్భక్తః ధన్యశ్చాపి భవా న్ధ్రువమ్,**
**అత్ర రాత్రావపి స్థిత్వా శ్వో గంతా రామసన్నిధిమ్.**
**ఇత్యుక్త్వా తం భరద్వాజో జగామ స్వాశ్రమం పునః. 50-53**

అనంతరము భరద్వాజముని భరతునితో నిటులఁ బలికెను. ఓ భరతా! లోకములో నిన్నొకనినే రామభక్తాగ్రేసరునిగాఁ దెలిసికొనఁగలిగితి. నీకంటె నితరుడెవ్వడు తన చేతికి వచ్చిన రాజ్యభోగములనుఁ జేతులార విడువంగలడు? నీతో వచ్చిన జనుల నందరినిఁ బరీక్షించితిని. వారలందరును కృత్రిమభక్తులును భోగలంపటులునుగా గన్పడిరి. నీవొక్కడవే నిజమైన భక్తుడవు. నీవు నిశ్చయముగ ధన్యాత్ముడవు. ఇచ్చట నీరాత్రి గడపి రేపటిదినము రామసన్నిధికి వెళ్లుము - అని చెప్పి భరద్వాజుడు తన యాశ్రమమున కేగెను.

సాయం సంధ్యాగ్ని కార్యాది విధేయాని సమాప్య సః,
అర్ధరాత్రే తు సర్వేషాం దేవానా మానతిం దదౌ. 54

అనంతరము భరద్వాజుడు సాయంకాల కృత్యముల నెరవేర్చి యర్ధరాత్రి సమయమున తానాహ్వానించిన దేవతల కందరకును సెలవొసంగెను.

ఉత్సర్జనేన దేవానా మభూ త్సర్వం తిరోహితమ్,
యద్యద్వృక్షతలే పూర్వం సంస్థితో ఽభూజ్జనస్తు యః,
తత్తద్వృక్షతలే సుప్తస్త్వాశ్రమే దృశ్యతే జనః. 55½

భరద్వాజుడు దేవతల కందరకు నెప్పుడు సెలవొసంగెనో, అప్పుడు దేవతలు తమ సంకల్పమాత్రముచే నిర్మింపఁబడిన బంగరు మేడలను, మిద్దెలను, సకలభోగ్యపదార్థములను పట్టణము నంతను నదృశ్యము చేసిరి. ఆ దేవవేశ్యలందరును తమ తమ స్థానముల కేగిరి. సర్వము మాయమై యథాప్రకారము పూర్వమునందున్న భరద్వాజాశ్రమము ప్రత్యక్ష మయ్యెను. భరద్వాజునివిందునకుఁబూర్వ మే చెట్టుక్రింద నెవ్వడుండెనో యా చెట్టుక్రింద నాయా జనుడు నిద్రించుచుండెను.

ఆశ్వికా స్త్వశ్వమూత్రాదియుతే దేశే స్థితా స్తదా,
గజమూత్రాదిసంయుక్తదేశే త్వాధోరణాః స్థితాః. 56

ఆశ్వికులు (అనగా గుఱ్ఱపురౌతులు) గుఱ్ఱముల మలమూత్రాదులలో బడి నిద్రించుచుండిరి. మావటివారలు నేనుగుల లద్దులలోఁబడి నిద్రించుచుండిరి.

చిత్ర మేవం స్థితాః ప్రాత స్సముత్థాయ జనాః పునః,
విస్మయం చ శుచం చాపి ప్రాపు స్సౌఖ్యవినిర్గమాత్. 57

భరతుని జనులందరును నివ్విధముగ నాశ్చర్యముగ జెట్లక్రిందను పుట్టల క్రిందను బడియుండి ప్రాతఃకాలమున లేచి చూచి తమ దుఃస్థితికి విచారమును నాశ్చర్యమునుగూడఁ బొందిరి.

గ. తతః ప్రభాతాయాం రజన్యాం హుతాగ్ని హోత్రం
భరద్వాజ మాసాద్య రామసందర్శన సముత్సుకస్య మమ
కతరేణ మార్గేణ గమన మతిసుకరం, కియద్దూరం,
తదాశ్రమః క్వ వా వర్తతే? త దాఖ్యాతు మర్హతి భవా నితి
భరత స్త మపృచ్ఛత్. తతః స్త్రీషు యోజనేషు చిత్రకూటో
గిరిరితి రమ్యకానన స్తత్పరిసరే సమారచితాం పర్ణశాలా
మధివసతి రామభద్రః, త దనేనైవ సవ్యదక్షిణమార్గేణ
సేనాం సంచాల యేతి వద న్భరద్వాజః కౌసల్యాప్రముఖ
రాజదారైః పీడ్యమాన చరణకమలః, తద్విశేషజ్ఞానాయ
భరత మపృచ్ఛత్. 58

అనంతరము ప్రాతఃకాలముననే భరతుడు లేచి నిత్యకృతమును నెరవేర్చికొని హుతాగ్నిహోత్రుడగు భరద్వాజుని సన్నిధికేగి నమస్కరించి యిటుల ప్రశ్నించెను:-

ఓ మునివర్యా! నీ తపశ్శక్తి వర్ణనాతీతము. నేను రామసందర్శనమున కేగుటకు నా కేమార్గము సుకరముగా నుండును? ఇచ్చటకు రామభద్రుడు నివసించు స్థల మెంతదూరమునం దున్నది? ఆయాశ్రమ మెచ్చట నున్నది? ఓ మునితిలకమా! అనుగ్రహించి నాకుఁ జెప్పుమనగా నమ్ముని భరతునితో నిటులఁ జెప్పెను.

ఓ రాజపుత్రా! ఇచ్చటకు మూడామడల దూరములోఁ జిత్రకూటమను నందమగు వనములతో నొప్పెడి పర్వతము కలదు. దానిసమీపమున నొక పర్ణశాల నేర్పఱచుకొని రామభద్రు డున్నాడు. ఇచ్చట నుండి సవ్యముగ దక్షిణమార్గముగ సైన్యమును నడుపుము అని చెప్పుచుండగా భరద్వాజుని దర్శించుటకు కౌసల్య సుమిత్ర కైకలు ముగ్గురును వచ్చి యారాజపత్ను లమ్మునిచరణకమలములకు నమస్కరింప, నమ్ముని వారలు రాజపత్నులని తెలిసికొనినను, రామమాత యెవరో, లక్ష్మణునితల్లి యెవరో, భరతునితల్లి యెవతెయో విశేషాకారముగఁ దెలిసికొనుటకై భరతుని నడిగెను.

భరతో௨పి భరద్వాజం ప్రత్యువాచ వచ స్త్విదమ్,
శ్రీరామజననీం విద్ధి తా మిమాం శోకకర్శితామ్.
సుమిత్రాం వామభాగస్థాం విద్ధి లక్ష్మణమాతరమ్,
యతో మూలం హి పశ్యామి వ్యసనం మహ దాత్మనః,
అనార్యా మపరాం విద్ధి కైకేయీం మమ మాతరమ్. **59-60½**

భరతుడును భరద్వాజునిగూర్చి యివ్విధముగఁ బలికెను. ఓ మునివర్యా! విచారగ్రస్తురాలై కృశించియున్న యీమెను రామ మాతనుగాఁ దెలిసికొనుము. ఈమె యెడమభుజమును నానుకొని యున్న సుమిత్రను లక్ష్మణుని జననిగాను దెలిసికొనుము. ఎవరివలన నిట్టి వ్యసనము రామునకు, నాకుఁ బ్రజలకు సంభవించెనో, ఆ దుర్మార్గురాలగు నాతల్లియైన కైకను మూడవ యామెనుగా దెలిసికొనుము.

భరద్వాజో௨పి భరతం బ్రువన్తం ప్రత్యువాచ సః,
త్వన్మాతృమూలా ల్లోకానాం భవే దుపకృతి ర్ధ్రువమ్,
అస్మాదృశాం రాఘవస్య దర్శనం వా కథం భవేత్,
హితమేవ భవే న్నూనం రామప్రవ్రాజనా దిహ,
భవతా నావగంతవ్యా కైకేయీ త్వపకారిణీ,
న కదాచి త్త్వయా దూష్యా కైకేయీ జననీ తవ,
నాహమేతాం దూషయేయ మితి త్వం శపథం కురు. **61-64**

ఇట్లు చెప్పుచున్న బరతునితో భరద్వాజముని యిటులఁ బలికెను. ఓ రాజపుత్రా! నీతల్లిమూలముగా లోకములకు మహోపకారము జరుగును. మావంటి యరణ్యవాసులకు సైతము రామదర్శనము కలుగుట కవకాశము కలిగినది. రామవనవాసమువలన హితమే కలుగును. నీవు కైకను నపకారిణిగాఁదలంపకుము. మఱియు నీ తల్లియగు కైకను నెప్పుడును దూషింపకుము. నేనీమెను నెన్నడును దూషింపనని శపథముకూడ చేయుము.

ఇత్యుక్తో భరతః పశ్చా న్నత్వా௨௨మంత్ర్య చ తం మునిమ్,
చిత్రకూటప్రయాణాయ సర్వం సైన్య మచోదయత్. **65**

అని భరద్వాజుడు పలుకగాఁదమ నెలవుప్రకారమే జరుగునని భరతుడు చెప్పి యమ్మునికి నమస్కరించి నెలవడిగి చిత్రకూటప్రయాణమునకై తన సైన్యమునుఁ బ్రేరేపించెను.

**ఇత్యాశ్చర్యరామాయణ అయోధ్యాకాండే ద్వితీయభాగే నవమ స్సర్గః సమాప్తః.**
**ఆశ్చర్యరామాయణమున అయోధ్యాకాండ ద్వితీయభాగమున నవమ సర్గము సమాప్తము.**

[1]అథ ప్రతస్థే ధర్మాత్మా భరత స్సేనయావృతః,
దక్షిణాం దిశ మాశ్రిత్య రామసందర్శనోత్సుకః. 1

అనంతరము ధర్మాత్ముడైన భరతుడు సైన్యసమేతుడై రామదర్శన కుతూహలముతో నచ్చటినుండి దక్షిణపు దిక్కుగ చిత్రకూటమునకు బ్రయాణ మయ్యెను.

సా చమూ స్సాగరనిభా మహీ మాచ్ఛాద్య నిర్గతా,
విగాహ్య చ వనం జంతూన్ త్రాసయంతీ వినిర్గతా. 2

సముద్రమువలె నొప్పుచున్న యాభరతసైన్యము భూమి నావరించి బయలుదేరి క్రమముగ వనమున బ్రవేశించి జంతువులను భయపెట్టుచు బయలుదేరెను.

తత్ర రామో ఽపి వైదేహ్యా గిరిసానుషు సంచరన్,
తస్యై సందర్శయన్ శోభాం గైరికాణా మువాచ తామ్. 3

ఈ సమయమున చిత్రకూటాద్రియందు రాముడును సీతాదేవితో బర్వతపు చరియలయందు విహారార్థమై సంచరించుచు నామెకు గైరికాది ధాతువుల శోభలను జూపించుచు నామెతో నిటుల బలికెను.

[1]కేచి ద్రజతసంకాశాః కేచి ద్రజతసన్నిభాః,
పీతమాంజిష్ఠవర్ణాభాః కేచి న్మణివరప్రభాః,
విరాజంతే ఽచలేంద్రస్య దేశా ధాతువిభూషితాః,
పశ్య తా న్సర్వతో దేవి కిన్నరా న్పశ్య చ ప్రియే,
ఇతి తా న్దర్శయిత్వాథ రామ శ్శైలా ద్వినిర్గతః,
మందాకినీ మనుప్రాప్య ప్రాహ సీతా మిదం వచః. 4-6

ఓ ప్రేయసి! యీ చిత్రకూటమునందలి ప్రదేశములెంత బాగుగ నున్నవో చూడుము. ఈ గైరికాది ధాతువులు కొన్ని తెల్లగాను, కొన్నిరక్తవర్ణము

---

1 కవిః 2. వా.

గలవిగాను, మరికొన్ని పచ్చనిరంగు గలవిగాను, కొన్ని మణుల కాంతులతో నొప్పునవిగాను ప్రకాశించుచున్నవి. ఓదేవి! కిన్నరులు దేవతాస్త్రీలు నెట్లు చిత్రకూటమునందు సంచరించుచున్నారో చూడుము అని వారలను జూపించి పిమ్మట రామచంద్రమూర్తి సీతాసమేతుడై పర్వతమునుండి దిగి క్రమముగ గంగయొద్దనకు వచ్చి సీతతో నిటులఁ బలికెను.

**ఋషయ స్త్వవగాహంతే మందాకిన్యా జలే ప్రియే,**
**జటాజినధరాః కాలే పశ్య వల్కలవాససః,**
**ఏతేషాం దర్శనా దేవ సర్వపాపక్షయో భవేత్. 7½**

ఓ ప్రేయసి! జటాధారులగు మహర్షులందరు వల్కలములను ధరించి సకాలమునకే యెటుల గంగలో స్నానము చేయుచుండిరో చూడుము! వీరల దర్శనమాత్రముచేతనే సకలపాపములు నశించును సుమా!

**[1] సత్యం ప్రేయసి వచ్మి తే శ్రుణు వచ శ్శ్రీచిత్రకూటస్థితేః**
**నిత్యం గాంగజలానుసేవనవశా త్సౌమిత్రి సంసేవనాత్,**
**త్వత్సాహిత్యవశా న్మహాత్మభి రలం సంసర్గత స్సర్వదా**
**సాకేతా ద్వనవాస ఏవ సుభగే! సౌఖ్యప్రదో దృశ్యతే. 8 ½**

ఓ ప్రేయసి!నిజము చెప్పెదను. నా మాటను వినుము రమ్యమైన చిత్రకూటమునం దుండుటవలనను, నిత్యము గంగాజల సేవనము వలనను, లక్ష్మణుడు బాగుగ పరిచర్య చేయుచుండుటవలనను, మహర్షులతో సర్వదా సహవాసమువలనను, నయోధ్యాపురమునం దుండుటకంటె నరణ్యావాసమే సౌఖ్యప్రదమై కన్పడుచున్నది.

**ఇత్యాలాపై ర్భూమిజాం తు తోషయ న్స్వాశ్రమం గతః,**
**శ్రమా త్సుష్వాప సీతాంకే శిరః కృత్వాఽథ రాఘవః**
**తదా విషాదకం కార్య మభూ త్తత్రాశ్రమే పునః. 9-10**

ఇవ్విధముగ రామచంద్రమూర్తి సంభాషణములచే సీతను సంతోషపెట్టుచుఁ దన యాశ్రమమున కేగి యలసటచే సీతఒడిలో శిరస్సు నుంచి నిద్రించెను. ఆసమయమున (నింద్రపుత్త్రునివలన) సీతకు విషాదజనకమైన యొక కృత్యము సంభవించెను.

1. శ||

చిత్రకూటే విహారార్థ మైంద్రిజాయా సఖీవృతా,
ఆగత్య సంచరంతౌ తు సీతారామౌ నిరీక్ష్య సా,
స్వర్గం గతా ఉత్మపతినా రామస్య గుణసంపదమ్,
సీతాయాశ్చాపి సౌందర్యం వర్ణయిత్వా ఉ ఉహ నైకధా. 11-12

ఇట్లు సూతుడు చెప్పగా శౌనకాది మహర్షులు 'విషాద కారణమేమి'యని సూతునిఁ బ్రశ్నింపగా సూతుడు మహర్షులతో నా వృత్తాంతము నిటులఁజెప్పెను. ఓ మహర్షులారా! ఇంద్రపుత్త్రుడగు జయంతుని భార్య తన చెలికత్తెలతో చిత్రకూటపర్వతమున విహరించుటకు వచ్చి యచ్చట సంచరించుచున్న సీతారాములనుఁ జూచి పిమ్మట స్వర్గమున కేగి తన బర్తతో రాముని గుణసంపదను, సీతయొక్క సౌందర్యమును గూర్చియు ననేకవిధములుగ వర్ణించి చెప్పెను

తదా దేవేంద్రపుత్రో ఉపి జయంతః కాకరూపధృత్,
ద్రష్టుం సీతాం రాఘవం చ చిత్రకూటం సమాగతః.
రామే సుప్తే తదా సీతావక్ష స్సందార్య నిర్యయౌ,
కాకేన దళితా త్తస్యా వక్షసో ఉసృ గ్వినిర్గతమ్.
తథా ఉపి నిద్రాభంగ స్స్యా ద్రాఘవస్యేతి భూమిజా.
పతిం నోత్థాపయామాస న చచాల చ సా తతః. 13-15

అప్పుడు దేవేంద్రుని పుత్త్రుడగు జయంతుడు కాకిరూపముతో సీతారాములను జూచుటకుఁ జిత్రకూట పర్వతమునకు వచ్చి శ్రీరాముడు నిద్రించుచుండగా నా యవకాశమును జూచి సీతయొక్క వక్షఃస్థలమును తన ముక్కుచేఁ జీల్చెను ఇట్లు కాకిచేఁ జీల్చబడిన యా యురఃస్థలమునుండి రక్తము స్రవించుచున్నప్పటికిని సీత తన భర్తకు నిద్రాభంగ మగునని రామునితోఁ జెప్పకపోవుటయే కాక తాను కూడఁ గదలక యుండెను.

రామ స్తూత్థాయ చ తతో దృష్ట్వా సృకస్య కారణమ్,
జ్ఞాత్వా తృణం చాభిమంత్ర్య ముమోచ చిరజీవిని,
బ్రహ్మాస్త్రరూపం ధృత్వా త మనుయాతిస్మ సో ఉప్యథ. 16½

అనంతరము రామచంద్రమూర్తి లేచి సీతయొక్క వక్షస్థ్సలము నుండి స్రవించుచున్న రక్తమునుఁ జూచి యందులకుఁ గారణ మడిగి తెలిసికొని

యొక తృణమును (గడ్డిపరకను) మంత్రించి యా కాకి రూపమును ధరించిన జయంతునిమీద విడువగా నాయస్త్రము వెంటనే బ్రహ్మాస్త్రరూపమును ధరించి వాయసమును (కాకిని) వెంబడించెను.

**ఆయాంతం హంతు మాత్మానం బ్రహ్మాస్త్రం వీక్ష్య సోఽప్యథ,**
**భయా త్కాకోఽపి దుద్రావ సోఽస్త్రోఽ ప్యనుససార తమ్. 17½**

తన్ను సంహరించుటకు వెనువెంట వచ్చుచున్న యా బ్రహ్మాస్త్రమును కాకిరూపముతో నున్న జయంతుడు చూచి భయముచే పరుగు లిడుచుండ బ్రహ్మాస్త్రము కూడ వానిని వెంబడించెను.

**అత్మరక్షణకారీ నో పితు రన్యో భవే దితి,**
**మత్వా ధృత్వా నిజం రూపం పితు రంతిక మాగతః.**
**రాఘవాస్త్రా ద్రక్ష రక్ష పిత ర్మా మిత్యయాచత. 18-19**

తన తండ్రికంటెఁ దన కితరు డెవడును నా సమయమున రక్షించు వాడు లేడని తలచి నిజరూపముతో జయంతుడు తన తండ్రి పాదములమీదఁబడి 'రాముని దివ్యాస్త్రమునుండి రక్షింపు రక్షింపు'మని తండ్రియగు నింద్రుని యాచించెను.

**రామాపరాధినం త్వాం తు రక్షితుం న క్షమ స్త్వహమ్,**
**పుత్రభావం త్యజా మ్యద్య త్వయి రామాపరాధిని,**
**మమాపి స్యా త్తమాద స్త్వం గచ్ఛతా త్స్వత్వరం ధ్రువమ్. 19-20½**

అప్పుడు దేవేంద్రుడు కుమారునితో నిటులఁజెప్పెను. ఓ పుత్రా!రామున కపకారము చెసిన నిన్ను రక్షించుటకు నాకు శక్తి చాలదు. రామునకు ద్రోహివైన నీ విషయమై పుత్రభావమునుఁగూడ విడిచివేసితిని. నీ విచ్చటనుండి వెడలి పొమ్మనెను.

**ఇతి పిత్రా పరిత్యక్తో నిరాశో భయవిహ్వలః,**
**చక్రభీతశ్చ దుర్వాసా యథాగా ద్బ్రహ్మణోఽంతికమ్. 21½**

ఇట్లు జయంతుఁడు తండ్రియగు నింద్రునిచే విడువఁబడినవాఁడై జీవితమం దాసలేనివాఁడును. భయముచే నొడలు తెలియనివాఁడునై సుదర్శనచక్రమునకు భీతిల్లిన దుర్వాసుఁడను మహర్షి వోలె బ్రహ్మదేవుని సమీపమున కేఁగెను.

రామాస్త్రా ద్రక్షరక్షేతి విధిం ప్రార్థయతిస్మ సః,
బ్రహ్మోఽపి ప్రాపద త్తం వై శరణార్థిన మాగతమ్. 24½

ఆ జయంతుడు బ్రహ్మసమీపమున కేఁగి తనను 'రాముని బ్రహ్మాస్త్రమునుండి రక్షింపు! రక్షింపు!' మని బ్రహ్మను బ్రార్థింప బ్రహ్మదేవుడు శరణార్థియై వచ్చిన యా జయంతునితో నిటులఁ బలికెను

మాతా మృత్యుః పితా కాల శ్చామృతం విషవ ద్భవేత్,
మిత్రం శత్రుత్వ మాప్నోతి యస్య రామః పరాఙ్ముఖః. 25½

ఓ జయంతుడా!ఎవనికి రాముడు పరాఙ్ముఖుడుగా నుండునో వానికిఁ దల్లి మృత్యువుగా నుండును తండ్రి యము డగును. అమృతము విష మగును. మిత్రుడు శత్రు వగును.

తన్నివర్తయితుం శక్తి ర్నాస్తి మే గచ్ఛ సత్వరమ్,
ఇతి నిష్కాసిత స్తేన కాకో వ్యాకులతాం గతః.
యత్ర యత్ర గతః కాక స్తత్ర తత్రానుసృత్య తమ్,
బ్రహ్మాస్త్రం చ యయౌ సోఽపి దీనభావం గతోఽభవత్. 26-27

ఆ రాముని దివ్యాస్త్రమును మరలించుటకు నాకు శక్తి లేదు. కాన నిచ్చటనుండి తొందరగ నడువుము. ఇవ్విధముగ బ్రహ్మచే వెడలగొట్టఁబడి తిరిగి కాకిరూపమును ధరించి యెచ్చటకు వెళ్లిన నచ్చటకు బ్రహ్మాస్త్రము వెంబడించగా నా కాకిరూపముతో నున్న జయంతుడు చేయునది లేక దీనభావముతో వెళ్లుచుండెను.

ఏతస్మి న్నంతరే దేవముని స్తం వీక్ష్య దుఃఖితః,
సతాం కిల భవే త్స్వాంతం పరదుఃఖేన దుఃఖితమ్. 28

ఈ సమయములో బ్రహ్మర్షియగు నారదుడు కాకిరూపముతో నున్న దుఃఖితుడగు జయంతునిఁ జూచి, సత్పురుషుల మనస్సు పరులు దుఃఖ పడుచుండఁ జూచి సహింపదు, కానఁ దానుగూడ విచారపడెను.

త మైంద్రిం ప్రాహ దేవర్షిః కరుణావిష్టహృ త్తతః
రామాపచారిణ స్తేఽద్య రక్షితా భువనత్రయే,
నాస్తి సత్య మహం వచ్మి గచ్ఛ రాఘవసన్నిధిమ్. 29½

పిమ్మట దేవర్షి యగు నారదుడు దయారసము కలవాడై యా జయంతుని గూర్చి యిటులఁ బలికెను. ఓ జయంతా! రాముని కపరాధ మొనర్చిన నిన్ను రక్షించువాడు ముల్లోకములయందునుఁ గన్పడడు. నిజము చెప్పితిని. నీవు రాముని సన్నిధికే వెళ్లుము.

**గత్వా భవా న్రాఘవమేవ తస్య**
**పాదాబ్జయోర్వై పతితో ఽర్థయేచ్చేత్,**
**దయార్ద్ర భావో భవితా ఽవితా త్వాం**
**రామో ధ్రువం గచ్ఛ తదంతికం త్వమ్. 30½**

నీవచటకు వెళ్లి రాముని పాదములయందు బడినచో దయాళుడగు నా రాముడు తప్పక నిన్ను రక్షింపగలడు. కావున శీఘ్రముగ నచ్చటకుఁ బొమ్ము.

**వినా తేన త్రిలోక్యాం చ రక్షకో నా స్తి తే ఽపరః,**
**ఇత్యుక్త్వా తం ద్రుతం కాకం ప్రేషయామాస తం ప్రతి. 31½**

ఆరాముని విడిచి నిన్ను రక్షించువాడు త్రిలోకములలోఁగూడ లేడు. అని చెప్పి నారదుడు వెంటనే యా జయంతుని రాముని సన్నిధికిఁ బంపెను.

**సో ఽపి గత్వా నారదోక్త్యా పతిత్వా రామపాదయోః,**
**రక్షరక్షేతి తం రామం ప్రార్థయామాస నైకధా. 32½**

అతడును నారదుని వాక్యము శిరసావహించి రాముని సమీపమున కేగి యా దయాళుని పాదములయందుఁబడి 'నా యపరాధమును క్షమించి నన్ను రక్షింపు రక్షింపు'మని యనేకవిధములుగ రామునిఁ బ్రార్థించెను. మఱియు నివ్విధముగఁ బ్రార్థించెను.

**అజ్ఞానా ద్య త్కృతం కర్మ క్షంతవ్యం రాఘవ! త్వయా,**
**ఇతి తం రాఘవం కాకః ప్రార్థయామాస దైన్యభాక్. 33½**

'ఓ రామచంద్రా! నే నజ్ఞానముచేఁ జేసిన యపరాధమును క్షమింపుము'అని యా కాకిరూపముతో నున్న జయంతుడు దీనత్వముతోఁబ్రార్థించెను.

**సానుక్రోశతయా కాక మథ రామో ఽబ్రవీ ద్వచః,**
**యత్త్వం మే చరణౌ మూర్ధ్నా గత స్త్వం జీవితేప్సయా,**
**అతో స్త్యపేక్షా త్వయి మే రక్ష్యో మే శరణాగతః. 34-35**

అనంతరము రామచంద్రమూర్తి యతనియందు దయారసము గల వాడై యిటులఁ బలికెను. ఓ కాకమా! నీవు జీవితాపేక్షచే నా పాదములను శరణు పొందినందున శరణాగతరక్షణము నావిధి కాన నీయందు నాకుఁ గరుణ కలిగినది.

**అమోఘం క్రియతా మస్త్ర మేక మంగం పరిత్యజ,**
**కి మంగం శాతయతు తే శరైషీకం వద ద్రుతమ్.**
**ఏతావద్ధి మయా శక్యం తవ కర్తుం ప్రియం ఖగ,**
**ఇత్యుక్తస్సోఽబ్రవీద్రామం నేత్ర మేకం త్యజా మ్యహమ్. 36-37**

కాని నా యస్త్ర మమోఘము కాన నొక యవయవమును దీనికి బలిగా నిమ్ము. ఈ యస్త్రము నీ యవయవములలో నే యవయవము మీదను విడువు మనియెదవో చెప్పుము. ఇంతమాత్రము నీకుఁ బ్రియమునుఁ జేయ నాకు వీలగును అని రామచంద్రమూర్తి పలుకగా జయంతుడును తన నేత్రములలో నొకనేత్రము నిచ్చెదనని చెప్పెను.

**ద్రోహకర్తరి కాకేఽపి వధ్యే రామః ప్రసన్నహృత్,**
**తదేకనేత్రే బ్రహ్మాస్త్రం సంప్రయుజ్య ముమోచ తమ్. 38**

తనకు సంపూర్ణముగ ద్రోహము చేసినను నతనియందుఁ బ్రసన్నుడై రాముడు తన యస్త్రమును నతని యొక నేత్రమునందు బ్రయోగించి యతనిని విడిచిపెట్టెను.

**అథ కాకోఽపి దైన్యేన తరుమూలేఽవస త్తదా,**
**దృష్ట్వా తం రాఘవో దీనం కాకం శోకాకులం తతః**
**కృపావిష్ట స్తమాహూయ సమాశ్వాస్య వరా న్దదౌ,**
**చిరాయు ర్దివ్యదృష్టిం చ శకునం ఫల మాదరాత్. 39-40**

అనంతరమం దా కాకి విచారముతో నొక వృక్షమూలమునం దుండగా దుఃఖాకులమై దీనభావముతో నున్న యా కాకిని రాముడు చూచి దయావిష్ట మనస్కుడై తన దగ్గరకుఁ బిలిచి యోదార్చి చిరాయుష్యమును, దివ్యదృష్టిని, శకునఫలమును కాకిజాతి కంతకు గలుగునటుల వరములుగా నిచ్చెను.

**అథ సోఽపి ముదం ప్రాప్య సమాపృచ్ఛ్య చ రాఘవమ్,**
**నిజరూపం సమాశ్రిత్య స్వస్థానం గతవా న్పునః. 41**

అనంతరము కాకము సంతోషించి రాముని సెలవడిగి నిజరూపముతో స్వస్థానమున కేగెను.

**ఏతస్మి న్నంతరే చాగా త్సౌమిత్రిః ఫలసంయుతః,**
**ఇష్టగోష్ఠిం ప్రకుర్వంత స్త్రయ స్తే న్యవస న్సుఖమ్. 42**

ఈ సమయమునకు లక్ష్మణుడును కందమూల ఫలాదులనుఁ దీసికొని రాముని సన్నిధికి వచ్చెను. సీతారామలక్ష్మణులు ముప్వురు నిష్టాగోష్ఠి కథలను జెప్పుకొనుచు సుఖముగ నుండిరి.

**భరతోఽపి క్రమా త్తీర్త్వా నదీనదవనాని చ,**
**సర్వసైన్యయుత శ్చాగా చ్చిత్రకూటాంతికం శనైః. 43**

అచ్చట భరతుడును సకల సైన్యసమేతుడై క్రమముగా నదీనద వనములను దాటి చిత్రకూటపర్వత సమీపమునకు వచ్చెను.

**సైన్యరేణుశ్చ శబ్దశ్చ మహా న్ప్రాదురభూ త్తదా,**
**చతురంగ బలోద్భూతం శ్రుత్వా శబ్దం తు రాఘవః,**
**రజశ్చాపిత దుద్భూతం వీక్ష్య సౌమిత్రి మాహ సః. 44-45**

భరతుని సైన్యమునుండి పరాగమున్ను (ధూళియున్ను) గొప్ప కలకల ధ్వనియును బయలుదేరెను. రామచంద్రమూర్తి యాకోలాహలమును విని యాసైన్యమునుండిబయలుదేరిన ధూళినిఁజూచి లక్ష్మణునితో నిటులఁ బలికెను.

**హంత లక్ష్మణ పశ్యేహ సుమిత్రాసుప్రజా స్త్వయా.**
**భీమ స్తనితనిర్ఘోష స్తుముల శ్శ్రూయతే స్వనః,**
**రాజా వా రాజమాత్రో వా మృగయార్థం సమాగతః,**
**సర్వ మేత ద్యథా తత్త్వం జ్ఞాతు మర్హసి లక్ష్మణ. 46-47**

ఓ తమ్ముడా! ఇటు చూడుము. భయంకరమైన కోలాహలము నీకు వినబడుచున్నదా? ఎవరో రాజుకాని, రాజమాత్రుడు కాని వేటకై వచ్చెనని తలచెదను. ఈ విషయము నంతను నున్నది యున్నటులఁ దెలిసికొనుము.

[1] ఇత్యుక్త స్స్వరం సాలం సమారుహ్య తు లక్ష్మణః,
దిశ స్సర్వాః క్రమా త్పశ్య న్నుదీచీం పశ్యతిస్మ సః
రథాశ్వగజసంబాధాం తత్రైక్షత మహాచమూమ్. 48½

ఇవ్విధముగ రాముడు చెప్పుటతోడనే, లక్ష్మణుడును సమీపము నందున్న యొకసారి వృక్షమునెక్కి యన్నివైపులఁ గలయఁజూచుచు నుత్తరపు దిక్కువైపు చూచెను. ఆదిక్కునందు రథ గజ తురగ పదాతిరూపమగు చతురంగ సైన్యము కన్పడెను.

సౌమిత్రి రథ రామం తం ప్రాహేదం వచనం మహత్,
శమయాగ్నిం ద్రుతం రామ గుహాం ప్రేషయ జానకీమ్,
ధనుర్ధర ద్రుతం బాణా న్కవచం ధర సత్వరమ్. 49-50

పిమ్మట లక్ష్మణుడు రామునితో నిటులఁ బలికెను. అన్నా! వెంటనే అగ్నులనుఁ జల్లార్పుము. సీతను సమీపములోనున్న పర్వతగుహలోఁ బ్రవేశపెట్టుము. ధనువును ధరించుము. బాణములను, కవచమును గూడ ధరింపుము.

తచ్ఛ్రుత్వా రాఘవః ప్రాహ సుమిత్రానందవర్ధనమ్,
అంగావేక్షస్వ సౌమిత్రే కస్యేమాం మన్యసే చమూమ్. 51

ఆ లక్ష్మణుని మాటలను రామచంద్రమూర్తి విని యిటులఁ బలికెను. ఓ లక్ష్మణా! బాగుగాఁజూడుము. ఈ సైన్య మెవరిదని తలచుచుంటివో చెప్పుమనియెను.

ఇత్యుక్తః ప్రాహ రామం తం సౌమిత్రిః క్రోధసంయుతః,
దిధక్షన్నివ తాం సేనాం రుషితః పావకో యథా,
సంపన్నం రాజ్య మిచ్ఛంస్తు వ్యక్తం ప్రాప్యాభిషేచనమ్,
ఆవాం హంతుం సమభ్యేతి కైకేయ్యా భరత స్సుతః,
ఏష వై సుమహా న్భాతి కోవిదారధ్వజో రథే. 52-53½

ఇట్లు రాముడు పలుకగా లక్ష్మణు డగ్నివలె క్రోధాగ్నిచే మండిపడుచు భరతసైన్యము నంతను దహించుచున్నవాడువలెఁ గన్పడుచు నిటుల రామునితోఁ బలికెను. అన్నా! భరతుడు పట్టాభిషిక్తుడై తన రాజ్యమును స్థిరీకృతమునుగా

1. వా ॥ రా ॥

జేసికొనుటకై మనలను జంపదలచి సైన్యసమేతుడై వచ్చుచున్నాడు. అతని రథము మీదను కోవిదార ధ్వజముకూడఁ గానవచ్చుచున్నది. తప్పక భరతుడే వచ్చుచున్నాడు.

గృహీతధనుషౌ చావాం గిరిం వీర శ్రయావహై,
అపి నౌ వశ మాగచ్ఛే త్కోవిదారధ్వజో రణే.
యన్నిమిత్తం భవా న్రాజ్యా చ్చ్యుతో రాఘవ! శాశ్వతాత్,
సంప్రాప్తోఽయ మరి ర్వీర భరతో వధ్య ఏవ హి.
ఏత్మస్మి న్నిహతే కృత్స్నా మనుశాధి వసుంధరామ్,
కైకేయీం చ వధిష్యామి సానుబంధాం సబాంధవామ్. 54-56½

మనమిద్దరము ధనుర్ధరులమై పర్వతముమీద నుండి యుద్ధము చేయుదము. అతడు మనకు వశ్యుడౌను. ఏ భరతుని మూలకముగా నీవు శాశ్వతమైన రాజ్యమునుండి భ్రష్టుడవైతివో యాశత్రువగు భరతు డాకస్మికముగ మనచేతికిఁ జిక్కుచున్నాడు. కాన వానినిఁ దప్పక వధింపవలసినదే. ఇతనిని జంపి సమస్త భూమండలమును నిష్కంటకముగఁ బరిపాలింపుము. బంధుసమేతముగఁ గైకనుగూడ నేను వధించెదను.

ఇత్యుక్తః ప్రాహ తం రామ స్సౌమిత్రిం దూషయ న్వచః,
కి మత్ర ధనుషా కార్య మసినా వా సచర్మణా,
య ద్ద్రవ్యం బాంధవానాం చ మిత్రాణాం చక్షయే భవేత్,
నాహం తత్ప్రతిగృహ్ణీయాం భక్ష్యా న్విషకృతానివ,
నహీచ్ఛేయ మధర్మేణ శక్రత్వ మపి లక్ష్మణ. 57-59

ఇట్లు లక్ష్మణుడు పలుకగా రామచంద్రమూర్తి లక్ష్మణుని దూషించుచు నిటులఁ బలికెను. లక్ష్మణా! ఈ సమయమున ధనువులతోఁగాని యస్త్రములతో గాని పనియేమి? బంధుమిత్రాదులను హింసించి సంపాదించుకొను ద్రవ్యమును విషసంపృక్తమగు భక్ష్యమువలె నేను ముట్టుకొనువాడను కాను. అధర్మముగా వచ్చిన యింద్ర పదవినిఁగూడ స్వీకరింపనని తెలిసికొనుము. భరతునిఁ జంపి యతని రాజ్యము తీసికొనుమని చెప్పెదవా? ఎంత ఘోరకృత్యమున కొడంబడితివి. మనలఁ జంపి యతడు తన రాజ్యమును స్థిరముగఁ జేసికొనుటకు వచ్చుచున్నట్లు తలచుట చాల పొరబాటు సుమా.

మన్యేహ మాగతో ఽయోధ్యాం భరతో భ్రాతృవత్సలః,
మమ ప్రాణా త్ప్రియతరః కులధర్మ మనుస్మరన్.
అంబాం చ కైకయీం రుష్య పరుషం చాప్రియం వదన్,
ప్రసాద్య పితరం శ్రీమా న్రాజ్యం మే దాతు మాగతః. 60-61

లక్ష్మణా! భరతుడెందుల కిచటకు వచ్చుచున్నాడో చెప్పెదను వినుము అతడు భ్రాతృవాత్సల్యము కలవాడును, నాకు ప్రాణాప్తుడును కాన నయోధ్యకు వచ్చుటతోడనే తల్లి చేసిన దుష్కృత్యము నంతనుఁ దెలిసికొని తన తల్లిని కోపగించి, దూషించియు తండ్రినిఁగూడ బ్రసన్నునిగాఁజేసి యిచటకు వచ్చి రాజ్యము నా కిచ్చి నన్నుఁ దిరిగి యయోధ్యకుఁ దీసికొని వెళ్లుటకు వచ్చుచుండెనని తెలిసికొనుము.

న హి తే నిష్ఠురం వాచ్యో భరతో నాప్రియం వచః,
అహం హ్యప్రియ ముక్త స్స్యాం భరతస్యాప్రియే కృతే,
యది రాజ్యస్య హేతో స్త్వ మిమాం వాచం ప్రభాషసే,
వక్ష్యామి భరతం దృష్ట్వా రాజ్య మస్మై ప్రదీయతామ్,
ఇత్యుక్తో భరతస్సద్యః బాఢ మిత్యేవ వక్ష్యతి. 62-63½

నీ వింతటినుండి యెప్పుడును నాయెదుట భరతుని గూర్చి పరుషవాక్యములను బలుకకుము. భరతుని గూర్చి పరుషవాక్యములు నీవు పలికినచో నన్ను గూర్చి నీవు పలికినట్లుగానే భావించెదను. నీకు రాజ్యకాంక్ష మిక్కుటముగ నుండి యిటులఁ బలుకుచుంటివేని చెప్పెదను వినుము. నీకు రాజ్యము నిమ్మని భరతునితోఁ జెప్పినయెడల నతడు తప్పక యంగీకరించి నీకు రాజ్య మీయగలడు.

ఇతీవ రామో ధర్మాత్మా సౌమిత్రిం త మువాచ హ,
అవతీర్యతు సాలాగ్రా త్తస్మా త్స సమితింజయః,
వ్రీడితో లక్ష్మణశ్చాపి రామపార్శ్వతలే ఽవసత్. 65

ఈ ప్రకారముగా ధర్మాత్ముడగు రామచంద్రమూర్తి లక్ష్మణునితోఁ బలుకగా నా లక్ష్మణుడును వృక్షాగ్రమునుండి మెల్లగ దిగి సిగ్గుపడినవాడై రాముని పార్శ్వభాగమున నిలుచుండియుండెను.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యాకాండే ద్వితీయభాగ దశమస్సర్గః సమాప్తః
ఆశ్చర్యరామాయణమున అయోధ్యాకాండ ద్వితీయ భాగమున పదియవ సర్గము సమాప్తము.

# ఏకాదశస్సర్గః - పదనొకండవ సర్గ

సంప్రాప్య తం గిరిం దూరే విన్యస్య భరతో జనాన్,
గుహమంత్ర్యనుజై ర్యుక్తో వ్యచినో ద్రాఘవాశ్రమమ్. 1

భరతుఁడు చిత్రకూటమునకుఁ జేరినపిమ్మటఁ దన సైన్యమును దూరముగ నుంచి సుమంత్రునితోడను, గుహునితోడను, శత్రుఘ్నునితోడను గూడి రాముని యాశ్రమమును వెదుక నారంభించెను.

అదృష్ట్వా రామభవన మపృచ్ఛ దృషిమండలమ్,
కుత్రాఽస్తే సీతయా సార్ధం లక్ష్మణేన రఘూత్తమః. 2

రాముని పర్ణశాల కన్పడకపోవుటచే సీతాలక్ష్మణ సమేతుఁడగు రామచంద్రమూర్తి యెచ్చట నుండెనో మీకుఁ దెలియునా యని యచ్చటి మునిజనులను భరతుఁడు ప్రశ్నించెను.

ఊచు రగ్రేగిరేః పశ్చా ద్గంగాయా ఉత్తరే తటే.
వివిక్తం రామసదనం రమ్యకాననమండితమ్. 3

మహర్షులును భరతునితో నివ్విధముగఁ జెప్పిరి. చిత్రకూటమునకు వెనుక భాగమున గంగకు నుత్తరభాగమున నందమగు వృక్షములచే నొప్పుచు సంమర్దము లేకుండ రాముని భవన మలరారుచున్నదని చెప్పి మార్గము చూపించిరి.

ఏవం దర్శిత మాలోక్య మునిభి ర్భరతోఽగ్రతః,
హర్షాద్యయౌ రఘుశ్రేష్ఠభవనం త్రిభి రన్వితః. 4

ఇట్లు మునులచేఁ జూపఁబడిన రాముని భవనమును భరతుఁడు చూచి సంతోషముతో సుమంత్ర గుహ శత్రుఘ్నులతో రాముని పర్ణశాలను సమీపించెను.

స తత్ర వజ్రాంకుశవారిజాంచిత, ధ్వజాదిచిహ్నాని పదాని సర్వతః,
దదర్శ రామస్య [1]భువోఽతిమంగళా, న్యచేష్టయ త్పాద రజస్సు సానుజ. 5

---

1. అ.రా.

భరతు డచ్చట వజ్రాంకుశ పద్మరేఖల చిహ్నములచే నొప్పుచున్న జగన్మంగళకరములగు రాముని యడుగులను జూచి యా పాదరజస్సును కండ్ల కద్దుకొని యీ విధముగఁ దలచుచుండెను.

**అహో సుధన్యోఽహ మమూని రామ, పాదారవిందాం కితభూతలాని!**
**పశ్యామి యత్పాదరజో విమృగ్యం, బ్రహ్మాది దేవైశ్శ్రుతిభి శ్చ నిత్యమ్. 6**

ఓహో! ఏ రాముని పాదకమలములు బ్రహ్మాదులకుఁగూడ మృగ్యమో యట్టి రామపాదములచే చిహ్నితమగు భూప్రదేశమునుఁ జూచు భాగ్యము నాకుఁ గలిగినందున నే నెంతయో కృతార్థుడను.

**ఇ త్యద్భుతప్రేమరసాప్లుతాశయో,**
**విగాఢచేతా రఘునాథ భావనే,**
**ఆనందజాశ్రుస్నపిత స్తనాంతర**
**శ్శనైరవాపాశ్రమ సన్నిధిం హరేః. 7**

ఇవ్విధముగ శ్రీరాముని మనమునందు భావించుచుండుటచేఁ గలిగిన యద్భుత ప్రేమరసముచేఁ దడుపఁబడిన చిత్తము గలవాడై భరతుడు ఆనందబాష్పములచేఁ దడుపబడుచుఁగ్రమముగ శ్రీరాముని సన్నిధానమున కేగెను.

**స తత్ర దృష్ట్వా రఘునాథ మాస్థితం దూర్వాదళ శ్యామల మాయతేక్షణమ్,**
**జటాకిరీటం నవవల్కలాంబరం ప్రసన్న వక్త్రం తరుణారుణద్యుతిమ్..**
**విలోకయంతం జనకాత్మజాం శుభాం సౌమిత్రిణా సేవితపాద పంకజమ్,**
**తదాభిదుద్రావశుచా రఘూత్తమమ్ హర్షాచ్చతత్పాదయుగంత్వరాగ్రహీత్.**
**8-9**

దూర్వాంకురమువలె నల్లనికాంతి గలిగినవాడును, విశాల నేత్రుడును, జటాధారియును, నారచీరను ధరించిన వాడును, ప్రసన్నమైన ముఖము గలవాడును, బాలసూర్యునివంటి తేజస్సుచే నొప్పువాడును, మంగళ ప్రదయైన సీతాదేవిని జూచుచున్నవాడును, లక్ష్మణునిచే సేవించబడుచున్నవాడు నగు రామచంద్రుని భరతుడు చూచి సంతోషముతో వెళ్ళి భ్రాతృపాదములకు బ్రణమిల్లెను.

రామ స్త మాకృష్య సుదీర్ఘబాహు
ర్ద్వోర్భ్యాం పరిష్వజ్య సిషించ నేత్రజైః,
జలై రథాంకోపరి సంన్యవేశయ
త్పునః పున స్సంపరిషస్వజే విభుః. 10

ఆజానుబాహుఁడగు రాముఁడును తన తమ్ముఁడగు భరతుని బాహువులచే నాలింగనము చేసికొని కన్నీరు కార్చుచు తన యొడిలో కూర్చుండ బెట్టుకొని మాటిమాటికిఁ గౌగిలించుకొనుచుండెను.

*[1] అథ తం కుశలప్రశ్నా నపృచ్ఛ ద్రాఘవో ఽనుజమ్,
కించి త్సౌమ్య న తే రాజ్యం భ్రష్టం బాలస్య శాశ్వతమ్ 11

* అనంతరము రాముడు తన సోదరుడగు భరతుని నీక్రింది విధముగఁ గుశలప్రశ్నములను వేయుచుండెను. నీవు రాజ్యమును విడిచి యిచ్చుటకు వచ్చుటచే నాకు సందేహము పొడముచున్నది. నీవు బాలుడ వైనందున నీ రాజ్యము శత్రువులవలన భ్రష్టమేమియు కాలేదు గదా!

** కుశలీ నః పితా కిం త్వం కచ్చి చ్ఛుశ్రూషసే చ తమ్. 11½

భరతా! మన నాయన గారు క్షేమముగా నుండిరా? తండ్రిగారికి నీవు బాగుగ సేవచేయుచున్నావా?

* అనేన బాలేనాధిష్ఠితం రాజ్యం నశ్యతీతి సూచితం- విదురనీతౌ :- యత్ర స్త్రీ యత్ర కితవో బాలో యత్రానుశాసితా! మజ్జంతి తేఽ వశా రాజన్ నద్యామశ్మప్లవా ఇవ ఇతి.

* ఇట్లు చెప్పుటచే బాలునిచే నధిష్ఠింపబడిన రాజ్యము నశించునని సూచితమగుచున్నది. విదురనీతిలోఁగూడ నివ్విధముగనే జెప్పఁబడినది. స్త్రీ స్వతంత్రురా లయినను, జూదరి స్వతంత్రుడుగా నున్నను, బాలుడు రాజుగా నున్నను, నదిలో రాతిపడవలవలె మునిగిపోవుదురు. (అనగాఁ గొయ్యచే గట్టబడిఁ పడవలు మునుగకుండ నుండునుగాని, రాళ్లచే నేర్పరుపబడిన పడవలు మునిగిపోవునటుల పైవారును మునిగిపోవుదురు. నశించుదురని)

** అనేన పితృశుశ్రూషా కర్తవ్యేతి సూచితం. తథా చ రాజధర్మ శూశ్రూషతే యః పితరం న చాసూయే త్కదాచన తస్య రాజ స్ఫలం విద్ధి స్వర్లోకే స్థాన మర్చితం ఇతి.

**ఇటు చెప్పుటచే బితృశుశ్రూష ముఖ్యముగాఁ జేయవలయునని సూచిత మగుచున్నది. రాజధర్మమునందును నటులనే చెపఁబడినది. (ఏమన) ఎవ్వడు తండ్రికి బాగుగ సేవచేయునో, ఎవ్వడు తండ్రిని ద్వేషింపడో వానికి స్వర్గలోకమునందు బూజనీయమగు స్థానముండునవి.

1. వా. రా.

*కచ్చి ద్దేవా న్పితౄ న్మాతౄ ర్గురూ న్పితృసమానపి,
వృద్ధాంశ్చ తాత వైద్యాంశ్చ బ్రాహ్మణాం స్తాత! పూజసే. 12½

భరతా! దేవతలను, గురువులను, పితృసమానులను, *తల్లులను, పెద్దలను, వైద్యులను, బ్రాహ్మణులను యథావిధిగఁ బూజించు చుంటివి కదా?

**కచ్చి న్మంత్రయసే నైకః కచ్చి న్న బహుభిస్సహ,
కచ్చిత్త్వాం నావజానంతి యాజకాః పతితం యథా. 13½

** సోదరా! నీవు రాజకీయములను విచారించునప్పు డొక్కడవే విచారించుటలేదు కదా? అనేకులతోఁ గూడ నాలోచనము చేయుట లేదు కదా? యజ్ఞములను జేయించు ఋత్విక్కులు మొదలగు వారలు పతితుడగు యజమాని నవమానించునట్లు నిన్నెవరును నవమానింపరు కదా?

---

* అనేన సర్వైః పితృభృత్యగురు వృద్ధవైద్య బ్రాహ్మణానాం బహుమానః కర్తవ్య ఇతి సూచితం, రాజధర్మే- ఆదా వేవ కురుశ్రేష్ఠ రాజ్ఞా రంజన మిచ్ఛతా, దేవతానాం ద్విజానాం చ వర్తితవ్యం యథావిధి. ధర్మనిష్ఠాన్ శ్రుతవతో వేదవ్రత సమాహితాన్, ప్రత్యుత్థా మోపసంగృహ్యా చరణా వభివాద్య చ ఇతి.

*ఇట్లు చెప్పుటచే గురువులను, పితృతుల్యులను, మాతలను, బ్రాహ్మణులను, వృద్ధులను, వైద్యులను గౌరవింపవలయుననెడి ధర్మము సూచింపబడినది. రాజ్యధర్మమునఁ గూడ నటులనే చెప్పఁబడినది (ఏమన) ఓ ధర్మరాజా! ప్రజారంజన మొనగూర్ప నిచ్ఛగల రాజు ధార్మికులను, వేదశాస్త్రసంపన్నులను, దేవతలను, బ్రాహ్మణులను, వేదవ్రతపరులను ప్రత్యుత్థానాభివందనాదులచే సత్కరింపవలయునని.

** అనే నైక ఏవ అర్థం న చింతయే న్న బహుభిర్మంత్రో గోపనీయ ఇతి. తథా చోద్యోగే- ఏక స్స్వాదు న భుంజీత ఏక స్స్వార్థం న చింతయేత్, ద్వికర్ణస్యసాతు మంత్రస్య బ్రహ్మాప్యంతం న గచ్ఛతి' ఇతి.

** ఇట్లనుటచే, నెప్పుడును కార్యాలోచనము చేయునప్పుడు తానొక్కడే యాలోచింపఁ గూడదనియు, ననేకులతో నాలోచింప గూడదనియు సూచింపబడినది. అవ్విధముననే యుద్యోగపర్వము నందునఁ జెప్పఁబడినది. (ఏమన) ఒక్కడు కార్యాలోచనము చేయఁగూడదనియు, దానొక్కడే మధురపదార్థమును భుజింపఁగూడదనియు, నొక్కడే యాలోచించిన యాలోచనముయొక్క యంతమును బ్రహ్మకూడ పొందలేడనియుఁ జెప్పబడినది.

*కచ్చి త్స్వాదుకృతం భోజ్య మేకో నాశ్నాసి రాఘవ!
కచ్చిదాశంసమానేభ్యో మిత్రేభ్య స్సంప్రయచ్ఛసి. 14 ½

*భరతా! భుజింపదగిన మధురపదార్థములను భుజించునపుడు నీవొక్కడవే భుజించుటలేదు కదా? నీహితమును గోరు మిత్రులకుఁగూడ నిచ్చుచుంటివి కదా?

నాస్తిక్య మనృతం క్రోధం ప్రమాదం దీర్ఘసూత్రతామ్,
అదర్శనం జ్ఞానవతా మాలస్యం పంచవృత్తితామ్.
ఏకచింతన మర్థానా మనర్థజ్ఞైశ్చ మంత్రణమ్
నిశ్చితానా మనారంభం మంత్రస్యాపరిరక్షణమ్,
మంగళస్యాప్రయోగం చ ప్రత్యుత్థానం చ సర్వతః,
కచ్చి త్త్వం వర్జయ స్యేతా న్రాజదోషాం శ్చతుర్దశ. 15-17½

---

*అనేన మృష్ట మన్నం నైకేన భోక్తవ్య మితి సూచితం. తథోద్యోగ పర్వణి- 'ఏకో న మృష్ట మశ్నీయాత్' ఇతి. అత్రేద మనుసంధేయం - అత్ర శ్రీరామచంద్రేణ స్వసందర్శనార్థం సమాగతస్య భరతస్య కుశలప్రశ్న వ్యాజేన సర్వేషాం ధర్మాణాం ప్రతిపాదనాత్ మహద్భి స్స్వేష్టజనస్య సమాగమే కుశలప్రశ్న పూర్వకం ధర్మోపదేశః కర్తవ్య ఇతి సూచితమ్.

తథా చ సభాపర్వణి ధర్మపుత్రం ప్రతి నారదవచనం - వైశంపాయనం- వైశంపాయనః సోర్చితఃపాండవై స్సర్వైర్మహర్షి ర్వేదపారగః, ధర్మకామార్థ సంయుక్తం పప్రచ్ఛేదం యుధిష్ఠిరం. కచ్చిదర్థాశ్చ కల్ప్యంతే ధర్మే చ రమతే మనః, కచ్చిదాచరితం పూర్వై ర్నరదేవపితామహైః' ఇతి.

** ఇట్లు చెప్పుటచే మృష్టాన్నమును దానొక్కఁడే భుజింప గూడదను ధర్మము సూచిత మగుచున్నది. అవ్విధముగనే యుద్యోగ పర్వమునందును జెప్పబడినది. " ఒక్కడు మృష్టాన్నమును భుజింపఁగూడదని.

ఇచ్చట శ్రీరామచంద్రమూర్తి తన్ను సందర్శించుటకు వచ్చిన భరతునిగూర్చి కుశలప్రశ్నములను మిషచే సమస్తరాజధర్మములను బోధించుటవల్లను పెద్దలగు వారలు తమ యిష్టజనులు వచ్చినప్పుడు కుశలప్రశ్నపూర్వకముగ ధర్మోపదేశము చేయవలయు ననియెడి ధర్మము సూచింపబడినది.

అవ్విధముగనే సభాపర్వమునందు ధర్మరాజునుగూర్చి నారదు డిటులనే ప్రశ్నించినట్లు కన్పడును. (ఏమన) వేదశాస్త్రపారంగతుడగు నారదమహర్షి పాండవులచే నర్ఘ్యపాద్యాదులచేఁ బూజింపఁ బడి పిమ్మట ధర్మయుక్తముగ నిటుల ధర్మరాజును బ్రశ్నించెను. ఓ ధర్మరాజా! ధర్మమునందు మనస్సు రమించుచున్నదా? అర్థమును రాజనీతిప్రకారము సమకూర్చుచుంటివా? ఓ రాజా! మీ పూర్వులాచరించిన విధముగ నాచరించుచుంటివా? అని.

ఓ భరతా! నాస్తికత్వము, అనృతము, క్రోధము, ప్రమాదము, దీర్ఘాలోచనము, జ్ఞానులను సందర్శింపకపోవుట, మాంద్యము, పంచేంద్రియములకు లోనగుట, తానొక్కడే కార్యాలోచనము చేయుట, అనర్థమును కలుగచేయువారలతో నాలోచనము, నిశ్చితకార్యముల నారంభింపక పోవుటయు, ఆలోచింపబడిన యాలోచనమును గాపాడకపోవుట, మంగళమును ప్రయోగించకపోవుట, అందరిని ప్రత్యుత్థానము చేయుటయు ననియెడి యీపదునాలుగు రాజదోషములను నీవు విడిచితివికదా? అని రామచంద్రమూర్తి భరతుని ప్రశ్నించెను.

తచ్ఛ్రుత్వా భరతః ప్రాహ దుఃఖితో రాఘవం ప్రతి.
త్వత్సేవా ధర్మహీనస్య రాజధర్మేణ కిం మమ. 18 ½

ఆ మాటలు విని భరతుడు దుఃఖితుడై రాముని గూర్చి యిటుల బలికెను రామచంద్రా! శాశ్వతసుఖములను గలుగజేయు భవత్కైంకర్యరూపమగు సేవాధర్మమును విడిచిన నాకీ రాజధర్మములతో బనియేమి?

*రాజానం మానుషం ప్రాహు ర్దేవత్వే సంమతో మమ,
యస్య ధర్మార్థసహితం వృత్త మాహు రమానుషమ్. 19 ½

*రాజ్ఞః అమానుష చరిత్రత్వం మనునా దర్శితం చంద్ర స్యార్కస్య వాతస్య యమస్య వరుణస్య చ, ఇంద్ర స్యాగ్నేః పృథివ్యాశ్చ తేజోవృత్తం నృప శ్చరేత్ ఇతి

1. వార్షికాం శ్చతురో మాసాన్ యథేంద్రో వర్షతి
తథా స్వరాష్ట్రం సర్వకామై రభివర్షతీ తీంద్రవృత్తమ్.
2. యథార్క స్స్వరశ్మిభి స్తోయం హరతి తథా రాష్ట్రా
త్కరం హరతీ త్యర్కవృత్తం.
3. యథా మారుత స్సర్వభూతాని ప్రవిశ్య చరతి
తథాచారైః ప్రవిశతీతి వాయువృత్తం.
4. యథా యమః ప్రియ ద్వేష్యా నియచ్ఛతి తథా
కాలే ప్రాప్తే సతి సర్వా న్నియచ్ఛతీతి యమవృత్తం.
5. యథా వరుణః పాపినం స్వపాశై ర్నియచ్ఛతి తథా
పాపా న్నిగృహ్ణీయాదితి వరుణవృత్తం.

* రాజును మనుష్యుడే యైనను నత డమానుష ధర్మ చరిత్ర గలవాడు కాన దేవుడనియే నామతము. (అట్టిరాజుగా నీ వుండతగినవాడవు. కాని, నే నుండతగిన వాడను కానని భావము)

---

**6.** యథా పరిపూర్ణం చంద్రం దృష్ట్వా ప్రజా నందంతి

తథా ప్రకృతయః నృపా న్నందంతీతి చంద్రవృత్తం.

**7.** యథాగ్నిః ప్రతాపీ హింసక స్తథా ప్రతాపీ పాపి హింసక ఇత్యగ్నివృత్తం.

**8.** యథా పృథివీ సర్వాణి భూతాని ధారయతే తథా

సర్వధారణం కరోతీతి పృథివీవృత్తం.

* రాజు అమానుషచరిత్ర గలవాడని మనువుగూడ చెప్పెను. చంద్ర, సూర్య, యమ, వాయు, వరుణేంద్రాగ్ని భూము లనియెడి యెనమండ్రుగురి వృత్తము (నడవడి) కలవాడు రాజు - అని.

1. ఇంద్రుడు వర్షాకాలమున నాలుగుమాసములు నెవ్విధముగ వర్షించునో, యవ్విధముగఁ దనరాష్ట్రమును రాజు సర్వకామములచే వర్షించును. కాన, ఇంద్రవృత్తము రాజున కుండును.

2. సూర్యుఁడెవ్విధముగఁ దనకిరణములచే నుదకము హరించునో యవ్విధముగ రాజు రాష్ట్రమునుండి పన్నును హరించును. కాన సూర్యవృత్తము రాజునకుఁ గలదు.

3. ఎవ్విధముగ వాయువు సమస్త భూతములను ప్రవేశించి సంచరించునో, యవ్విధముగ రాజు గూఢచారులచేఁబ్రవేశించును. కాన వాయువృత్తము రాజునకు ఁజెప్పఁబడినది.

4. ఏ ప్రకారముగ యముడు మిత్రామిత్రులను శిక్షించునో, యవ్విధముగ సమయము వచ్చినప్పుడు హితాహితు లందరను రాజు శిక్షించును. కాన యముని వృత్తము రాజునకుఁ జెప్పబడినది

5. ఏ విదముగ వరుణుడు పాపులను తనపాశములచే బంధించునో, యవ్విధముగ రాజు పాపులను పాశములచే బంధించునుగాన వరుణవృత్తము రాజునకుఁజెప్పబడినది.

6. ఏ విధముగ జనులు పూర్ణచంద్రునిఁజూచి యానందించెదరో యా విధముగనే రాజువలనఁ బ్రజలు సంతోషించెదరుగాన చంద్ర వృత్తము రాజునకుఁ జెప్పఁబడినది.

7. ఏ విధముగ, అగ్నిహోత్రుడు ప్రతాపము గలవాడును, హింసించువాడు నగునో, యవ్విధముగ రాజు ప్రతాపవంతుడును, హింసకుడును, కాన అగ్నివృత్తము రాజునకుఁ జెప్పబడినది.

8. ఏ విధముగ భూమి సమస్తభూతములను ధరించుచున్నదో, యవ్విధముగ రాజు సమస్తమును ధరించును, కాన భూమివృత్తము రాజునకుఁ జెప్పబడినది.

[1]ఏతస్మి న్నంతరే తత్ర సమాగు ర్మాతరో ద్రుతమ్,
రామసందర్శకామా స్తా స్తృషార్తా గౌ ర్యథా జలమ్. 20½

రాముని సందర్శింప నాతురతతో, దాహముచే పీడింపబడిన గోవులు జలముగూర్చి పరుగిడునట్లు రామునిదగ్గరకు వచ్చిరి.

రామ స్స్వమాతరం వీక్ష్య ద్రుత ముత్థాయ పాదయోః,
వవందే సాశ్రు సా పుత్ర మాలింగ్యాతీవ దుఃఖితా. 21½

రాముడు తనతల్లియగు కౌసల్యనుఁ జూచి శీఘ్రముగ లేచి యామె పాదములకు నమస్కరింపగా నామెయును కన్నీరు కార్చుచుఁ బుత్రునిఁ గౌగలించుకొని దుఃఖింపసాగెను.

ఇతరాశ్చ తథా నత్వా జననీ రఘునందనః,
తత స్సమాగతం దృష్ట్వా వసిష్ఠం మునిపుంగవమ్,
సాష్టాంగం ప్రణిపత్యాహ ధన్యోఽస్మీతి పునః,
యథార్హ ముపవేశ్యాహ సర్వానేవ రఘూద్వహః,
పితా మే కుశలీ కిం వా మాం కి మాహాతిదుఃఖితః. 22-24

పిమ్మట రామచంద్రమూర్తి సుమిత్ర మొదలగు తల్లులకును నమస్కరించెను. ఇంతలో వసిష్ఠుడు నచ్చుటకు రాగా నెదురుగా వెళ్ళి నమస్కరించి తగునటుల నందఱనుఁ గూర్చుండబెట్టెను. పిమ్మట మా తండ్రి కుశలముగా నుండెనా? దుఃఖముతో నున్న మా తండ్రి నన్ను గూర్చి యేమి చెప్పుమని చెప్పెనో చెప్పుఢని రామచంద్రమూర్తి వసిష్ఠుని బ్రశ్నించెను.

వసిష్ఠ స్త మువాచేదం పితా తే రఘునందన,
త్వద్వియోగాభితప్తాత్మా త్వామేవ పరిచింతయన్,
రామ రామేతి సీతేతి లక్ష్మణేతి మమార హ. 25 ½

వసిష్ఠుడును రామచంద్రమూర్తితో నిటులఁ జెప్పెను. ఓ రామచంద్రా!నీ వరణ్యమునకు వచ్చిన తర్వాతను నీవియోగదుఃఖముచేఁ బరితప్తుడై హా రామా! హా రామా! యనియు, హా జానకి! యనియు, హా లక్ష్మణా! యనియు, వనవాసమున కేగిన మిమ్ములనే చింతించుచు మృతినొందెను.

1. అ॥ రా ॥

శ్రుత్వా త త్కర్ణశూలాభం గురో ర్వచన మంజసా,
హా హతో౽స్మీతి పతితో రుదన్రామ స్సలక్ష్మణః. 26 ½

కర్ణములకు శూలమువంటి యావసిష్ఠవచనమును రాముడు విని హతో౽స్మియని రోదనము చేయుచు మూర్ఛితుడై భూమిపై పడెను, లక్ష్మణుడును నవ్విధముగనే మూ ర్ఛిల్లెను.

హా తాత మాం పరిత్యజ్య క్వ గతో౽సి, ఘృణాకర,
అనాథో౽స్మి మహాబాహో మాం కో వా లాలయే దితః,
ఇతి రామ స్తదాత్యర్థం విలలాప సుదుఃఖితః,
సీతా చ లక్ష్మణశ్చాపి విలాపం చక్రతు స్తదా,
తదానీం రురుదు స్సర్వా మాతరశ్చ తథా౽పరే. 27-29

తండ్రీ! నన్ను విడిచి నీ వొక్కడ వెచ్చటి కేగితివి? నేను దిక్కులేని వాడనైతిని. నన్నింతటినుండి యెవడు లాలనము చేయును? ఇవ్విధముగ రామచంద్రమూర్తి మిక్కిలి దుఃఖించుచు విలపించు చుండెను. సీతయు లక్ష్మణుడును కౌసల్య మొదలగు తల్లులు నితరులు కూడ నప్పుడు విలపించుచుండిరి.

వసిష్ఠ శ్శాంతివచనా న్యాహ రామం సముద్దిశన్,
మానుష్యే కదళీ స్తంభనిస్సారే సారమార్గణమ్,
కరోతి య స్స సంమూఢో జలబుద్బుదసంనిభే. 30 ½

వసిష్ఠుడు రాముని శాంతవచనములచే నిట్లోదార్చెను. ఓ రామచంద్రా! అరటి స్తంభమువలె నిస్సార మైనదియు నీటిమీద బుడగవలె వినశ్వర మైనదియునగు మనుష్యదేహమునందు సార మున్నదని యెవడు తలచునో, వాడు కేవలము మూఢుడని చెప్పనొప్పును.

పంచధా సంభృతః కాయః యో౽యం పంచత్వ మాగతః,
కర్మభి స్స్వశరీరస్థై స్తత్ర కా పరిదేవనా,
గంత్రీ వసుమతీ నాశ ముదధి ర్దైవతాని చ,
అతో న రోదితవ్యం హి క్రియాః కార్యా స్త్వయానఘ,
ఇత్యుక్త్వా౽సౌ రాఘవస్య శమయామాస తాం శుచమ్. 31-33

ఓ రామచంద్రా! ఈశరీరము పంచభూతములచే సంపాదింపబడినదై యున్నది. అట్టి పాంచభౌతిక శరీరము స్వకర్మవశమున పంచత్వమును (వినాశమును) బొందినప్పుడు విచారమేల? అనగా పంచభూతములతో నేర్పరుపబడిన శరీరము తిరిగి పంచభూతములలో గలిసిపోవుటయే పంచత్వ మనబడును. (దానికే వినాశ మనియెదరు) ఓరామచంద్రా! లోకమునందేది శాశ్వతమో యాలోచింపుము. భూమియు, సముద్రములు మొదలగునవి కూడ నశించునవియే. కాన, నీవు పితృమరణమును గూర్చి రోదనము చేయఁదగదు. ముందు జరుగవలసిన పితృకర్మము జేయుము. ఈ మొదలగు శాంతవచనములచే వసిష్ఠుడు రాముని దుఃఖోపశాంతుని చేసెను.

మైథిలోఽపి స్వీయజాయాయుతో ద్రష్టుం చ రాఘవమ్,
సమాగత శ్చిత్రకూటం ప్రావిశ ద్రాఘవాశ్రమమ్,
[1]రాఘవో మైథిలం దృష్ట్వా నత్వా చోక్త్వా పితుర్మృతిమ్,
విలప్య బహుధా తస్మైగతవృత్త మువాచ సః 34-35

ఈ సమయముననే జనకమహారాజును తన భార్యతోడను మిత్రపరివారము తోడను రామునిఁ జూచుటకు నచ్చటికి వచ్చి రామాశ్రమమునుఁ బ్రవేశించెను. రామచంద్రమూర్తియును జనకునిఁ జూచి ప్రత్యుత్థానాదులచే గౌరవించి పితృమరణ వృత్తాంతమునుఁ జెప్పి దుఃఖించి జరిగిన వృత్తాంతము నంతనుఁ జెప్పెను.

**జనకోఽపి తదా శాంతవచనై స్తచ్ఛుచం పునః,**
**శమయామాస విజ్ఞానీ లోకానుసరణేన సః. 36**

జ్ఞాని యగు జనకమహారాజును లోకానుసారముగ శాంతివచనములతో రాముని దుఃఖోపశాంతునిఁజేసెను.

**కౌసల్యాద్యా రాజపత్న్యో మైథిలభూపతేః,**
**పరామృష్టా శ్శాంతివాక్యైస్తాభి రేషాఽపి సత్కృతా. 37**

కౌసల్య మొదలగు రాజపత్నులను జనకుని భార్యయగు సుమేధాదేవి పరామర్శ చేయగా వారును పిమ్మట నామెను గౌరవ పూర్వకముగఁ జూచిరి.

**సుమేధా భూమిజాం పశ్చా దాలింగ్యాశ్వాస్య నైకధా,**
**వనవాసం ప్రతి ముహు స్స్మరంతీ దుఃఖితాఽఽహ తాం. 38**

1. భ. రా.

పిమ్మట సుమేధాదేవి సీతనుఁ గౌగిలించుకొని యోదార్చుచు నామెకుఁ గలిగిన వనవాసకష్టమును స్మరించి తన విచారమును వెలిబుచ్చుచు సీతతో నిటులఁ బలికెను.

**పతి స్తే తాతవచనా ద్వనవాసం కరిష్యతి,**
**తావ త్త్వ మాగతా తిష్ఠే ర్మద్గేహే పుత్త్రి జానకి!** 39 ½

ఓ పుత్త్రీ! నీ భర్తయగు రామచంద్రమూర్తి పితృవాక్యానుసారముగ నరణ్యమున నుండవలసివచ్చిన నుండు గాక! తిరిగి నీభర్త యయోధ్యకు వచ్చుదనుక నీవు మిథిలాపురమునకు వచ్చి నాయింటియందుండు మని మెల్లగాఁ జెప్పగాఁ దల్లితో సీత యిటుల జెప్పెను.

**ఇత్యుక్తా భూమిజా ప్రాహ సుమేధాం మాతరం ప్రతి,**
**నారీధర్మా న్విజానంతీ త్వమేవం మావదాద్య మామ్,**
**పతిర్యత్రవసే త్తత్ర భార్యా స్యా ద్భర్తృసేవినీ,**
**తస్మాన్మదాగమోఽశ్రేయాన్ జనకస్య గృహం ప్రతి.** 40-41

తల్లీ! నీవు స్త్రీధర్మముల నన్నిటిని బాగుగ నెరిగినదానవయ్యు నిటులఁ జెప్పవలదు. భర్త యెచ్చట నుండునో భార్యకూడ భర్తృసేవ చేయుచు నచ్చట నుండవలసినదని నీకుఁదెలియని విషయమా? నా భర్త వనవాసము చేయుచుఁ గష్టపడుచుండ నేను సుఖపడుచుఁ బుట్టినింట నుండుట ధర్మమా! కాన నేను తండ్రిగారి యింటికి వచ్చుట శ్రేయస్కరము కాదనెను.

**తతో మందాకినీం గత్వా స్నాత్వా రామోఽనుజా స్తథా,**
**రాజ్ఞే దదు ర్జలం తత్ర సర్వే తే జలకాంక్షిణే.** 42

పిమ్మట రామచంద్రమూర్తియు సోదరులును వసిష్ఠానుమతిచే గంగానదికి వెళ్లి స్నానము చేసి పితృతర్పణము మొదలగునవి చేసిరి.

**పిండా న్నిర్వాపయామాస రామో లక్ష్మణసంయుతః,**
**ఇంగుదీ ఫలపిణ్యాకరచితా న్మధుసంప్లుతాన్.** 43

భరతశత్రుఘ్ను లిర్వురును పూర్వమే పిండప్రదానము చేసిరి కాన రామచంద్రమూర్తి లక్ష్మణసమేతుడై యింగుదీఫలములను పిండిచేసి యిప్పపువ్వు కూడా నందులో కలిపి పిండములు చేసి పిండప్రదానము చేసెను.

**వయం యదన్నాః పితర స్తదన్నా స్స్మృతినోదితాః,**
**ఇతి దుఃఖాశ్రుపూర్ణాక్షం పునః స్నాత్వా గృహం యయౌ.** 44

రాముడిటులఁ బితృదేవతల నుద్దేశించి విచారపడెను. మేము దేనిని భుజించుచుంటియో దానినే పితృదేవతలకుఁ బెట్టవలయునని స్మృతి ప్రకార మీ కాలమున కీ యింగుదీ ఫలముల పిండితోఁ బిండప్రదానము చేయవలసివచ్చెనని విచారపడుచుఁ దిరిగి స్నానము చేసి తన పరివారముతోఁ బర్ణశాల కేగెను.

సర్వే రుదిత్వా సుచిరం స్నాత్వా జగ్ము స్తదాశ్రమమ్,
తస్మింస్తు దివసే సర్వ ఉపవాసం ప్రచక్రిరే. **45**

అందరును విశేషముగ దుఃఖించి గంగానదియందు స్నానము చేసి తిరిగి రాముని యాశ్రమమునకుఁ జేరి యందరు నాదిన ముపవాసమును జేసిరి. (రాముడు పితృకర్మ చేసి యుపవాస ముండుటచే నందరుకూడ విచారముతో నుపవాసము చేసిరి.)

తతః ప రేద్యు ర్విమలే స్నాత్వా మందాకినీజలే,
తదాశ్రమం సమాగత్య స్థితా స్సర్వే జనాః పునః,
[1]పశ్చా ద్భుక్త్వా చ విశ్రాంతా స్తత శ్చక్రు స్సభాం చ తే,
చిత్ర కూటసమీపస్థా స్సర్వే మునిజనా స్తదా,
సభాస్థలం సమాజగ్ము ర్భావికార్యదిదృక్షయా,
దేవాదయో௨ంతరిస్థాః పశ్యంతిస్మ భయాన్వితాః,
రామో భరతవాక్యేన గచ్ఛే ద్వా స్యాదిహేతి తే. **46-48½**

మఱు దినమున నందరును గంగలో స్నానము చేసి రామాశ్రమమునకు వచ్చి వంటలు చేసికొని భుజించి విశ్రమించి పిమ్మట నొకసభ నేర్పరచిరి. ఆ సభలో నేమి జరుగునో యని చూచుటకుఁ జిత్రకూటసమీపములో నుండు మహర్షులు కూడ వచ్చిరి. భరతుని మాటలచే రాముడు తిరిగి యయోధ్యకు వెళ్ళునా? లేక స్థిరమనస్సుతో నిచ్చటనే యుండునా? ఏమి జరుగునో యని భీతచిత్తులై దేవతలు నభఃస్థలమున విమానములయందుండి తిలకించుచుండిరి.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యాకాండే ద్వితీయభాగే ఏకాదశ స్సర్గః సమాప్తః
ఆశ్చర్యరామాయణమున అయోధ్యకాండమున
ద్వితీయభాగమున పదునొకండవ సర్గము సమాప్తము.

---

1 క

# ద్వాదశస్సర్గః - పంద్రెండవసర్గ

[1]తతో వసిష్ఠః ప్రాహేదం జనకం భరతేరితః,
మైథిలాశ్రిత్య ధర్మ్యం త్వం వద సర్వహితోఽధునా. 1

అనంతరము వసిష్ఠుడు భరతునిచేఁ బ్రేరింపబడి జనకునితో నివ్విధముగఁ బలికెను.

రామస్య వనవాసం వా సాకేతాగమనం తు వా,
వినిశ్చిత్య భవానేవ వదే త్సర్వహితే రతః. 2

ఓ రాజా! రాముడరణ్యములో నుండుటయా? లేక సాకేత పురమునకు తిరిగి వచ్చుటయా? అను విషయమును సర్వహితుడవగు నీనే నిశ్చయించి చెప్పుమనెను.

ఇత్యుక్తో జనక స్స్వాంతే చింతయామాస నైకధా,
మదాగమన మేవాద్య న యుక్త మితి భాతి మే, 3

ఇవ్విధముగ వసిష్ఠుడు చెప్పగా జనకుడు తనమనమునం దిటుల విచారించెను. నేనిచ్చటకు వచ్చుటయే మంచిదిగాఁ దోచుట లేదు.

వనం గచ్ఛ త్వ మిత్యుక్తే పిత్రాఽగా ద్రాఘవో వనమ్,
తన్నివృత్తౌ కృతే యత్నే న నివృత్తః పురీం యది,
మా మశక్తం జనా లోకే వదేయు ర్నాస్తి సంశయః. 4½

నీవు వనమునకు వెళ్ళుమని తండ్రియగు దశరథుడు చెప్పగా రాముడరణ్యమునకు వచ్చెను. రాముని మరలించుట కొకవేళ నేను ప్రయత్నించినను పురమునకు రానిచో లోకులందరును నన్నశక్తునిగా దలచెదరు. సందియము లేదు.

యద్యయం రాఘవోఽయోధ్యాం వచసా మే పురీం ప్రతి.
నివృత్తశ్చే త్తాతవచోఽతిక్రమప్రేరణా దఘమ్,
భవే న్మమ న సందేహః కిం కుర్యా మహ మద్య తు. 5-6

1. భర. రా.

ఈ రామచంద్రమూర్తి నామాటప్రకారము తిరిగి యయోధ్యకు వచ్చినచో నప్పుడు పితృవాక్యము నుల్లంఘింపఁ జేసిన దోషము నాకు సంభవించును. సందియముండదు. నేనేమి చేయుటకును దోచుటలేదు.

**తస్మా త్తూష్ణీం స్థితి ర్మేఽద్య యుక్తేతి ప్రతిభాతి మే,**
**ఇత్యాలోచ్య తతో రాజా భరితం వీక్ష్య చాఽహ తమ్. 7**

ఆ కారణమువలన నేనేమియు నంటించుకొనకుండగ నూరక యుండుటయే మంచిదని తోచుచున్నది. ఇవ్విధముగ జనకమహారాజు మనమునం దాలోచించి భరతుని జూచి యిటులఁ బలికెను.

**శ్రీరామో ధర్మనిరత స్సత్యవ్రతపరాయణః,**
**సోఽప్యస్మ త్స్నేహమూలేన పీడితో భవతి ధ్రువమ్. 8**

ఓ భరతా! శ్రీరాముడు. ధర్మనిరతుడును సత్యవ్రత పరాయణుడుగా నున్నాడు. అతడును మన యందలి స్నేహముచే బీడింప బడుచునే యున్నాడు.

**త్వదుక్తరీత్యా భ్రాతా తే కరిష్యతి భవా న్వదేత్,**
**ఇత్యుక్తో భరతః పశ్చా న్మైథిలం ప్రాహ సాంజలిః. 9**

నీవు చెప్పినరీతిగ నీయన్నయైన రాముడు చేయగలడు. కాన నీవే చెప్పవలయును. ఇవ్విధముగ జనకుడు చెప్పగాఁ భరతుడు చేతులు జోడించి జనకునితో నిటులఁ జెప్పదొడగెను.

**భవా న్పితృసమః పూజ్యో వసిష్ఠోఽపి చ తాదృశః,**
**యువామేవ యథాయోగ్యం వదేతం రాఘవం ప్రతి,**
**అల్పాస్య స్స్యాం కథం వక్తుం మహావాక్యా న్యహం క్షమః. 10 ½**

ఓ జనకమహారాజా! నీవు మాకుఁ దండ్రితో సమానుడవు. వసిష్ఠుడును నట్టివాడు కావున మీర లుభయులు తగినటుల రామునితోఁ జెప్పవలయును. అల్పముఖముతో నేను మహావాక్యముల నేమి చెప్పగలను? కాన, మీరలే చెప్పవలయును.

**బధిరాంధౌ గానసభాం ద్రష్టుం సహ గతౌ ముదా,**
**గానం సంశ్లాఘతే చైక స్త్వన్యో నృత్యం సమీహతే.**
**పితృవాక్యప్రకారేణ రాఘవో ఽవర్తతేతి యత్,**
**సోఽపి ధర్మ స్తద్వియోగతప్తానాం శరణార్థినామ్,**
**పాలనం చాపి రామస్య ధర్మ ఏవ భవే ద్ధ్రువం.**
**ద్వయో ర్విరోధోఽస్తి తయో ర్భంగో న స్యా ద్యథా యువాన్,**
**ద్వా వాలోచ్య వినిశ్చిత్య వదేతం రాఘవం ప్రతి. 11- 14**

చెవిటివాడును, గ్రుడ్డివాడును గానసభ జూచుటకు వెళ్ళినచో వారిలోనొకడు గానమును గొనియాడును, మఱియొకడు నృత్యమును శ్లాఘించును. పితృవాక్యప్రకారము రాముడు ప్రవర్తించుట యనునదియు ధర్మమే యగును. రాముని వియోగముచేఁ బరితప్తులమును శరణార్థులము నగు మమ్ములను రక్షించుటయును ధర్మమేకాని, యారెంటికిని నెవ్విధముగ భంగము కలుగకుండ నుండునో యాలోచించి నిశ్చయించి రామునికి మీరలే చెప్పవలయును.

**ఇతి తస్య వచోజాతం మంజులం దుర్గ్రహం తథా,**
**దర్పణం వర్తతే హస్తే ప్రతిబింబం చ దృశ్యతే,**
**తథాఽపి దుర్లభం తస్య గ్రహణం తు యథా భవేత్. 15 ½**

మనచేతిలో నద్దముండును. అందులో ప్రతిబింబము కన్పడును, అయినను నా ప్రతిబింబమును చేతిలో గ్రహించుట కెటుల వలనుపడదో యటులనే భరతుడు చెప్పినమాటలును మనోహరముగా నున్నను దుర్గ్రహముగా నున్నవి.

**తతో వసిష్ఠో భరతం ప్రాహేదం వచనం మహాన్,**
**భరతాదౌ రాఘవం త్వం వద పశ్చా ద్వయం పునః,**
**వదేమ రాఘవం సర్వే రామాగమనకాంక్షిణః,**
**ఇత్యుక్త్వాత్తై భరతం పశ్చా త్తైస్సహాగా త్సభాం గురుః 16-17 ½**

పిమ్మట మహాత్ముడగు వసిష్ఠుడు భరతునితో నివ్విధముగఁ జెప్పెను. ఓ భరతా! నీవు మొదట రామునితో నివ్విధముగఁ జెప్పుము. ముచ్చటింపుము. పిమ్మట రాముని రాకను గోరుచున్న మేమును రామునితోఁ జెప్పగలము. ఇట్లు నచ్చచెప్పి వారినందరిని వెంటబెట్టుకొని సభాస్థలమునకు వసిష్ఠు డేతెంచెను.

[1]పశ్చా ద్రాఘవ మేవ మాహ భరతో భ్రాతః! పితా త్వ య్యలమ్
కైకేయ్యా విజితశ్చకారయ దఘం విస్మృత్య త చ్చాఖిలమ్,
దాసస్యోపరి మే ప్రసాద మధునా కృత్వా ప్రజా శ్చాగతా
దృష్ట్వా తా స్త్వనుగృహ్య సత్వర మిహైవాద్యాభిషిక్తో భవ. **18½**

అనంతరము భరతుడు రామచంద్రమూర్తితో వినయపూర్వకముగ నిటులఁ జెప్పెను. అన్నా! కైకచేఁ బ్రేరితుడై మన తండ్రి నీ విషయమై చేసిన పాపకృత్యమును నీవు మరచిపొమ్ము. నీదాసుడనగు నాయం దనుగ్రహించి నీవు ఈ ప్రజలందరియందును నీ వనుగ్రహించియు నీ విచ్చటనే పట్టాభిషిక్తుడవై పురమునకు బయలుదేరుము.

మాతా మే భవతా రఘూత్తమ! విభో సంపూజితా సర్వధా,
దత్తం రాజ్య మిదం దదామి భవతే భూయోఽనుగృహ్ణీష్వ మామ్,
ధర్తుం శక్యతమో వృషేణ మహతా భారస్తు యో వై మహాన్,
వత్సస్యోపరి నిక్షిపే ద్యది భవాన్ వత్సః కథం తం వహేత్. **19½**

ఓ రామచంద్ర ప్రభూ! నా తల్లియగు కైకను నీవు సర్వవిధముల గౌరవించితివి. నా కిచ్చిన రాజ్యమును తిరిగి నీ కిచ్చివేయు చున్నాను. నన్ను నుగ్రహింపుము. గొప్పవృషభము మోయదగిన బరువును లేగదూడ మీద బెట్టినయెడల, నాబరువును లేగదూడ యెట్లు మోయగలదు?

దూరస్థే మయి తే మదీయజననీ బుద్ధ్యా త్వతిక్షుద్రయా
పాపం య త్కృతవ త్యభూ దహ మిదం నో వేద్మ్యహం రాఘవ.
అంతే మోహవశో భవే జ్జన ఇతి శ్రుత్వా నృప స్తే ధ్రువం
ద్రోహం త్వాచరతి స్మ సర్వమపి త ద్విస్మృత్య నః పాలయ. **20½**

అన్నా! నేను దూరస్థుడనై యుండగా నాతల్లి క్షుద్రబుద్ధిచే నీ యెడ నాచరించిన పాపకృత్యము విషయమై నాకేమియు తెలియదు. అంతకాలమున జనుడు మోహమును బొందునని పెద్దలు చెప్పునటులనే తండ్రియగు దశరథు

1. కవిః

డంతకాలమున మోహవశుడై నీకు ద్రోహమును జేసెను. దానిని గూడ మరచి మమ్ములనుఁ బరిపాలింపుము.

[1]రాజ్యం పాలయ పిత్ర్యం తే జ్యేష్ఠ స్త్వం మే పితా యథా,
క్షత్రియాణా మయం ధర్మో యత్ప్రజాపరిపాలనమ్. 21½

జ్యేష్ఠభ్రాత తండ్రితో సమానుడు కాన తండ్రివలె నీవును పితృపైతామహమగు రాజ్యమును పాలింపుము. ప్రజాపాలనము క్షత్రియులయొక్క ధర్మమై యున్నది.

ఇష్ట్వా యజ్ఞైర్బహువిధైః పుత్త్రా నుత్పాద్య ధర్మతః,
రాజ్యే పుత్త్రం సమారోప్య గమిష్యసి తతో వనమ్. 22 ½

ప్రజాపాలనము చేయుచు ననేక యజ్ఞములను జేసి పుత్రసంతానము పడసి పుత్త్రులు పెద్దవాళ్ళయిన పిమ్మట రాజ్యమును పుత్త్రున కప్పగించి పిమ్మట వనమునకు వెళ్ళవలసియుండును.

ఇదానీం వనవాసస్య కాలో నైవ ప్రసీద మామ్,
మాతు ర్మే దుష్కృతం కించి త్స్మర్తుం నార్హసి పాహి నః. 23½

ఇప్పుడు నీకు వనవాసమునకు కాలము కాదు. కాన నన్ననుగ్రహింపుము. నాతల్లియొక్క దుష్కృత్యమును మరచి మమ్ములను పాలింపవలయును

[2]కృత్వా పృష్ఠత ఏవ మద్వచ ఇదం తిష్ఠేర్యది త్వం వనే
వత్స్యామ్యద్య రఘూత్తమాహమపి వై సార్థం త్వయా కాననే
రాజ్యం తే వితతార తాత ఇతిచే న్నాంగీకృతం త న్మయా
భ్రాత ర్మేన భవే త్తదా ధ్రువ మిదం రాజ్యం త వై వాధిప. 24½

నేను చెప్పుమాటలను నీవు త్రోసిపుచ్చి వనమునందే యున్నయెడల నేనును నీతోఁగూడ నిచ్చటనే యుందును. తండ్రి నీకు రాజ్యమిచ్చెనని యనెదవేమో కాని నాతోఁజెప్పి నాయంగీకారము తీసికొని యిచ్చియుండలేదు. నే నంగీకరింపలేదు. అప్పుడు రాజ్యము నీది యగును, కాని నాది కానేరదు.

1.అ.రా ||2. కవిః ||

కిం చేదం శ్రుణు రాజ్య మేత దఖిలం రామ ప్రజాస్వామికమ్
కర్తుం త్వా మఖిలాః ప్రజాశ్చ మనసా వాంఛంతి వాచా నృపమ్
సర్వే మంత్రిపురోహితాః పురజనా భృత్వా భవంతం నృపమ్
వాంఛంత్యేవ తతోఽత్ర పట్టవిభవం లబ్ధ్వా పురం త్వే హ్యాంమ్. **25½**

అన్నా! ఈ సంగతి వినుము, మనరాజ్యము ప్రజాస్వామికము. (అనగా ప్రజలెవరిని రాజునుగా గోరెదరో వారు రాజుగా నుండవలయును) కాన సమస్తమైన ప్రజలును నిన్నే ప్రభువుగా మనసుచేతను, వాక్కుచేతనుఁ గోరుచుండిరి మరియు మంత్రులు, పురోహితులు, పురజనులు, భృత్యులందరును నిన్నే రాజుగాఁ గోరుచున్నందున నిచ్చటనే పట్టాభిషిక్తుడవై శీఘ్రముగఁ బురమునకు రమ్ము.

ఇత్యుక్త్వా చరణౌ భ్రాతు శ్చిర స్యాదాయ భక్తితః,
రామస్య పురత స్సాక్షా ద్దండవ త్పతితో భువి. **26 ½**

ఇవ్విధముగఁ జెప్పుచు భక్తిచే రాముని పాదముల మీద సాష్టాంగ దండ ప్రణామముగఁ బడెను.

**ఉత్థా ప్యాంకతలే నివేశ్య భరతం రామోఽవద త్ప్రేమవాన్**
**వత్సేదం శ్రుణు యత్త్వయోక్త మధునా మత్ప్రేమమూలం హి తత్,**
**రాజ్యం నౌ జనకో విభజ్య తు దదౌ తేఽదా న్మదా కౌసలమ్,**
**మహ్యం దండక మప్యదా త్పితృవచో ద్వాభ్యాం విధేయం ఖలు. 27½**

పిమ్మట రామచంద్రమూర్తి ప్రేమచే భరతుని లేవదీసి తన యొడిలో గూర్చుండ బెట్టుకొని బుజ్జగించుచు నిటులఁ జెప్పఁదొడగెను. వత్సా! నీ విప్పుడు చెప్పిన మాట లన్నియు నా యందు నీ కున్న ప్రేమచేఁ జెప్పబడినవని తలచెదను. మనతండ్రి మన యుభయులకు వేర్వేరుగా రాజ్యమును విభజించి యిచ్చెను. నీకుఁ గోసల రాజ్యమును, నాకు దండకరాజ్యమును వేర్వేరుగఁదండ్రియే విభజించి యిచ్చెను. కాన పితృవాక్యమును మన మిర్వురము కూడ పరిపాలించవలసియుండును.

యస్త్వోల్లంఘ్య పితుర్వ్వచస్తు నితరాం స్వాతంత్ర్యవా న్వర్తతే
జీవ న్నో మృతకో భవే త్సతు పరాం చాంతే వ్రజే దుర్గతిమ్,
తస్మా త్పాలయతా ద్భవా న్పితృవచోఽనుల్లంఘుయ న్కోసలం
రాజ్యం తద్వచసైవ దండకభువం పాతుం యతిష్యే త్వహమ్. 28½

సోదరా! ఎవడు పితృవాక్యము నుల్లంఘించి స్వతంత్రుడుగాఁ బ్రవర్తించునో యతడు భూమిమీద జీవించి యుండినను మృతప్రాయు డనియే చెప్పవలయును. మరియు నంతమునం దతడు దుర్గతుల పాలగును, కావున నీవు పితృవాక్యము నుల్లంఘింపక కోసలరాజ్యమును బాలింపుము. నేనుకూడా బితృవాక్యప్రకారము దండకరాజ్యమునుఁ బాలింపగలను.

తస్మాత్త్వం భరతాద్య రాజపదవీం లబ్ధ్వా నరాణాం వసేః
వర్తేయం త్విహ వానరాఢ్యపదవీం లబ్ధ్వా సుఖేనాన్వితః
శత్రుఘ్నో ఽస్తి చ తే సహాయకరణే సౌమిత్రి రత్రాస్తి మే
సర్వే రాజసుతా వయం తు పితరం కుర్వీమ సత్యస్థితమ్. 29½

ఆకారణము వలన నీవు కోసలదేశమునందలి నరులకు రాజవుగ నుండుము. నే నిచ్చటి నరులకు రాజుగా నుందును (ఇచ్చట నొక విశేషార్థము కలదు "వానరాఢ్య" అనుపదమును విడదీసినచో "వా, నరాఢ్య" అని యేర్పడును అడవిలోని మనుష్యులకు నేను రాజుగా నుందునని యర్థము వచ్చును. "వానరాఢ్య" అను పదమును నేకముగాఁ జెప్పినప్పుడు నేను వానరములకు రాజుగా నుందునని యర్థము స్ఫురించుచున్నది. దీనివలన సుగ్రీవాది వానరులకుఁ దా నధ్యక్షుడుగా నుండునని ధ్వనిత మగుచున్నది) నీకచ్చట శత్రుఘ్నుడు సహాయుడుగా నుండును. నా కిచ్చట లక్ష్మణుడు సహాయుడుగా నుండును. దశరథ పుత్రులమగు మన మందరము తండ్రిని సత్యవంతునిగాఁ జేయవలయును.

సంతాపం తు విసృజ్య సోదరపురీం గత్వా భువం పాలయ
పిత్రాజ్ఞాం పరిపాల్య పత్తన మహం పశ్చా త్సమేష్యా మ్యహమ్,
నైకే రాజసుతా స్స్వతాతవచనానుల్లంఘనాద్వై పురా
కీర్త్యా క్రాంత దిగంతరా స్సమభవన్ తత్త్వం శుచం మాగమః. 30½

సోదరా! సంతాపమును విడిచి పట్టణమున కేగి భూమినిఁబాలింపుము. పిత్రాజ్ఞను బరిపాలించి పిమ్మట నేనుగూడఁ బురమునకు రాగలను. పూర్వముగూడ రాజపుత్త్రు లనేకులు పితృవాక్యము నుల్లంఘించకుండగ పరిపాలించి దిగంతవిశ్రాంతమగు కీర్తిని సంపాదించిరి. ఆ కారణమువలన విచారమును బొందకుము.

**కిం చేదం శ్రుణు నః పితా పరిణయే త్వన్మాతు రన్యాదృశమ్**
**రాజ్యం శుల్క మదాచ్చ కేకయనృపం మాతామహం తే పురా,**
**తస్మా ద్రాజ్య మిదం తవైవ భరత! న్యాయేన తత్తే పితా**
**ప్రాదాద్రాజ్య మిదం పురోదితవచో భంగా త్సుభీత్యా ధ్రువమ్. 31½**

ఇంకొక విషయమును కూడ నాలకింపుము, మనతండ్రి నీ తల్లియగు కైకను వివాహమాడు సమయమున నీ మాతామహుడైన కేకయరాజుతో రాజ్యశుల్కమును ప్రతిజ్ఞచేసి వివాహమాడెను. (అనగా గైకకుఁ బుట్టిన సంతానమునకు రాజ్యము నిచ్చెదనని ప్రతిన చేసి వివాహము చేసికొనెను.) ఆ కారణమువలన రాజ్యము నీది కాని నాది కాదు. కావుననే తండ్రికూడఁ బూర్వము తాను చెప్పిన వచనములకు భంగము కలుగుననెడి భయముచే రాజ్యమును నీకిచ్చెను.

**కిం చేదం శృణు దేవదానవమహాసంగ్రామభూమౌ పితా**
**సాహాయ్యాయ మరుత్వతస్తు గతవాన్ తత్రాసుర శ్శంబరః,**
**పిత్రా సంగర మాచర న్నిజరిపుప్రధ్వంసినీ మాసురీం**
**మాయాం తు ప్రయుయోజ తత్ర జననీ తే రక్షతి స్మాధిపమ్. 32½**

ఇదియునుగాక మఱియొక విషయమునుగూడఁ జెప్పెదను వినుము, పూర్వమొకప్పుడు దేవతలకును రాక్షసులకును యుద్ధము సంభవింపగా మనతండ్రి కైకతో గూడ దేవేంద్రునకు సహాయముగా నాయుద్ధ భూమికి వెళ్ళగా శంబరాసురుడు మనతండ్రితో యుద్ధము చేయుచు శత్రుసంహారక మగు తన శాంబరీ మాయను దశరథుని మీదకుఁబ్రయోగింపగా సమీపములో నున్న నీ తల్లియగు కైక (తనబాల్యమున ధవళాస్యమహర్షి యనుగ్రహముచే రాక్షసమాయలకుఁ బ్రతిక్రియలనుఁ దెలిసికొనియుండినది కావున) వెంటనే ప్రతి మాయను ప్రయోగించి శాంబరీ మాయను నశింపఁజేసి శంబరాసురుని బారినుండి దశరథునిఁ గాపాడినది.

తస్మాజ్జనన్యై తవ సంప్రహృష్టో
వరద్వయం తు ప్రదదౌ పితా నః,
న్యాసీకృతం రాజ్ఞి వరద్వయం త
త్సంప్రార్థితోఽద్య ప్రదదౌ నృపోఽస్యై. 33 ½

ఆ కారణమువలన మన తండ్రియగు దశరథుడు నీ తల్లికి సంతోషము కొలది రెండు వరముల నప్పుడిచ్చెను. ఆ వరములను సమయము వచ్చినప్పుడు తీసికొనియెదనని దశరథునియొద్దనే న్యాసముగా నుంచెను. ఆ వరముల నిప్పుడు నీతల్లి కోరగా మనతండ్రి యిచ్చెను.

సర్వథాఽనుజ రాజ్యం తు తావకం మామకం న హి,
కైకేయ్యాం దోషలేశోఽస్తి మా దూషయతు తాం భవాన్. 34½

తమ్ముడా! సర్వవిధముల రాజ్యము నీదియే కాని నాది కాదు. నీ తల్లియగు కైకేయియందును దోషము లేశమును కన్పడదు. నీవామెను దూషింపకుము.

[1] ఋణా న్మోచయ రాజానం మత్కృతే భరత ప్రభుమ్,
శ్రూయతే హి పురా తాత శ్రుతి గ్గీతా యశస్వినా. 35½

ఓ భరతా! నానిమిత్తముగ మనతండ్రిని ఋణవిముక్తునిగ జేయుము. నాయనా! పూర్వగాథ యొకటి యున్నది.

గయేన యజమానేన గయేష్వేవ పితౄ న్ప్రతి.
పున్నామ్నో నరకా ద్యస్మా త్పితరం త్రాయతే సుతః. 36½

యజమానుడగు గయుడు, గయలో తండ్రికి పిండప్రదానము చేసి తండ్రిని పున్నామనరకమునుండి రక్షింపవలయునని చెప్పెను.

* ఏష్టవ్యా బహవః పుత్రాః గుణవంతో బహుశ్రుతాః,
తేషాం వై సుమవేతానా మపి కశ్చి ద్గయాం వ్రజేత్,
తస్మాత్త్రాహి నరశ్రేష్ఠ పితరం నరకా ద్ధ్రువమ్. 37-38

** అనేన గయాయాం శ్రాద్ధకరణ మతిప్రశస్త మితి సూచితం. తథా చ విష్ణుపురాణే:- గయా ముపేత్య యశ్శ్రాద్ధం కోరోతి పృథివీపతే, సఫలం తస్య. త జ్జన్మ జాయతే పితృతుష్టిదంఇతి.

బహ్మకైవర్తేఽపి- గయాశీర్షే యదా పిండం నామ్నా యేషాం ప్రకుర్వతే, నరకస్థా దివం యాంతి స్వర్గస్థా మోక్ష మాప్నుయుః, ఇతి. గయామాహాత్మ్యేఽపి, యన్నామ్నా పాతయే త్పిండం తం నయే ద్బ్రహ్మ శాశ్వతం, ఇతి.

1. వా.

* గుణవంతులును, పండితులునగు పుత్త్రు లెందరున్నను వారలలో నెవ్వడు గయకు వెళ్లి పిండప్రదానము చేయునో, వాడే పుత్త్రుడని చెప్పబడియున్నది. కానఁ బితృఋణ విముక్తినిఁ చేసినవాడే పుత్త్రుడగును. కాన తండ్రిని నరకమునుండి కాపాడుము.

తచ్ఛ్రుత్వా భరతోఽబ్రవీ ద్రఘువరం కామీ పితా స్త్రీజితో
భ్రాంతో మూఢమతి స్తవాపకృతికృ ద్వాక్యం పురోకవాచయత్,
న గ్రాహ్యం జన కేరితం వచ ఇదం సత్యం త్వయా రాఘవ!
భ్రాంతస్యేవ వచో విసర్జితు మలం యోగ్యం వచ స్తస్య చ. 39

రాము డిట్లు పలుకగా విని భరతు డిటులఁ బలికెను. ఏతండ్రి కాముకుడును, స్త్రీవశుడును, భ్రాంతుడును, మూఢబుద్ధి కలవాడునై నీ కప కారకరమగు నేవాక్యమును బలికెనో యా తండ్రివాక్యమును సత్యముగా గ్రహింపఁదగదు భ్రాంతుని మాటలను నేవిధముగ విసర్జించెదమో యటులనే దశరథుని వచనమునుగూడ విసర్జింపవలయును.

[1]త ఛ్ఛ్రుత్వా భరతం ప్రాహ రాఘవో ధర్మతత్పరః,
న స్త్రీజితః పితో వాచ న కామీ నైవ మూఢధీః,
పూర్వం ప్రతిశ్రుతం తస్మై సత్యవాదీ దదౌ భయాత్,
అసత్యా ద్భీతి రధికా మహతాం నరకాదపి. 40- 41

ఆ భరతుని మాటలను విని ధర్మాసక్తు డగు రాముడు భరతునితో నిట్లు పలికెను. సోదరా! మనతండ్రి స్త్రీజితుడుకాని, కాముకుడు కాని, మూఢుడుకాని కాడు. సత్యవాది కావుననే నరక భయముచే పూర్వము తాను చేసిన ప్రతినను నెరవేర్చుకొనుటకై తాను పూర్వము ప్రతిజ్ఞ చేసినటుల నిచ్చెను. మహాత్ములకు నరకముకంటెను నసత్యము వలన భయ మెక్కువ కాదా!

---

* ఇట్లు చెప్పుటచే గయయందు శ్రాద్ధము చేయుట యతిప్రశస్తమని సూచింపఁబడినది. విష్ణుపురాణమునందునను నవ్విధముగనే చెప్పబడినది. గయకు వెళ్లి యెవ్వడు పితృదేవతలు సంతోషించునట్లు శ్రాద్ధము చేయునో వానిజన్మమే సఫల మైనదని. మరియు, బ్రహ్మకైవర్తపురాణమునఁగూడ నివ్విధముగనే చెప్పఁబడినది. ఎవరెవరి పేర్లతో గయలోఁ బిండప్రదానము చేయుదురో వారలు పూర్వము నరకము నొందినచో స్వర్గస్థు లగుదురనియు, స్వర్గస్థులుగానే యుండినచో మోక్షమును బొందెదరనియుఁ జెప్పబడినది, గయామాహాత్మ్యము నందు నివ్విధముగఁ జెప్పఁబడినది ఎవనిపేరుతో గయలో పిండ ప్రదానము చేయుదురో వానికి బ్రహ్మ సాయుజ్యము కలుగునని

---

1. అ.రా.

[1] కిం చానుజ పితు ర్వాక్యం కరోమీతి పురా మయా,
ప్రతిశ్రుతం సమక్షే తు పితు రన్యజనస్య చ,
కథంను త దహం కుర్యా మసత్యం రాఘవోఽపి సన్. 42½

సోదరా! మరియొక విషయము చెప్పెదను వినుము. పితృవాక్య పరిపాలనము చేయుదునని తండ్రిసమక్షమున, నితరుల సమక్షమునను నేను ప్రతిజ్ఞ చేసి నేను రాఘవుడనై యుండియు (అనగా రఘువంశములో బుట్టియు) నిదివరలో నేజేసిన ప్రతిజ్ఞను నెటుల నసత్యము చేసెదను?

*త్యక్తుం వత్స! మయా న శక్య మవనీపాలస్య త చ్ఛాసనమ్
సమ్మాన్యం భవతాఽపి శాసన మలం తాతస్య రాజ్ఞోఽనుజ,
కిం చేదం శ్రుణు వత్స కామచరణే శక్తః పుమా న్న క్షితౌ
ఆవాభ్యాం పితృశాసనం తు విధినానుష్ఠేయ మేవ ధ్రువమ్. 43½

* తమ్ముడా! నా నిశ్చయమును జెప్పెదను వినుము. పితృశాసనము నుల్లంఘించుటకు మాత్రము నే నిష్టపడను. నీవుకూడఁ బితృశాసనమును గౌరవింపవలసినదే. ఇదియునుగాక పురుషుడు తన యిష్టము వచ్చిన విధముగఁ బ్రవర్తించుటకు నశక్తుడు నస్వతంత్రుడు నై యుండును. కాన మనమిర్వురము పితృశాసనమును విధిగ నెరవేర్ప వలసినదే.

త చ్ఛ్రుత్వా భరతః ప్రాహ రాఘవం భ్రాతృభక్తిమాన్. 44

రామచంద్రమూర్తి యివ్విధముగఁ జెప్పగా భ్రాతృభక్తి భరతుడు రామచంద్రునితో తిరిగి యివ్విధముగఁ బలికెను.

జాత్యశ్వస్య గతిం ఖరోఽధమ ఇవ శ్రీవైనతేయస్య కౌ
ప్రాజ్యాం సద్గతి మల్పపత్రివ దలం పూజ్యస్య హంసస్య వై
సంశ్లాఘ్యాం గతి మల్ప వాయస ఇవ ప్రాజ్యేడ్య రాజ్యావన
ప్రావీణ్యాన్వితస త్త్వదుత్తమగతిం వోఢుం న శక్తోఽస్మ్యహమ్. 45

*అనేన పురుష స్స్వేచ్ఛయా న కర్మ కరోతీతి, కింతు దైవాధీన ఏవేత్యుక్తం- తథా చోద్యోగపర్వణి కేనాపి దైవేన హృది స్థితేన యథా నియుక్తోఽస్మి తథా కరోమి.

*ఇటు చెప్పుటచే పురుషుడు స్వేచ్ఛగ నే పనిని చేయ నశక్తుడనియు, దైవాధీ నుడనియు సూచింఁబడెను. ఉద్యోగ పర్వములో కూడనటులనే చెప్పబడినది. హృదయాంతర్యామి యగు దైవమెటుల ప్రేరేపింప నటుల చేయుదునని.

1. కవిః

జాతి గుఱ్ఱముయొక్క పోకడను గాడిద యనుసరించ లేనటులను, గరుత్మంతుని గమనమును నల్పవిహగము(పక్షి) అనుసరింప లేనట్లును, పూజ్యమగు హంసయొక్క గమనమును కాకి యనుసరింపలేనటులను పూజనీయులచేఁ గొనియాడబడు రాజ్యమును బరిపాలించుటయందుఁ బ్రవీణత గల నీయొక్క పోకడను నే ననుసరింప నశక్తుడను.

యత్నావర్ధితపుష్పిత స్తరురివ ప్రాజ్ఞేన రాజ్ఞా భవాన్
యత్నేనైవ సువర్ధితస్తు సుఫలం చాదర్శయ న్రాఘవ!
స్వేష్టాన్ తాపయితుం సుమర్హతి జనా నత్రాభిషిక్త స్త్వత
స్సైన్యైస్సాక మరం పురీం కిల భవా నాగచ్ఛతాద్వై నిజామ్. 46

ఇదియునుంగాక, కష్టపడి పెంచి పెద్దచేయబడిన వృక్షము పుష్పించియు ఫలింపక పోయినచో చెట్టునాటినవాని కెంత కష్టముగ నుండునో యటులనే మన తండ్రియగు దశరథునిచేఁ బ్రయత్నపూర్వకముగఁ బెంచి పెద్దచేయబడిన నీవను వృక్షముకూడ, రాజ్యపాలనమను ఫలమును ఫలింపకపోయినచో నిష్టజనులకుఁ బరితాపమును గలుగఁ జేసినవాడ వగుదువు. కాన నిచ్చటనే యభిషిక్తుడవై సైన్య సమేతముగ నిజపురమునకు బయలుదేరుము.

పాపిష్ఠయా చ కైకేయ్యా వంచితో నః పితా పురా,
స్వయశోహరకార్యం తు కృతవా న్విస్మరాద్య తత్, 47

పాపిష్ఠురాలగు కైకచే వంచితుడై మనతండ్రి తన కపయశస్సును గలుగజేయు పనినిఁ జేసినదానిని మాత్రము మరచిపొమ్ము సుమా!

అనార్యేయం కర్మఫల మనుభూతవతీ ద్రుతమ్,
పితృపైతామహం రాజ్యం పాతు మర్హసి రాఘవ. 48

దుర్మార్గురాలగు కైక తాను చేసిన దుష్కర్మయొక్క ఫలమును వెంటనే యనుభవించినది. అన్నా! పితృ పైతామహమగు రాజ్యమును నీవు పాలింప నర్హుడవు కాని నే నర్హుడను కాను.

దీనే మయి ప్రసాదం త్వం కురు సోదరవత్సల!,
కాంక్షంతీనాం ప్రభుం త్వాంతు ప్రకృతీనాం మనోరథాన్,
అనాథానాంచ మాతౄణాం కామా న్పూరయితుం తథా,
దాసభూతం చ మాం రామ దయయా రక్షితుం తథా,
స్వాత్మాభిషేచనేనాద్య ప్రసాదం కర్తుమహన్సి. 49-50½

సోదరవత్సలా! దీనుడనుగ నయం దనుగ్రహము నుంచుము. నిన్ను ప్రభువునుగా గోరుచున్న ప్రజల మనోరథములను, దిక్కులేని తల్లుల కోరికలను బూర్తిజేయుము. దాసుడనగు నన్ను దయతోఁ బాలింపుము. నీ వభిషిక్తుడవై యనుగ్రహమును మాయందుఁ జూపుము.

రాజ్యం న యాచిత మిదం తు మయా కదాచి ద్రాజ్యం
మదర్థ ముపకల్పయ కైకయీతి,
నోక్తం మయా స్వజననీం ప్రతి రాఘవ త్వమ్,
రాజ్యార్హ ఇత్యహ మవైమి పరంతు సత్యమ్. 51½

అన్నా! నాకు రాజ్యకాంక్ష యెన్నడును లేదు. కైకమ్మా! నాకెటులైన నీవు రాజ్యమును సంపాదించిపెట్టు మని నా తల్లి కంతకంటె నేను చెప్పియుండలేదు. రామచంద్రా! రాజ్యార్హుడవు నీవని నాకు సత్యముగఁ దెలియును.

పిత్రాజ్ఞయా ప్రభవతా భవతా త్వవశ్యం
వస్తవ్య మేవ యది రాఘవ కాననే స్మిన్,
శిష్యోఽ హమేవ విపినే నివసామి తేఽద్య
రాజ్యం తు పాలయ పురీం ప్రతి నిర్గత స్త్వమ్. 52½

అన్నా! తండ్రియాజ్ఞచే విధిగ నీవు వనవాసము చేయదలచిన యెడల నీకు ప్రతినిధిగ (బదులుగ) నీ శిష్యుడనగు నేను వనమునందు నివసించెదను. నీవు పురమున కేగి రాజ్యమును బాలింపుము.

కార్యం స్వయం తు గురుణా యది కర్మ శిష్య
హస్తేన కారితమిదం స్వకృతం భవేద్ధి,
శిష్యేణ తే కృత మిదం విపినే
సితత్వం సత్యం కృతంను భవతా భవితాఽవనీంద్ర. 53½

గురువు స్వయముగఁ దానాచరింపవలసి యున్న కార్యమును దన శిష్యునిచేఁ చేయించినచో తాను చెసినట్లే యగునని కదా పెద్దలు చెప్పెదరు. కావున నీవాచరింపవలసిన వనవాసమును నీశిష్యుడనగు నే నాచరించినచో సత్యముగ నీ వాచరించినట్లే యగును.

అథవాఽహం త్వయా సార్ధ మాగమిష్యామి దండకాన్,
సౌమిత్రిరివ తే సేవాం కుర్వ న్వత్స్యా మ్యహం వనే. 54½

పైన నేను చెప్పిన విధమును నీ వంగీకరింపనిచో నీతో నేనుగూడ దండక వనమునకు వచ్చెదను. లక్ష్మణునివలె నేనుకూడ నీసేవ చేయుచు ని వ్వనమునందే యుండెదను. దీనినైన నంగీకరింపుము.

మదుక్తం వచనం రామ! న త్వయా స్వీకృతం యది,
ప్రాయోపవేశం కృత్వాఽహం త్యజేయం వా తనుం ధ్రువమ్,
ఇతి నిశ్చిత్య మనసా దర్భా నాస్తీర్య సత్వరమ్,
తత్రోపవిష్టో భరత స్సర్వేషాం పశ్యతాం సతామ్. **55-56.**

పైన చెప్పిన విధమును గూడ నీ వంగీకరింపనిచో నే నిప్పుడే ప్రాయోపవేశము చేసి కళేబరమును విడిచిపెట్టెదనని చెప్పి మనసార నిశ్చయించి యెండలో దర్భలను పరచి యందరు చూచుచుండగ నా దర్భలయందుఁ జతికిలబడి కూర్చుండెను.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యకాండే ద్వితీయభాగే ద్వాదశస్సర్గః సమాప్తః
ఆశ్చర్య రామాయణమున అయోధ్యాకాండమున
ద్వితీయభాగమున పండ్రెండవ సర్గము సమాప్తము.

## త్రయోదశస్సర్గః - పదుమూడవసర్గ

[1]పశ్చా ద్వైదికసార్వభౌమపదవీసంస్థో మహాన్వై గురు
ర్జాబాలిః పితృవాక్యపాలనకృతే సందీక్షితం రాఘవమ్,
సన్మార్గేణ తు తన్నివర్తన లఘూపాయం త్వపశ్యం స్తత
శ్చార్వాకస్య మతేన చాహ వచనం ధర్మాదపేతం త్వసత్. 1

అనంతరము గురువును పెద్దవాడునగు జాబాలి వైదికసార్వభౌముడైనను బితృవాక్యపాలనదీక్షితుడగు రామచంద్రుని సన్మార్గముచే సాకేతపురమునకు మరలించుటకు దగిన సులభోపాయము కన్పడనందున చార్వాకమతానుసారముగ ధర్మవిరుద్ధమగు నసన్మార్గముచే మరల్చుటకు నిటులఁ బలికెను.

పిత్ర్యం రాజ్య మపాస్య రాఘవ! వనే వాసో న యుక్తో భవేత్
రాజ్ఞస్త్వం న హి కశ్చిదేవ భవతో రాజాఽపి కశ్చి న్నహి,
కో వా కస్య చ బంధు రాప్య మవనౌ కిం కేనచి త్కస్య హి
ప్రత్యక్షా త్పరమేవ నాస్తి నితరా మాలోచితే రాఘవ! 2

ఓ రామచంద్రా! నీవు పిత్ర్యమైన రాజ్యమును విడిచి వనమునందుండుట మాత్రము యుక్తముగాఁ గన్పడుటలేదు. విచారించినచో రాజునకు (దశరథునకు) నీ వెవడవు కావు. నీకు రాజు నెవడు కాడు. ఒకనికి నింకొకడు బంధు వనుకొనుట వెఱ్ఱితనము. ఒకని వలన నింకొకనికిఁ బొందదగిన దేమున్నది? ఓ రామచంద్రా! బాగుగ నాలోచించినఁ బ్రత్యక్షముగ గన్పడుదానికంటె నితర మేమియు లేదనియే చెప్పవలెను.

[2]యథా గ్రామాంతరం గచ్ఛన్నరః కశ్చి త్క్వచి ద్వసేత్,
ఉత్సృజ్య చ త మావాసం ప్రతిష్ఠే తాపరేఽహని.
ఏవమేవ మనుష్యాణాం పితా మాతా గృహం వసు,
విసృజ్య కాపథం దుఃఖం రాజ్యం పాలయ రాఘవ. 3-4

1. కవిః 2. వా. రా

ఒక మనుష్యుడు గ్రామాంతరమునకు వెళ్ళళి ఒక్కదినమున వేరొక్కచోటున కొంచెము విశ్రమించి యా స్థానమును విడిచి మరుదినమునందున నివాసమును జేరునటులనే తల్లియు, తండ్రియు, నిండ్లు, ధనమును గ్రహించవలయును. కాన, ఈ కుత్సితమైన దుఃఖమును విడిచి రాజ్యమును బాలింపుము.

1*శాస్త్రం యాగవిధాయకం జనపతే నిస్సంగతా బోధకమ్
శాస్త్రం దానతపస్సురార్చన విధిప్రఖ్యాపకం రాఘవ!
క్షుత్క్షామాన్వితభిక్ష్వకించనమహీదేవైః పురా కల్పితం
శాస్త్రం సర్వ మభూ న్నిజోదరభరై స్సత్యం న త త్స్వీకురు. 5

* అత్ర యాగవిధాయకశాస్త్ర మిత్యనేన బ్రహ్మ చర్యాశ్రమోపలక్షణం, దానశాస్త్ర మిత్యనేన గృహస్థాశ్రమ ఉపలక్షితః, దానస్య గృహస్థేన ప్రధానతయానుష్ఠేయత్వాత్, తపోవిధాయకశాస్త్ర మిత్యనేన వానప్రస్థాశ్రమ ఉపలక్షితః, వానప్రస్థైః ప్రాధాన్యేన తపసోఽ నుష్ఠేయత్వాత్, నిస్సంగతా బోధకం శాస్త్ర మిత్యనేన తురీయాశ్రమ ఉపలక్షితః, నిస్సంగత్వస్యైవ ప్రాధాన్యేన తురీయాశ్రమిభిః కర్తవ్యత్వాత్ ఏవం బ్రహ్మ చర్యాద్యాశ్రమ సాధారణశాస్త్రజాత స్యాప్రామాణ్య ప్రతిపాదనేన చతుర్ణా మాశ్రమాణాం తద్ధర్మాణాం చ విధాయకం శాస్త్రజాత మప్రామాణిక మిత్యుక్తం భవతి.

చార్వాకమత మవలంబ్య జాబాలినా ప్రతిపాదిత మేత దితి విజ్ఞేయం.

తన్మతే ప్రత్యక్షాదృష్టం వస్తు నాస్త్యేవేతి తథైవ తచ్ఛాస్త్రే ప్రతిపాదితం.

పృథి వ్యాప స్తథా తేజో వాయురిత్యేవ నాపరః, ప్రత్యక్షగమ్యతై వాస్తి నాస్త్యదృష్ట మదృష్టతః. అదృష్టవాదిభిశ్చాపి నాదృష్టం దృష్ట ముచ్యతే, క్వాపి దృష్ట మదృష్టంచే దదృష్టం బ్రువతే కథమితి.

నను విచిత్రసుఖదుఃఖాన్యథానుపపత్త్యా ధర్మాధర్మావదృష్ట రూపౌ స్వీకర్తవ్యా వితిచేన్న, కోకిలకలరవమయూరపింఛ వైచిత్ర్యఫలాదివ త్స్వభావాదేవోపపన్నస్య సుఖదుఃఖాదివైచిత్ర్యస్య ధర్మాధర్మ ఫలకత్వాభావాత్, తదుక్తం- న కల్ప్యౌ సుఖదుఃఖాభ్యాం ధర్మాధర్మౌ పరై రిహ, స్వభావేన సుఖీ దుఃఖీ జనోఽన్య న్నైవకారణం. శిఖిన శ్చిత్రయేత్కో వా కోకిలా న్కః ప్రకూజయేత్, స్వభావవ్యతిరేకేణ విద్యతే నాన్య కారణం - ఇతి.

తన్మతే ఆత్మా తు పృథివ్యాదిభూత చతుష్టయసంఘాతరూప ఏవేతి న తద్విలక్షణ ఇతి స్థూలత్వాదినా సామానాధికరణ్యేన దేహ ఏవాత్మత్వానుభవాత్. న చ జడత్వా త్కథం చైతన్యం సంపద్యేత ఇతి వాచ్యం, ప్రత్యేకం రాగాసమర్థానాం చూర్ణపర్ణక్రముకాదీనాం యోగే రాగవిశేషవత్ మార్తాండమండల మయూఖసంతప్త భస్త్రాస్థిత మద్యస్య స్వయమేవోత్పతన నిపతనవత్ ప్రత్యేకం భూతానాం జడత్వేఽపి తత్సంఘాతరూపస్య దేహస్య చైతన్యసంభవాత్.

1 అ ||రా||

ఓ రామచంద్రా! యాగాదికర్మలను బోధించు శాస్త్రమున్ను, నిస్సంగత్వమును(సన్న్యాసమును) బోధించు శాస్త్రమున్ను, తపస్సును దానమును దేవతార్చనమును జేయుమని బోధించు శాస్త్రమున్ను, క్షత్తుచేఁ(ఆకలిచే) గృశించిన *సంన్యాసులచేతను, దరిద్రులగు బ్రాహ్మణులచేతను, స్వోదరపోషణార్థమై కల్పింపబడినవి గాన విశ్వసింపకుము.

---

కించ, దేహాతిరిక్తాత్మసద్భావేన ప్రత్యక్షం ప్రమాణం, చక్షురాదినా ఘటాదివ ద్దేహాతిరిక్త స్యాత్మనో ఽనుపలంభాత్; న చ పారలౌకికస్వర్గనరకాన్యథానుపపత్త్యా శరీరాతిరిక్తాత్మసిద్ధి రితి వాచ్యం. స్రక్చందనవనితాజనిత సుఖకంటక వేధాజనితదుఃఖ వ్యతిరేకేణ పరలోక భోగ్య స్వర్గ నరకయో రేవాభావాత్. స్వర్గనరకావపి దృష్టోపాయైరేవ సంభవతః, తపశ్చరణం మూఢపరికల్పితమితి. సువర్ణదానాన్నదానాదికం దరిద్రభిక్షుకాది కల్పితమితి, ప్రపాసత్రారామాదికం పాన్థపరికల్పితమితి. అతః పరలోకభ్రాంత్యా కాయక్లేశాదికం పరిత్యజ్య శరీరమేవ పోషణీయమితి. న చ దృష్టోపాయై ర్లబ్ధస్య భోగస్య దుఃఖసంభిన్నత్వాన్న తస్య పురుషార్థత్వమితి వాచ్యం, దుఃఖ మనాదృత్య సుఖమాత్రోపభోగసంభవాత్.

**అత ఏవోక్తం--**

త్యాజ్యం సుఖం విషయసంగమజన్మ పుంసాం దుఃఖోపసృష్టమితి మూర్ఖవిచారణైషా, వ్రీహీన్ జిహాసతి సితోత్తమ తండులాఢ్యాన్ కో నామ భోస్తుషకణోపహితాన్ హితార్థీ ఇతి తస్మాద్దృష్టమేవ పుంస్కార్యం నాదృష్టమస్తీతి చార్వాక మతం. తదనుసారేణ జాబాలినా ప్రతిపాదితం.

*ఇచ్చట యాగాదులను విధించు శాస్త్రమనుటచే బ్రహ్మచర్యాశ్రమము ఉపలక్షణముచేఁ జెప్పబడినది. దానమును విధించు శాస్త్రమనుటచే గృహస్థునకే దానము ప్రధానముగా జెప్పబడినది. కాన గృహస్థాశ్రమము ఉపలక్షితము.

తపోవిధాయక శాస్త్ర మనుటచే తపస్సు వానప్రస్థులకే ప్రధానముగ ననుష్ఠేయముగ జెప్పబడినది. కాన వానప్రస్థాశ్రమము ఉపలక్షితము. నిస్సంగతాబోధకమగు శాస్త్ర మనుటచే సంగరాహిత్యము సంన్యాసులకే ప్రధానముగాన తురీయాశ్రమము ఉపలక్షితము. బ్రహ్మచర్యాశ్రమాద్యాశ్రమ సాధారణశాస్త్ర సముదాయము అప్రమాణమని చెప్పుటచే నాలుగు ఆశ్రమములును నప్రమాణమని చార్వాకమతావలంబియగు జాబాలిచే జెప్పబడినట్లయినది. అవ్విధముగనే చార్వాక (బౌద్ధ) శాస్త్రమందుగూడఁ జెప్పబడినది. (ఏమనగా)

పృథివ్యాపస్తేజోవాయువులు నాలుగును ప్రమాణము ప్రత్యక్షమే ప్రమాణము. ప్రత్యక్షముగా గన్పడనిది ప్రమాణము కాదు. అదృష్ట పదార్థము సంగీకరించువారలును దృష్టముకాని పదార్థమును నదృష్టమని చెప్పరుగదా! ఎచ్చటనైన దృష్టమైన దానిని నదృష్టమని చెప్పుట యెట్లు సంభవ మగును? అని. ఇందుపై వారిమతముమీద నొకపూర్వపక్షము చేయవచ్చును. (ఏమన) ఒక మనుష్యుడు సుఖవంతుడుగాను నింకొక మనుష్యుడు దుఃఖవంతుడుగాను లోకములోఁ గన్పడుచున్నందున సుఖదుఃఖాన్యథానుపపత్తిచే అదృష్టములగు ధర్మాధర్మముల నంగీకరింపవలసియున్నదే యను నాశంకకు చార్వాకులు చెప్పు సమాధాన మేమనగా కోకిలలును

పావురములను నెమళ్ళపింఛములు మొదలగు వానియొక్క వైచిత్ర్యములు స్వభావముచేతను సిద్ధించినవని చెప్పనొప్పును కాన సుఖదుఃఖాది వైచిత్ర్యమునకుఁ గారణములను ధర్మాధర్మములనుగఁ గల్పించుట యనవసరము అవ్విధముననే బౌద్ధశాస్త్రమునందు జెప్పబడినది సుఖదుఃఖములకొరకై ధర్మాదర్మములనుఁ గల్పించుట యనవసరము స్వభావముచేతనే మనుష్యులకు సుఖ దుఃఖములు కలుగును ఇతర కారణము లేదు నెమళ్ళ నెవడు చిత్ర విచిత్రములుగా చేయుచుండెను? స్వభావమునకు వ్యతిరేకముగా దీనికిఁ గారణము కన్పడదు అని

స్థూలత్వము మొదలగువానియొక్క సామానాదికరణ్యమువలన ఆ చార్వాకమతమునందు పృదివీజలాగ్ని వాయురూపమయిన భూతచతుష్టయ రూపమగు దేహముకంటె వేఱుగ నాత్మపదార్థము లేదు దేహమే యాత్మయను ననుభవమువలన దేహముకంటె వేఱుగ నాత్మ లేదు దేహమే యాత్మ యనినచో నది జడమయినది కాన చైతన్య మెట్లు సంభవించునని యాశంక కలుగును దానికి చార్వాకులు చెప్పు సమాదాన మేమనగా నాలుకకు రాగమును (ఎఱ్ఱదనమును) కలుగఁ జేయుటకు తమలపాకు, వక్క, సున్నము ప్రత్యేకముగ సమర్థములు కాకపోయినను నివియన్నియు కలిసి నాలుకను నెఱ్ఱనిదానినిగాఁ జేసినటులనే,మరియు సూర్యకిరణములచేఁ దపింపబడిన తోలుసంచిలోని మద్యము స్వయముగ పైకిపొంగుచు తగ్గుచు నున్నటుల ప్రత్యేకముగ పృదివ్యాదిభూతచతుష్టయము జడమైనను తత్సముదాయ రూపమగు దేహమునందు చైతన్యము సంభవించునని (చెప్పుదురు) దేహముకంటె వేఱుగ నాత్మ యున్నదనుటలో దేహాతిరిక్తమగు నాత్మ నేత్రములకు గన్పడనందునఁ బ్రత్యక్షప్రమాణ మేమియు లేదనియు, పారలౌకిక స్వర్గ నరకాన్యదానుపపత్తిచే శరీరము కంటె వేఱుగ నాత్మ సిద్ధించునని చెప్పుటకును, స్త్రీసౌఖ్యాదులకంటె పారలౌకిక సౌఖ్యముకాని, ముండ్లు మొదలగునవి గ్రుచ్చుకొనుటవలన గలిగిన బాద మొదలగువానికంటెఁబారలౌకిక దుఃఖమనునదికాని వేఱగ లేదనియు, నట్టి స్వర్గనరకములు దృష్టోపాయములచేతనే యిచ్చటనే సంభవించుననియు, తపశ్చర్యాదులు కల్పితములనియు, సువర్ణదానము, అన్నదానము మొదలగునవి దరిద్రబిక్షుకజన కల్పితము లనియు, కానఁ బరలోకభ్రాంతిచేఁ గాయక్లేశాదులను విడిచి శరీరపోషణమే బాగుగఁజేసికొనుచుండవలయు ననియు,నా మతమునఁ జెప్పబడినది

దృష్టోపాయములచే సంభవించిన సుఖము దుఃఖమిశ్రిత మయినది గాన నా సుఖము పురుషార్థము కాదనియెడియాశంకకు చార్వాకులు చెప్పు సమాధాన మేమనగా, దుఃఖభాగమును దీసికొనక సుఖమును మాత్రమునే గ్రహింపవలయునని (చెప్పెదరు) కావుననే చార్వాక మతావలంబులచే నిటుల చెప్పబడినది (ఏమనగా) విషయోపభోగములవలన బుట్టిన సుఖము దుఃఖమిశ్రితము కాన విషయ సౌఖ్యము మంచిది కాదనుకొనుట మూర్ఖవిచారణము ఎట్లన, హితార్థియగు నరుడు తెల్లని బియ్యములో నూకపొర్లున్నట్లయిన దానిని విసర్జించి బియ్యమును గ్రహించును కాని ఊకపొర్లున్నట్లయిన బియ్యమును పారపోయు వాడుండునా? వుండడు (కాన నటులనే దుఃఖమును విడిచి విషయసౌఖ్యమునే గ్రహింపవలయునని) కాన దృష్టమునే పురస్కరించుకొనవలసినది కాని యదృష్టమగు (దృష్టముకాని) పరలోకాదు లున్నవనుట కూడదని చార్వాకమతము నవలంబించి జాబాలి రామునితోఁ జెప్పెను

యథాకథంచి దానేతు మధర్మోపహితాన్యపి
వచనాని వ్యాహరంతం జాబాలిం ప్రాహ రాఘవః,
*విరుద్ధాచారపురుషః న శిష్టైః పూజ్యతే ధ్రువమ్
ఇహామూత్రాపి సంసిద్ధిం న లభేత ధ్రువం తు సః. 6-7

* ఏదో యొకవిధముగ నయోధ్యకు దీసికొనిబోవుటకు యత్నించి ధర్మవిరుద్ధములగు వచనములను౯ జెప్పుచున్న జాబాలితో రామచంద్రమూర్తి యిటుల౯ బలికెను. మర్యాద నతిక్రమించిన వాడును, పాపాచారము గలవాడును, భిన్న చరిత్ర కలవాడును సత్పురుషులచే గౌరవింపబడడు.

**జాబాలే విషమస్థబుద్ధిసహితం ధర్మా దపేతం తథా
త్వాం వై నాస్తిక ముక్తవంత మనయారీత్యాధునా మాం ప్రతి,
ఋత్విక్త్వేన గృహీతవంత మధిపం తాతం తు నిందా మ్యహమ్
దోషో నాస్తి తవాత్ర నాస్తికమతప్రఖ్యాపకస్యాస్య వై. 8

** ఓ జాబాలి! నాస్తికబుద్ధితో నీరీతిగ ధర్మవిరుద్ధముగ నాతోడనిట్లు మాట్లాడుచున్న విషమబుద్ధి గల నిన్ను ఋత్విక్కునిగా, మంత్రినిగా బెట్టుకొనిన మాతండ్రియగు దశరథుని నిందింపవలసినది కాని నాస్తికమతావలంబి యగు నీదోషము లేదు సుమా!

---

*అనేన పాపాచారః పురుషః సద్భిర్న బహుమంతవ్య ఇత్యుక్తమ్. తథా చ రాజధర్మే- ఉపేక్షితవ్యో యత్నేన తాదృశః పురుషోఽధమః|| ఇతి.

*ఇట్లు చెప్పుటచే పాపసమాచారము గల పురుషుడు సత్పురుషులచే గౌరవింపబడడని సూచింపబడినది. రాజధర్మములో గూడ నటులనే చెప్పబడినది. పాపప్రవర్తన కల పురుషుని ప్రయత్న పూర్వకముగ నుపేక్షింపవలయునని.

**నన్వత్ర చార్వాకమతావలంబినం జాబాలిం స్వసమీపే సంస్థాపిత వంతం పితరం ప్రతి దూషితవా న్నామ ఇతి జ్ఞాయతే, తన్నయుజ్యతే, పితరం వినిందయంతం సౌమిత్రిం కైకేయీం దూషితవంతం భరతం చ నివారితవతో రామస్య పితృనిందాయా అసంభవాత్.

న చ చర్వాకమతావలంబక జాబాలినిందాపరమేవ తదితి వాచ్యం, జాబాలే ర్ద్విజాతిత్వేన తన్నిందాయా స్సుతరా మసంభవా దితిచేన్న, అత్ర శ్రీరామకృతదూషణం న హి జాబాలిం వా నాపి పితరం వా సముద్దిష్టం, పరంతు జాబాల్యుపన్యస్త చార్వాకాది మతదూషణ పరమితి వేద్యం.

**ఇచ్చట, చార్వాకమతము నవలంబించి చెప్పుచున్న జాబాలిని దన సమీపమునందుంచుకొనిన తండ్రియగు దశరథుని రాముడు దూషించినట్లు కన్పడుచున్నది. అది యుక్తముగ గన్పడుట లేదు. 'లోగడ౯ దండ్రిని దూషించిన లక్ష్మణుని౯ దల్లియగు కైకను దూషించిన భరతునిఁగూడ నివారించిన రాముడు తండ్రి నిపుడు నిందించుట యసంభవమను

ప్రీతిం కర్తు మలం మమాద్య భవతా ప్రఖ్యాపితం యద్వచ
స్తచ్చేదం వచనం త్వధర్మ్య మయశస్సంపాదకం వై మయా,
న్యాయాపేత మనార్యజుష్ట మధునా చానుష్ఠితం స్యాద్యది
ప్రాహు ర్మామపి నాస్తికం భువిజనా స్సర్వే ధ్రువం రాఘవమ్. 9

ఓ జాబాలి! నాకు సంతుష్టిని గలుగజేయవలయునని నీవిపుడు మాట్లాడిన మాటలు ధర్మవిరుద్ధములుగను, న్యాయము కానివిగాను, నపయశస్సును కలుగజేయునవిగాను, పెద్దలచే సేవింపబడనివిగాను నున్నవి. ఇట్టి నీవచనములను నేను విని యవ్విధముగ ననుష్ఠించినచో లోకములో నన్ను గూడ నాస్తికునిగా జెప్పుకొనియెదరు.

కించేదం శృణు రాజవృత్త మతులం దేవర్షిసంమానితం
మన్మూలా ద్భవితా నృశంస మనృతం త్వాద్వాక్యసంమాననే,
రాజానో భువి యద్విధాః ప్రకృతయ స్స్యుస్తద్విధా భూతలే
మన్మూలాద్భువి నాస్తికత్వసహితాస్సర్వాః ప్రజాస్స్యుర్ధ్రువమ్. 10

ఇదియునుంగాక మరియొక సంగతినిగూడ వినుము. ఇంతదనుక రాజవృత్తము నిరుపమాన మైనదియు దేవర్షి సన్మానితమునై యున్నది. ఇట్టి రాజవృత్తము నీమాటలను నేను గౌరవించినచో నృశంస మైనదియు ననృతమును కాగలదు. రాజులు యద్విధముగా నుందురో ప్రజలును తద్విధముగనే యుందురు. కాన నా మూలకముగ నిశ్చయముగ ప్రజలు కూడ నాస్తికు లగుదురు.

*దత్తం పూర్త మపీష్ట మాచరతి యో వా చరేద్వై తపః
నిస్సంగత్వయుతో భవేద్భువి తు య స్సర్వేఽపి తే సజ్జనాః,
తత్తత్కర్మఫలం పరత్ర విధినా సంప్రాప్నువంతీ త్యలం
శాస్త్రే బోధయతి త్వ మిత్థ మధునా కిం బోధయ స్యన్యథా. 11

నాశంక కలుగను. రాముడు చేసిన దూషణము తండ్రినిగూర్చి కాదు. చార్వాకమతావలంబియగు జాబాలిని గూర్చి యనుటకును వలనుపడదు. జాబాలి బ్రాహ్మణుడును, ఋత్విక్కునుగూడ. కాన బ్రాహ్మణనింద రాముడు చేసెననుటయు గూడ యుక్తముగా లేదని యాశంక కలుగును. కాని యిచ్చట రాముడు దూషించుట జాబాలిని గూర్చికాదు; తండ్రిని గూర్చికాదు. ఇక నేమనగా జాబాలిచే నుపన్యసింపబడిన చార్వాకాది మతదూషణ పరమని భావింపవలయును

* దత్తం నామ శరణాగత సంత్రాణదానాదికం, పూర్తం నామ వాపీకూపతటాకాది నిర్మాణం దేవతాలయం అన్నప్రదాన మారామకరణం పూర్త మిష్యతే, ఇతి. ఇష్టం నామ యాగాదికం.

* ఓ జాబాలి! లోకములో నెవరు దత్తకార్యములనుగాని, ఇష్టకార్యములనుగాని, పూర్తకర్మలనుగాని, తపస్సునుగాని, త్యాగమునుగాని యాచరించుదురో - వారలు చేసిన యాయా కర్మలకు దగిన ఫలమును పరలోకమున బొందెదరని శాస్త్రము బోధించుచుండ నీవు వేఱు విధముగ బోధించెదవేల?

---

పూర్వోక్త యాగదానతపస్సన్న్యాససురార్చనాదివిధాయకం శాస్త్రజాతం బహుళ ముపలభ్యతే. తత్ర దానవిషయే యజుర్వేదే- దానం యజ్ఞానాం వరూథం, దానేన ద్విషంతో మిత్రాణి భవంతి దానే సర్వం ప్రతిష్ఠితం తస్మా ద్దానం పరమం వదంతి. దానవిషయే మనురపి- యత్కించిదపి దాతవ్యం యాచతే నానుసూయయా ఇతి.

దానం చతుర్విధం నిత్యం నైమిత్తికం కామ్యం విమలం చేతి

అహన్యహని యత్కించి ద్దీయతే తన్నిత్యం, యత్తు పాపశాంత్యర్థం తన్నైమిత్తికం

అపత్యవిజయైశ్వర్యస్వర్గార్థం యద్దీయతే తత్కామ్యం, ఈశ్వరప్రీతయే యద్దీయతే తద్విమలం, దానభేదేఫలం మనుః - వారిద స్తృప్తి మాప్నోతి సుఖ మక్షయ్య మన్నదః। గృహదోఽగ్ర్యాణి వేశ్మాని రూప్యదో రూప్య ముత్తమం। వాసోదశ్చంద్రసాలోక్య మశ్విసాలోక్య మశ్వదః। గోదో బ్రధ్నస్య సాలోక్యం సమాప్నోతి న సంశయః। యానశయ్యాప్రదో భార్యా మైశ్వర్య మభయప్రదః ధాన్యద శ్శాశ్వతం సౌఖ్యం బ్రహ్మదో బ్రహ్మణోఽంతికమ్, ఇతి. బారతే- త్రీణ్యాహు రతిదానాని కన్యా పృథ్వీ సరస్వతీ, మద్రారాజశ్చ రాజర్షిర్దత్వా కన్యాం సుమధ్యమాం, సువర్ణహస్తాయ గతోలోకాన్ దేవై రభిష్టుతాన్॥ ఇతి

గారుడే- దానానా ముత్తమం దానం విద్యాదానం విదుర్బుధాః॥ ఇతి

పాత్రవిశేషే ఫలం-

సమ మబ్రహ్మణే దానం ద్విగుణం బ్రాహ్మణబ్రువే.

సహస్రంశ్రోత్రియేదానం అనంతం వేదపారగే॥ ఇతి.

తపోవిషయే మనుః - తపోమూల మిదం సర్వం దైవం మానుషకం సుఖం॥ఇతి.

సన్న్యాసవిషయే మనుః - చతుర్థ మాయుషో భాగం సంగం త్యక్త్వా పరివ్రజేత్॥ ఇతి.

అనేన పూర్వోక్తం వచనజాతేన దానతపస్సన్న్యాసాది విధాయకశాస్త్రం ప్రమాణమితి అస్తి పరలోక, ఇతి, తత్సాధనీభూతం వేదవిహితం కర్మజాతం, తద్బోధకం శాస్త్రం చ ప్రమాణమితి ప్రతిపాదనేన సర్వేషా మవైదికమతానాం దూషణం చోక్తం॥

తత్రప్రకారశ్చ -

ప్రమాణమేవ వేదాః స్యుః సర్వజ్ఞేశకృత త్వతః
స ఏవ కర్మఫలదః జీవానాం వా విశేషతః।
జీవానాం జీవకర్మాణి ప్రకృతిః పరమాణవః
వేశతే హ్యత్ర జీవానాం తత్ర కార్యఫలార్పణే॥

వ్యా-జీవాః కర్మఫలావాప్తౌ శక్తాశ్చే త్స్వసుఖేరతాః, అప్రార్థితాని దుఃఖాని వారయంతు ప్రయత్నతః. అశక్తాన్యత్ర కర్మాణి జీవానాం స్వఫలార్పణే, అచేతనత్వావగతే స్స్వర్గాదిఫలభూమిషు. నాచేతనత్వాత్తత్కృతేః ఫలదాతృత్వ సంభవః, అచేతనాః ఫలం దాతు మశక్తాః పరమాణవః, కాలోప్యచేతన స్తేషాం న హి కర్మఫలప్రదః, అతో ఽన్యః ఫలదో లోకే భవత్యేభ్యో విలక్షణః, స తు ప్రాణివిశేషాంశ్చ దేశానపి తదాశ్రయాన్, జానన్ సర్వజ్ఞ ఏవేష్టః నతు బౌద్ధాది సంమత, అజాన న్నాణినో లోకాన్ హేయోపాదేయమాత్రవిత్, ప్రాదేశికో న సర్వజ్ఞః నాస్మదాది విలక్షణ, అదృష్టయోశ్చ విశ్వాసః కార్య స్స్వర్గాపవర్గయోః॥ ఇతి.

తస్మా ద్వైదికమార్గో న దూషణీయ ఇతి జాబాలినా ప్రోక్త స్సర్వో ప్యపసిద్ధాంత ఇతి సర్వం రమణీయం.

*దత్తకార్యము లనగా శరణాగతరక్షణము, దానము మొదలగునవి. పూర్తకార్యము లనగా వాపీకూప తటాకాదులను త్రవ్వించుట, దేవాలయములను గట్టించుట, అన్నప్రదానము చేయుట, తోటలు వేయుట మొదలగు కర్మలు. ఇష్టకార్యములనగా - యజ్ఞాదికర్మలు. పూర్వముఁ జెప్పబడిన యాగము, దానము, తపస్సు, సన్న్యాసము, దేవపూజ, బ్రహ్మణపూజ మొదలగువానిని విధించు శాస్త్రములు బహుళముగ గన్పడుచున్నవి. దాన విషయమున యజుర్వేదమున నిటుల జెప్పబడినది." దానము యజ్ఞములతో శ్రేష్ఠమైనది. దానముచే శత్రువులు కూడా మిత్రు లగుదురు. దానమునందు సర్వము ప్రతిష్ఠింపబడినది. కావున దానము సర్వోత్కృష్టమైనది" అని. (చెప్పబడెను). దానవిషయమున మనువిట్లు చెప్పెను."యాచకునకుఁ దన శక్తికొలది కోపము లేకుండగ నేకొంచెమైనను నీయవలయు" నని.

దానము- నిత్యము, నైమిత్తికము, కామ్యము, విమలమని నాలుగు విధములుగ నున్నది. ప్రతిదినము నిచ్చుటకు నిత్యమనియు, పాపశాంతికై చేయునట్టి దానమునకు నైమిత్తకమనియు, సంతానము, విజయము, ఐశ్వర్యము, స్వర్గము మొదలగు వానికై యిచ్చుటకుఁ గామ్యమనియు, ఈశ్వరప్రీతికై చేయునట్టి దానమునకు విమల మనియు పేర్లు జెప్పఁబడెను. దానభేదముచే ఫలభేదము చెప్పబడినది. జలదానము చేయువాడు తృప్తిని, అన్నదానము చేయువాడు అక్షయఫలమును, గృహదానము చేయువాడు శ్రేష్ఠమైన గృహమును, రూప్యముల దానముచేయువాడు తిరిగి రూప్యములను, వస్త్రదానము చేయువాడు చంద్రలోకమును, అశ్వదానము చేయువాడు అశ్వినీదేవతల లోకమును, గోదానము చేయువాడు సూర్యలోకమును, శయ్యావాహనదానము చేయువాడు యోగ్యమైన కళత్రమును (భార్యను), అభయదానమిచ్చువా డైశ్వర్యమును, ధాన్యదానము చేయువాడు శాశ్వతసౌఖ్యమును, బ్రహ్మోపదేశము చేయువాడు బ్రహ్మలోకమును పొందునని చెప్పబడినది.

దానవిషయమున భారతమునందిట్లు చెప్పబడెను. కన్యాదానము, భూదానము, విద్యాదానము- మూడు దానములు నుభయతారకము లనియు, మద్రరాజు కన్యాదానముచే దేవలోకమును బొందెననియు చెప్పబడినది. గరుడ పురాణమున, దానములలో కన్యాదాన ముత్తమ మైనదని చెప్పబడెను.

దాన విషయములలో పాత్రవిశేషమునుబట్టి ఫలభేదము చెప్పబడినది :- బ్రాహ్మణేతరున కిచ్చిన దానముచే సమఫల ముండుననియు, నామమాత్ర బ్రాహ్మణుని కిచ్చిన దానమువలన ద్విగుణమైన ఫలముండు ననియు, శ్రోత్రియున కిచ్చిన దానమునకు వెయ్యిరెట్లు ఫలముండుననియు, వేదవేత్తకుఁజేసిన దానమునకు ఫలమనంత మనియుఁజెప్పబడినది.

లోకే కశ్చన పాతి భూమి మఖిలాం కశ్చి త్కులం పాతివై
కశ్చి త్స్వర్గసుఖం భునక్తి నిరయం కశ్చి ద్వ్రజ త్యన్యధా,
కశ్చి త్సౌఖ్య ముపేతి కశ్చన శుచం ప్రాప్నోతి కశ్చి ద్ధనీ
కశ్చి న్నిర్ధనతా ముపేతి భువనే పూర్వాత్మకర్మాంకురాత్. 12

ఓ జాబాలి! లోకములో నొక్కడు తన పూర్వ కర్మానుసారము భూమినిఁ బాలింపశక్తుడుగా నుండును. మరియొకడు తన కులమును మాత్రము పోషించుట్క శక్తుడుగానుండును, మరియొకడు స్వర్గ సుఖము ననుభవించును. వేఱొకడు నరకము ననుభవించుచుండును. ఇంకొకడు సౌఖ్యముతో నుండును. మరియొకడు దుఃఖములపాలై యుండును. ఒకడు ధనవంతుడుగాను, మరియొకడు నిర్ధనుడుగాను నుండును. ఈ పైపురుషుల వైచిత్ర్యముచే వారువారు చేసిన కర్మలు కూడ విచిత్రములుగా నుండుననియు, వానివలననే యివి జరుగుచున్నవనియు నెరుగుము.

---

సన్న్యాసవిషయమున మను విట్లు చెప్పెను తన అయుర్దాయమును, సన్న్యాసము మొదలగువానిని విధించు శాస్త్రము ప్రమాణముగా నున్నదనియు, పరలోకసాధనములగు వేదవిహితములైన కర్మలను బోధించు శాస్త్రములు ప్రమాణములే యనియు చెప్పుటచేతను, వేదవిరుద్ధములగు మతము లన్నియు దూషితములని రాముని వచనముచే సూచిత మగుచున్నది. కర్మమే బ్రహ్మమని కొందరును, జీవులే స్వతంత్రులని కొందరును, ప్రకృతి యాత్మ యని కొందరును, దేహమే యాత్మయని కొందరును, పరమాణువులే జగత్కారణమని చెప్పువారు కొందరును. కాలము కారణమని కొందరును నిటుల ననేకులు వేదవిరుద్ధమతస్థులు కలరు వారల మతము లన్నియు రామునివచనములచే ఖండింపబడినవి.

అవ్విధముగనే శాస్త్రమునందు బైమతములు దూషింపబడినవి వేదములు సర్వజ్ఞుడగు నీశ్వరునిచే విరచితము లగుటవలనఁ బ్రహ్మణములనియు, ఆ ఈశ్వరుడే జీవులకు కర్మఫలము నిచ్చువాడనియు, జీవులయొక్క కర్మకాని, ప్రకృతికాని సమర్థములు కావనియు, జీవులు తమకుఁ గలిగిన దుఃఖములను నివారించుకొనుటకు సమర్థులు కానందున కర్మఫలములను పొందుటలో స్వతంత్రులు కారనియు, కర్మకూడ నచేతనముగాన స్వర్గాదిఫలమును గలుగజేయుటలో నసమర్థమేయనియు, ప్రకృతికూడ నచేతనమే కాన జీవులకు ఫలమునిచ్చుటలో నసమర్థమే యనియు, పరమాణువులుకూడా నచేతనములే కాన ఫలము నిచ్చుట కసమర్థములే యనియు, కాలముకూడ నచేతనము కాన కాలమునకుగూడ జీవులకు ఫలము నిచ్చుశక్తి లేదనియు, కావున పైవానికంటె విలక్షణమైన మరియొకనిని నంగీకరింపవలయుననియు నతడు ప్రాణి దేశ తదాశ్రయ విజ్ఞానము కలవాడు కాన నతడే సర్వజ్ఞుడనియు, బౌద్ధాది మతములయందు జెప్పఁబడిన విధముగ దేహ మాత్మకా దనియు, జీవుడు కూడ సకలప్రాణి లోక విశేష జ్ఞానము లేనివాడు కాన సర్వజ్ఞుడు కాడనియు, కాన నదృష్టములగు స్వర్గనరకములయందు విశ్వాస ముండవలసిన దనియుఁ జెప్పబడినది. కావున పై హేతువులచే వైదికమార్గము దూష్యము కాదనియు జాబాలి చెప్పినది యపసిద్ధాంత మనియు సిద్ధము

ఏకః పూర్వ మరం శతక్రతుచయం కృత్వా దివం ప్రాప్తవాన్
అన్యః కశ్చన సత్యపాలనవశా దద్యాపి పూజ్యోఽభవత్,
నైకే చోగ్రతపో విధాయ చ దివం ప్రాపుః పురా వై ద్విజాః
తస్మాత్కర్మభువం సమేత్య మనుజ స్సత్కర్మకు ర్యాద్ధ్రువమ్. 13

ఓ జాబాలి! పూర్వమొకడు (ఇంద్రుడు) శతక్రతువులను జేయుట వలన స్వర్గరాజ్యమును బాలింపగలిగెను. మరియొకడు (హరిశ్చంద్రుడు) సత్యమును బాలించుటవలన నిప్పటికిని లోకమునఁ బూజనీయుడై యున్నాడు. అనేకులైన మహర్షులు గొప్పతపస్సును జేసి స్వర్గమును బొంద గల్గిరి. ఆ కారణమువలన మనుష్యుడు కర్మభూమికి వచ్చినందుకు సత్కర్మను చేయవలసినదే.

*స్వర్గావాప్తిసుసాధనాని భువనే సత్యం చ ధర్మ స్తథా
శౌర్యం భూతదయా ప్రియం చ వచనం దేవద్విజాద్యర్చనమ్,
ప్రాహు స్సత్పురుషా స్తతోఽహ మధునా వాక్యం పితుస్త్వన్యథా
కర్తుం న ప్రభవామి త ద్విరమతా ద్దుష్టా త్పథ స్త్వం ధ్రువమ్. 14

---

* అనేన సత్యధర్మాదీనాం పరలోకసాధనత్వ ముక్తం. సత్యస్య స్వర్గసాధనత్వే మను- సత్యం స్వర్గస్య సోపానం పారావారస్య నౌరివ. ఇతి.

ధర్మస్య పరలోకసాధనత్వే మనుః- ధర్మం శనై స్సంచినుయాత్ సర్వభూతా న్యపీడయన్|| ఇతి.

పరాక్రమస్య స్వర్గసంపాదకత్వే పరాశరః- క్షణేన యాంత్యేవ హి తత్ర వీరాః ప్రాణాని యుద్ధే చ పరిత్యజంతః|| ఇతి.

భూతానుకంపాయాః పరలోకసాధనత్వం రాజధర్మే- సర్వభూతే ష్వనుక్రోశం కుర్వతస్తవ భారత, అనృశంస్యే ప్రవృత్తస్య నియతః పుణ్యసంచయః|| ఇతి.

వ్యా- ప్రియవచనస్య పరలోకసాధనత్వే మనుః- వాక్చైవ మధురా శ్లక్ష్ణాప్రయోజ్యా ధర్మ మిచ్ఛతా| స వై సర్వ మవాప్నోతి వేదాంతోపగతం ఫలం|| ఇతి|| ద్విజాతి దేవాతిథిపూజాయాః స్వర్గసాధనత్వే విష్ణుపురాణే-నివాపేన పితౄ నర్చేత్| యజ్ఞై ర్దేవాన్ తథాతిథీన్| అన్నై ర్మునీంశ్చ స్వాధ్యాయై| స్సద్గతిం ప్రాప్నుయా న్నరః|| ఇతి.

కిం చ సత్యధర్మ యాగాదీనాం దేహాంతరోపభోగ్యఫలత్వ ప్రతిపాదనాత్ దేహాత్మవాదస్య విహితసత్య ధర్మ యాగాది క్రియాఫలాభావస్య చ నిరాకరణాత్ చార్వాకాదిమత దూషణం కృత మితి వేద్యం.

* ఇట్లు చెప్పుటచే సత్యధర్మాదులు పరలోకసాధనములని చెప్పబడినది. స్వర్గము సత్యసాధన మనుటలో మనువిటులఁజెప్పెను. (ఏమనగా) సముద్రమును దాటుటకు ఓడ సాధన మగునటుల సత్యము స్వర్గమునకు సాధనమని.

* ఓ జాబాలి! సత్యము, ధర్మము, పరాక్రమము, భూతదయ, ప్రియవచనము, దేవబ్రహ్మణాతిథిపూజయు స్వర్గమునకు సోపానములని పెద్దలు చెప్పుదురు. కాన నేను పితృవాక్యము నన్యథాగాఁ జేయజాలను. కావున నీ వసన్మార్గమునుండి మరలుము.

*క్షాత్రం త్యజామి జాబాలే కరోమి పితృశాసనమ్,
న కదాపి త్వయా వాచ్య మేవం మాం ప్రతి వైదికమ్. 15

---

ధర్మము పరలోక సాధన మనుటలో మనువిటులఁజెప్పెను. భూతములనుఁ బీడింపకుండగ ధర్మమును నెమ్మదిగా సంపాదింపవలయునని - పరాక్రమము స్వర్గసాధన మనుటలో పరాశరు డిటులఁజెప్పెను. యుద్ధములో ప్రాణములను విడుచువారలు క్షణములో వీరస్వర్గమును బొందెదరని- భూతదయ పరలోక సాధన మనుటకు రాజ ధర్మమునం దిటులఁజెప్పబడినది ఘాతుకపు పనులను జేయక సర్వభూతములయందు దయ కలవానికి పుణ్యలోకము నియతముగా గలుగునని.

ప్రియవచనము పరలోక సాధన మనుటలో మను విటులఁజెప్పెను. ధర్మార్థియగు నరుడు మధురవచనములనుఁ బ్రయోగింపవలయు ననియు నటులఁ బ్రియవచనములను బలుకువాడు వేదాంతములయందు బ్రతిపాదింపఁ బడిన ఫలమును బొందుననియు (జెప్పబడినది). దేవ బ్రాహ్మణాతిథిపూజ స్వర్గసాధన మనుటలో విష్ణుపురాణమునం దివ్విధముగఁ జెప్పబడినది. (ఏమనఁగా) తర్పణములచేఁ బితృదేవతలను, యజ్ఞములచే దేవతలను, అన్నముచే నతిథులను, స్వాధ్యాయముచే ఋషులను బూజించిన జనుడు సద్గతినిఁబొందునని (చెప్పబడెను). సత్యధర్మయాగాదులు దేహాంతరమునం దనుభవింపదగిన ఫలముగలవి యని చెప్పుటవలన దేహాత్మవాదము సత్యధర్మయాగాదులకు ఫలము లేదనుటయు, దూషింపబడినందున చార్వాకాది మతదూషణము చేయబడినదిగా నెరుగవలయును.

* నన్వత్ర పితృవాక్యపాలనాతిక్రమ స్సంభవేదితి భీత్యా ప్రజా పాలనధర్మో రామభద్రేణ పరిత్యక్త ఇతి తన్నయుజ్యతే, ప్రజాపాలనస్య క్షత్రియాణాం స్వధర్మ త్వేన తస్యావశ్య కరణీయత్వాత్, తథైవ మనునాపి ప్రతిపాదితం - క్షత్రియాణాం ప్రజాపాలనం ధర్మ ఇతి. తస్య విగుణత్వేఽపి కరణీయతాయాం భగవద్వాక్యం" శ్రేయా న్స్వధర్మో విగుణ" ఇతి.

ప్రజారక్షణే సంభావితానాం పాపానాం దానధర్మాదినా నివారయితుం శక్యత్వాచ్చ, ఏవం సతి తాదృశం ప్రజాపాలనరూపం స్వధర్మం విసృజ్య కిమర్థం దండకా స్త్రస్థితో రామభద్ర ఇతిచేత్ ప్రజాపాలనస్య క్షత్రియాణా మావశ్యకత్వేఽపి తస్మాదపి పితుః ప్రతిజ్ఞాతార్థనిర్వాహస్యాపి పరమధర్మత్వాత్, తథైవ భారతే- దుర్యోధనోరుభంగకృతో భీమస్యో పరి క్రుద్ధం హలాయుధం ప్రతి వాసుదేవే నైవం ప్రతిపాదితం క్షత్రియాణా మూరుభంగకరణస్య దోషావహత్వేపి పూర్వ ప్రతిజ్ఞాభంగభియా కృతవాన్భీమ ఇతి.

*ఓ జాబాలి! నేను క్షాత్రమును వదలుకొంటిని. పితృశాసనము ననుష్ఠించెదను. నీవెప్పుడును వైదిక ధర్మావలంబి యగు నన్ను గూర్చియిటుల నాస్తికమతమును బోధింపకుము.

జ్ఞాత్వా రామం తతః క్రుద్ధం జాబాలి స్సాంత్వనాన్వితైః,
వచనైస్సాంత్వయామాస వేదమార్గదృఢవ్రతమ్. 16

పిమ్మట జాబాలి రామునకుఁ దనమీద నాగ్రహము కలిగినటుల గ్రహించి శాంతవాక్యములచే వేదమార్గాన లంబియైన రాముని నెట్లెట్లో శాంతపరచెను.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యాకాండే ద్వితీయభాగే త్రయోదశ స్సర్గ స్సమా ప్తః.
ఆశ్చర్యరామాయణమున అయోధ్యాకాండమున
ద్వితీయభాగమున పదుమూఁడవ సర్గము సమాప్తము.

---

*ఇచ్చట, పితృవాక్యపాలనాతిక్రమము సంభవించు ననియెడి భయముచే ప్రజాపాలన ధర్మమును రాముడు పరిత్యజించినటులఁ గన్పడుచున్నది. అది యుక్తముగా లేదు. ప్రజాపాలనము క్షత్రియులకు స్వధర్మ మగుటచే నది యవశ్యముగఁ జేయదగినది, కానఁబైన జెప్పబడినది యుక్తముగ లేదు. మనువు కూడనట్లే చెప్పెను. క్షత్రియులకు ప్రజాపాలనము ధర్మమని,

స్వధర్మమునందు గుణము లేక పోయినను ననుష్ఠింపవలయునని భగవద్వాక్యము కూడ గలదు. స్వధర్మము విగుణమైనను శ్రేయస్కర మైనదియని, ప్రజారక్షణములోఁ బాపములు సంభవించినను దాన ధర్మములచే నివారింప నవకాశము కూడ కలదు. ఇట్లుండగా ప్రజాపాలన రూపమగు స్వధర్మమును విడిచి రామచంద్రుడు దండకమున కెటులఁబయనమగు చుండెనని యాశంక కలుగును కాని ప్రజాపాలనము క్షత్రియుల కావశ్యకమైనను నంతకంటెను పితృసమీపమున బ్రతిజ్ఞ చేయబడిన దానిని నిర్వహించుట కూడఁ బరమధర్మమని తెలియవలయును. భారతమునఁ గూడ నటులనే చెప్పబడినది. భీముడు దుర్యోధనుని తొడలను దెగగొట్టగా నధర్మముగా జంపిన భీముని విషయమై బలరాముడు కోపగింప కృష్ణుడు బలరామునికి నిటులఁజెప్పెను. అన్నా! క్షత్రియులు యుద్ధములో నూరుభంగము చేయుట దోషమే కాని భీముడు పూర్వమొకప్పుడు దుర్యోధనుని తొడలను దెగనరికెదనని చేసిన ప్రతిజ్ఞకు భంగము కలుగుననియెడి భయముచే నటుల జేసెను అని.

## చతుర్దశస్సర్గః - పదునాల్గవసర్గ

[1]వసిష్ఠోఽపి ప్రేరితస్స న్భరతేన తతః పరమ్,
రాఘవం ప్రాహ ధర్మజ్ఞం లోకానుసరణే రతః. 1

అనంతరము భరతుడు వసిష్ఠుని, బ్రేరేపింపగా నవ్వసిష్ఠుడును లోకానుసారముగ ధర్మజ్ఞుడగు రామునితో నివ్విధముగఁ బలికెను.

పురుషస్య హి జాతస్య భవంతి గురవ స్త్రయః,
ఆచార్యశ్చైవ కాకుత్థ్స పితా మాతా చ రాఘవ! 2

రామభద్రా! జన్మమెత్తిన పురుషునకుఁదండ్రియు దల్లియు నాచార్యుడు నను ముప్పురు గురువులని చెప్పబడుదురు.

సోఽహం తే పితు రాచార్య స్తవచైవ పరంతప!,
[2]* మమ త్వం వచనం కుర్వన్నాతివర్తే స్సతాం గతిమ్.
ఇమాహి తే పరిషదః జ్ఞాతయశ్చ ద్విజా స్తథా,
ఏషాం తాత చరన్ వాక్యం నాతివర్తే స్సతాం గతిమ్,
వృద్ధాయా ధర్మశీలాయా మాతు ర్నార్హస్య వర్తితుమ్,
భరతస్య వచః కుర్వన్ యాచమానస్య రాఘవ!
ఆత్మానం నాతివర్తే స్త్వం సత్యధర్మ పరాయణ. 3-5½

నేను మీతండ్రికిని నీకునుఁగూడ గురువును. కావున నేను చెప్పి

** నటుల నీవు నడచెదవేని సన్మార్గము నతిక్రమింపనివాడ వగుదువు. ఈప్రజలు, జ్ఞాతి బంధు సముదాయము, బ్రాహ్మణులు, నేను, వీరలందరు

---

* అనేన గురుమాత్రాదీనా మభిమతం కుర్వ న్పురుష స్సద్గతిం నాతిక్రామతి, అత స్తేషాం వచన మవశ్యం కర్తవ్యం. తథా చానుశాసనికే - పితు ర్మాతు ర్గురూణాంచ ఆచార్యస్య చ సర్వదా, హితం వాప్యహితం వాపి తత్కార్య మవిశంకయా|| ఇతి. అనేనాచార్య ప్రజామాత్రాది వచన మనుల్లంఘనీయ మతస్సముల్లంఘ్యాపి పితృవచనం మత్తార్థనాం నఫలీకుర్వితి తదాశయ ఇతి వేద్యం.

1. కవిః || 2. వా.రా.

నీ వయోధ్యకు రావలసినదిగాఁ గోరుచున్నాము. మావాక్యము ననుష్ఠించిన యెడల సన్మార్గము నతిక్రమింపనివాడ వగుదువు. ఇదియునుంగాక వృద్ధురాలును ధార్మికురాలునగు నీతల్లిమాటను గూడ నీ వతిక్రమింపజనదు. నిన్ననేక విధములఁ బ్రార్థించుచున్న భరతుని వాక్యము ననుష్ఠించినచో నాత్మాతిక్రమణము చేయనివాడ వగుదువు.

[1]ఇత్యుక్తో రాఘవః ప్రాహ వసిష్ఠం ధర్మతత్పరః,
స హి రాజా జనయితా పితా దశరథో మమ.
[2]ఆజ్ఞాతం య న్మయా తస్య న త న్మిథ్యా భవిష్యతి. 6-7

వసిష్ఠుడిట్లు చెప్పగా ధర్మనిరతుడగు రామచంద్రమూర్తి వసిష్ఠునితో నివ్విధముగఁ బలికెను - రాజును, నా జన్మ కారణభూతుడును, నన్ను బెంచిన వాడునగు నాతండ్రియొక్క సమీపమున నేను ప్రతిజ్ఞ చేసిన దానికి భిన్నముగ ననుష్ఠించు వాడను కాను.

---

** ఇట్లు చెప్పుటచే గురువు తల్లి మొదలగు వారి యభిమతమును నెరవేర్చిన పురుషుడు సద్గతినిఁ బొందుననియు గాన వారలవాక్యము నవశ్య మనుష్ఠింప వలయు నని యెడి ధర్మము సూచింపబడినది. ఆనుశాసనికమునం దివ్విధముగ జెప్పబడినది. "తండ్రి , తల్లి, గురువు, ఆచార్యుడు, వీరల వాక్యము హితమైనను నహిత మైనను నిస్సందేహముగాఁ జేయవలయునని" (పైవాక్యమువలన, ఆచార్యుడు ప్రజలు తల్లి మొదలగువారల వాక్యముల నతిక్రమింపఁ గూడదనియు పితృవాక్యము నుల్లంఘించి యైనను మాప్రార్థనను సఫలముచేయు మనియు వసిష్ఠుని యాశయమని తెలియవలయును.)

* న న్వస్మి న్వచనే పిత్రాజ్ఞయా ప్రతిజ్ఞాతమేవ పరిపాలనీయమితి పతీయతే త్ర దనుపపన్నం- ఆపస్తంబసూత్రే ఆచార్యప్రాచార్యయోః ప్రాచార్యస్య ప్రాబల్యకథనాత్, తద్వచనస్యైవ కర్తవ్యత్వాత్, కిం చ వనగమనే పిత్రాజ్ఞామాత్రం రాజ్యాభిషేకే తు ప్రాచార్యమాతృప్రజానుజ్ఞేతి విప్రతిషిద్ధధర్మ సమవాయే "భూయసాం స్యాత్సధర్మత్వం" ఇతి న్యాయేన వసిష్ఠాదివాక్యస్యైవ కర్తవ్యత్వాచ్చ, అతః ఉభయధాపి వసిష్ఠాదివాక్యస్యైవ కర్తవ్యత్వేన కథం పితృవచనపరిపాలన ప్రతిజ్ఞేతిచేన్న "ఆచార్యాధీన స్స్యా దన్యత్ర పతనీయేభ్యః" ఇత్యాపస్తంబసూత్రేణ పాతిత్యాపాదకకర్మవ్యతిరి క్తకర్మణ్యే వాచార్యాధీనత్వప్రతిపాదనేన " పాతకాన్యపి పూయంతే పితుర్వచన కారిణః" ఇతి చిరకారివచనేన పితృవాక్యకరణే పాతకనివృత్త్యవగమేన పరశురామాదిభిః పిత్రాజ్ఞయా మహాపాతకరూప మాతృహత్యా కరణేన ఆజ్ఞావిషయే పితు రతిప్రబలత్వాచ్చ తద్వచనమేవ పరిపాలనీయం - ఆచార్యప్రాచార్య విషయవచనం త్వభిమాత్రవిషయం - అతఏవ రామేణ తాటకావధే ఆచార్య విశ్వామిత్రస్య వచనం పితృవచనగౌరవాదేవ కృత మిత్యవగమ్యతే.

---

1. కవిః 2. వా. రా.

లక్ష్మీశ్చంద్రా దపేయాద్వా హిమవాన్వా హిమం త్యజేత్,
*అతీయా త్సాగరో వేలాం న ప్రతిజ్ఞా మహం పితుః. 8

*చంద్రుడు తన సహజశోభను విడిచినను విడుచుగాక! హిమవంతుడు తన సహజమైన హిమమును (మంచును) విడిచినను విడుచుగాక! సముద్రుడు చెలియలికట్ట నతిక్రమించుగాక! నేను మాత్రము తండ్రి యెదుటఁజేసిన ప్రతిజ్ఞను మాత్ర మతిక్రమింపను.

[1]ఏవం నైకవిధోపాయై స్తమశక్యనివర్తనమ్,
ఆలోక్య రామం భరతః ప్రేరయామాస నాగరాన్ 9

ఇవ్విధముగ ననేకోపాయములచేతను గూడ రాముని మరల్చుటకు శక్యము కాని హేతువుచే నేమియుఁ దోచక భరతుడు పురజనుల నిటులఁ బ్రోత్సహించెను.

* పై వచనము నాలోచింపఁ బిత్రాజ్ఞచే చేయబడిన దానిని ఁబరిపాలింపవలయు ననియు ధర్మము సూచిత మగుచున్నది. కాని యది యుక్తముగా లేదు. ఆపస్తంబసూత్రములో, ఆచార్య ప్రాచార్యులలో ప్రాచార్యుడు (విద్యచెప్పినవాడు) ప్రబలుడని చెప్పుటవలన నతని వచన మవశ్యకర్తవ్యమని తెలుచుండటవలనను మరియు, తండ్రి యొక్కడే వనగమనముగూర్చి రాముని కనుజ్ఞ యిచ్చెను కాని రాజ్యమును బాలించుటకు, ఆచార్యుడు తల్లి ప్రజలు మొదలగు వారలనేకు లనుజ్ఞ నిచ్చినందున సంవాదమునే (మెజారిటీనే) గ్రహింపవలయు ననుధర్మము చొప్పున వసిష్ఠాదులు చెప్పినట్లుగానే రాముడనుష్ఠించవలసియుండగాఁ బితృవచనమునే పరిపాలించెదనని చెప్పిన రాముని మాట సంగతము గాలేదని యాశంక కలుగగా సమాధానము చెప్పబడుచున్నది. తనకుఁ బాతిత్యము సంభవింపని పనులను మాత్రమాచార్యుడు చెప్పినట్లు చేయవలయు నను నాపస్తంబ సూత్రము నాలోచింపగాఁ దనకుఁ బాతిత్యము సంభవించు పనులలో నాచార్యాధీనుడై యుండ నవసరము లేదు కావునను." పితృవాక్యమును బరిపాలించినయెడల మహాపాతకము లన్నియుఁదొలగి పోవుననియెడి చిరకారి వచనము నాలోచించిగాని, పితృవాక్య పాలనమువలన పాతకములుకూడ ఁదొలగును గావునను, పరశురాముడుకూడ పిత్రాజ్ఞచే మహాపాతకరూపమగు మాతృ హత్యను జేయుటవలనను, పైహేతువులవలన, ఆజ్ఞ నిచ్చుటయందుఁ దండ్రికి ప్రాబల్యము కన్పడుచున్నందునఁ బితృవాక్య పాలనమే చేయవలయునని స్పష్ట మగుచున్నది.

ఆచార్య ప్రాచార్యుల విషయమై చెప్పినమాట కర్థమేమనగా వారిని గౌరవింపవలయునని చెప్పుటయందు తాత్పర్యమని యెరుగవలయును. కావుననే రాముడు తాటకావధను చేయు సందర్భమున గూడ నిటుల విశ్వామిత్రునితోఁజెప్పెను. (ఏమనగా) ఓ విశ్వామిత్రా! మాతండ్రి చెప్పిన మాటయందలి గౌరవముచే నీవు చెప్పిన తాటకావధను నేనంగీకరించితిని

1 కవిః

భో భో పౌరజనా స్సర్వే కిం వాచంయమతాం పునః,
అవలంబ్య స్థితా యూయం రాఘవం బ్రూత వో మతమ్. 10

ఓ పౌరులారా! మీరలందరును రామచంద్రమూర్తిని నయోధ్యకు మరల్చి తీసికొని వెళ్లుటకు వచ్చియుండియు నేమియు మాట్లాడకుండ నుండెదరేమి?మీ యభిమతమునుగూడ రామున కెరిగింపుడు.

ఇత్యుక్తా నాగరాస్త్వేవ మాహు స్తం దైవమాయయా,
1ఏషోఽపి హి మహాభాగః పితు ర్వచసి తిష్ఠతి,
అత ఏవ న శక్తాః స్మ వ్యావర్తయితు మంజసా. 11½

ఇవ్విధముగ భరతుడు పలుకగాఁ బౌరులును దైవమాయచే నావరింపబడిన వారలై యీ విధముగ భరతునితోఁ జెప్పిరి. ఓ రాజపుత్రా! ఈ రామచంద్రమూర్తి పితృవాక్య పరిపాలనమునందే దృఢవ్రతుడై యున్నందున మేము మరలింప నసమర్థులము.

2 ఇత్యుక్తో భరతః ప్రాహ నిరాశో రాఘవం ప్రతి,
యావ ద్భవా న్న ప్రసీదే త్తావ న్నియమ మాస్థితః
ప్రాయోపవేశం కృత్వాఽహం నిరాహారవ్రతే స్థితః,
కళేబరం త్యజా మ్యత్ర సాంప్రతం త్వదనాగమే. 12-13½

పౌరులు కూడ నిటులఁబలుకగా భరతుడు నిరాశ చెంది రామచంద్రునితో నిటులఁ బలికెను. అన్నా! రామచంద్రా! నీ వనుగ్రహమును జూపక, నీవు పురమునకు రానిపక్షమున నేను నిరాహారుడనై నియమపూర్వకముగఁ బ్రాయోపవేశము చేసి యిచ్చటనే కళేబరమును విడిచిపెట్టుట నిక్కువము.

ఇత్యేవం వ్యాహరంతం తం భరతం ప్రాహ రాఘవః,
*బ్రాహ్మణో హ్యేకపార్శ్వేన ప్రాణాన్ రోద్ధు మిహార్హతి,
న తు మూర్ధావసిక్తానాం విధిః ప్రత్యుపవేశనే,
ఉత్తిష్ఠ త్వం మహాభాగ! మాం చ స్పృశ తథోదకమ్. 14-15½

---

*అనేన ప్రత్యుపవేశనం దరిద్రైః బ్రాహ్మణైరేవక ర్తవ్యం న తు మూర్ధావసిక్తైరితి సూచితం- అత్ర ప్రత్యుపవేశన ప్రాయశ్చిత్తత్వేన 'మాంచ స్పృశ తథోదక' మిత్యుక్త్వా గురుజన సంస్పర్శన ముదకోపస్పర్శనం చ ప్రాయశ్చిత్తం భవతి.

---

1. వా. రా. 2. కవిః

*ఇవ్విధముగఁ బలుకుచున్న భరతునితో రామభద్రు డిటుల ఁబలికెను. భరతా! బ్రాహ్మణుడు ప్రాయోపవేశాదులు చేసి ప్రాణనిరోధము చేయజనునుకాని, రాజులకుఁ బ్రాయోపవేశము చేయజనదు కాన, నీవు ప్రాయోపవేశమునుండి లెమ్ము. నన్నును, నుదకమును నొక పర్యాయము తాకుము. నీకుఁ బ్రాయోపవేశమువల్లనైన దోషము పోవును.

[1] పశ్చా దవీక్ష్య చోపాయం నివృత్త్యై భరతస్య సః,
మహర్షీ న్సృతవా న్రామో భ్రూసంజ్ఞాం తత్ర సంస్థితాన్. 16½

భరతుని మరల్చుట కుపాయ మేమియు రామునకుఁ దోచక, యచ్చట నున్న మహర్షులకు గనుసంజ్ఞనుఁ జేసెను.

తదా మహర్షయ స్సర్వే రామస్య భరతస్య చ,
సంవాదా ద్విస్మితా స్స్వాంతే భరతం త్వవదన్నితి. 17½

మహర్షులందరును రామభరత సంవాదమునకు మనస్సులలో విస్మయము నొందిన వారలై భరతునితో నిటులఁ బలికిరి.

[2] స ధన్యో యస్య పుత్త్రౌ ద్వౌ ధర్మజ్ఞౌ ధర్మవిక్రమౌ,
శ్రుత్వా వయం హి సంభాషా ముభయోః స్పృహయామహే. 18½

ఓ భరతా! దశరథున కిట్టి ధార్మికులగు మీరలు పుత్త్రులుగా నుద్భవించినందున నతడు ధన్యుడని చెప్పవలయును. మీయిర్వుర సంభాషణము వినిన కొలది యింకను వినఁ గుతూహలము మా కుదయించుచున్నది.

[3] భరత! శ్రుణు వాక్యం న స్సద్భక్త స్త్వం హితం వచః,
పిత్రాజ్ఞాపాల నేనాముం రాఘవం త్వనృణం వయమ్,
ఇచ్ఛామో భవతా గ్రాహ్యం రామస్య వచనం హితమ్.
పితృూణస్య విముక్తిస్తు కార్యా చ భవతా విభో. 19-20½

* ఇట్లు చెప్పుటచేఁ బ్రాయోపవేశము దరిద్రులగు బ్రాహ్మణులు చేయవలసినది కాని రాజులు చేయవలసినది కాదను ధర్మము సూచితమైనది. ప్రాయోపవేశప్రాయశ్చిత్తమునకుగా నన్ను స్పృశింపుమనియు నుదకమును స్పృశింపుమనియు జెప్పుటచే పెద్దలను స్పృశించుటయు, నుదకస్పర్శనమును ప్రాయశ్చిత్తమనికూడ సూచింపబడినది.

1. కవిః, 2. వా || రా || 3. కవిః,

ఓ భరతా! నీవు పరమభాగవతోత్తముడవు. నీహితమును గూర్చియే మేమును చెప్పుచున్నాము. కాన మావాక్యమును శ్రద్ధగా నాలకింపుము. రాముడు పిత్రాజ్ఞాపరిపాలనము చేసి తండ్రిని ఋణవిముక్తునిగాఁ జేయవలయునని మేమందరము కోరుచున్నాము. కావున రాముని హితవచనము నవశ్యముగా నీవు గ్రహించవలయును. పితృఋణవిముక్తి నీవు కూడ చేయవలసినదే కదా!

**వనవాసేన రామస్య లోకానాం సంభవే చ్ఛుభమ్,**
**తతో ఽస్మాకం వచో గ్రాహ్యం మా నిర్బంధయ రాఘవమ్. 21½**

ఓ భరతా! రాముని వనవాసమువలన బితృవాక్యపరిపాలనమే కాక లోకములకు కూడ క్షేమము కలుగును. కావున మా వచనమును నీవు గ్రహింపవలయును. రాముని నిర్బంధింపకుము.

**ఇత్యుక్తవత్సు సర్వేషు మహర్షిషు సురాస్తథా,**
**విమానసంస్థితాః సర్వే నిర్భయా ముదితా స్తదా. 22 ½**

ఇవ్విధముగ మహర్షులందరు చెప్పుచుండగా నాకాశమున విమానములందున్న దేవతలు విని రాముని వనవాసము స్థిరపడుననియు నందువలన రాక్షససంహారము కాగలదనియుఁ దలచి సంతసముతో నుండిరి.

**రామేణ సంజ్ఞితః పశ్చా ద్వసిష్ఠో భరతం ప్రతి,**
**ప్రాహేదం వచనం గుహ్యం తన్మాత్రశ్రుతిగోచరమ్. 23½**

పిమ్మట రాముడు వసిష్ఠునకుఁగూడ కనుసంజ్ఞ చేయగా వసిష్ఠుడు భరతుని సమీపించి యతనితో రహస్యముగా నిట్లు చెప్పఁదొడగెను.

**భూభారహరణార్థాయ హరిర్దేవైః పురార్థితః,**
**రామరూపేణ జాతో ఽభూ ల్లక్ష్మీస్సీతాజని ధ్రువమ్. 24½**

ఓ భరతా! నీకు రహస్యమును చెప్పెదను వినుము. వైకుంఠవాసి యగు విష్ణుమూర్తియే భూభారహరణార్థమై దేవతలచేఁ బ్రార్థింపఁబడి రాముడుగా నవతరించెను. లక్ష్మియే సీతగా నవతరించెను.

**శేషో ఽపి లక్ష్మణో జాతః రామ మన్వేతి సర్వదా,**
**వినాశం రక్షసాం కర్తుం గచ్ఛం త్యద్య వనం త్రయః. 25½**

శేషుడు లక్ష్మణుడుగాఁ బుట్టి రాముని ననుసరించెను. వీరు ముగ్వురును రాక్షససంహారము చేయుట కవతరించిరి. ఆకార్యమును చేయుటకే వీరు వనమునకు బయలుదేరి వెళ్ళుచుండిరి.

**త్వన్మాతు ర్వరదాన మాధ్యచరితం తస్యా వచో నిష్ఠురమ్**
**యద్యత్సర్వ మభూ త్పురా భరత తద్దై వాగతం చాఖిలమ్,**
**నోచే త్త్వజ్జననీ కథం రఘుపతిం సంభాషయే న్నిష్ఠురమ్**
**తస్మాత్సంత్యజ తన్నివర్తనమతిం నిర్గచ్ఛతా త్స్వాంపురీమ్. 26½**

ఓ భరతా! దశరథమహారాజు నీ తల్లికి వరముల నిచ్చుటయు, నిష్ఠురముగా కైకేయి మాట్లాడుటయు మొదలగు జరిగినదంతయు దైవవశముచే జరిగినది కాని, నీ తల్లిదోష మేమియు లేదు. అట్లు కాక పోయినచో నెంతయో ప్రేమపూర్వకముగాఁ జూచుకొను నీతల్లి రాముని గూర్చి యంత కఠినముగా మాట్లాడునా? ఇది యంతయు దైవమాయ కాన నీవు రాముని మరల్పవలయు ననెడి ప్రయత్నమునుండి మరలి యయోధ్యకు బయలుదేరుము.

**శ్రీ రామజననం లోకకల్యాణార్థ మభూ ద్ధ్రువమ్,**
**నాయోధ్యాయా మవస్థాతు మితి త్వం విద్ధి సత్తమ! 27½**

శ్రీరాము డవతరించినది లోకకల్యాణమునకై కాని యయోధ్యలో గూర్చుండుటకుఁ గాదని తెలియుము.

**భ్రాతృభావే రాఘవే త్వం విముంచాద్యైవ వా విభో,**
**వినాశం రక్షసాం కృత్వా ద్రుతం సోఽప్యాగమిష్యతి,**
**ఇదం రహస్యం భవతా గోపనీయం ప్రయత్నతః. 28-29**

నీవు రాముని విషయమై భ్రాతృభావమును విడిచిపెట్టుము. రాక్షస సంహారమునకై యవతరించెను కాన నాపని పూర్తిచేసి యయోధ్యకు దిరిగి రాగలడు. ఇది కడు రహస్యము; ప్రయత్నపూర్వకముగా, గోప్యముగా నుంచదగిన దని. (వసిష్ఠుడు భరతునితోఁజెప్పెను.)

**తన్నిశమ్య వసిష్ఠస్య వచనం విస్మయం గతః,**
**దైవాపచారతశ్చాపి పరితప్తస్సభాం గతః,**
**కింక ర్తర్యత్వమూఢోఽభూ ద్భరతస్తు తదా పునః. 30½**

వసిష్ఠుడు చెప్పిన వచనములను భరతుడు విని భ్రాతృద్రోహమునకే విచారపడుచున్న నాకు దైవాపచారముకూడ సంభవించినదని పరితాప పడుచు నేమి చేయుటకును దోచక సభలోఁ గూర్చుండెను

దేవతా స్త్వంబరే స్థిత్వా పశ్యంత స్సంస్థితా స్తదా,
వసిష్ఠాదికృతా ద్బోధా ద్భరతస్తు నిజం పురమ్,
గమిష్యతీతి తే సర్వే విచారం తత్యజు ర్హృది. 31-32

దేవతలు నాకాశమున విమానములందుండి యీ చిత్రమునంతను జూచుచు వసిష్ఠుడు మొదలగు వారలు బోధించిన రహస్యోపదేశముల వలన భరతుడు నిజపురమునకు వెళ్ళగలడనియు, తమకార్యము సఫలము కాగలదనియుఁ దలచి విచారమును వదలిరి.

ప్రకాశం ప్రాహ రామం తు వసిష్ఠోఽథ దృఢవ్రతమ్,
భరతప్రార్థనాం రామ సఫలాం కర్తుమర్హసి. 33

అనంతరము వసిష్ఠుడు దృఢవ్రతుడగు రామునితో బైకి నిటుల(బలికెను. ఓ రామచంద్రా!భరతు డిన్నివిధముల నిన్నుఁ బ్రార్థించుచున్నందున నతని యాచనను సఫలము చేయుము

ఇత్యుక్తో రాఘవః ప్రాహ వసిష్ఠం శిష్టసంమతమ్,
భరతస్య చ మే నూనం భవా న్పితృసమో గురుః,
యథా వదే ద్భవా నావా మాచరావ స్తథా గురో. 34½

వసిష్ఠుడిట్లు చెప్పగా రాముడు తిరిగి వసిష్ఠునితో శిష్టసమ్మతమగు నటుల నిటుల బలికెను. ఓ గురువర్యా! నాకును భరతునకును మా యిర్వురకును నీవు పితృసమానుడవును, గురువును గాన మా యిర్వురకు క్షేమము గలుగునటుల నీవే యాలోచించి చెప్పుము. మే ముభయులము నీవు చెప్పిన విధముగ నాచరించెదము.

ఇత్యుక్తః ప్రాహ వచనం విచార్య ద్వావుభౌ గురుః,
పిత్రాజ్ఞాపాలనాయాహం వనం యామీతి వైభవాన్,
నాగచ్ఛేద్యది సాకేతం భవా న్ప్రాయోపవేశనమ్,
కరిష్యామీతి భరతో వదతః కిం కరోమ్యహమ్. 35-36½

రాముడిట్లు చెప్పుటతోడనే వసిష్ఠు డాలోచించి యా యిర్వురితో నిటులఁజెప్పెను. ఓ రామచంద్రా! పితృవాక్యపరిపాలనమునకై యడవికి వెళ్లెదనని నీవును, నీవు పురమునకు రానియెడల తాను ప్రాయోపవేశముచేసి శరీరమును విడిచిపెట్టెదనని భరతుడును మీ యిర్వురును పరస్పరము విరుద్ధముగ మాట్లాడుచుంటిరి. నే నేమి చేయుదును.?

**తథాఽప్యహం ద్వయోః ప్రీత్యై విచార్యైవం వచః పునః,**
**వదా మ్యాచరతాం రామ ద్వౌ యువాం తు తథా పునః. 37 ½**

అయినను మీ యిర్వురను సంతోషపెట్టుటకై యీ క్రింది విధముగ నాలోచించి చెప్పుచుంటిని, మీర లిర్వురును విని నేను చెప్పినట్లు నడుచుకొనుడు.

**భరతాద్య భవాన్ తాత యాచతాం రామపాదుకే,**
**పాదుకే తే ధ్రువం తస్య రాజ్యం వై పాలయిష్యతః. 38½**

ఓ భరతా! నీవు రాముని పాదుకలను యాచించి తీసికొనుము. ఆ రాముని పాదుకలే రాజ్యమును బరిపాలింపగలవు.

**ఇత్యుక్తో భరతః ప్రాహ రాఘవం భక్తి పూర్వకమ్,**
**రామ తే పాదుకే దేహి మహ్యం భూపాలనాయ వై,**
**తయో స్సపర్యాం కుర్వాణో వసేయం త్వత్ప్రతీక్షకః,**
**ఇత్యుక్త్వా పాదుకే దివ్యే యోజయామాస పాదయోః,**
**రామస్య తే దదౌ రామో భరతాయాతిభక్తితః. 39-41**

ఇవ్విధముగ వసిష్ఠుడు చెప్పగా భరతుడు చేయునది లేక భక్తి పూర్వకముగ రాముని నిట్లు ప్రార్థించెను. అన్నా! రామచంద్రా! రాజ్యపాలనమునకై నీ పాదుకలను సమర్పింపుము. ఆ పాదుకలకు సేవచేయుచు నీ రాకకు నిరీక్షించుచుండెదను. ఇట్లు చెప్పి సువర్ణ పాదుకలను భరతుడు రాముని పాదములకుఁ దొడుగగా రాముడును తన పాదములకుఁ దొడిగిన పాదుకలను ప్రేమపూర్వకముగ భరతున కిచ్చెను.

**గృహీత్వా పాదుకే దివ్యే భరతో రత్నభూషితే,**
**రామం పునః పరిక్రమ్య ప్రణనామ పునః పునః,**
**భరతః పునరాహేదం భక్త్యా గద్గదయా గిరా,**
**నవపంచసమాంతే తు ప్రథమే దివసే యది,**
**నాగమిష్యసిచే ద్రామ ప్రవిశామి మహానలమ్. 42-43½**

సువర్ణరత్నభూషితములగు నా రామపాదుకలను భరతుడు శిరసావహించి రామునకు నమస్కరించి గద్గదస్వరముతో రామునితో నిటుల జెప్పెను. అన్నా రామచంద్రా! పదునాలుగు సంవత్సరములు వెళ్ళు దినమునకు నీవు రానియెడల నేనగ్ని ప్రవేశము చేసెదను. ఇది నిశ్చయము.

**బాఢమిత్యేవ తం రామో భరతం సంన్యవర్తయత్,**
**భరతోఽపి తతో మంత్రిపురోహితముఖై ర్జనైః,**
**జననీభిః ప్రజాభిశ్చ సహితో గంతు ముద్యతః. 45½**

రామచంద్రమూర్తియు నటులే యని యంగీకరించి భరతున కనుజ్ఞ నొసగెను. భరతుడును మంత్రి పురోహితాది జనులతోడను తల్లుల తోడను ప్రజలతోడను బయలుదేరి యయోధ్యకు బయన మగుట కుద్యుక్తు డయ్యెను.

**జనకోఽపి తదా రామ మామంత్ర్య విధివైభవమ్,**
**మన్వానోఽచింత్య మతులం సీతా మాశ్వాస్య నిర్గతః 46½**

జనకుడును రాము నడిగి విధివైచిత్ర్య మచింత్యమని తలచుచు సీతనోదార్చి మిథిలాపురమునకుఁ బయనమై వెళ్లెను.

**సాశ్రునేత్రాఽఽహ కైకేయీ రామ మాహూయ వై రహః,**
**పట్టాభిషేకవిఘ్నం తే కృత్వా దుష్టాభవం సుత!**
**మాయయా మోహితా తేఽహం తథాఽకరవ మాత్మజ!**
**నోచేత్త్వా మౌరసాచ్చాపి దృష్టవత్యా మమాధికమ్,**
**తత్కాలే దుష్టబుద్ధిస్తు సముద్భూతా కథం భవేత్. 47-48½**

కైకయును కంటి వెంట నీరు కార్చుచు రాముని రహస్యముగా బిలిచి యిట్లు పలికెను. రామచంద్రా! నీ పట్టాభిషేకమునకు విఘాతము చేసి నేను కడు తప్పిదమును జేసితిని. నీ మాయచే మోహితురాలనై యటులఁజేసితిని. లేనియెడల భరతుని కంటెను నతిప్రేమతో నిన్ను జూచుకొను నా కిట్టి దుష్టబుద్ధి యెట్టు కలుగును?

**యేన కేన ప్రకారేణ తవాహం కృతవ త్యఘమ్,**
**మమాపరాధం రామ! త్వం క్షమస్వాజ్ఞానతః కృతమ్. 49½**

ఏ విధముచేతనైనను నీ కపరాధము చేసినదాన నైతిని. అజ్ఞానముచేఁ జేసిన నా యపరాధమును క్షమింపుము.

**భూభారహరణార్థాయ హరిరేవ పరాత్పరః,**
**త్వద్రూపేణావనీ త్యస్మిన్ లోకేఽస్తి చ జనశ్రుతిః. 50½**

భూభార హరణార్థమై శ్రీహరియే నీ రూపముగ ఈ భూలోకమున నవతరించినట్లు ప్రథకూడ నున్నది.

**ఆచరం తాదృశస్యాస్య పాపకృత్యం మహం తవ,**
**కథం మే పాపముక్తి స్స్యా త్త్వద్ద్రోహిణ్యా మమాత్మజ! 51½**

అట్టి దైవాంశ సంభూతుడ వగు నీ కపకారమును నేను చేసితిని. నీకు ద్రోహము చేసిన నాకుఁ బాపవిముక్తి యెట్లగునో కదా?

**కరోమి తే నమస్కారం విస్మృత్యా యాహి మత్కృతమ్,**
**నోచే న్మమాపవాదస్తు కథం నశ్యే త్పుత క్షితౌ.**
**ఇత్యుక్తో రాఘవః ప్రాహ కైకేయీం సస్మితాననః. 52-53**

నీకొక నమస్కారము చేసెదను. నాయపరాధమును మరచి పురమునకు రమ్ము. లేనిచో నాకు లోకములో వచ్చిన యపవాద మెట్లు నశించును? ఇట్లు కైక చెప్పగా రాముడు మందహాసము చేయుచు నిటులఁ జెప్పెను.

**దైవీవా గ్జనని ధ్రువం కిల మయా సంప్రేరితా త్వాం తదా,**
**త్వావిష్టా దివిజార్థసిద్ధయ ఇదం సర్వం తయా కారితమ్,**
**త్వద్దోషస్తు న లేశతోఽస్తి జనని త్వం పశ్య రూపం మ మే**
**త్యుక్త్వాఽఽదాన్నిజ దివ్యదృష్టి మతులాం తస్యైముదా రాఘవః! 54**

తల్లి! కైకేయి! నీవు పరితాపపడకుము. దైవవాణి నాచేతనే ప్రేరేపింపబడి దేవతాసాధనమునకై నీ చేత నీకార్యమును జేయించెను. నీదోషము లేశముకూడ లేదు. దివ్యదృష్టి నిచ్చెదను. నారూపము నొకపర్యాయము చూడుమని దివ్యదృష్టినిచ్చెను.

**దృష్ట్వా తద్దివ్యరూపం తు పుత్త్రభావం విహాయ సా,**
**రాఘవం ప్రాహ శిరసా నత్వా ప్రాంజలిసంయుతా. 55**

కైకేయియును రాముని దివ్య రూపమునుఁ జూచి రామునియందు పుత్రభావమును విడిచి భగవద్భావన కలదై చేతులు జోడించి నమస్కరించి యిట్లు పలికెను.

**అద్య ప్రతీతోఽసి మమ దేవానా మప్యగోచరః,**
**మాం పాలయ జగన్నాథ! భక్తానుగ్రహ! తే నమః. 56**

రామచంద్రా! నీవు దేవతలకు నగోచరుడవను విషయము నాకిపుడు తెలిసినది. భక్తరక్షకా! జగన్నాయకా! నీకు నమస్కారము, నన్నుఁ బరిపాలింపుము.

**ఛిత్త్వా మే మోహపాశం త్వం విజ్ఞానం దేహి రాఘవ!**
**తచ్ఛ్రుత్వా వచనం రామః ప్రాహేదం కైకయీం ప్రతి. 57**

మోహపాశమును త్రెంచివైచి విజ్ఞానమును గలుగఁ జేయుము - అని యిట్లు ప్రార్థించుచున్న కైకతో రామచంద్రమూర్తి యిటులఁ బలికెను.

**అంబ! త్వం త్యజ హార్దతాప మఖిలం భక్త్యా తు మాం భావయ**
**త్వం ముక్తా చ భవే స్తయా విమలయా భక్త్యా గతస్నేహయా,**
**లోకే ద్వేష్యమ నాస్తి మిత్రమపి నో సర్వత్ర చాహం నమః**
**కల్పం మాం భజతోఽహమ ప్యనుభజా మ్యంబ ధ్రువం సర్వదా. 58**

తల్లీ! హృదయతాపమునంతను విడిచి పెట్టుము. నన్ను సర్వదా మనమునందు భావింపుము. స్నేహరహితమగు నిర్మలభక్తిచే నీవు ముక్తిని జెందెదవు. లోకములో నాకు మిత్రుడు కాని శత్రువు కాని లేడు. నా కందరును సమానులే. కల్పవృక్షము తనను భజించు వారలకు సకలాభీష్టముల నొసగునట్లు నన్ను భజించువారలకు నేనటుల సకలాభీష్టముల నొసగెదను.

**ఇతి తస్య వచశ్శ్రుత్వా కైకేయీ ముదితా తతః,**
**ప్రణమ్య మనసాఽఽ మంత్ర్య రాఘవం సా వినిర్గతా. 59**

ఇట్లు రాముడు చెప్పగా విని కైకయు సంతోషించినదై నమస్కరించి రాముని మనసార వేడి వీడుకొలిపిబయలుదేరెను.

తతస్స్వమూర్ధ్నా ధృతరామపాదుకో
వసిష్ఠజాబాలిముఖై ర్నృపాత్మజః
ఆత్మీయమంత్రి ప్రముఖై ర్జనై ర్యుతః
*ప్రదక్షిణీ కృత్య గిరిం వినిర్గతః. 60

* పిమ్మట భరతుడును రామపాదుకలను శిరస్సునందు ధరించి వసిష్ఠుడు జాబాలి మొదలగు పురోహితులతోడను, మంత్రివర్గముతోడను, పౌరులతోడను, తల్లులు మొదలగు వారలతోను బయలుదేరి చిత్రకూటమునకుఁ బ్రదక్షిణపూర్వకముగ నడుచుచుండెను.

తతః క్రమా ద్రథారూఢః ప్రతస్థే భరతః పునః,
శత్రుఘ్నసహితో పార్శ్వాద్గిరే స్సైన్యం ప్రచోదయన్. 61½

అనంతరము భరతుడు శత్రుఘ్న సహితముగ రథారూఢుడై బయలుదేరి చిత్రకూటమునకు పార్శ్వభాగమునుండి సైన్యమును నడువ బ్రోత్సహించెను.

తచ్చిత్రకూటాద్రిసమీప సంస్థితం
దృష్ట్వా భరద్వాజమునే రథాశ్రమమ్
రథావరోహం తు విధాయ సత్వరం
వినీత వేషో భరత స్త్వగాన్మునిమ్. 62 ½

ఆ చిత్రకూటమునకు సమీపములో నున్న భరద్వాజాశ్రమమునకు భరతుడు క్రమముగ వచ్చి తాను రథమునుండి దిగి వినీతవేషముతో నమ్ముని సమీపమున కేగెను

శిరో ఽవతంసీకృతతత్పదాంబుజో
ప్రహృష్టతత్పృష్టనిజ ప్రవృత్తిమాన్
సర్వం చ తస్మై భరతో ఽబ్రవీ త్తతో
మునిశ్చ సంతుష్య త మాహ సద్వచః. 63

---

* అనేన పుణ్యవనస్పతి పర్వతాదయః ప్రదక్షిణనమస్కారాదిభిః పూజనీయా ఇతి సూచితం

* భరతుడు గిరికి ప్రదక్షిణ పూర్వకముగ బయలుదేరె ననుటచే పుణ్యకరమైన పర్వతములు మొదలగువానినిఁ బ్రదక్షిణ నమస్కారములు మొదలగువానిచేఁ బూజింపవలయునని సూచింపఁబడినది

పిమ్మట భరతుడు మునిచరణకమలములకు నమస్కరింపగా నమ్మునియును సంతోషించి క్షేమసమాచారముల నడిగెను. భరతుడు చిత్రకూటము నందు జరిగిన సమాచారమునంతను భరద్వాజునకు విన్నవింపగా నమ్మునియు సంతోషించి భరతునితో నిటులఁ బలికెను.

**1*అమృత స్స మహాబాహుః పితా దశరథ స్తవ,**
**యస్య త్వ మీదృశః పుత్రః ధర్మజ్ఞో ధర్మవత్సలః. 64**

* ఓ భరతా! ఇట్టి ధార్మికుడవగు పుత్రుడవు. నీవు దశరథున కుద్భవించుటవలన నీతండ్రియగు దశరథుడు మృతి నొందినను సజీవుడనియే చెప్పవచ్చును.

**ఇతి తం భరతం సంతం భరద్వాజో విశేషతః,**
**సంశ్లాఘ్య చాశిషః కృత్వా చానుజ్ఞాం గంతు మప్యదాత్. 65**

ఈ ప్రకారము భరద్వాజుడు సజ్జనుడగు భరతుని విశేషముగఁ గొనియాడి యాశీస్సును జేసి గమనమునకై యనుజ్ఞ నిచ్చెను.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యాకాండే ద్వితీయ భాగే చతుర్దశ స్సర్గ స్సమాప్తః
ఆశ్చర్య రామాయణము అయోధ్యాకాండమున
ద్వితీయభాగమున పదునాల్గవసర్గము సమాప్తము.

---

* అనేక ధార్మికపుత్రేణ సతా మృతోఽ ప్యమృత ఏవేతి సూచితం.

* ఇట్లు చెప్పుటచే ధార్మికుడగు కుమారునివలనఁ దండ్రి మృతి నొందినను మృతినొందనివాడను ధర్మము సూచితము.

---

1. వా ॥ రా ॥

## పంచదశస్సర్గః - పదునైదవ సర్గ

[1] తతోమునివతంసం తం త్వభివాద్య కృతాంజలిః,
ఆమంత్ర్య భరత స్తస్మా దాశ్రమా న్నిర్యయౌ ద్రుతమ్. 1

అనంతరము భరతుడు మునిశ్రేష్ఠుడగు భరద్వాజమహర్షికి సాష్టాంగ నమస్కారము చేసి యనుజ్ఞ నొంది యా యాశ్రమమునుండి యయోధ్యకు బయలుదేరెను.

గ. తదను మంత్ర్యధిపతి పురోహితపౌరజనసహితో భరతః పరితస్సంచలదనేక చతురంగ బలచరణవిదలితమహీతల సత్వరసముదిత విస్పృత్వరపరాగపరంపరావృతదినకరకరప్రకరః స్వసైన్యకోలాహలబధిరీకృత భువనోదరః, కళింగనందినీం సముత్తీర్యక్రమేణ భగీరథమనోరథ పరిపూర్ణవ్యాజేన సకలజనపావనీకరణాయ సకరుణ మవని మవతీర్ణాం దురధిగమవిధిసదన సౌధాధిరోహణసోపానవీథికాయమానతరంగపరంపరాం, శంకరవిశంకట జటాపటలఘటిత సుధాకర చిరసహవాసవశాదివ నితాంతమధుర శీతల తోయాం భగవతీం భాగీరథీమపి సముత్తీర్య, శృంగిబేరపురం గతస్సన్నికృష్టతయా స్ఫుటతరపరిదృశ్యమానసముత్తుంగ గోపుర సౌధశృంగాం, భగ్నచమూమివ విపత్తి మాపన్నాం, ఆవాహన సమయప్రశాంతమంత్ర ఘోషయజ్ఞభూమిమివ విలీనకోలాహలాం వృషభవిరహవిధుర ధేనుమివ దురంతచింతా సమాక్రాం తాం, వాసంతికలతామివ పరిమ్లానరూపాం, నిశీథినీనభఃస్థలీమివ నిష్ప్రకాశాం, విలీనామివ వాదిత్రనిస్వనైః, విత్రస్తామివ వేదఘోషైః, అస్తమితామివ ధూపవాతైః, ప్రశాంతామివ మద్యగంధైః, ప్రణష్టామివ చతురంగబలైః, సురాసురైరప్యయోధ్యా మయోధ్యాం విలోక్య బహువిధం ప్రలపన్ సగద్గద మిద మవాదీత్.

పిమ్మట భరతుడు మంత్ర్యధిపతి పురోహిత పౌరజనసమేతుడై యంతట నడచుచున్న చతురంగబలముల పాదములక్రింద నలిగిన భూమియందలి పరాగపరంపరలచే సూర్యమండలమును గూడ గప్పివేయుచుఁదన సైన్యముల యందలి కోలాహలముచే బ్రహ్మాండ కటాహమును బధిరమునుగాఁజేయుచు స్వల్పకాలములోనే యమునానదిని సమీపించి యా నదిని దాటి భగీరథ

1. కవిః

మనోరథమును బూర్తిచేయుటయను మిషచే సకల జనులను బావనము చేయుటకు భూమి కవతరించి నదియును, పొంద నశక్యమగు బ్రహ్మ సౌధము నెక్కుటకు సోపానములవలె నాచరించు తరంగ పరంపర గలదియును, శంకరుని జటాపటలమున గూర్చబడిన చంద్రకళతో చిరసహవాసమువలనువలె మిక్కిలి చల్లని మధురజలము గలదియును, పూజ్యారాలునగు గంగనుగూడ\u0c01గ్రమముగా దాటి శృంగిబేరపురమునకు వచ్చి యచ్చటకు సమీపమునందుండుటచే స్పష్టముగఁ గన్పడుచున్న యున్నతమైన మేడలు గలదియును, శత్రువులవలన భిన్నమైన సైన్యమువలె నాపదను బొంది యున్నదియును, ఆవాహన సమయమున శాంతించిన మంత్రఘోషము గల యజ్ఞభూమివలెఁగోలాహల మేమియు లేనిదియును, ఆబోతుయొక్క వియోగముచేఁ బరవశమై యుండు గోవువలె దురంతచింతాక్రాంతమైనదియును. వసంతఋతువునందలి లతవలె వాడియున్నదియును, రాత్రియందాకాశమువలెఁ బ్రకాశము లేనిదియును, వాద్యఘోషము లేనిదియును, శాంతించిన వేదఘోషము కలదియును, అస్తమించిన ధూపవాయువులు కలదియును, శాంతించిన మద్యగంధము గలదియును, చతురంగబలము నష్టమయ్యెనా యనునట్లున్నదియును, దేవదానవులకు గూడ యుద్ధము చేయ నశక్యమైన యా యయోధ్యాపురమును జూచి యనేక విధములుగ భరతు డిటుల విలపింపఁదొడగెను.

**[1]కదా ను ఖలు మే భ్రాతా మహోత్సవ ఇవాగతః,**
**జనయిష్య త్యయోధ్యాయాం హర్షం గ్రీష్మ ఇవాంబుదః. 3**

నా యన్న యగు రాము డెప్పు డీ యయోధ్యకు మహోత్సవముతో వచ్చి గ్రీష్మములో మేఘునివలె హర్షమును కలుగఁజేయునో కదా?

**తరుణై శ్చారువేషైశ్చ నరైరున్నతగామిభిః,**
**సంపతద్భి రయోధ్యాయాం న విభాంతి మహాపథాః. 4**

అయ్యో! పూర్వ మీ యయోధ్యలో రాజవీథులు, వస్త్రాలంకారములచే నలంకరించుకొని యందముగ నుండు యువకులచేఁ బ్రకాశించిన విధముగ నిపుడు ప్రకాశించుట లేదుకదా!

1. కవిః

ఇత్యుద్గ తాశ్రునిష్యందిలోచనో భరత స్తతః,
ఆవివేశ మహారాజభవనం వనసన్నిభమ్. 5

ఇట్లు భరతుడు విలపించుచుఁ గన్నీరు గార్చుచు వనము వలె నున్న మహారాజభవనమును బ్రవేశించెను.

నివేశ్య జననీ స్తత్ర భరత శ్శోకకర్శితః,
వసిష్ఠాదీ న్గురూ న్నత్వా ప్రాహేదం వచనం తు తాన్. 6

అనంతరము దృఢవ్రతుడగు భరతుడు తల్లుల నయోధ్యలో నుంచి దుఃఖించుచు వసిష్ఠుడు మొదలగు గురుజనులతో నిటులఁ బలికెను.

[1]నందిగ్రామం గమిష్యామి సర్వా నామంత్రయే ద్య వః,
తత్ర దుఃఖ మిదం సర్వం సహిష్యే రాఘవం వినా. 7

ఒపూజ్యులారా! మిమ్ముల నందరను సెలవడుగుచున్నాను. నాకు సెలవిండు. నందిగ్రామమునకు వెళ్లి యచ్చటనే యీ రామవియోగ దుఃఖమును సహించగలను కాని యిచ్చట సహింపలేను.

గతశ్చ హి దివం రాజా వనస్థశ్చ గురుర్మమ,
రామం ప్రతీక్ష్యే రాజ్యాయ స హి రాజా మహాయశాః. 8

రాజగు దశరథుడా స్వర్గస్థు డాయెను. అన్నయగు రామచంద్ర మూర్తియా వనవాసి యయ్యెను. మహాకీర్తిమంతుడగు రామచంద్రమూర్తి రాజు కాదగినవాడు.

కాన రాజ్యాభిషేకమునకై రాముని రాకకై నిరీక్షించుచు నందిగ్రామములోఁ గాలము గడుపుచుందును.

2గ. తదను తద్వచన మత్యాదర మాకర్ణ్య సహామాత్యైర్వసిష్ఠముఖైః పురోహితై రపి సాధుసాధ్వితి సశ్లాఘ మభ్యనుజ్ఞాత శ్శిరసివిహిత రామ పాదుకో భరత స్సారథిసమానీతం రథమారుహ్య పురస్కృతగురుజన స్తత్క్షణ మనాహూతసమాగతై స్సకలపౌరజనసైనికై స్సమభిగమ్యనందిగ్రామ మవతీర్య రథోత్తమా దశేషజనహిత మిద మభిహితవాన్. 9

1. వా ‖ రా ‖ 2క ‖

అ భరతుని వచనము మంత్రిసామంత పురోహితులు మొదలగువారు నత్యాదరముతో విని సంతోషపడి బాగుబాగని భరతునిఁ గొని యాడగాఁ బిమ్మట భరతుడు రామపాదుకలను శిరమునందుంచుకొని సారథిచేఁ దీసికొనిరాబడిన రథము నెక్కి గురుజనమును ముందుంచుకొని పిల్వకుండగనే తనవెంట వచ్చుచున్న సకలపౌరజన మంత్రి పురోహితాదులతో బయలుదేరి నందిగ్రామము చేరి యచ్చట రథమునుండి దిగి సర్వజనహిత మగు వాక్యముల నిటుల బలికెను.

భ్రాత్రా హి మయి సంన్యాసో నిక్షిప్త స్సౌహృదాదయమ్,
త మిమం పాలయిష్యామి రాఘవాగమనం ప్రతి. **10**

రామచంద్రమూర్తి సుహృద్భావముచే రాజ్యమును, నాయందు న్యాసముగా నుంచెను. రామచంద్రుని రాకను నిరీక్షింపుచు నతడు వచ్చుదనుక జాగ్రత్తగఁ గాపాడుచుండెదను.

రామేభిషేకమాపన్నే సంతుష్టే సకలే జనే,
తదా మమ భవేత్కీర్తిః పాలనా దధికా చ ముత్. **11**

జనులు సంతోషించునట్లు రామచంద్రమూర్తి తిరిగి యయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడైనపుడు నాకు సంతోషము, కీర్తియు, రాజ్యపాలనముకంటెఁ జతుర్గుణము (నాల్గురెట్లధికము) గఁ జేకూరును.

ఇత్యుక్త్వాఽథ శుభే లగ్నే కార్తాంతికవినిశ్చితే,
స్వస్తిపూర్వం శుభే గేహే న్యస్తవా న్పాదుకే తు సః. **12**

ఇవ్విధముగ భరతుడు చెప్పి జ్యోతిర్విదులచే నిశ్చయింపఁబడిన యా శుభలగ్నమునందు స్వస్తివాచక పూర్వకముగ రామపాదుకలను నొక శుభ మందిరమునఁ బ్రవేశపెట్టెను.

పాదుకే త్వభిషిచ్యాథ నందిగ్రామేఽవసత్తథా,
సవాలవ్యజనం ఛత్రం ధారయామాస వై స్వయమ్. **13**

అనంతరము నందిగ్రామమున పాదుకాపట్టాభిషేకము యథావిధిగఁజేసి యా సమయమున ఛత్రచామరములను తాను స్వయముగ ధరించెను.

రత్నసింహాసనే దివ్యే సంస్థాప్య భరత స్స్వయమ్,
పాదుకే పూజయ న్నిత్య *మష్టపుష్పై రువాస సః. 14

*భరతుడు రత్నసింహాసనమునందు పాదుకల నుంచి ప్రతినిత్యము అష్టవిధములగు పుష్పములచేఁ బూజించుచుండెను. రాజశాసనము లన్నిటిని భరతుడు పాదుకలకు నివేదించుచుండెను.

**భరతః ప్రత్యహం స్వేన క్రియమాణం కృతం చ యత్
కార్యజాతం నృపానీత ముపాయనచయం తథా
ఆదాయం చ వ్యయం చాపి పాదుకాభ్యాం న్యవేదయత్. 15½

**ఎప్పుడెప్పు డేకార్యము చేయబడుచుండునో, గొప్ప విలువగల యేకానుకలు తీసికొనిరాబడుచుండునో, వాని నన్నిటిని భరతుడు ముందుగ రామపాదుకలకు నివేదించి పిమ్మట నాచరణలోఁ బెట్టుచుండును.

---

* అష్టపుష్పై రితి-అహింసా ప్రథమం పుష్పం| పుష్పమింద్రియనిగ్రహః| సర్వభూతదయా పుష్పం క్షమా పుష్పం విశేషతః| శాంతిపుష్పం తపః పుష్పం దానపుష్పం తథైవ చ| సత్య మష్టవిధం పుష్పం విష్ణుప్రీతికరం భవేత్|| ఇతి||

* ఎనిమిది పుష్పముల వివరము:- అహింస మొదటిపుష్పము; ఇంద్రియనిగ్రహము రెండవపుష్పము, భూతదయ మూడవ పుష్పము, సహనము నాలుగవ పుష్పము, శాంతి యైదవపుష్పము, తపస్సు ఆరవపుష్పము, దానము ఏడవపుష్పము, సత్యము ఎనిమదవపుష్పము. ఈ యెనిమిది పుష్పములే భగవంతునకుఁబ్రీతికరములుగాని సామాన్య పుష్పములు కావని సూచింపబడినది.

** నను పుర్వోక్త వచనజాతేన రామభద్రదత్తపాదుకా పురస్కారేణ రాజ్యం భరతః కృతవానితి గమ్యతే-తత్ర హి పాదుకాప్రదాతా రామో రాజా, అథవా తద్దత్తే పాదుకే, అథవా భరతః ఉత న కోఽపీతి, నాద్యః,"భరతో భజతా మద్య యౌవరాజ్య మకంటక" మితి కైకేయీ ప్రార్థితస్వతంత్ర రాజ్యనిర్వహణాభావేన పితు రసత్య ప్రతిజ్ఞత్వం స్యాత్, న ద్వితీయః, అచేతనాయాః పాదుకాయాః దుష్టనిగ్రహశిష్టపాల నాత్మకచేతన కార్యాధికార సంభవాత్, న తృతీయః- "దారాగ్నిహోత్రరాజ్యాని యః కుర్యాదగ్రజే స్థితే| పరివేత్తా స విజ్ఞేయః పరివిత్తిస్తు పూర్వజః"ఇతి స్మృతివచనబలాత్పరివేత్తృత్వదోషాపత్తి స్స్యాత్, న చాభ్యనుజ్ఞాతత్వేన భిన్న మాతృప్రసూతత్వేన చ పరివేత్తృత్వదోషోఽస్తీతి చేత్తథాపి భరతస్య స్వాతంత్ర్యేణ రాజ్యకర్తృత్వే" పాదు కేత్వభిషిచ్యాథ నందిగ్రామే వస త్తథా" ఇత్యాది వచనావగతపాదుకా పట్టాభిషేకవాలవ్యజనధారణ రాజ్యతంత్ర నివేదనాదిక మనుపపన్నం స్యాత్.

న తురీయః - తథా సతి రాజ్యస్యారాజకత్వాపత్త్యా "నారాజకే జనపదే విద్యున్మాలీ మహాస్వనః" ఇత్యాదీనా మరాజకరాజ్యధర్మాణాం ప్రవృత్తిప్రసంగా దితిచే దుచ్యతే -

భరత ఏవ స్వతంత్రో రాజా "నందిగ్రామేఽకరో ద్రాజ్యం భరతో మంత్రిభిస్సహ" ఇత్యాదివచనేన రాజ్యకరణప్రతీతేః, కించ, పూజితా మామికా మాతా దత్తం రాజ్య మిదం తవ, తద్దదామి పున యథా త్వమదదా మమ" ఇతి వచనేన భరతకర్తృక రాజ్యసంప్రదానక

రాజ్య ప్రదానాపగమాత్, అన్యథా" భరతో భజతా మద్య యౌవరాజ్యమకంటకం" ఇతి కైకేయీప్రార్థిత వరనిర్వాహాభావేన పితు రసత్య ప్రతిజ్ఞాత్వం స్యాత్, అతి ఏవ-నందిగ్రామే ఒకరో ద్రాజ్యం రామాగమనశంకయా" ఇతి వచనమపి సంగచ్ఛతే. పాదుకాపురస్కారవర్ణనం తు పరివేత్తృత్వదోష లోకాపవాద నివృత్త్యర్థక మితి వేద్యం.

** పూర్వోక్త వచనములవలన రామచంద్రునిచే నీయబడిన పాదుకలనుఁ బురస్కరించుకొని భరతుడు రాజ్యమును బాలించినట్లు తోచబడుచున్నది. ఇచ్చట నొక యాశంక కలుగుచున్నది.

1 రాజు, పాదుకల నిచ్చిన రాముడా? 2 లేక, రాజు, రామునిచే నీయబడిన పాదుకలా?3 లేక రాజు, భరతుడా? లేక, 4 రాజెవడును లేడా? అని, 1 " యౌవరాజ్యమును భరతుడు పొందుగాక" యని కైకేయి ప్రార్థించిన విధముగ భరతుడు స్వతంత్రముగ రాజ్యమును బాలింపనందున దశరథున కసత్యప్రతిజ్ఞతా దోషము వచ్చునుగాన రాముడు రాజని చెప్ప వలనుపడదు.

2 అచేతనములయిన పాదుకలకు దుష్టశిక్షణ శిష్ట పరిపాలన రూపమగు చేతనకార్యాధికారము సంభవింపదుగాన పాదుకరాజని చెప్పుటకును వలనుపడదు.

3. జ్యేష్ఠుడు (అన్న) ఉండగా, తమ్ముడు వివాహమాడకూడ దనియు, జ్యేష్ఠుడు యజ్ఞాదులను జేయు నపుడు తమ్ముడు యజ్ఞాదికర్మలు చేయగూడదనియు, అన్న యుండగా తమ్ముడు రాజ్యమును బాలింపగూడదనియు, నటుల నాచరించినచో తమ్ముడు పరివేత్త యను దోషము గలవాడగు ననియు, అన్న పరివిత్తియని చెప్ప బడుననియు (మనువు చెప్పెను) కాన, రాముడుండగ భరతుడు రాజ్యమును బాలించిన పరివేత్తృత్వదోషము గలవాడగును. కాన, భరతుడు రాజ్యమును బాలించిన పరివేత్తృత్వదోషము లేదనినను భరతుడు స్వయముగ రాజ్యమును బాలించినట్లు చెప్పుపక్షమున "భరతుడు పాదుకలకు బట్టాభిషేకముచేసి నందిగ్రామములో నుండెనను" వాల్మీకి వచనము నాలోచింపగా భరతుడు స్వయముగా పాదుకాపట్టాభిషేకము చేయుట ఛత్రచామరములను బట్టుట మొదలగు కథ యనుపపన్న మగును కావున, భరతుడు రాజని చెప్పవలనుపడదని తెలియనగును. 4 రాజ్య మరాజకము కావలసివచ్చును గావునను" అరాజక మగు దేశములో మేఘుడు వర్షింపడు" అను వచనముచే నరాజకధర్మము లన్నియు రాజ్యములోఁగలుగవలసి వచ్చునుగాన రాజెవడును లేడని చెప్పుటకు వలనుపడదు. కానపై నలువురు రాజని చెప్పుటకు వలనుపడదుగాన బ్రకృతమున రాజెవరని యాశంక కలుగగా సమాధానము చెప్పబడుచున్నది:- భరతుడే స్వతంత్రమైన రాజని చెప్పవలయును," భరతుడు నందిగ్రామములో మంత్రులతో గూడి రాజ్యమును బాలించెను." అను వాల్మీకి వచనమును విచారించిన రాజ్యమును భరతుడు చేసినట్లు స్పష్టమగును. ఇదియునుంగాక రాము డయోధ్యకు వచ్చినప్పుడు "అన్నా! రామచంద్రా! నా తల్లిని నీవు గౌరవించితివి. నీవు నా కిచ్చిన రాజ్యమును దిరిగి నీ కిచ్చుచున్నాను. నీ వెట్లిచ్చితివో యట్లుగానే యిచ్చుచుంటినను భరతవచనము నాలోచించినను భరతు డిచ్చువాడు రాముడు పుచ్చుకొనువాడుగా, గన్పడుచున్నందునను భరతుడే స్వతంత్రరా జనవలయును. లేక పోయిన" భరతుడు యౌవరాజ్యమును పొందుగాక" యను కైక ప్రార్థన వ్యర్థమగును. కావున తండ్రి కసత్యప్రతిజ్ఞాత్వము కూడ కలుగును. కావుననే; " రాముని రాకకై నిరీక్షించుచు నందిగ్రామములో భరతుడు రాజ్యమును జేసెను" అను వాల్మీకివచనము సంగతమగుచున్నది. పాదుకాపురస్కారవర్ణనమున కర్థమేమి యన భరతునకుఁ బరివేత్తృత్వ దోషము లేకుండుటను, లోకాపవాదము లేకుండుటకునని తెలియవలెను.

రాజోపచారై రఖిలైః ప్రత్యహం పాదుకేఽర్చయన్
ఫలమూలాశనో దాంతః జటావల్కలధారకః.
అధశ్శాయీ బ్రహ్మచారీ శత్రుఘ్నసహిత స్తదా,
రాజకార్యాణి సర్వాణి యావంతి పృథివీతలే,
తాని పాదుకయో స్సమ్యక్ నివేదయతి రాఘవః. 16-18

భరతుడు శత్రుఘ్నసహితుడై సమస్తరాజోపచారములతో పాదుకలనుఁ బూజించుచు, కందమూలఫలాదులను భుజించుచు, నియతుడై యింద్రియ నిగ్రహము గలిగి, జటావల్కలములను ధరించి, క్రిందఁబరుండి బ్రహ్మచర్యమును జరుపుచుఁదన రాజ్యములోని సమస్త రాజకార్యములను పాదుకలనుఁ బ్రతినిత్యము తెలియజేయుచుండెను.

*ఆజ్యపూరేణ భక్ష్యాద్యై స్తర్పయ న్బ్రాహ్మణా న్సదా,
రామార్పణ మిదం సర్వమితి మధ్యే వదన్ముహుః,
రాఘవాగమనార్థీ సన్ బ్రహ్మర్షి రివ సోఽవసత్. 19½

భరతుడు బ్రహ్మర్షి వలెనుండి ప్రతినిత్యము బ్రాహ్మణులకు* ఆజ్యధారలతో భక్ష్యభోజ్యాదులతో సంతర్పణములఁ జేయుచు నది యంతయు రామార్పణమని మాటిమాటికి జెప్పుచు రాముడెప్పుడు వచ్చునా యని నిరీక్షించుచుండెను.

---

* ఆనందతాండవవనే ద్రవిడస్య, గేహే చిత్రం వసిష్ఠవనితాసమమాజ్యపాత్రం, విద్యుల్లతేవ పరినర్తతి తత్ర, దర్వీధారం విలోకయతి యోగబలేన సిద్ధః॥ క్వచి ద్ధారా క్వచిద్బిందుః క్వచి ద్దమగణాయతే। క్వచి ద్బిందుప్రదృష్టిశ్చ సాపిదర్వీ న దృశ్యతే॥ ఇత్యుక్తప్రకారేణవినా సమృద్ధాజ్యపూరేణ ద్విజాం స్తర్పయతిస్మ భరత ఇతి, వేద్యం.

*ఆజ్యధారలతో భరతుడు సమారాధనము చేసెనను సందర్భమున నొక యపూర్వకథ యిట వ్రాయబడుచున్నది.

ద్రవిడదేశములో, ఆనందతాండవవనమను గ్రామములో నొక ద్రావిడుని గృహములో సమారాధనము జరిగినదట. ఆ సమాధానములో, ఆజ్యపాత్ర (నేతిఝారీ) అరుంధతివలె మెరయుచున్నదట. దానిలో గరిటె మెఱుపుతీగెవలె తటాలున మెరయుచుండును. దానిలోనుండి వచ్చు నేతిధార యోగసిద్ధులకు గన్పడవలసినదే కాని సామాన్యులకు గోచరమే కాదు. అట్టి ఆజ్యపాత్ర చేతబుచ్చుకొని వడ్డనకు బయలుదేరి యజమాని వడ్డించుచుండగా నొక్కచోటఁగొంచెము ధారగాఁ బడుటయు, మరియొక్కచోట నొకబిందువు పడుటయు, వేరొక్కచోట పాత్రలోని గరిటె చప్పుడేకాని బిందువైనను పడకపోవుటయు, నింకొకచోట నాజ్యబిందు దర్శనము, మఱియొక్కచోటునఁ గరిటెకూడ గన్పడకపోవుటయు నిట్లు సమారాధన జరిగినదట. అట్టి సమారాధనము కాకుండగ భరతుడు ఆజ్యమును కాలువలు గట్టునట్లు వడ్డింపజేసి బ్రాహ్మణ సమారాధనములు చేసెనని యెరుగవలయును.

మంత్రిణో రాజకీయాదివ్యవహారకృతౌ తథా
శత్రుఘ్నం మాతృసేవార్థం ధర్మజ్ఞానాయ వై ద్విజాన్
ప్రజా స్స్వసౌఖ్యకష్టాది జ్ఞాపనాయ నియుక్తవాన్. **20-21**

భరతుడు రాజకీయ వ్యవహారములకై మంత్రులను, కౌసల్యాది మాతలసేవకై శత్రుఘ్నుని, ధర్మబోధనమునకై బ్రాహ్మణులను, తమకష్టసుఖములను దెల్పుకొనుటకై ప్రజలను నియమించెను.

స్వయం భూషణవస్త్రాదిభోగజాత మనన్యధీః,
వాచాపి మనసా చైవ తత్యజ భరత స్తదా. **22**

భరతుడు తాను వస్త్రాలంకారాది భోగము లన్నిటిని త్రికరణశుద్ధిగ విడిచెను.

ఇంద్రో యథా ప్రశంసేచ్చ కుబేరో లజ్జితో భవేత్,
తథాఽయోధ్యాం పాలితవాన్ పూర్వేభ్యోఽ ప్యధికం చ సః. **23**

దేవేంద్రుడు ప్రశంసించునట్లును, కుబేరుడుకూడ లజ్జపడునట్లును, పూర్వులకంటె నధికముగ భరతుడు రాజ్యపాలనము చేయుచుండెను.

నందిగ్రామే పర్ణశాలాం పరికల్ప్య త్వనన్యధీః,
విరక్త స్స న్సదా రామపాదపూజాం చర న్నభూత్. **24**

మరియు భరతుడు నందిగ్రామములోఁ బర్ణశాలయందు నివసించి యనన్యమనస్కుడై సర్వత్ర విరక్తుడై యెల్లపుడు రామపాదపూజా నిరతుడై యుండెను.

రామచంద్రప్రేమభూమే ర్ధన్యస్య భరతస్య వై,
తస్యాంగం ప్రత్యహం కార్శ్యా త్కృశీభూత మభూ ద్ధ్రువం.
తేజోఽభివృద్ధి మాప్నోతి బలం చాస్యాభివర్ధతే,
వర్ధతే ముఖశోభాచ క్రమా త్తద్భరతస్య తు. **25-26**

రామచంద్రునకుఁ బ్రేమాస్పదుడైన వాడును ధన్యుడు నగు భరతుని శరీరము నానాటికిఁ గృశించుచున్నప్పటికిని తేజస్సుమాత్ర మభివృద్ధిని బొందుచున్నది. బలముకూడ నటుల నభివృద్ధినొందు చుండెను. క్రమముగ భరతుని ముఖశోభకూడ పూర్వముకంటె నధికముగ నుండెను.

భరతస్య చ సద్భక్తిం వైరాగ్యం గుణసంపదమ్,
శేషో ఽపి వర్ణితుం శక్తో న భవే త్కిం పునః పరః. 27

భరతుని భక్తి వైరాగ్యములను సద్గుణసంపదను సహస్రజిహ్వాలు గల శేషుడుకూడ వర్ణింపజాలడన నితరుని విషయము చెప్పునదేమి?

భరతస్య సదా చిత్తం శ్రీరామధ్యానతత్పరమ్
పాదపూజారతౌ పాణీ జిహ్వా తద్గుణవర్ణినీ,
ఆనందాశ్రుయుతే నేత్రే శరీరం పులకాంచితమ్
తచ్చిత్తే రామరూపం తు సర్వదా గోచరం స్థితమ్
తన్మనో ఽతిపవిత్రం చ రామప్రేమరసాన్వితమ్. 28-29½

భరతుని చిత్త మెప్పుడును శ్రీరాముని పాదారవిందములను ధ్యానించుట యందే నిమగ్నమై యుండెను. అతని చేతులు రామపాదుకలను బూజించుటయందే వినియోగపడుచుండెను. భరతుని జిహ్వా రామగుణవర్ణనము చేయుచుండెను. భరతునిశరీర మెల్లప్పుడు పులకాంచితమై యుండెను. భరతుని చిత్తమం దెప్పుడును రాముని దివ్యమంగళవిగ్రహము గోచర మగుచునే యుండెను. భరతుని మనస్సు కడు పవిత్ర మైనదియు భక్తిరసపూరిత మైనదియునై యుండెను.

ఏవం స్థితస్సన్ గృహస్థో ఽపి తదా పునః,
వనస్థా ద్రాఘవా చ్చాభూ దధిక స్తాపసో యథా.
దృష్ట్వా తం భరతం సర్వే విస్మయావిష్టచేతసః,
ఏతాదృగ్గుణసంపన్నో న భూతో న భవివే ధితి.
నైకధా శ్లాఘయంతిస్మ పౌరాః ప్రకృతయ స్తథా. 30-32

భరతు డివ్విధముగ నుండి గృహస్థుడైనను వనమునందుండిన రాముని మించిన ఋషివలెఁ గన్పడుచుండెను. అట్టి భరతుని, పురోహితులు మంత్రులు మొదలగు వారలు చూచి యాశ్చర్యపడుచు నిట్టి సద్గుణసంపన్నుడగు రాజింతవర కెవ్వడును లేడనియు ముందు నుండడనియు దలచుచు ననేకవిధములుగ భరతుని గొనియాడుచుండిరి.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యకాండే ద్వితీయభాగే పంచదశస్సర్గ స్సమాప్తః,
ఆశ్చర్యరామాయణము అయోధ్యకాండమున
ద్వితీయభాగమున పదునైదవసర్గము సమాప్తము

# షోడశస్సర్గః - పదునారవసర్గ

కైకేయీతనయే గతే నిజపురం సంప్రాప్తకామే తత
శ్శ్రీరామోఽపి తపస్విభిస్సహ ముదా తిష్ఠన్గిరే రంతికే
సాశంకం చ మిథ శ్శనైః కథయతాం తేషా మునీనాం తదా
త్వౌత్సుక్యం తు నిరీక్ష్య తత్కులపతిం సందిగ్ధచిత్తోఽవదత్. 1

భరతుడు సఫలమనోరథుడై సాకేతపురమున కేగినపిమ్మట రామచంద్రమూర్తి తపస్సంపన్నులగు మునిజనులతో నిర్విచారముగ నచట కాలము గడుపుచుండగా నొక్క దినమున మహర్షు లందరును నొక్కచో గలసి రహస్యముగ నెద్దియో విషయమును జెప్పుకొనుచుండ వారల యౌత్సుక్యమును జూచి రామచంద్రమూర్తి కులపతియగు (మునిసంఘమునకు బెద్దయగువాడు) మహర్షితో నిటులఁ బలికెను.

గ॥ భగవ న్నృషిమండల మకాండ ఏవ కించిదప్యనావిష్కృత వచన మప్రకాశితనిదానం కేవల మన్యోన్యమేవ రహఃకథనైః సావహిత్థ ముఖవర్ణైశ్చ నితాంత మాకులమివ విలోక్యతే తద్బ్రవీతు భవాన్, ప్రమాదవశేన కింమయా కించి దతిక్రాంతం, కిముత లక్ష్మణేన మహర్షిజనే ష్వననురూపమాచరితం, కింను వా విదేహనందిన్యా కించిదయుక్తమే వాచరితం, తద్భగవా నౌత్సుక్యమూలకథనేన పరిహరతు మహతీం మమాశంకామితి ప్రసాదయామాస.
2

ఓ మహాత్మా! ఋషిసంఘము నంతయు నొక్కచోఁజేరి యేదియో రహస్యవచనములతోఁ బరస్పరము మాట్లాడుటను బట్టి మీముఖవర్ణమును బట్టియు, మీ మునిజనసంఘమంతయు వ్యాకులముగా గన్పడుచున్నది. కారణ మేదియో యనుగ్రహించి చెప్పుము. ప్రమాదవశముచే నే నేమైన నయుక్త మాచరించితినా? లేక లక్ష్మణు డేమైనను మీ విషయమై యననుకూల మగుపనిని జేసెనా? సీతవలన నేమైన నయుక్తకార్యము జరిగెనా? అను సంశయము నన్ను బాధించుచున్నందున మూలకారణమును జెప్పి నాసందియమును బాపుము.

**తతః కులపతిః ప్రాహ కంపమాన ఇవ స్థితః**
**జరయా తపసా వృద్ధో రాఘవం తు దయానిధిమ్. 3**

అనంతరము తపస్సుచేతను వయస్సుచేతను గూడ వృద్ధుడగు నా కులపతియగు మహర్షి భయపడుచు దయాసముద్రుడగు రామునితో నిట్లు పలికెను.

**గ॥ వత్స రామచంద్ర! సర్వ భూతదయానిధే ర్భగవతస్తవ, భాగవతస్య వా సౌమిత్రే ర్విదితనయాయా స్సీతాయాః బ్రాహ్మణేషు విశిష్య తపోధనేషు పరమస్మాసు కుతోభవే దపకారలేశసంభావనా? పరంతు వయ మనిమిత్తకమేవ సముత్సుకా స్స్మః యదత్ర విత్రసితత్రిభువనః జనస్థానకృతావస్థానః తాపసరుధిర పారణపారాయణో దశవదనానుజః ఖరోనామ నీచరజనీచరపతిః త్వదాగమన మారభ్య స్వానుచరా న్నిశాచరా నాదిశ్య తాపసాశ్రమేషు క్వచి దాకస్మిక భీషణభాషణైః క్వచన వికటభ్రుకుటీరచనైః క్వచిదపి దేవ యజనభూమిషు రుధిరవర్షైః దుస్సహతరై రితరై రుపద్రవశతై రస్మా నతీవ ప్రతిబాధతే. త దధునా తాపసైస్సహ బహుమూలఫలోదక మధ్యుషితచర మన్య మాశ్రమ మాశ్రయిష్యే, యది తవాపి సమామస్మాభి రాగమనే మనః తదా సజానకీలక్ష్మణ స్సత్వరం ప్రతిష్ఠస్వ. సర్వథా సమర్థస్యాపి తవ సకళత్రస్య న సముచితోఽత్ర వనే నివాస ఇత్యభిధాయ కులపతౌ ప్రస్థితే రఘుపతి రపి ముని జనవిరహజనితఖేదః స్వమాశ్రమ మాశ్రయత.**

నాయనా! రామచంద్రా! సర్వభూత దయాళువగు నీవుకాని భగవద్భక్తుడగు లక్ష్మణుడుకాని, జనకరాజనందినికాని బ్రాహ్మణులమేకాక తపోధనులమగు మా విషయమై యపకారము లేశముకూడఁ జేయుదురని యూహింపగూడ నవకాశ ముండదే! నీవిటులఁ దలఁచుట తగదు. మే మిటుల వ్యాకుల పడుటకుఁ గారణమును చెప్పెదను వినుము. త్రిలోకములను నల్లకల్లోలము చేసినవాడును, జనస్థానమునందు నివాస మేర్పరచుకొనిన వాడును, మునిజనుల రక్తమును పానము చేయువాడును, రావణుని తమ్ముడు నగు ఖరుడను రాక్షసశ్రేష్ఠుడు నీ విచ్చుటకు వచ్చినది మొదలు తన యనుచరుల నాజ్ఞాపింపగా నా ఖరునియనుచరులు మా యాశ్రమములకు రాత్రి భాగమున వచ్చి యొక్కచోట భయంకరమగు సంభాషణము జేయుచు, మరియొక్క చోట వికటముగ బొమముడులను విరచించుచు, నింకొక్కచోట యజ్ఞభూములలో రక్తవర్షమును

గురిపించుచు, నింకను సహింప శక్యముకాని యనంతములగు నుపద్రవములను గలుగ జేయుచు బాధించుచున్నారు. ఆ కారణమువలన నిప్పుడు మే మందరము పూర్వ మొకప్పుడు నివసించినట్టియు, కందమూలఫలములు జలము సమృద్ధిగ దొరుకునట్టియు, మరియొక యాశ్రమస్థలమునకు వెడలుట కాలోచించుచుంటిమి కాని మరేమియు లేదు రామచంద్రా! నీకుఁగూడ మాతోడ వచ్చుటకు నిష్టముండిన సీతాలక్ష్మణ సమేతుడవై వెంటనే బయలుదేరుము నీవు సర్వవిధముల సమర్థుడవైనను భార్యతోగూడ నీ విచ్చటను మాత్ర ముండుట సముచితముగ గన్పడుటలేదు అని చెప్పి కులపతియగు మహర్షి మునిజనముతోఁ గూడ బయలుదేరి వేరొక స్థలమునకు వెళ్ళగా రాముడును మునిజనవియోగ ఖేదముతోఁ దన యాశ్రమమునకుఁ జేరెను

**పశ్చా ద్రామవిభుర్మహర్షిషు గతేష్వాక్రాంతచింతో ఽనుజ**
**స్కంధావారనివేశనై ర్గజహయాదీనాం కరీషైః పురా,**
**సంవీక్ష్యాశ్రమ మాత్మబంధు నగరావాసైశ్చ సంమర్దితమ్**
**స్వాంతే చింతయతిస్మ చాత్ర వసతే స్తత్తత్స్మృతి స్స్యాదితి. 5**

మహర్షులందరు మరియొక స్థానమునకు వెళ్లిన పిమ్మట రామచంద్ర ప్రభువును చింతాక్రాంతుడై యిట్లు మనస్సునం దాలోచించెను- భరతుని వెంటవచ్చిన సైన్యముల నివాసములచేతను, గజతురగాదుల కరీషములచేతను (పెంటలచేతను), పురజనుల నివాసములచేతను సంమర్దితమైన యీ యాశ్రమప్రదేశములను జూచినప్పుడెల్ల పౌరులు బంధువులు స్మరణకు వచ్చుచుందురుగాన నిచ్చట నివసించుట యుక్తముగా గన్పడుటలేదు.

**కించ మాం చిత్రకూటస్థం జ్ఞాత్వా పౌరాః పదేపదే,**
**సమేయుః కించ మే కార్యం భావి దండవనే స్థితమ్. 6**

ఇదియునుంగాక చిత్రకూటమునందున్నట్లు దెలిసికొని పౌరులు మాటిమాటికి నిచ్చటకు వచ్చెదరు. మరియు గాదగిన కార్యమంతయు దండకవనమునందే యున్నది.

**ఇత్యాలోచ్య చ రాఘవో ఽనుజమహీజాతాన్విత స్తత్స్థలా**
**దత్రే రాశ్రమ మాగతో మునివరం నత్వా తదీయాశిషమ్,**
**లబ్ధ్వా చార్ఘ్యఫలాదిభిశ్చ మునినా సంపూజితస్స న్నిజాం**
**వార్తాం ప్రాహ మహర్షయేఽథ మునిరాడ్జ్ఞాత్వాఽహ తం శ్రీహరిమ్. 7**

ఇట్లు ఆలోచించుకొని రామచంద్రమూర్తి సీతాలక్ష్మణసమేతుడై యచ్చటనుండి బయలుదేరి. అత్రిమహర్షి యాశ్రమమునకు వెళ్ళి వెంటనే మహర్షికి నమస్కరించి యమ్ముని యాశీస్సును బొంది యర్ఘ్యపాద్యాదులచే నమ్మునిచేఁ బూజింపఁబడి తన వృత్తాంతము నంతను నత్రిమహర్షికిఁ జెప్ప నమ్మునియును రాముని బరాత్పరునిగా దెలిసికొని యిటులఁ బలికెను.

బ్రహ్మాదయో యస్య దయాం వాంఛంత్యనిశ మచ్యుత,
స త్వమేవాసి హేరామ! దీనబంధో! జనార్దనః!
ఇత్యుక్త్వా తం ముని స్తోతు ముపచక్రే చ రాఘవమ్. 8½

ఓ రామచంద్రా! బ్రహ్మాదిదేవతలు కూడ నెవని దయను వాంఛించు చుందురో ఆ జనార్దనుడవు నీవే- అని పలికి తిరిగి యమ్ముని రామచంద్రమూర్తిని నిటుల స్తోత్రము జేసెను.

నమామి భక్త వత్సలం కృపాళుశీలకోమలం
భజామి తే పదాంబుజం త్వకామినాం స్వధామదమ్,
నికామకామసుందరం భవాంబునాథమందరం
ప్రఫుల్లకంజలోచనం మదాదిదోషమోచనమ్. 9½

ఓ రామచంద్రా! దయాస్వభావముచే కోమలుడవును, భక్తవత్సలుడవు నగు నీకు నమస్కరించెదను. నిష్కామకులకు ముక్తిప్రదమగు నీ పాదారవిందములకు నమస్కారము. శ్యామసుందరుడవును సంసారసముద్రమును మథించుటకు మందరపర్వతము వంటివాడవును, పుండరీకాక్షుడవును కామక్రోధాది దోషనివారకుడవు నగు నిన్ను భజించుచున్నాను.

ప్రలంబబాహు విక్రమం ప్రభో ఽప్రమేయవైభవం
నిషంగచాపసాయకం ధరం త్రిలోకనాయకమ్,
దినేశవంశమండనం మహేశచాపఖండనం
మునీంద్ర బృందరంజనం సురారిబృందభంజనమ్. 10 ½

ఓ రామచంద్రా! ఆజానుబాహుడవును, అనంతవైభవము గలవాడవును, కోదండపాణివియును, త్రిలోకనాయకుడవును, సూర్యవంశమున కలంకారమైన వాడవును, శివధనువును విరచినవాడవును, మునిజన రంజకుడవును, రాక్షసభంజకుడవు నగు నీకు నమస్కారము.

ఇత్థంస్తువ న్నత్రిముని రానందాశ్రుపరిప్లుతః
పులకాంచితసర్వాంగః ప్రాహ తం రాఘవం త్వితి,
యం సర్వదా జపామ్యద్య స ఏవ మమ గోచరః
అహోభాగ్యం తు కింవర్ణ్యం ధన్యోఽహమభవం ధ్రువమ్. 11-12½

ఈ ప్రకారము విశేషముగ నత్రిమహర్షి రాముని స్తుతించి పులకాంచిత శరీరుడై యానందబాష్పములచేఁ భాగ్యమేమి యని వర్ణింతును. నేను కృతార్థుడనైతినని పలికి యమ్ముని మనస్సులో సంతోషించుచుండెను.

తచ్ఛ్రుత్వా రాఘవః ప్రాహ మునిం తం బ్రహ్మణ స్సుతమ్
మా మేవ మల్పం భగవన్స్తౌషి కిం సేవకం తవ.
విచారితే సతి మునే పితా భవతి మే భవాన్,
*బ్రహ్మవిష్ణు మహేశానామపి త్వం జనకో యతః.
తస్మా ద్విన్యస్య భగవన్ పుత్త్రభావం ప్రసీద మామ్. 13-15

అత్రిమహర్షియొక్క స్తుతి పాఠమును రామచంద్రమూర్తి విని బ్రహ్మమానసపుత్రుడగు నమ్మునితో నిటులఁ బలికెను. మునీంద్రా! నీ సేవకుడ నల్పుడనగు నన్ను నీ వేల యిట్లు స్తుతించుచుంటివి? బాగుగ విచారించినచో *బ్రహ్మవిష్ణు మహేశ్వరులకును నీవు పితవు కాన నీవు నాకును బితృతుల్యుడవే కావున నీవు నాయందుఁ బుత్రభావము నుంచి యనుగ్రహించవలయును.

---

*మునే స్త్రీమూర్తిజనకత్వంప్రత్యత్ర కించి దుచ్యతే. అత్రిస్తు బ్రహ్మణోజాతః మానసాత్తపసాధికః, కదాచిత్సంతతేః కామాద్దీక్షాం కృత్వా తపశ్చరన్ ప్రార్థయామాస లోకేశం త్రయః ప్రత్యక్షతాం గతాః, దృష్ట్వా తాన్ప్రాహ మునిరా డేకధ్యానకృతౌ త్రయః, కిమర్థమాగతా యూయ మిత్యుక్తా స్తేఽవద న్మునిం, త్రయాణామపి నోభేదః న కించిదపి వర్తతే, అస్మదంశైస్త్రయః పుత్త్రా భవిష్యంతి మునే తవ. ఇత్యుక్త్వా తే త్రయో జగ్ము స్తత్ప్రసాదా త్త్రయస్సుతాః. మునేరపి క్రమా జ్జాతా స్తత్తదంశై స్సమన్వితాః, దత్తాత్రేయా హరే రంశాత్ బ్రహ్మంశా దపి చంద్రమా, రుద్రాంశాదపి దుర్వాసాః క్రమాత్సంజజ్ఞిరే మునేః, అత్రే స్స్వజాయయా భోగకాలే వాయుస్తదా పునః, చకార రేతో విక్షేపం క్షిప్తం నేత్రే పతన్మునేః, తస్మా దత్ర్యక్షిజాతోఽభూ చ్చంద్రమా ఇతి కీర్తితం|| ఇతి

*అత్రిమహర్షి త్రిమూర్తులకుఁదండ్రి యెట్లయ్యెనను విషయము కొంచెమిచట వ్రాయబడుచున్నది. బ్రహ్మమానసపుత్త్రుడగు నత్రి మహర్షి యొకప్పుడు సంతానార్థియై దీక్షబూని సర్వేశ్వరుని గూర్చి తపము చేయుచుండగా బ్రహ్మవిష్ణు మహేశ్వరులు ముగ్వురు ప్రత్యక్షమైరి. అప్పు డత్రిమహర్షి వారలను జూచి నేను నొక్కనిఁగూర్చి తపస్సు చేయగా మీరు ముగ్వురు వచ్చుటకుఁ గారణంబేమని యడుగగా వారిట్లు సమాధానము చెప్పిరి. ఓ మునితిలకమా! మా ముగ్వురిలో భేదమేమియు లేదు. మాలో ,నీ వెవ్వనిని ధ్యానించినను మేము ముగ్వురము ప్రత్యక్షము కావచ్చును. లేక యొక్కడు ప్రత్యక్షము కావచ్చును. భేదమేమియు లేదు. నీవు పుత్రార్థివై తపమును జేయుచుంటివి. కాన, మా ముగ్వురి యంశములతో ముగ్గురు పుత్రులు నీకు

**ఇత్యుక్తో ఽత్రిమునిః ప్రాహ రాఘవం వినయాన్వితమ్,**
**అనసూయాంతికం రామ భూమిజాం ప్రేషయ ద్రుతమ్. 16**

ఇవ్విధముగ రామచంద్రమూర్తి పలుకగా నత్రిమహర్షియు వినమ్రుడై యున్న రామభద్రునితో నిటులఁ బలికెను. రామచంద్రా! మహాతపస్వినియైన యనసూయాదేవియొక్క సమీపమునకు సీతను బంపుము. అనసూయా మాహాత్మ్యమును గొంచెము నీకుఁ జెప్పెదను వినుము.

**గ. వత్స రామచంద్ర! యయా కిల దశవర్షాణ్యవర్షవశా ద్దహ్యమానేషు లోకేషు దయావిధేయహృదయయా అనితర స్త్రీసాధారణసౌశీల్యయా దుశ్చరతపశ్చరణమహిమ్నా వినిర్మితైః స్వాదుతరమూలఫలై రన్నాయ ప్రవర్తితయా జహ్నుసుతయా చ చిరంసుఖితః కృతో ఽయం లోకః, కిం చ దశసహస్రవర్ష పర్యంత మనుపమ నియమిత ప్రత్యూహ మత్యుగ్రం తపశ్చరంత్యా యయా త్రిదశకార్యనిమిత్తం దశరాత్రం రాత్రిరేవ ప్రవర్తితా. 17**

రామచంద్రా! ఒకానొకప్పుడు పదిసంవత్సరములవరకు వర్షములేక పోవుటవలన లోకము లన్నియు దహింపఁబడిపోవుచుండగా దయా విధేయహృదయము గలదియు నసాధారణ సౌశీల్యభూషితురాలు నగు ననసూయాదేవి దుశ్చరమగు తన తపోమహిమచే కందమూల ఫలాదులను ప్రతిదినమును సృష్టింపఁజేసియు, గంగను దన యాశ్రమసమీపమున స్రవింపఁజేసియు సమస్తమునిజనమును గాపాడెను. ఇదియునుగాక పదివేలసంవత్సరములు నిర్విఘ్నముగ నత్యుగ్రమగు తపస్సును జేసి యీ యనసూయాదేవి తన తపోమహిమచే దేవకార్యము నిమిత్తము పదిదినములు రాత్రినిగానే ప్రవర్తింపఁజేసెను.

**[1] తా మిమాం సర్వభూతానాం నమస్కార్యాం తపస్వినీమ్,**
**అభిగచ్ఛతు వైదేహీ వృద్ధా మక్రోధనాం సదా, 18**

---

జన్మించెదరని చెప్పి వారలు స్వస్థానముల కేగిరి. పిమ్మట వారల యనుగ్రహముచే మువ్వురి యంశములచే ముగ్గురు నమ్మునికిఁ బుత్రులుగాఁ బుట్టిరి. విష్ణ్వంశమువలన దత్తాత్రేయుడును, బ్రహ్మాంశమువలన చంద్రుడును, రుద్రాంశమువలన దుర్వాసుడును జన్మించిరి:- చంద్రుడు అత్రినేత్రమునుండి పుట్టెనని చెప్పుటకు గారణ మేమనగా అత్రిమహర్షి భార్యతోఁ గ్రీడించు కాలమున రేతస్సు వాయువుచే నెగురగొట్టబడగా నా రేతస్సువెళ్లి యత్రినేత్రమునందు బడెను. అత్రినేత్రమునుండి చంద్రుడు పుట్టెనని ప్రసిద్ధి యందువలన గలిగెనని తెలియవలెను.

---

1. వా ॥ రా ॥

సమస్తభూతములకుఁబూజ్యురాలును మహాతపస్వినియును పరమ శాంతురాలునగు నీ యనసూయాదేవినిఁజూచుటకై సీత యేగుగాత!

గ. తస్య మునే ర్వచన మాకర్ణ్య నిఖిలలోకపావన చరితా మనుపమ తపోరాశిమయీ మన్వర్థనామధేయా మనసూయా మభిగచ్ఛేతి భర్తృవదనారవిందగళితం వచనమకరంద మాదరేణ కర్ణాంజలిపుటేన పిబంతీ మిథిలాధిరాజతనయా శిథిలిత సకలావయవాం జరాధవళమూర్ధజా* మరుంధతీసహోదరీం మహాభాగా మనసూయాం నిజనామధేయ కథనపూర్వక మభిప్రణమ్య బద్ధాంజలిపుటా వినియేన సర్వత్ర కుశల మపృచ్ఛత్. 19

ఇట్లు చెప్పిన యత్రిమహర్షి యొక్క వచనములను రామచంద్రమూర్తి విని, సకలలోకపావన చరిత్ర గలదియును నిరుపమ తపోరాశియును సార్థక నామధేయము గలదియు నగు ననసూయాదేవికి నమస్కరింపఁ జనుమని సీతతోఁజెప్పగా నా జానకియును, భర్తృముఖారవిందము నుండి వెలువడిన వచన మకరందమును కర్ణపుటములచేఁగ్రోలి (అనగా భర్తృవాక్యమును విని) వార్ధక్యముచే శిథిలావయవములను, నెరసిన శిరోజములు (వెంట్రుకలు) గలదియు; పుణ్యాంగనయును* నరుంధతీదేవికి సహోదరియు నగు ననసూయాదేవియొద్దకేగి తన నామధేయమును జెప్పుచు నమస్కరించి చేతులు జోడించి వినయపూర్వకముగఁ గుశలము నడిగెను.

---

* అరుంధతీ సహోదరీత్వ మేవాత్ర కించిన్నివేద్యతే- పరిణీయ మనోః పుత్రీం దేవహూతిం తు కర్దమః, జనయామాస తస్యాం తు పుత్రం కపిలనామకం, బోధయామాస లోకానాం ముక్తిమార్గం తు యో మునిః, అరుంధత్యనసూయాది కన్యకాశ్చ తతో నవ| తాసా మరుంధతీదేవీ వసిష్ఠం బ్రహ్మణస్సుతం, పరిణీతవతీ చాభూ దనసూయా తథా విధేః| పుత్రమత్రిం వృతవతీ తత స్తే ప్రథితే భువి, పాతివ్రత్యం తయోర్లోకే వర్ణితుం కః క్షమో భువి|| ఇతి.

* అరుంధతియు ననసూయయు సహోదరీలను విషయములో నిచ్చుటఁ గొంచెము పూర్వకథ వ్రాయబడుచున్నది. కర్దమ మహర్షి స్వాయంభువమను పుత్రిక యగు దేవహూతిని వివాహమాడెను. ఆ కర్దమ దేవహూతులకు సాంఖ్యశాస్త్ర పారంగతుడును ముక్తి మార్గోపదేశికుడునగు కపిలుడను పుత్త్రుడును, అరుందతి అనసూయ మొదలగు తొమ్మండుగురు పుత్రికలును గలిగిరి. వారలలో అరుంధతియు అనసూయయు మహాతపస్సంపన్ను రాంద్రగుటవలన వీర లిర్వురును సోదరీలందరిలోఁ గడు ప్రసిద్ధి నొందిరి. అరుంధతి బ్రహ్మపుత్రుడగు వసిష్ఠమహర్షిని వివాహమాడెను. అనసూయయును బ్రహ్మమానస పుత్త్రుడైన యత్రిమహర్షిని వివాహమాడెను. అరుంధత్యనసూయ లిర్వురును మహా పతివ్రతలును సకలగుణ భూషితురాండ్రునై యొప్పుచుండిరి. వారల పాతివ్రత్య ప్రభావమును నెవ్వడు వర్ణింపఁగలడు (వర్ణింపలేడని భావము) ఈ కథాసందర్భమునుబట్టి వీరిలిర్వురును సహోదరీలని తెలియదగును.

తతో౽నసూయాదేవీం తాం తుష్టా వైవంతు భూమిజా,
యస్యా మాతా దేవహూతిః కపిలశ్చ సహోదరః,
*జహార యా త్రిమూర్తీనాం తత్సతీనామహంకృతిమ్,
యా త్రిమూర్తీన్ శిశూ న్కృత్వా దదౌ స్తన్యం కదాచన,
పతిభిక్షా మదా త్పూర్వం తత్సతీనాం చ యా ముదా,
తస్యా స్తే దర్శనా ద్దేవి కృతార్థా౽స్మి న సంశయః,
ఇతి తాం భూమిజా దేవీ స్తౌతిస్మ వినయాన్వితా. 20-22½

*అనంతర మనసూయాదేవిని నీక్రింది విధముగ స్తోత్రము చేసెను.

ఓ దేవి! దేవహూతి పుత్రికవును భగవదవతారమగు కపిలమహర్షికి సహోదరివియును, త్రిమూర్తులయొక్కయు (బ్రహ్మ విష్ణుమహేశ్వరుల) వారి భార్యలయొక్కయు గర్వము నణచినదానవును, త్రిమూర్తులను శిశువులనుగా జేసి స్తన్య మొసంగినదానవును, త్రిమూర్తుల భార్యలకుఁ బతిభిక్ష పెట్టినదానవునగు నీయొక్క దర్శనమాత్రముచే నేను కృతార్థురాలనైతిని, సందియము లేదని సీత వినయపూర్వకముగ ననసూయాదేవిని స్తుతించెను.

---

*త్రిమూర్తి గర్వ పరిహారాది కదాత్ర కించి న్నివేద్యతే నారీత్రయం స్యా న్మిళితం యది భా న్యుదయంత్యహః, ఇతికశ్చిత్సుధీ స్సమ్యగ్విచార్యైవావద ద్యథా, పతివ్రతా స్త్రిలోక్యాం చ నాస్మదభ్యధికాస్థ్సితాః, ఇతిదేవస్త్రియ స్త్రిస్రోమిళిత్వాలో చనాన్వితాః, రమా గౌరీ తథా వాణీ సగర్వాస్స్వేకదా స్థితాః, తదుదంతం నారదస్తు కర్ణాకర్ణిక యా పునః, శ్రుత్వాతాసాం దేవతానా మభిమానజిహీర్షయా, శాలానాం గుళికాః కాశ్చి ద్గృహీత్వా తత్త్రిస్రయః పునః, గత్వా సమీపం ప్రాహేదం వచనం వినయాన్వితః, త్రిలోక్యామపి యూయం హి పాతివ్రత్యే ప్రథాంగతా శిలానాంగుళికాస్త్వేతాః పాతివ్రత్యమహత్త్వతః, పక్త్వాదత్త ద్రుతం మహ్యం క్షున్నివృత్త్యై పతివ్రతాః ఇతిసంప్రార్థితా స్తేన దృష్ట్వా తా శ్చావదన్మునిం, మునేకర్తు మశక్యం హి కర్మేదం కా కరిష్యతి.

ఏత త్కార్యంతు యా నారీ కరిష్యతి సతీత్వతః, వయం తస్యా ధ్రువం దాస్యో భవిష్యామో న సంశయః. ఇత్యుక్తో నారద స్తస్మాన్నిర్గత్యాశ్రమం ద్రుతం, సమాగత్యాహ దేవీం తా మనసూయా మిదం వచః. క్షున్నివృత్త్యై మహాదేవి పక్త్వా తూర్ణ మిమా శ్శిలాః, మహ్యం దేహీతి తేనోక్తా తథేత్యుక్త్వా తదా పునః, పాతివ్రత్యమహత్త్వేన పక్త్వాదా త్తచ్ఛిలాశ్చ సా, గృహీత్వా తా శ్శిలా మౌనిస్సమేత్యాహ సురస్త్రియః పక్తా ఇమే శిలాఖండా మహాదేవ్యానసూయయా, పశ్యతేతి ముని స్తాసాం దర్శయిత్వా జగామ సః పశ్చాత్త్రిస్ర స్సమాలోచ్యప్రాహు స్స్వస్వపతింపున, అనసూయామహాదేవ్యాః పాతివ్రత్య మనుత్తమం. యదాభగ్నం భవే ద్యుష్మం యతధ్వమితి తే త్రయః, బ్రహ్మవిష్ణు మహేశాస్తు కథితాశ్చ వినిర్గతాః అత్రే రాశ్రమసాన్నిధ్యం సమాజగ్ము ర్విమనగా, అనసూయామహత్త్వేన విమానం న చచాల తత్|| పాదచారేణ దేవా స్తేత్రయోప్యత్రిగృహంగతా, మునినా పూజితాశ్చేమ ర్భోజనార్థం నిమంత్రితాః. అనసూయా ద్రుతం పక్త్వా భక్ష్యాణి వివిధాని

చ, సమాజుహావజగ్ధ్యర్థం బ్రహ్మ విష్ణుమహేశ్వరాన్. తేఽపి దేవీం తదా ప్రాహురనసూయాం పతివ్రతాం, వివస్త్రా దేహి జగ్ధింనో వ్రతమస్తి చిరా దిదం, ఇత్యుక్తా సాత థేత్యుక్త్వా శిశూన్కృత్వా ద్రుతం తు తాన్. స్తన్యం వివస్త్రా దత్వాచ తర్పయిత్వా శిశూంశ్చ తాన్, సంస్థాపయామాస గేహే త్వనసూయా మహత్త్వతః నారదా ద్గతవృత్తాంతం తత శ్రుత్వాతు తత్త్రియః, మార్గయంత్యోఽత్రి గేహం తు సమేత్యాథ తపస్వినీం. నత్వానసూయాం తా స్త్రియః పతిభిక్షాం యయాచిరే, తాసు సాఽపి దయాం కృత్వా తత్పతీ న్పూర్వవ త్తతః. కృత్వాత్మీయమహత్త్వేన దదౌ తాభ్యో ముదంగతా, త్రిమూర్తయో లజ్జితాస్తే ప్రాహుస్తాం వినయాన్వితాః, యతో దేవీ శిశూ న్కృత్వాత్వస్మాన్ స్తన్యమదా స్తతః, అస్మదంశై స్త్రయః పుత్రా భవిష్యంతి ద్రుతం తవ. ఇత్యుక్త్వాగు స్తతో దేవా స్సజాయా స్స్వస్వసద్మ తే.

* అనసూయాదేవి త్రిమూర్తుల గర్వ పరిహారమునుజేసిన కథ యిచ్చట నొకింత నుదాహరింపబడుచున్నది. ముఖ్వ రాడువారు గూడినఁ బట్టపగలు చుక్కలు మొలుచునను సామెత కుదాహరణముగా నీకథ యున్నది. ఒకప్పుడు లక్ష్మీ గౌరీ సరస్వతులు ముఖ్వరును నొక్కచోటఁజేరి మనకంటెఁబతివ్రతలు ముల్లోకములలో వెదకిచూచినను గన్పింపరని యాలోచనముచేసి గర్వితులై యుండిరి. ఆ వృత్తాంతమును నారదుడు కర్ణాకర్ణికగా విని వారల గర్వ పరిహారమును చేయదలచి పలుగురాళ్ల ముక్కలను మూటఁగట్టుకొని త్రిమూర్తులభార్యలు ముఖ్వరునొక్క చోట నుండు సమయమున వారల యొద్దకేతెంచి వినయపూర్వకముగా నారదు డిటుల వారలతోఁ బలికెను.

ఓయమ్మలారా! ముల్లోకములలోగూడ మీకంటెఁబ్రతివ్రతా తిలకములు కన్పడరు. కాన మీపాతివ్రత్యమహిమచే నీశిలాఖండములను గుగ్గిళ్ళుగా వండిపెట్టి నాక్షుద్బాధను దీర్పవలయు ననియెను. ఇట్లు నారదునిచేఁబ్రార్థితలై నారదుడు తెచ్చిన పలుగురాళ్ళముక్కలను జూచి విస్మయమొంది వారలు నారదునితో నివ్విధముగఁ బలికిరి. ఓ నారదా! చేయశక్యముకాని పనినిఁ జేయుమనినచో నెవ్వతె చేయగలదు.? జేసినచో నామెకు మేము సేవకురాండ్రము కాగలము. ఇందుకు సందియము లేదని వారలు చెప్పగా నారదు డచ్చటనుండి బయలుదేరి యత్రిమహర్షియొక్క యాశ్రమమున కేతెంచి యనసూయాదేవిని సందర్శించి"తల్లీ! యీ శిలాఖండములను గుగ్గిళ్ళనుగాఁజేసి పెట్టుమని చెప్ప నందులకామె యంగీకరించి వెంటనే శిలాఖండములను తన పాతివ్రత్యమహిమచే గుగ్గిళ్లుగాఁజేసి నారదున కిచ్చెను. నారదు డాపలుగురాళ్ళ గుగ్గిళ్ళను మూటగట్టుకొని త్రిమూర్తుల భార్యలయొద్దకు వచ్చి వారలతో నిటులఁజెప్పెను. ఓ యమ్మలారా! లోకములో వీనినెవ్వరును బచనమే చేయలేరని మీరు చెప్పితిరి. చూచితిరా! ఆ మహాపతివ్రతాతిలకమైన యనసూయాదేవి తన పాతివ్రత్యమహిమచే నీశిలాఖండముల నెట్లు గుగ్గిళ్ళుగాఁ జేసి యిచ్చెనో చూడుడని తనయొద్దనున్న మూటను విప్పి చూపి నారదుడు వెళ్లెను.

అనంతరము ముఖ్వరు లజ్జితలై దీనికిఁ బ్రతిక్రియ యేమని యాలోచనముచేసి తుదకు ననసూయా పాతివ్రత్యభంగము చేయుటకై నిశ్చయించి తమ తమభర్తలతో" అనసూయాదేవియొక్క పాతివ్రత్యము భగ్నమగునటుల మీరు ప్రయత్నించవలయునని" చెప్పగా తమ తమ భార్యల కోరికలను దీర్పబూని త్రిమూర్తులు ముఖ్వరును విమానారూఢులై యత్రిమహర్షి యాశ్రమమునకు వచ్చుసరికి అనసూయాపాతివ్రత్య మహిమచేఁ దమ విమానము కదలదయ్యెను, పిమ్మట విమానమును

**త చ్ఛ్రుత్వా మిథిలాధిరాజతనయా మాలింగ్యదోర్భ్యాం శిర**
**శ్చాఘ్రాయాదరణేన చీర మమలం భూషాంగరాగాదికమ్,**
**దత్వా తత్కుశలం తదీయవసతిం పృష్ట్వాత్రిజాయా తతః,**
**పాతివ్రత్య మబోధయచ్చ బహుధా స్త్రీ ధర్మజాతం చ తామ్. 23½**

అనసూయ సీతచెప్పిన మాటలను విని సంతోషముతో నాజానకిని గౌగిలించుకొని కుశలమడిగి సీతయొక్క వృత్తాంతము నడిగి తెలిసికొని పిమ్మట నారచీరలను నలంకారమును నంగరాగమును నామె కిచ్చి సీతకు పాతివ్రత్యమును స్త్రీ ధర్మములనుగూడ ననేక విధములుగ నీక్రిందివిధముగ బోధించెను.

**మితం దదాతి హి పితా మితం మాతా మితం సుతః,**
**అమితస్యతు దాతా తు పతి రేవ సదా స్త్రియాః. 24½**

ఓ జానకి! తండ్రి, తల్లి, పుత్త్రుడు మొదలగువారలు మితమునే (అశాశ్వతమైన ధనకనకవస్తువాహనాది సౌఖ్యములనే) యిత్తురు. అమితమును, (శాశ్వతసౌఖ్యము) నిచ్చువాడు భర్తయొక్కడే యని తెలియవలయును.

**మిత్ర మాపది జానీయా ద్భార్యాం భాగ్యక్షయే తథా,**
**ధైర్యధర్మసుహృస్త్రీణాం పరీక్షాపది సంభవేత్. 25½**

---

వదలి పాదచారులై యత్రిమహర్షి యాశ్రమమునఁ బ్రవేశించి యమ్మహర్షిచేఁ బూజితులై భోజనార్థమై నిమంత్రితులై యచ్చట నుండిరి. అనసూయాదేవియును వెంటనే భక్ష్యభోజ్యాదులను సిద్ధము చేసి త్రిమూర్తులను భోజనమునకు రమ్మనగా వార లామెతో నిట్లు పలికిరి. అమ్మా! మాకొక వ్రతమున్నది. విగతవస్త్రురాలిచేతనుగాని మేము భుజింపము. ఈ సంగతి నీకుఁజెప్పుటకు లజ్జించుచుంటి మన నామెయు మీకోరిక ప్రకారము చేయుదునని చెప్పి వెంటనే తన పాతివ్రత్య ప్రభావముచే నా త్రిమూర్తుల ముద్వురను శిశువులనుగా జేసి వివస్త్రయై స్తన్యపానమిచ్చి వారలను తృప్తులనుజేసి వారలను శిశువులనుగానే తమ యాశ్రమమునందుంచివేసెను. నారదు డీసమాచారము త్రిమూర్తుల భార్యలకుఁ జెప్పి మీరు వెళ్ళి యామెపాదముల మీదబడి పతిభిక్షను వేడినచో మీ భర్తలు మీకు లభింపగలరని చెప్పగాఁ జేయనదిలేక యాముద్వురు స్త్రీలు నత్ర్యాశ్రమమును వెదకుకొనుచు వచ్చి యనసూయాదేవి పాదములకుఁబ్రణమిల్లి పతిభిక్షను పెట్టుమని వేడుకొనగా నమ్ముని భార్యయు వారలను గనికరించి త్రిమూర్తులను పూర్వ రూపవంతులనుగాఁజేసి వారలకు పతిదానము చేసెను. త్రిమూర్తులును లజ్జితులై వినయపూర్వకముగ నిట్లనసూయాదేవితోఁజెప్పిరి.

ఓ తల్లీ! మమ్ములను శిశువులుగాఁజేసి మాతృభావముతో నీవు ప్రవర్తించితివి గాన మేము ముద్వురము నీకు బుత్త్రులుగాఁ బుట్టగలము. (అనగా మా యంశములతో నీకు ముద్వురు పుత్త్రులుద్భవించెదరని) చెప్పి తమ భార్యలతోఁగూడఁ బరిభూతులై తమ నివాసముల కేగిరి. అని.

తాను సౌఖ్యముగ నున్నప్పుడు మిత్రులు చాలగ నుందురు. తనకుఁ గష్టము వచ్చినప్పుడు స్నేహితు డొకడును గన్పడడు. కానఁ దన యాపత్సమయముననే మిత్రుని పరీక్ష చేయవలయును, తాను ధనమును బాగుగ సంపాదించునప్పుడు భార్య తనయందు ప్రేమతో నున్నట్లు నటించును. తన ధనమంతయు పోయినప్పుడు కాని భార్య పూర్వప్రేమతో నుండెనా లేదా యని భార్యను బరీక్షింపవలసిన సమయ మప్పుడై యున్నది. కష్టసమయములోనే ధైర్యమును, ధర్మమును, మిత్రుని, భార్యను బరీక్షింపవలసియున్నది.

**వృద్ధం రోగయుతం మూర్ఖం నిర్ధనం బధిరం తథా,**
**దీన మంధం కురూపం వా యా భజే త్సా పతివ్రతా. 26½**

భర్త వృద్ధుడుగాని, రోగిగాని, మూర్ఖుడుగాని, నిర్ధనుడుగాని, చెవిటివాడుగాని, గ్రుడ్డివాడుగాని, కురూపిగాని యెట్టివాడైనను విడువక యెవ్వతె సేవించునో యామె పతివ్రతయని చెప్పనొప్పును.

**అపి మాం పావయే త్సాధ్వీ స్నా త్వేతీచ్ఛతి జాహ్నవీ,**
**స్తంభయామాస మాహాత్మ్యాత్ భృగుపత్నీ సురేశ్వరమ్,**
**తథా కౌశికజాయాఽపి చకా రాదిత్యబంధనమ్. 27½**

ఓ జానకి! పతివ్రతామాహాత్మ్యమును జెప్పెద వినుము. పాపాత్ములు తనలో స్నానము చేయుచున్నందున దనకు సంభవించుచున్న పాపములను బోగొట్టుకొనుటకై పతివ్రత లెవ్వరైనను దనలో స్నానము చేయుటకు వచ్చుచుండిరాయని గంగ సైతము పతివ్రతకై యెదురు చూచుచుండును. భృగుపత్ని తన పాతివ్రత్యముచే దేవేంద్రుని సయితము స్తంభింపజేయగలిగెను. అట్లే కౌశికుడను బ్రాహ్మణునిభార్య తన పాతివ్రత్యమహిమచే సూర్యుడుదయింపకుండఁజేసెను.

**స్త్రియ శ్చతుర్విధా స్సంతి చోత్తమా మధ్యమాధమా,**
**నీచేతి, ప్రథమాయాస్తు న స్వప్నేఽప్యన్య చింతనమ్,**
**పతిం దైవం తు మన్వానా సా తత్పూజారతా భవేత్. 29½**

ఓ జానకి! స్త్రీలు నాలుగువిధములుగ నున్నారు 1. ఉత్తమురాలు, 2. మధ్యమురాలు, 3. అధమురాలు 4. నీచురాలు. ఉత్తమస్త్రీకి స్వప్నమునందైనను

బరపురుషచింతన ముండదు. మఱియు నామె భర్తను దైవముగఁ దలచుచు భర్తృపూజయం దాసక్తితో నుండును.

ధనార్జనే పతిం ప్రేమ్ణా దృష్ట్వా భాగ్యక్షయే సతి,
మధ్యమం యా పతిం పశ్యే న్మధ్యమా పరికీర్త్యతే. 30½

ఓ జానకి! మధ్యమస్త్రీలక్షణము చెప్పెదను వినుము. తన భర్త ధనార్జనము చేయునప్పుడు ప్రేమను గన్పరచు, భర్త భాగ్యహీనుడైనచో భర్తను మధ్యమముగాఁ జూచునది మధ్యమురాలుగాఁ దెలిసికొనుము.

స్వపతిం వంచయిత్వా యా పరం ప్రేమ్ణా చ పశ్యతి,
సాధమా కథ్యతే లోకే సాంతే దుర్గతి మేష్యతి. 31½

తన భర్తను మోసగించి పరునిఁ బ్రేమతోఁ జూచునది యధమురాలని తెలియవలయును. ఆమె యిహపరములకు రెంటికిని దూరమగును. (అంతమున దుర్గతులను పొందును.)

సర్వదా భర్తృకలహా మృష్టాన్నం యా న దాస్యతి,
వాచా పరుషయా యా చ తాడనేనాపి బాధయేత్.
నీచేతి కథ్యతే లోకే కల్పాంతం నరకే వసేత్. 32-33

ఏ స్త్రీ నిరంతరము భర్తతోఁ గలహించుచుఁ గడుపునిండ మృష్టాన్నమును బెట్టకయు, భర్తను దిట్టుచుఁ గొట్టుచు నుండునో, ఆ స్త్రీ నీచురాలని చెప్పబడును. కల్పాంత పర్యంతము నామె రౌరవాది నరకములయం దుండును.

[1]త్యక్త్వా జ్ఞాతిజనం సీతే! మానవృద్ధిం చ భామిని,
అవరుద్ధం వనే రామం దిష్ట్యా త్వ మనువర్తసే. 34

ఓ జానకి! నీవు బంధుజనమును విసర్జించి, రాజపుత్రిక నను నహంకారమును విడిచి, వనమున కేగుమని తండ్రిచే నియుక్తుడైన భర్తను నీవు కూడ నదృష్టముచే ననుసరించుచుంటివి. నీపాతివ్రత్యము కొని యాడదగినది కదా!

నగరస్థో వనస్థో వా పాపో వా యది వా శుభః,
యాసాం స్త్రీణాం ప్రియో భర్తా తాసాం లోకా మహోదయాః. 35

---

1 వా.రా.

ఏ స్త్రీలు తన భర్తనగరమునందున్నను, వనమునందున్నను, లేక పాపి యైనను, పుణ్యవంతుడైనను, నతనిని బ్రేమతోఁ జూతురో యా స్త్రీలకుఁ బుణ్యలోకము చేకూరు ననుటకు సందియము లేదు.

త దేవ మేనం త్వ మనువ్రతా సతీ,
పతివ్రతానాం సమయానువర్తినీ,
భవస్వ భర్తు స్సహధర్మచారిణీ,
యశశ్చ ధర్మం చ తతస్సమాప్స్యసి. 36

ఓ జానకి! నీవివ్విధముగ భర్త ననుసరించి పతివ్రతల యాచారము చొప్పున సహధర్మచారిణివిగ నుండిన యెడల నిహమునందుఁ గీర్తిని కాలాంతరమునఁ బాతివ్రత్య ధర్మానుష్ఠానమువలన గలిగెడి నిశ్శ్రేయస్సును (ముక్తిని) బొందగలవు.

[1]ఏవం స త్వనసూయయా సకరుణం ప్రోక్తా సతీ మైథిలీ,
హృష్టా తా మవద త్సతీమణి మిదం స్త్రీధర్మజాతం పురా,
మన్మాత్రా మమ పాణిపీడనవిధౌ ప్రోక్తం వనప్రస్థితం
భర్తారం త్వనుసారిణీం సమవద చ్ఛ్వశ్రూశ్చ ధర్మాంస్తు మామ్. 36

సీత యివ్విధముగ ననసూయాదేవిచేఁ గృపారసముచే నుపదేశింపబడి సంతోషించిన దై యనసూయాదేవితో నిటులఁ బలికెను ఓ దేవి! నా వివాహ కాలమున మాతల్లియు నిటుల సతీధర్మమును బోధించెను. మఱియు, వనమునకుఁ బ్రయాణ మగుచున్న రామచంద్రుని ననుసరించుచున్న నన్ను గూర్చి మాయత్తయగు కౌసల్యయు నిటులనే ధర్మమును బోధించెను.

త్వయా సంస్మారితా చాహం ధర్మజాతం తదేవ హి,
కృతార్థాఽస్మిన సందేహః యథోక్తం క్రియతే మయా. 38

ఓ దేవీ! యా ధర్మములనెల్ల నీవు నాకుపదేశించి జ్ఞప్తిచేసినందువలనఁ గృతార్థురాలనైతిని. నీవు చెప్పిన విధముననే యాచరించెదను.

దేవి! కా విగుణం చాపి భర్తారం త్యక్తు మిచ్ఛతి,
కిం పున ర్యో గుణశ్లాఘ్య స్సానుక్రోశో జితేంద్రియః,
స్థిరానురాగో ధర్మాత్మా మాతృవర్తీ పితృప్రియః,
తాదృక్కల్యాణభూయిష్ఠ సద్గుణాభరణస్య వై
పత్యుశ్శుశ్రూషణా న్నిత్యముత్తమం కిం తపోఽస్తి మే. 39-40½

1కవిః

ఓ దేవి! లోకమునందెవ్వతె తన భర్త గుణరహితుడైనను నతనిని విడిచిపెట్టును? అట్టి స్థితిలో సకలసద్గుణ సంశ్లాఘ్యుడును కృపాళువును జితేంద్రియుడును, స్థిరానురాగియును, ధర్మాత్ముడును, మాతృశుశ్రూష చేయువాడును, పితృప్రేమ గలవాడును, సకలసద్గుణాభరణుడునగు రాముని శుశ్రూషకంటె నాకు వేఱుగ నుత్తమతప స్సేమి యున్నది?

ఇత్యుక్త్వా మునిజాయయాత్మజన నోద్వాహాదికాం సత్కథాం
సంపృష్టా జనకాత్మజా మునిసతీం ప్రారభ్య జన్మాత్మనః,
ఉద్వాహావధికాం నిజాం శుభకథా మాహానుపూర్వ్యేణ సా
జ్ఞాత్వా తాం తు రమాంశజాం జనకజాం హృష్టాఽనసూయాఽవదత్. 40½

ఇవ్విధముగఁ జెప్ప మునిపత్నియును సీతతో నిట్లనెను. జానకి! నీ జననము మొదలు వివాహపర్యంతమగు కథ నంతను నాకు వినిపింపుమని యడుగగా, సీతయును దన జనన ప్రభృతి వివాహము దనుక జరిగిన వృత్తాంతము నంతను బూసగ్రుచ్చినట్లు మునిపత్నితో జెప్ప నామునిపత్నియు సంతోషించి పిదప జానకితో నిట్లుచెప్పెను.

సంప్రవృత్తా నిశా సీతే నక్షత్రసమలంకృతా,
జ్యోత్స్నా ప్రావరణ శ్చంద్రో దృశ్యతేఽభ్యుదితేఽంబరే,
గమ్యతా మనుజానామి *రామస్యానుచరీ భవ. 41-42

ఓ మైథిలి! రాత్రియైనది. ఆ కాశమంతయు నక్షత్రములచే నలంకృత మయినటుల నున్నది. చంద్రు డాకాశమున వెన్నెలతో నొప్పుచున్నాడు. అనుజ్ఞ నిచ్చుచున్నాను. కావున నీవు రామునియొద్దకు వెళ్ళి* సహచరివి కమ్ము.

---

*అనేన పత్న్యా రాత్రౌ భర్తృసమీప ఏవ శయనం కర్తవ్యమితి సూచితం. తథా చ బోధాయనః. తస్యా స్సహపత్న్యా పూర్వారాత్రా వుపసంవేశన మర్ధరాత్రా దధశ్శయనమితి. భర్తృస్సమీపే శయనాకరణే దోష మాహ మనుః॥ పానం దుర్జనసంసర్గః పత్న్యా చ విరహోఽటనం, స్వప్నోఽన్య గేహవాసశ్చ నారీణాం దూషణాని షట్॥ ఇతి. అత్ర విరహో నామ పతిశయనదేశా దన్యత్ర శయన మితి వేద్యం.

* ఇట్లు చెప్పుటచే భార్య రాత్రియందు భర్తృ సమీపముననే శయనింపవలయు నను ధర్మము సూచింపబడినది. బోధాయనసూత్రకారుడు నవ్విధముగనే చెప్పెను. (ఏమన) పూర్వరాత్రియందు భార్య భర్తసమీపమున శయనింపవలయు ననియు నర్ధరాత్రియందుఁగ్రింద శయనింపవలయుననియు (చెప్పెను.) భర్తృ సమీపమున భార్య శయనింపనియెడల దోషమును మనువిట్లు చెప్పెను. 1. మద్యపానముచేయుట 2 దుర్జనులతో సంబంధము 3 భర్తృసమీపమున శయనింపకుండుట, 4 యథేచ్ఛముగఁ దిరుగుచుండుట, 5 స్వప్నము 6 ఇతరగృహములలో నివాసము - నీయారును స్త్రీలకుఁగూడనివి (దోషములని భావము).

గ. సీతాఽప్యనసూయావచనేన దివ్యాంగరాగవసన భూషణాదిభి రలంకృతా పునరపి తా మభిప్రణమ్య రామాంతిక ముపాగమ్య సర్వమపి వృత్తం నివేదయామాస. రామోఽపి తపస్వినీదత్త ముత్తమం ప్రీతిదాన మవలోక్య లక్ష్మణేన సహ సుహృష్టమనాః తదాశ్రమ ఏవ తాం నిశాం విశ్రమ్య ప్రభాతాయాం నిశీథిన్యాం కృతపుర్వాహ్నికః హుతాగ్నిహోత్రం మునిగమనాయాఽమంత్రయామాస. 44

గ అనసూయావచనముచే నచ్చటనే సీత యంగరాగమును (అనగా శరీరకాంతి యెప్పటికిని దగ్గకుండ నుండునట్లు తన కనసూయ యనుగ్రహించి యిచ్చిన సుగంధిద్రవ్యపు చూర్ణమును) శరీరమునకుఁ బూసికొని నారచీరలను దరించి యలంకారముల నలంకరించుకొని యనసూయాదేవికిఁ దిరిగి నమస్కరించి యామెయొక్క యనుజ్ఞ నొంది రాముని సమీపమునకు వచ్చి జరిగిన వృత్తాంతమునంతను రామునకుఁ దెలియజేసెను రామచంద్రమూర్తియు ననసూయాదేవిచే సంతోషపూర్వకముగ నీయబడిన యుత్తమమైన యా పారితోషికమును (బహుమానమును) జూచి సంతోషించి యారాత్రి యాశ్రమమునందే విశ్రమించి ప్రాతఃకాలముననే యాహ్నిక కృత్యములను నెరవేర్చికొని యగ్నిహోత్రాదికర్మలను జేసికొనుచున్న యాత్రిమహర్షి సమీపమునకు లక్ష్మణసమేతుడై రామచంద్రమూర్తి వచ్చి నమస్కరించి తమకు వెళ్లుట కనుజ్ఞ నిమ్మని కోరెను.

ప్రస్థితౌ రాఘవౌ వీక్ష్య ప్రాహు స్తే తాపసా స్తదా,
వంసత్యస్మి న్మహారణ్యే నానారూపాస్తు రాక్షసాః,
*ఉచ్ఛిష్టం వా ప్రమత్తం వా తాపసం ధర్మచారిణమ్,
అదంత్యస్మి న్మహారణ్యే త న్నివారయ రాఘవ!. 45-46

* ఉచ్ఛిష్టనిమిత్తేసతి రక్షాంసి ప్రదర్షయంతీత్యుక్తం తదా చానుశాసనికే ప్రమదాన్ప్రతి దేవవచనం-బవంతో వై మహాబాగా అపరోక్షనిశాచరాః, ఉచ్ఛిష్టా నశుచీన్ క్షుద్రాన్కదం హింసద మానవాన్ శ్రోతు మిచ్ఛామి యుష్మాకం సర్వ మేత న్నిశాచరాః ప్రమదా ఊచుః-మైదునేతు సదోచ్ఛిష్టాః కృతే చై వాధరోత్తరే, మోహా న్మాంసాని ఖాదేత వృక్షమూలేచ య స్స్వపేత్, ఉదకే చాప్యమేద్యాని శ్లేష్మ యస్తుప్రముంచతి ఏతే బక్ష్యాశ్చ వద్యాశ్చ మానవా నాత్రసంశయః, ఏవం శీలసమాచారా న్దర్షయామోహి మానవాన్ ఇతి అతః పురుషేణాశుచినా న బవితవ్య మితి సిద్ధం

* ప్రయాణమై వచ్చిన రామలక్ష్మణులను నచ్చటి మహర్షులు చూచి యిట్లు వారలతో విన్నవించిరి. ఓ రామలక్ష్మణులారా! ఈ మహారణ్యమునందనేక రూపములతో సంచరించుచున్న రాక్షసు లనేకు లున్నారు. తపస్సంపన్నుడైనను నుచ్ఛిష్టుడై (అశుచియై) యున్నయెడలను, నజాగ్రతగా నున్నప్పుడును, రాక్షసులు, భక్షించుచుందురు. ఓ రామచంద్రా! రాక్షసబాధ మునిజనులకు లేకుండగఁ జేయుము.

ఏవం తై ర్మునిభి స్తదా బహువిధం సంప్రార్థితో రాఘవః,
పశ్చా దత్రిమునీశ్వరం తదితరా న్నత్వా మునీం శ్చాఖిలాన్,
తత్తన్మౌనికృతాశిషశ్చ శిరసా గృహ్ణ న్సభార్యానుజో,
నిర్గత్య ప్రవివేశ దండకవనం భాస్వాని వాభ్రం తతః. 47

ఇట్లు మునిజను లనేకవిధములుగఁ దమను ప్రార్థింపగా రామచంద్రమూర్తియు నట్లు చేయుదునని యంగీకరించి యనంతరము మునిశ్రేష్ఠుడైన యత్రిమహర్షికి నచ్చటి మునులకు గూడ నమస్కరించి వారల యాశీస్సులను శిరసాగ్రహించి వారల యాజ్ఞను గైకొని సీతాలక్ష్మణసహితుడై యచ్చటనుండి బయలుదేరి సూర్యుడు మేఘమండలమును బ్రవేశించిన విధముగ దండకవనమును బ్రవేశించెను.

ఇత్యాశ్చర్యరామాయణే అయోధ్యాకాండే ద్వితీయభాగే షోడశ స్సర్గ స్సమాప్తః.
ఆశ్చార్యరామాయణమున అయోధ్యాకాండమున
ద్వితీయభాగమునఁ బదునారవసర్గము సమాప్తము.

---

* ఉచ్ఛిష్టనిమిత్తము కలిగినప్పుడు రాక్షసులు మునిజనులను భక్షించుచుందురని చెప్పబడినది. అనుశాసనికమున గూడ నటులనే చెప్పబడినది (ఏమన) రాక్షసులను గూర్చి పరమేశ్వరుడిట్లు ప్రశ్నించెను ఉచ్ఛిష్టులు నశుచులునగు మానవుల నెట్లు మీరు హింసించుచుంటిరో చెప్పుడు, కుతూహలముగా నుండెనవి ప్రశ్నింపగా రాక్షసులిట్లు పలికిరి ఓ దేవా! మైథునము (స్త్రీ సంభోగముచే) ఉచ్ఛిష్టులగు వారిని, స్త్రీల యధరోష్ఠమును ముద్దిడుటచే నశుచులైన వారలను, చెట్లక్రిందను నిద్రించువారిని, ఉదకములో నుమ్మివేయువా, ఇటువంటి యశుచికర్మలను జేయువారిని మేము వధించి భక్షించుచుందుము (అని రాక్షసులు పరమేశ్వరునితోఁజెప్పిరి) కావునఁ బురుషు డుచ్ఛిష్టుడై యుండగూడదను ధర్మము సూచిత మగుచున్నది.

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం తు యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ రామచంద్ర నమోఽస్తు తే.

ఓ రామచంద్రా! అక్షరముల పొరపాటు మొదలగు నాదు దోషము లెవ్వి యిందు సంభవించినను వానిని క్షమింపవేడెదను. నీకు నమస్కారము.

## గద్య

ఇతి శ్రీ రామచంద్ర చరణకమల సేవాతత్పరేణ, రామాయణ
కేసరీత్యాది బిరుదాంకితేన, విశ్వామిత్రగోత్రోద్భవేన,
లక్కావఝ్ఝుల వంశముక్తాఫలేన, సుబ్బమాంబాజానే
స్సుబ్రహ్మణ్య సిద్ధాంతిన స్తనూజేన, వేంకట కృష్ణ
శాస్త్రిణా విరచితే, ఆశ్చర్యరామాయణే, అయోధ్యా
కాండే ద్వితీయభాగ స్సమాప్తః.

**మంగళం.**

ఇతి శ్రీరామచంద్ర చరణకమల సేవాతత్పరుడును, రామాయణ కేసరీత్యాది బిరుదాంకితుఁడును, విశ్వామిత్ర గోత్రోద్భవుఁడును, లక్కావఝ్ఝుల వంశముక్తాఫలుఁడును, సుబ్బమాంబా సుబ్రహ్మణ్య సిద్ధాంతుల

తనూజుఁడును నగు వేంకట కృష్ణశాస్త్రిచే రచింపఁబడిన

**ఆశ్చర్యరామాయణమునం దయోధ్యకాండమున ద్వితీయభాగము సమాప్తము.**

**అయోధ్యకాండము సమాప్తము**

ఇయ్యది శ్రీభద్రాచలరామచంద్రార్పణ మగు గాక
మంగళం.

ఋతవ స్సాగరా ద్వీపా వేదా లోకా దిశశ్చ తే
మంగళాని మహాబాహో దిశం తు శుభమంగళమ్.

ఋతువులు సముద్రములు ద్వీపములు లోకములు దిక్కులు మొదలగున వన్నియు నీకు శుభమంగళములను కలుగజేయుగాత.

## ఫలశ్రుతిః

**ఉమాసంహితాయాం- సాకేతకాండస్య ఫలం వక్తుం వర్షాయుతైరపి, న శక్యతే మహాదేవి క్వచిత్కించి ద్బ్రవ చ్మ్యహం, అయోధ్యాకాండ మఖిలం యే శృణ్వంతి నరోత్తమాః, తే సర్వే హరిసాయుజ్యం ప్రాప్నువంతి న సంశయః.**

రామః కృతార్థం భరతం సమాశ్వాసముదాత్మవాన్,
ఇత్యాది శ్రవణా త్పుంసాం వైరాగ్యం జాయతే భృశమ్.

అత్రేశ్చ దర్శనం పశ్చాదనసూయాభిదర్శనమ్,
అనసూయాప్రణామం చ పాతివ్రత్యస్తుతిం తథా
సీతాకల్యాణ సంప్రశ్న మంగరాగస్య చార్పణమ్,
శ్రుత్వా రామప్రసాదేన తత్సాయుజ్యం నరో వ్రజేత్॥ ఇతి

ఉమాసంహితయందిట్లు కలదు-' ఓ పార్వతీ! అయోధ్యాకాండ ఫలమును పదివేల సంవత్సరములలోఁగూడ జెప్పుటకు సాధ్యము కాదు. అయినను కొంచెము నేను (శివుఁడు) చెప్పెదను. అయోధ్యాకాండము పూర్తిగా నెవరు విందురో వారందఱు శ్రీహరిసాయుజ్యము నొందుదురు. ఇందు సందియము లేదు. శ్రీరాముఁడు ధైర్యము కలవాఁడు కానఁగృతకృత్యుఁడగు భరతు నూరడించెను - మొదలగువానిని, వినుటవలన మనుజులకుఁ దప్పక, వైరాగ్యము కలుగును. అత్రిమహర్షిని (రాముఁడు) జూచుటయుఁ బిమ్మట ననసూయాదేవిని (సీత) జూచుటయుఁ బాతివ్రత్యమును స్తుతించుటయు, సీతవివాహముఁగూర్చి యడుగుటయు, మైపూఁత నిచ్చుటయు ననుకథను విని మానవుఁడు శ్రీరామానుగ్రహముచే నాతని సాయుజ్యము నొందును.

T.T.D. Religious Publications Series No. 678

# "జయంతి తే సుకృతినో ........"



**శ్రీ లక్కావఝ్ఝుల వేంకట కృష్ణశాస్త్రి**
**(1887-1963)**

కవి పండిత కుటుంబంలో జన్మించి తన సాధన, దీక్షతో సామాజిక శ్రేయస్సు కొరకు కావ్యాన్ని రచించి కీర్తిని గడించిన శ్రీ లక్కావఝ్ఝుల వేంకట కృష్ణశాస్త్రిగారు ధన్యులు. వీరు చిన్నతనంలోనే పంచ కావ్యాలు, చంపువులు, వేదం, తర్కం, వాస్తు, జ్యోతిషశాస్త్రాలను అధ్యయనంచేసి గురువుల ఆశీస్సులను పొందినారు. భారత దేశమంతటా తీర్థయాత్రలు గావించి జనజీవన నాడిని గ్రహించినారు. సంస్కృత భాషావ్యాప్తికి, వేద పరిరక్షణకొరకు తన శక్తిమేరకు ప్రయత్నాలు గావించి సఫలీకృతులైనారు. 'రామాయణ కేసరి', 'రామాయణ తీర్థ' అనే బిరుదులతో ఖ్యాతి గడించారు. కేవలం సంస్కృతంలో కావ్యాన్ని రచించిన, సామాన్యజనానికి అందుబాటులో ఉండదని గ్రహించి, చక్కటి తెలుగు వచనంలో కూడ విషయాలను సమగ్రంగా వివరించారు.

రామాయణ కథకు మూల రచయిత మహర్షి వాల్మీకియే. శ్రీ శాస్త్రిగారు సుమారు నలభైరామాయణాలను అధ్యయనంచేసి, వీటన్నిటిసారాన్ని ఈ 'ఆశ్చర్య రామాయణము' గా పొందుపరిచారు. ధర్మసూక్ష్మాలను పాఠకులకు బోధించారు. తిరుమల తిరుపతి దేవస్థానము ఈ కావ్యాన్ని ధార్మిక ప్రచురణగా స్వీకరించి ప్రస్తుతం ఏడు కాండలను మొత్తం తొమ్మిది సంపుటాలుగా ప్రచురిస్తున్నది. రామాయణ జిజ్ఞాసువులు కవులు, పండితులు, విద్వజ్జనులు సహృదయతతో ఆదరిస్తారని ఆకాంక్ష.

---

Published by Sri A.P.V.N. Sharma, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and Printed at Adsprint, Chennai
on behalf of T.T. Devasthanams Tirupati